ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 27-8-2017 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 17 | రూ. 6-00 పేజీలు 16+24+32 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

డేరా కాష్టం

- అట్టుడుకుతున్న హరియాణా
- దిల్లీ, రాజస్థాన్, యూపీల్లోనూ అల్లర్లు
- హింసాత్మక ఘటనల్లో 36కి చేరిన మృతుల సంఖ్య
- డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ సింగ్ శిక్షపై రేపు నిర్ణయం
- అనుచరుల నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం
- పంచ్‌కుల డీసీపీ సస్పెన్షన్... డీఐజీ తొలగింపు

చండీగఢ్, సిర్సా, దిల్లీ: హరియాణా అట్టుడుకుతోంది. తనను తాను దైవంగా చెప్పుకొంటున్న 'డేరా సచ్చా సౌధా' అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా ప్రకటించగానే మొదలైన అల్లర్లు శనివారం కూడా కొనసాగాయి. హింసాకాండ వల్ల రెండు రోజుల్లో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితి నియంత్రించడంలో విఫలమైనందుకు పంచ్‌కుల పోలీసు (మిగతా 2లో)





గుర్మీత్ రామ్ రహీం మద్దతుదారుల చేతిలో ఆహుతవుతున్న వాహనాలు

మీరు డేరా అనుచరులకు లొంగిపోయారు

రాజకీయ కారణాలు చూసుకున్నారు • హరియాణా సర్కారుకు తీవ్రంగా తలంటిన హైకోర్టు ప్రధాని దేశం మొత్తానికి ప్రధాని అని వ్యాఖ్య 12లో



కంచు మోగింది కనకంబు మోగేనా!

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిలు సైనా నెహ్వాల్, పి.వి.సింధు అదరగొట్టారు. నెహ్వాల్ కాంస్య పతకాన్ని గెలవగా.. ఇప్పటికే కంచు ఖాయం చేసిన సింధు.. ఫైనల్‌పై గురి పెట్టింది. ఒకే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు పతకాలు అందించి వీళ్లిద్దరు చరిత్ర సృష్టించారు. శనివారం జరిగిన సెమీస్‌లో నొజొమి ఒకహర (జపాన్) చేతిలో ఓడిన సైనా.. కాంస్యంతో సరిపెట్టుకుంది. మరో సెమీస్‌లో సింధు.. చెన్ యుఫియ్ (చైనా)తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే సింధు కనీసం రజతం ఖాయం చేసుకుంటుంది. ఆ తరువాత ఫైనల్ గెలిస్తే బంగారు పతకం మన సొంతమవుతుంది.

వివరాలు ఛాంపియన్‌లో...

కలసి మాట్లాడుకోండి

- విభజన సమస్యలపై ఏపీ, తెలంగాణ సీఎంలకు వెంకయ్య నాయుడు సూచన
- సొంతగడ్డపై అపూర్వ స్వాగతాన్ని జీవితంలో మర్చిపోలేనని వెల్లడి
- ఉపరాష్ట్రపతికి ఘనంగా సన్మానం

"ఆంధ్రప్రదేశ్‌కు అపూర్వమైన భవిష్యత్తుంది. అపారమైన ప్రకృతి సంపద ఉంది. సుదీర్ఘమైన సముద్ర తీరం, జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్ ఉన్నాయి. నదుల అనుసంధానం చేయాలి. ప్రకృతిని సంరక్షించుకోవాలి. తెలుగువారికి అపారమైన తెలివితేటలు, వ్యాపార దక్షత ఉన్నాయి. వీటన్నిటినీ వినియోగించుకుంటే ఆంధ్రప్రదేశ్‌ని వేగంగా అభివృద్ధి చేసుకోవచ్చు.

– వెంకయ్య నాయుడు 2లో



శనివారం వెలగపూడి సచివాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి అభినందన సన్మాన పత్రికను అందజేస్తున్న గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనా చౌదరి

తారస్థాయికి తమిళ రాజకీయం!

- చెన్నై చేరుకున్న గవర్నర్
- సీఎంను మార్చుకుంటే రాష్ట్రపతి వద్దకెళ్తాం
- టీటీవీ మద్దతుదారు ఎమ్మెల్యేల స్పష్టీకరణ
- తిరుగుబాటు ఎమ్మెల్యేలకు నోటీసులు పంపిన స్పీకర్
- సీనియర్ నేత మధుసూదన్‌తో పన్నీర్ భేటీ

3లో

కశ్మీర్‌లో ఉగ్ర పంజా


- పోలీసు ప్రాంగణంపై ఆత్మాహుతి దాడి
- 8 మంది భద్రతా సిబ్బంది మరణం
- ముగ్గురు ముష్కరులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో శనివారం ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. జిల్లా పోలీసు ప్రాంగణంపై ఆత్మాహుతి దాడికి తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు, ముష్కరులకు మధ్య భారీ పోరాటం చెలరేగింది. ఇందులో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. 8 మంది భద్రతా సిబ్బంది వీర మరణం పొందారు.

ముష్కరులంతా విదేశీయులని భావిస్తున్నారు. వీరు శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జిల్లా పోలీసు ప్రాంగణంలోకి చొరబడ్డారు. ముగ్గురు ఉగ్రవాదులూ.. మూడు బ్లాక్‌లలో మాటువేసి భద్రతా (మిగతా 2లో)



దక్షిణ కశ్మీరులోని పుల్వామాలో ఉగ్రవాదులతో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం



అఆఇఈ... అజరామరం!

- సాహిత్యం, చరిత్ర.. తెలుగుభాషకు శ్రీరామరక్ష
- బహుభాషల పరిజ్ఞానంతో మాతృభాషకు మేలే
- తెలుగు రాష్ట్రాల్లో 12 గిరిజన భాషల ఉనికికి ప్రమాదం
- భాషా పరిరక్షణను ప్రభుత్వాలు భారంగా చూడకూడదు
- 'ఈనాడు'తో పీఎల్ఎస్ఐ ఛైర్మన్ గణేష్ ఎన్.దేవీ

3లో

వైద్య సీట్లపై నోట్ల దెబ్బ!

- సి కేటగిరిలో 119 సీట్లు మిగులు
- రుసుము తగ్గిస్తున్న యాజమాన్యాలు
- పొరుగు రాష్ట్రాలకు విద్యార్థులు

16లో

ఇదీ సంగతి!



జల... కళకళ

- తుంగభద్రలోకి చేరుతున్న నీరు

హొసపేటె, న్యూస్‌టుడే: జలకళతో తుంగభద్ర జలాశయం తొణికిసలాడుతోంది. నీటి నిల్వలు క్రమంగా పెరుగుతుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి. జలాశయానికి వస్తున్న వరద మూడు రోజులుగా పెరుగుతుండడంతో జలకళ ఉట్టిపడుతోంది. ప్రస్తుతం జలాశయంలో 58.98 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 12,969 క్యూసెక్కుల వరద వస్తోంది. రోజూ ఓ టీఎంసీ మేర నీటినిల్వ పెరుగుతోంది. పశ్చిమ కనుమల్లో మాసాంతంలో ఆశాజనకంగా వర్షాలు పడే సూచనలు ఉన్నాయని జలాశయం వర్గాలు చెప్పాయి. నిరుడు ఇదే సమయానికి జలాశయంలో 52.70 టీఎంసీల నీటి నిల్వ ఉండేది. మరోవైపు, బళ్లారి, రాయచూరు పట్టణాల్లో కర్ణాటక మంత్రులు రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమై నీటి విడుదలపై సలహాలు తీసుకున్నారు. ఈ నెల 29న బెంగళూరులో నీటి పారుదల సలహా సమితి సమావేశం జరగనుంది.



తుంగభద్రలో శనివారం సాయంత్రం తొణికిసలాడుతున్న జలాలు



విజయవాడ బందరురోడ్డు మీదుగా ఓపెన్‌టాప్ వాహనంలో వెళ్తున్న వెంకయ్యనాయుడు. చిత్రంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు



శనివారం వెలగపూడి సచివాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



శనివారం గన్నవరం విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో గవర్నర్ నరసింహన్

‘ గ్రామీణాభివృద్ధి మంత్రిగా ఉన్నప్పుడు ప్రతి పల్లెకూ పక్కా రహదారి ఉండాలని, లేకపోతే అభివృద్ధి చెందవని గట్టిగా పట్టుబట్టాను. మంత్రివర్గంలో కొందరు వ్యతిరేకించారు. గ్రామ రాజ్యం లేని రామరాజ్యం అసంపూర్ణమన్న మహాత్మాగాంధీ మాటల్ని గుర్తు చేసి, వారికి నచ్చజెప్పాను. పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా దేశం మొత్తంలో 26 లక్షల ఇళ్లు ఇస్తే, వాటిలో 5.35 లక్షల ఇళ్లు ఆంధ్రప్రదేశ్‌కే మంజూరు చేశాను. ఇవి రెండూ నాకెంతో తృప్తినిచ్చాయి

ఈ రోజు యువతీ యువకులు, విద్యార్థులు, అధ్యాపకులు, సామాన్య ప్రజానీకం అందించిన స్వాగతం అపూర్వం. నేను తెలుగు నేలపై పుట్టి, విద్యార్థి ఉద్యమ సారథిగా విజయవాడలో అనేక ఉద్యమాలకు ఊపిరి పోసి, అంచలంచెలుగా ఎదిగి హస్తినాపురికి చేరుకున్నాను. అప్పటి మధుర క్షణాలు గుర్తుకు వస్తున్నాయి. రాజ్యసభ ఛైర్మన్‌గా చర్చల స్థాయిని పెంచేందుకు, కొత్త ప్రమాణాలు నెలకొల్పేందుకు కృషి చేస్తానన్నారు. ’

వెంకయ్యనాయుడు

‘ వెంకయ్య నాయుడు, నేను ఒకేసారి 1978లో ఎమ్మెల్యేలుగా శాసనసభలో అడుగుపెట్టాం. అప్పుడు ప్రతిపక్షానికి సంఖ్యాబలం లేకపోయినా తన వాగ్ధాటితో ప్రధానపక్షాన్ని గజగజలాడించారు. 1983లో రెండోసారి ఎమ్మెల్యే అయిన సమయంలో ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించేస్తే తిరిగి ముఖ్యమంత్రి అయ్యేదాకా పోరాడారు. దేశ రాజకీయాల్లో రాణించాలంటే హిందీ అవసరం కావడంతో భాష నేర్చుకోవడమే కాకుండా బ్రహ్మాండంగా మాట్లాడగలిగే స్థాయికి చేరుకున్నారు.

నేను వెంకయ్య సమావేశాలంటే భయపడతాను. ఎందుకంటే ఆయన 10 గంటలకు సమావేశమైతే 9.45 గంటలకే వస్తారు. క్రమశిక్షణ ఎప్పుడూ ఉల్లంఘించని వ్యక్తి. రాజకీయాల ద్వారా ప్రజలకు సేవ చేయడం కోసం స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా ఎనలేని సేవలందించారు. తెలిసిన వ్యక్తుల ఇళ్లలో పెళ్లిళ్లైనా శుభకార్యాలు జరిగినా అక్కడకెళ్లి ఆశీర్వదించి వెళ్లేవారు. చిన్ననాటి మిత్రులు కనపడ్డా వారి ఇళ్లకు వెళ్లి భోజనం చేస్తారు. ’

చంద్రబాబు నాయుడు

కలసి మాట్లాడుకోండి

ఈనాడు- అమరావతి, గుంటూరు

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ తరచూ కలుసుకుని మాట్లాడుకోవాలని, ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సమస్యల్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. ఇద్దరూ సామరస్య వాతావరణంలో పనిచేసి, తెలుగు ప్రజలు అభివృద్ధిలో వేగంగా దూసుకెళుతున్నారన్న మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. తన పైనా, తెలుగుప్రజలపైనా ఉన్న గౌరవంతో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుని పరిపాలన భాషగా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుని ఆయన కోరారు. రాజధాని అమరావతిలో శనివారం తన గౌరవార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పౌర సన్మానంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... కేంద్ర మంత్రిగా ఉండగా తాను తెలుగువారికి వీలైనంత సాయం చేశానని, ఉపరాష్ట్రపతి అయినంత మాత్రాన తెలుగువారిని, తెలుగు నేలను మర్చిపోనని ఉద్ఘాటించారు. “నేను మాట్లాడుతుంటాను. సలహా సంప్రదింపుల్లో పాల్గొంటాను. అభివృద్ధిలో పాలుపంచుకుంటాను” అని తెలిపారు.

రాష్ట్ర విభజన జరిగిందన్నది వాస్తవమని, ఇక దాని గురించి చింతించి, నిందించి ఉపయోగం లేదని వెంకయ్యనాయుడు అన్నారు. “ఇల్లు కట్టేటప్పుడే ఇంకుడుగుంత తవ్వాలి. ఒక చెట్టు నరకాల్సి వస్తే పది మొక్కలు పెంచాలి. జలం లేకపోతే జీవం లేదు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు, ప్రాజెక్టులు త్వరగా అమలు చేయగలిగితే రాష్ట్ర ముఖచిత్రమే మారిపోతుంది. ప్రణాళిక, దార్శనికతతో పాటు అమలు కూడా చాలా ముఖ్యం” అని ఆయన పేర్కొన్నారు.

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత తొలిసారి సొంత గడ్డకు వచ్చిన తనకు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు వేలాది మంది రహదారికి ఇరుపక్కలా నిలబడి అపూర్వ స్వాగతం పలకడం జీవితంలో మర్చిపోలేనని ఉపరాష్ట్రపతి అన్నారు. “విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం జరిగింది. న్యాయం చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్రానికి వివిధ సంస్థలు, ప్రాజెక్టులు వచ్చేలా కృషి చేశాను. వెంకయ్య దేశానికి మంత్రా, ఆంధ్రప్రదేశ్‌కా అని విమర్శించినవారూ ఉన్నారు. ఒక సందర్భంలో ప్రధాని మోదీ కూడా... ఆంధ్రప్రదేశ్‌కి ఇబ్బందేముంది, వెంకయ్యనాయుడు ఉన్నారు, గుజరాత్‌కి ఎవరున్నారని చమత్కరించారు” అని ఉపరాష్ట్రపతి వివరించారు. “ప్రభుత్వంలో ఉన్న వారు ప్రతిపక్షాన్ని గౌరవించాలి. వారికి మాట్లాడేందుకు ఎక్కువ అవకాశమివ్వాలి. ప్రతిపక్షం సద్విమర్శలు చేయాలి. వ్యక్తిగత ద్వేషాలకు రాజకీయాల్లో అవకాశం లేదు” అని పేర్కొన్నారు.

ఘన సన్మానం..!.. విజయవాడ విమానాశ్రయంలో గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు అశోక్‌గజపతి రాజు, సుజనాచౌదరి, శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, నక్కా ఆనందబాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్, డీజీపీ ఎన్.సాంబశివరావు తదితరులు స్వాగతం పలికారు. అక్కణ్నుంచి ముఖ్యమంత్రి, గవర్నర్‌లతో కలిసి ప్రకాశం బ్యారేజీ వరకూ ఓపెన్‌టాప్ వాహనంలో 23 కిలోమీటర్ల పొడవునా ప్రజల హర్షధ్వానాల మధ్య అభివాదం చేస్తూ ఉపరాష్ట్రపతి ముందుకు సాగారు. జాతీయ పతాకాలు చేతబట్టి, పూలు జల్లుతూ విద్యార్థులు జయజయ ధ్వానాలతో ఘన స్వాగతం పలికారు. వెలగపూడి సచివాలయం పక్కనే నిర్మించిన వేదిక వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన... వేల మంది సమక్షంలో ఆయనకు ఘనంగా పౌర సన్మానం జరిగింది. భద్రతా దళాల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. తితిదే నుంచి వచ్చిన పండితులు వేద మంత్రోచ్చారణలతో, అక్షితలుజల్లి దీవించారు. అనంతరం సన్మాన పత్రాన్ని ముఖ్యమంత్రి, గవర్నర్.. వెంకయ్యకు బహూకరించారు. శాలువలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. 2.25 లక్షల గృహాల నిర్మాణానికి వెంకయ్యనాయుడు శంకుస్థాపన చేశారు. స్పీకర్ కోడెల ఆధ్వర్యంలో స్వచ్ఛ సత్తెనపల్లిపై రూపొందించిన ‘స్వచ్ఛమేవ జయతే’ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తకం విశిష్టతను సీనియర్ పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావు వివరించారు. సాయంత్రం గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య శతజయంతి కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. వెంకట్రామయ్య కాంస్య విగ్రహాన్ని, ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెనాలి పట్టణంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ఉద్యమాల కాలంలో చినరావూరులోని లీలావతమ్మ అనేకసార్లు భోజనం పెట్టిందని, ఆమె ఇటీవల మరణించిందని గుర్తుచేసుకున్నారు.

సుఖం, శాంతి, సమృద్ధి తెచ్చారు
గవర్నర్ నరసింహన్

“దిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అని మీరు వినే ఉంటారు. ఆ దృశ్యాన్ని ఈ రోజు మేం చూశాం. విమానాశ్రయం నుంచి ప్రకాశం బ్యారేజిదాకా ఆయనకు ఘనస్వాగతం పలుకుతూ ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు నిరుపమానం. రాష్ట్రానికి సుఖం, శాంతి, సమృద్ధి తెచ్చిన పెద్దలు వెంకయ్యనాయుడు. విభజన సమయంలో ఆయన చేసిన సేవలు నాకు తెలుసు. జైఆంధ్ర ఉద్యమం సమయంలో విజయవాడ కేంద్రంగా ఆయన పోరాటం చేశారు. అప్పుడు వేసిన బీజాలు చెట్లుగా మారాయి” అని గవర్నర్ నరసింహన్ ప్రస్తుతించారు. నమ్మిన సిద్ధాంతాన్ని ఏనాడూ విడిచి పెట్టని వ్యక్తని కేంద్ర మంత్రి అశోక గజపతిరాజు అన్నారు. వెంకయ్య చొరవ వల్లే రాష్ట్రానికి ఎన్నో కేంద్ర సంస్థలు వచ్చాయని మరో కేంద్ర మంత్రి వై.సుజనా చౌదరి పేర్కొన్నారు. రైతు బిడ్డగా ఎదిగిన ఆయన ఎన్నో ఉన్నతావకాశాలు అందుకున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ అన్నారు.

సింహపురి నుంచి హస్తినదాకా తిరుగులేని శక్తి వెంకయ్య

సింహపురి నుంచి హస్తినదాకా తిరుగులేని శక్తిగా ఎదిగిన వ్యక్తి వెంకయ్యనాయుడని దేశ రాజకీయాల్లో దక్షిణ భారతం నుంచి నాయకత్వం ఇవ్వగల వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఆయనేనని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఆయన తెలుగుజాతి గర్వించగదగ్గ బిడ్డ అని ప్రశంసించారు. “ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అందరు ఎమ్మెల్యేలకు మార్గదర్శకులయ్యారు. ఎంపీగా ప్రజా సమస్యలపై ఎలా పోరాడాలో తెలియజేశారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఒక్క తప్పు చేయకుండా, ఎవరూ వేలెత్తి చూపలేని విధంగా ఆయన నడచుకున్న విధానాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి” అని సూచించారు. ఉపరాష్ట్రపతిగా ఆయన దేశానికే వన్నె తెస్తారని అదే సమయంలో రాష్ట్రంపైనా ఆశీస్సులు ఉంటాయనే విశ్వాసం ఉందని అన్నారు.

మంత్రిగా చివరి రోజున కూడా రాష్ట్రానికి మేలు...

పట్టణాభివృద్ధిలో వెంకయ్య నాయుడి పాత్ర చరిత్రలో మిగిలిపోతుందని చంద్రబాబు అన్నారు. విశాఖపట్నం, తిరుపతి, కాకినాడతోపాటు అమరావతిని స్మార్ట్ సిటీ చేసి అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. “పట్టణ ప్రాంతాలకు 5,39,286 గృహాలు మంజూరయ్యాయంటే ఆయన చొరవే కారణం. మంత్రిగా చివరి రోజు కూడా రాష్ట్రానికి 2.15లక్షల ఇళ్లు మంజూరు చేసి అనంతరమే ఉపరాష్ట్రపతి బాధ్యతలు స్వీకరించారు” అని చంద్రబాబు తెలిపారు.

పర్యటనలో స్వల్ప అపశ్రుతి.. ఉపరాష్ట్రపతి కార్యక్రమాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించడానికి ఏర్పాట్లు చేయగా అది పడిపోయింది. ఆయన వాహనం జాతీయ రహదారి మార్గంలో కొత్త ప్రభుత్వ ఆసుపత్రి సమీపానికి చేరుకోగా డ్రోన్ ఆయనకు అతి సమీపంలో కిందపడింది. త్రుటిలో ప్రమాదం తప్పింది.

భాజపా అధ్యక్షుడు అమిత్‌షా ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించతలపెట్టిన ఏపీ పర్యటన వాయిదా పడినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖపట్నం ఎంపీ కంభంపాటి హరిబాబు ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరులో అమిత్‌షా పర్యటన ఉండే అవకాశం ఉందని వివరించారు.

డేరా కాష్టం

(మొదటి పేజీ తరువాయి)

డీసీపీగా ఉన్న ఐపీఎస్ అధికారి అశోక్ కుమార్‌ని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నిందితుని వెంట ఉన్నందుకు డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌కు ఉద్వాసన పలికింది. హింస చెలరేగిన ప్రాంతాల్లో పరిస్థితుల్ని అదుపులోకి తీసుకువచ్చేందుకు రంగంలో దిగిన సైన్యం... స్థానిక పోలీసుల సమన్వయంతో ముందడుగు వేస్తోంది. డేరా ప్రధాన కేంద్రం లోపల ఉన్న లక్ష మందిని బయటకు రప్పించడంపై యంత్రాంగం దృష్టి కేంద్రీకరించింది.

అత్యాచారాలు నిజమే

గుర్మీత్ సింగ్ 2002లో ఇద్దరు మహిళలపై అత్యాచారానికి పాల్పడినట్లు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ప్రకటించింది. తీర్పు వస్తుందని తెలిసి భారీగా తరలివచ్చిన డేరా అనుచరులు ఆ వెంటనే చెలరేగిపోయి, విధ్వంసానికి పాల్పడడంతో పెద్దఎత్తున ప్రాణ నష్టం వాటిల్లింది. 50 మంది పోలీసులు సహా 250 మంది గాయపడ్డారు. మొత్తం రణరంగానికి ప్రధాన కేంద్రంగా నిలిచిన పంచ్‌కులలోనే 28 మంది మరణించారు. వీరిలో ఒక్కరినే గుర్తించగలిగారు. మిగిలినవారి వివరాలు తెలియాల్సి ఉంది.

న్యాయస్థానం తీర్పు వెలువడుతుందని ముందుగానే తెలిసినా, పరిణామాలపై తగిన చర్యలు తీసుకోవడంలో హరియాణా యంత్రాంగం విఫలం కావడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో పరిస్థితి తీవ్రత దృష్ట్యా పారామిలిటరీతో పాటు పెద్దఎత్తున సైన్యం రంగప్రవేశం చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు నిర్వహించింది. హరియాణా, పంజాబ్, చండీగఢ్‌లలో కలిపి 20 వేల మంది సైనికుల్ని మోహరించారు. సిర్సాలో ఉన్న డేరా సచ్చా సౌధా ప్రధాన కార్యాలయంలో చొరబడే ప్రణాళిక ఏదీ ప్రస్తుతానికి లేదని సైన్యం స్పష్టం చేసింది.

పంచ్‌కులలో వేర్వేరుగా 8 కేసులు నమోదు కాగా, 15 మంది డేరా అనుచరులు సహా 524 మందిని అరెస్టు చేశారు. 24 వాహనాలు, అయిదు పిస్తోళ్లు, ఏకే-47 తుపాకీ ఒకటి, 79 రౌండ్ల తూటాలు, 10 పెట్రోలు బాంబులు, హాకీ స్టిక్స్, కొన్ని వేల లాఠీలు, ఇనుప కడ్డీలు, గొడ్డళ్లు, పదునైన ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ‘నామ్ చర్చా ఘర్’ల పేరుతో 9 చోట్ల ఉన్న అనుబంధ కేంద్రాలకు తాళాలు వేయించారు. 28 వాహనాలకు, రెండు ప్రభుత్వ కార్యాలయాలకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ప్రైవేటు దుకాణాలు, ఒక ఏటీఎం కూడా వారి ఆగ్రహావేశాలకు బుగ్గి అయ్యాయి. అవాంఛిత ఘటనల్ని నివారించడం కోసం విధించిన ఆంక్షలతో సాధారణ జీవనం స్తంభించిపోయింది. పంజాబ్, హరియాణాల్లో పలుచోట్ల కర్ఫ్యూ విధించారు. స్థానికులెవరినీ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. యూపీ, దిల్లీ, రాజస్థాన్‌లలో హింస చెలరేగిన చోట్ల నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు.



దిల్లీలోని ఆనంద్‌విహార్ స్టేషన్‌లో నిప్పు పెట్టడంతో కాలిపోయిన రైలు కోచ్

డేరా ప్రాంగణంలోనే లక్ష మంది తిష్ఠ..!

వెయ్యి ఎకరాల్లో విస్తరించిన డేరా ప్రాంగణంలోనే తిష్ఠ వేసిన దాదాపు లక్ష మంది అనుచరుల్ని అక్కడి నుంచి ఖాళీ చేయించడం అధికార యంత్రాంగానికి పెద్ద సవాల్‌గా నిలిచింది. వీరిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. ఆ ప్రాంగణాన్ని విడిచి వెళ్లాల్సిందిగా యంత్రాంగం పదేపదే మైకుల్లో విజ్ఞప్తి చేస్తున్నా వారు బయటకు రాలేదు. శనివారం సాయంత్రం నుంచి కొద్ది కొద్ది మంది చొప్పున బయటకు రావడం ప్రారంభమయింది. ప్రాంగణంలో ఎక్కడ ఏముందో తెలిపే పటాలను సైన్యానికి అందజేశారు. డేరా ప్రాంగణంలోకి వెళ్లే రహదారుల్లో పోలీసు బలగాలు, సైన్యం కొన్ని అడ్డుకట్టల్ని ఏర్పాటు చేశాయి. ప్రధాన కేంద్రం లోపల ఎలాంటి సోదాలు నిర్వహించకపోయినా చుట్టుపక్కల పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పాఠశాలలు, నివాస సముదాయాలు, క్రీడా గ్రామం, ఆసుపత్రి, చలనచిత్ర మందిరం వంటివన్నీ ఉన్న డేరా లోపలకు ప్రవేశించేందుకు సైన్యాన్ని ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని అధికార వర్గాలు తెలిపాయి. కర్ఫ్యూ అమలయ్యేలా చూడడం వరకే వారు పరిమితమయ్యారని వివరించాయి. సిర్సా, పంచ్‌కులల్లో పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా ఉన్నా, అదుపులోనే ఉందని కేంద్ర హోంశాఖ అధికార ప్రతినిధి దిల్లీలో ప్రకటించారు. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అక్కడి పరిస్థితిని ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారని తెలిపారు. పరిస్థితి నియంత్రణలోనే ఉన్నట్లు హరియాణా డీజీపీ కేంద్రానికి తెలిపారని హోంశాఖ కార్యదర్శి రాజీవ్ మెహ్‌రిషి చెప్పారు. శనివారం కొత్తగా అవాంఛిత ఘటనలేమీ చోటు చేసుకోలేదని ఆయన చెప్పారు. పరిస్థితిని అదుపు చేయడంలో హరియాణా ప్రభుత్వం విఫలమయిందా అనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ- ప్రస్తుతం ఎవరినీ నిందించదలచుకోలేదన్నారు. గుర్మీత్ సింగ్ అనుచరుల్లో 15 మందిని అరెస్టు చేశామనీ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునేవారెవరినీ వదిలిపెట్టబోమనీ హిస్సార్ ఐజీ ఎ.ఎస్.దిల్లో తెలిపారు.

రామ్ రహీం సింగ్‌కు జడ్ ప్లస్ భద్రత ఉపసంహరణ

రామ్ రహీంసింగ్‌కు ఇంతకాలం కొనసాగుతూ వచ్చిన జడ్ ప్లస్ స్థాయి భద్రతను తక్షణం ఉపసంహరించినట్లు హరియాణా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.ఢేశీ తెలిపారు. శిక్ష ఖరారైన వెంటనే ఆ భద్రతను తొలగించామనీ, రోహ్‌తక్ కారాగారాంలోనూ అతడికి ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం లేదనీ వివరించారు. సింగ్‌ను సాధారణ ఖైదీగానే చూస్తున్నామనీ, ఏసీ వంటి సదుపాయాలు కల్పించినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదనీ తేల్చిచెప్పారు. అయితే భద్రతపరమైన కారణాలతో నిందితుడిని రోహ్‌తక్ జిల్లా కారాగారానికి హెలికాప్టర్లో తరలించాల్సి వచ్చిందన్నారు. హింస నేపథ్యంలో డేరా అనుచరులపై దేశద్రోహం కింద రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి నెలకొందని చెప్పారు. గాయపడిన, గల్లంతైన, మరణించినవారిలో పంచ్‌కుల స్థానికులెవరూ లేరని స్పష్టం చేశారు. గుర్మీత్‌కు ఎంత శిక్ష విధించిందీ సోమవారం న్యాయస్థానం ప్రకటించనున్న దృష్ట్యా భద్రతపరంగా తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. డేరా సచ్చా సౌధాకు సంబంధించి జనసమీకరణ జరిగే ప్రాంతాలన్నింటిలో సోదాలు జరపాల్సిందిగా ఆదేశాలిచ్చినట్లు హరియానా అదనపు ప్రధాన కార్యదర్శి రాంనివాస్ చెప్పారు. పోలీసులు తమ విధుల నుంచి తప్పించుకుని పారిపోయారన్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. వారంతా సమర్థంగా పనిచేసి ఉండకపోతే పరిస్థితి ఇంకా భీకరంగా ఉండేదన్నారు. మూడున్నర గంటల్లోనే ఆందోళనకారుల్ని చెదరగొట్టగలిగామని చెప్పారు.

డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌పై వేటు.. గుర్మీత్ సింగ్‌తో సంబంధాలున్నందుకు హరియాణా ప్రభుత్వ డిప్యూటీ అడ్వకేట్ జనరల్ (డీఏజీ) గురుదాస్ సల్వారాపై ప్రభుత్వం వేటు వేసింది. శిక్షపడిన నిందితునితో కలిసి ఆయన న్యాయస్థానానికి హాజరు కావడంతో పాటు నిందితుడి సూట్‌కేసును మోసుకుంటూ వచ్చినట్లు గుర్తించిన మీదట అడ్వకేట్ జనరల్ బల్‌దేవ్ రాజ్ మహాజన్ చేసిన సిఫార్సుపై సల్వారాను తొలగించింది.

రైళ్లు రద్దు

బెంగళూరు: పంజాబ్, హరియాణా, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉద్రిక్తకర పరిస్థితుల దృష్ట్యా చండీగఢ్ వైపు వెళ్లాల్సిన రైళ్లను రద్దు చేసినట్లు నైరుతి రైల్వే ప్రకటించింది.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

కోస్తా జిల్లాలపై ప్రభావం

ఈనాడు, విశాఖపట్నం: ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరం ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది ఆదివారంలోపు అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మీదుగా మరో ఉపరితల ఆవర్తనం కూడా ఉన్నట్లు వెల్లడించారు. ఇంతకు ముందు ఏర్పడిన ద్రోణి ఇంకా కొనసాగుతోంది. అల్పపీడనం ప్రభావం వల్ల కోస్తాలో కొన్నిచోట్ల రానున్న రెండ్రోజుల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లో రానున్న నాలుగు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపారు.

గ్రహం అనుగ్రహం
27-8-2017 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
షష్ఠి: రా. 11-07 తదుపరి సప్తమి
స్వాతి నక్షత్రం: రా. 7-21 తదుపరి విశాఖ
అమృతఘడియలు: ఉ. 9-58 నుంచి 10-40 వరకు
వర్జ్యం: రా. 1-25 నుంచి 3-09 వరకు
దుర్ముహూర్తం: సా. 4-37 నుంచి 5-27 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-48; సూర్యాస్తమయం: సా. 6-17

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	21.1	29.5
ఖమ్మం	23.0	25.0
నిజామాబాద్	23.0	31.0
హన్మకొండ	23.5	34.0
అనంతపురం	23.3	28.7
కర్నూలు	24.0	32.1
కరీంనగర్	24.0	34.0
ఒంగోలు	24.4	34.9
రామగుండం	25.0	31.4
గుంటూరు	25.0	32.0
సూర్యాపేట	25.0	34.5
విజయవాడ	25.2	32.6
నరసాపురం	25.7	31.5
కడప	26.0	34.0
రాజమహేంద్రవరం	26.0	34.0
తిరుపతి	26.0	35.5
విశాఖపట్నం	26.2	34.0
తాడేపల్లిగూడెం	26.5	30.5
నెల్లూరు	27.0	33.0
శ్రీకాకుళం	27.0	36.5

కశ్మీర్‌లో ఉగ్ర పంజా

(మొదటి పేజీ తరువాయి)

దళాలపై కాల్పులు జరపడం మొదలుపెట్టారు. ఈ ప్రాంగణంలో పోలీసుల కుటుంబ సభ్యుల నివాసాలు కూడా ఉన్నాయి. దీంతో సైన్యం, సీఆర్పీఎఫ్, పోలీసు బలగాలు వెంటనే రంగప్రవేశం చేసి.. ఉగ్రవాదులను ఒక చోటుకే పరిమితం చేశాయి. క్వార్టర్స్‌లో ఉన్న కుటుంబ సభ్యులందరినీ సురక్షితంగా వెలుపలికి తీసుకురాగలిగాయి. మధ్యాహ్నానికి ఒక ఉగ్రవాదిని హతమార్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో మరో ముష్కరుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడపటి వార్తలు అందేసరికి కాల్పులు ముగిశాయి. మూడో ఉగ్రవాది మృతదేహం కోసం గాలింపు జరుగుతోంది. ఎన్‌కౌంటర్ సమయంలో ఒక ముష్కరుడు భవనం నుంచి బయటకువచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడని అధికారులు తెలిపారు. అతడిని అక్కడికక్కడే కాల్చి చంపినట్లు వివరించారు. షోపియాన్- పుల్వామా జాతీయ రహదారిపై కట్టుదిట్టమైన భద్రత ఉండే ప్రాంతంలో ఈ ప్రాంగణం ఉంది. అక్కడికి సమీపంలోనే జిల్లా కలెక్టర్, సీనియర్ ఎస్పీల కార్యాలయాలు ఉన్నాయి.

గరిష్ఠ నష్టం కలిగించేందుకే.. ఈ ఘటనలో నలుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు, జమ్మూకశ్మీర్ పోలీసు కానిస్టేబుల్, రాష్ట్ర పోలీసు విభాగానికి చెందిన ముగ్గురు ప్రత్యేక పోలీసు అధికారులు మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. మరణించిన నలుగురు సీఆర్పీఎఫ్ సిబ్బందిలో ఇద్దరు.. ఉగ్రవాదులు అమర్చిన పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే క్రమంలో దుర్మరణం పాలయ్యారు. భద్రతా దళాలకు గరిష్ఠ స్థాయిలో ప్రాణ నష్టం కలిగించేందుకు ఈ ప్రాంగణాన్ని ఉగ్రవాదులు ఎంచుకొని ఉండొచ్చని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో దక్షిణ కశ్మీర్‌లో అప్రమత్తత ప్రకటించారు. ముందుజాగ్రత్త చర్యగా పుల్వామా జిల్లాలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

వైఫల్యమేమీ లేదు.. భద్రతా దళాలు ఇంత పెద్ద సంఖ్యలో మరణించడం దురదృష్టకరమని జమ్మూకశ్మీర్ డీజీపీ ఎస్.పి.వెయిద్ తెలిపారు. “మా సిబ్బంది ధైర్య సాహసాలతో పోరాడారు. రాష్ట్రం నుంచి ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టేయాలన్న దృఢ సంకల్పం మాలో ఇంకా పెరిగింది” అని చెప్పారు. ఈ దాడిలో భద్రతాపరమైన వైఫల్యమేమీ లేదన్నారు. “చావుకు సిద్ధపడిన వారు చేసే దాడిని నివారించడం కష్టం.” అని చెప్పారు.

బీఎస్ఎఫ్ ఎదురు కాల్పుల్లో ముగ్గురు పాక్ రేంజర్ల మృతి.. పాకిస్థాన్ దళాలు జరిపిన కాల్పులను తిప్పికొట్టిన బీఎస్ఎఫ్ జవాన్లు ఆ దేశానికి చెందిన ముగ్గురు రేంజర్లను మట్టుబెట్టారు. శనివారం సురందర్‌బని సెక్టారులోని దేవ్రా గ్రామంపైకి పాకిస్థాన్ రేంజర్లు కాల్పులు జరిపారు. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కనీసం ఆరు మోర్టార్లను ప్రయోగించారు. ప్రతిగా తమ జవాన్లు కూడా కాల్పులు జరపడంతో కనీసం ముగ్గురు పాక్ రేంజర్లు మృతి చెందారని బీఎస్ఎఫ్ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు.

కానిస్టేబుల్ కె.కె.అప్పారావుకు గాయాలు.. మరో సంఘటనలో... ఆర్.ఎస్.పోరా సెక్టారులో శుక్రవారం పాక్ రేంజర్లు జరిపిన కాల్పుల్లో బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కె.కె.అప్పారావుకు గాయాలయ్యాయి. ఆయన నీరు తాగుతున్న సమయంలో దూరంగా నక్కి ఉన్న ఓ పాక్ సైనికుడు కాల్పులు జరిపాడు. అప్పారావు కుడి చెవి కింద భాగంలో తూటా తగిలింది. ఆయనకు శుక్రవారం రాత్రే శస్త్రచికిత్స చేశారని, ప్రస్తుతం కోలుకుంటున్నారని ఆ అధికార ప్రతినిధి వివరించారు. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి చాలా కాలం తరువాత కాల్పులు జరిగాయని అధికారులు చెప్పారు.

అఆఇఈ... అజరామరం..!

- సాహిత్యం, చరిత్ర.. తెలుగుభాషకు శ్రీరామరక్ష
- అనువాదంతో మరింత వెలుగు తేవాల్సిన అవసరం ఉంది
- తెలుగు రాష్ట్రాల్లో 12 గిరిజన భాషల ఉనికికి ప్రమాదం
- 'ఈనాడు'తో పీఎల్ఎస్ఐ ఛైర్మన్ గణేష్ ఎన్.దేవీ

ఈనాడు - హైదరాబాద్

తెలుగు భాషా వైభవానికి సాహిత్యం, చరిత్ర, సాంస్కృతిక పునాదులే శ్రీరామరక్ష అని పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పీఎల్ఎస్ఐ) ఛైర్మన్ గణేష్ ఎన్.దేవీ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 6 వేల భాషల్లో దాదాపు 90 శాతం అంతరించిపోయినా, ఆంగ్ల భాషా ప్రభావం ఉన్నప్పటికీ తెలుగుకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. అలాగని మిన్నకుండి పోకుండా తెలుగు అనువాదాన్ని పెంచుతూ మరింత విజ్ఞానవంతమైనదిగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇటీవల పీఎస్ఎల్ఐ సర్వే వివరాలు వెల్లడైన నేపథ్యంలో ఆయనతో 'ఈనాడు' ఇంటర్వ్యూ నిర్వహించగా.. అనేక ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

పీఎల్ఎస్ఐ నిర్వహించిన అధ్యయనం వందల కొద్దీ భాషలు అపాయంలో ఉన్నట్లు తేల్చింది? దీనికి ప్రాతిపదిక ఏమిటి?

దేశంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న 780 భాషల్లో 400 రానున్న కొన్నేళ్లలో ముప్పు ముంగిటకు వెళ్లే అవకాశముందన్నది వాస్తవం. వీటిలో ఎక్కువ సంచార జాతులు, కొండ, తీరప్రాంతాల్లో నివసించే వారు మాట్లాడేవి. దీనికి ప్రధాన కారణం... తక్కువ సంఖ్యలో ప్రజలు, సమూహాలు మాట్లాడే భాషలున్న ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాలను కల్పించకపోవడమే. ప్రాథమిక విద్యలో మాట్లాడే భాషను చేర్చకపోవడంతో మాతృభాషలో బోధన జరగడం లేదు. ఈ కారణంగా మనుగడ కొనసాగించేందుకు.. మాతృభాషతో సంబంధం లేని సమూహాల్లోకి భారీఎత్తున వలసలు జరుగుతున్నాయి. దీన్నిబట్టే దీనిపై అంచనాకు వచ్చాం.

హిబ్రూ తరహాలో మాతృభాషలను పరిరక్షించుకునేందుకు ఏమైనా పరిశోధన పద్ధతులున్నాయా?

హిబ్రూ తరహాలో అంతరించిపోయే దశలో ఉన్న భాషల పరిరక్షణకు శాస్త్రీయ విధానాలున్నాయి. కొన్నేళ్ల పాటు ప్రజలు, ఆయా సమూహాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న భాషాభిమానులతోనే ఇది సాధ్యం. వీరంతా ప్రజలు తమ మాతృభాషలోనే మాట్లాడుకునేలా వారిలో చైతన్యం తేవాలి. స్వచ్ఛంద సంస్థలు ఈ యజ్ఞంలో పాల్గొని ఆయా భాషలపై పుస్తకాలు, వీడియోలు రూపొందించాలి. ఆ క్రతువులో ఆయా జాతుల ప్రజలను భాగస్వాములను చేయాలి. భాషా పరిరక్షణను ప్రభుత్వాలు సున్నితమైన అంశంగా, ప్రజాస్వామిక హక్కుగా చూడాలే తప్ప... భారంగా పరిగణించకూడదు.

ప్రాంతీయ భాషల పరిరక్షణలో ప్రభుత్వాల పాత్ర ఏమిటి?

ప్రభుత్వాలు భాషను తయారు చేయలేవు. రక్షించనూ లేవు. ప్రజల తరపున ప్రభుత్వాలు భాషను శాసించగలవా? అంటే లేదనే సమాధానం వస్తుంది. ప్రజలే మాతృభాష వినియోగాన్ని ప్రాథమిక హక్కుగా భావించాలి. ప్రభుత్వాలు మాతృభాష వినియోగాన్ని పౌరహక్కుగా పరిగణించాలి.

భాషా పరిరక్షణకు పాఠశాల, కళాశాల పాఠ్య ప్రణాళికల్లో మార్పులు సూచిస్తారా?

పాఠశాల, కళాశాలలలో భాషా పుస్తకాల పాఠ్య ప్రణాళికలపై స్పష్టమైన పరిశీలన, మదింపు అవసరం. కళాశాల, పాఠశాల నుంచి ఉత్తీర్ణులై బయటకు వెళ్తున్న పిల్లలకు భాషాపరమైన పోటీలు అవసరం. తద్వారా వాటికి గుర్తింపు వస్తుంది. ఈ ప్రాథమిక వాస్తవానికి విద్యాలయాలు ఇతర ప్రమాణాలు చేరుస్తున్నాయి. 99 శాతానికిపైగా ఉత్తీర్ణత గణాంకాలు, ప్రాంగణ నియామకాల పేరిట విద్యాలయాలు ఆత్మను చంపుకుంటున్నాయి. ఈ వైఖరి మారాలి.



ఆంగ్ల ప్రభావంతో తెలుగుకు ప్రమాదం పొంచి ఉందన్న వాదన బలంగా ఉంది? దీనితో మీరు ఏకీభవిస్తారా?


తెలుగు భాష మనుగడ..భవిష్యత్తుకు ఎలాంటి ప్రమాదం లేదు. ఈ భాషకు బలమైన చారిత్రక పునాదులుండటమే దీనికి కారణం. అద్భుతమైన సాహితీ చరిత్ర, నాటకాలు, సంగీత, సినీ, మీడియా మాధ్యమాల ప్రభావమూ ఎక్కువగా ఉంది. సైబర్ ప్రపంచంలోనూ ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. చిన్న, పెద్ద సమూహాలతో దాదాపు 40 దేశాల్లో తెలుగు మాట్లాడే వారు కనిపిస్తారు. దేశంలోని 25 రాష్ట్రాల్లోనూ తెలుగుకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలో మాట్లాడే 6వేల భాషల్లో దాదాపు 90శాతం కనుమరుగైనప్పటికీ తెలుగు సజీవంగా ఉంటుంది. 40 దేశాల్లోని తెలుగు మాట్లాడే ప్రవాసీయులు..కొన్ని తెలుగు పదాలను ఆయా దేశాల్లో దైనందిన వినియోగ భాషా పదాలుగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తే తెలుగుకు మరింత వన్నె చేకూరుతుంది. నిత్యం చేసే అనువాదంతో ఇది సాధ్యమవుతుంది.

తెలుగు రాష్ట్రాల్లో ఎన్ని గిరిజన భాషలకు ప్రమాదం పొంచి ఉంది? అధ్యయనానికి విఘాతం ఎందుకు ఏర్పడింది?

తెలుగు రాష్ట్రాల్లో 16 గిరిజన, సంచార సమూహాల భాషలు వాడుకలో ఉన్నాయి. వీటిలో 2040 నాటికి 12 భాషలు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది చాలా విచారకరం. ఈ విషయమై ప్రత్యేక దృష్టిసారించాలి. ఉమ్మడి రాష్ట్రంలో భాషలపై సామాజిక, ఆర్థిక అధ్యయనం చేయాలన్న ప్రతిపాదన పీఎల్ఎస్ఐకి వచ్చింది. ఈ పని మొదలైన తరువాత ఆ విభాగానికి కొత్తగా మరో అధికారి వచ్చి ప్రాజెక్టు అవసరం లేదన్నారు. దీంతో దాన్ని మధ్యలో వదిలేయాల్సి వచ్చింది. సున్నితమైన ప్రాజెక్టులు నిలకడలేని ప్రభుత్వ విభాగాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడటంతో.. తక్కువ సంఖ్యలో మాట్లాడే భాషలు ప్రతికూల ప్రభావానికి గురవుతున్నాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో గిరిజన భాషలు, సంస్కృతిని కాపాడుకునేందుకున్న మార్గాలేమిటి?

వాతావరణ మార్పులు, భూతాపం జీవ వైవిధ్య వినాశానికి ఏవిధంగా కారణమవుతున్నాయో... పారిశ్రామికీకరణ గిరిజన సంస్కృతి, భాషలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. తమ ప్రాంతంలో స్థాపించే పరిశ్రమలు, దాని పర్యవసానాలపై మాట్లాడే అవకాశాన్ని గిరిజనులకు కల్పించాలి. జీవ వైవిధ్య పరిరక్షణకు ఇచ్చిన ప్రాధాన్యాన్నే..భాష ఉనికిని నిలబెట్టేందుకూ ఇవ్వడం ద్వారా గిరిజన భాషలు, సంస్కృతిని కాపాడవచ్చు.



అహోబిలం.. జలపాతాల సోయగం..

కర్నూలు జిల్లాలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. నల్లమల, అహోబిలం అటవీ ప్రాంతంలో ఎక్కడ చూసినా పొంగుతున్న వాగులు, వంకలు, జలపాతాలు నీటిధారలు కనువిందు చేస్తున్నాయి. ప్రధానంగా ఎగువ ఆలయం వెనుక భాగంలో కొండపై నుంచి జాలువారుతున్న నీటి ధారలు, వరాహ ఆలయం, ప్రహ్లాద బడి, జ్వాలా నృసింహ స్వామి ఆలయాల చెంత పెద్ద ఎత్తున జలపాతాలు జాలువారుతున్నాయి. పచ్చటి చెట్లతో కూడిన కొండలు, జలపాతాలను ఆస్వాదించేందుకు భక్తులు అధిక సంఖ్యలో అహోబిలానికి తరలి వస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణ

ఉపాధి పనులపై పక్కా సమాచారం

ఈనాడు, అమరావతి: గ్రామీణ ఉపాధి హామీ పనులపై కేంద్రం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు అన్ని స్థాయిల్లోనూ పక్కా సమాచారం ఉండేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ మేరకు కలెక్టర్లను అప్రమత్తం చేస్తున్నారు. గత రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలపై పనుల వారీగా దస్త్రాలు రూపొందించాలని ప్రభుత్వం సూచించింది. ముందస్తు ఏర్పాట్లపై పరిశీలన కోసం గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల బృందాలు వచ్చే నెల 5 నుంచి జిల్లాలకు పంపనున్నారు.

స్టార్ ప్రచారకుల ఖర్చూ తెదేపా అభ్యర్థి జాబితాలోనే!

సకాలంలో జాబితా ఇవ్వని ఫలితం

ఈనాడు, అమరావతి: నంద్యాల శాసనసభ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం తరపున ప్రచారం చేసిన ప్రముఖుల(స్టార్ క్యాంపెయినర్స్) ఖర్చు ఆ పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఖాతాలోనే పడనుంది. అభ్యర్థి చేసిన వ్యయానికి ఇది అదనం. ఎన్నికల సంఘానికి సకాలంలో స్టార్ క్యాంపైనర్ల జాబితా ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వారం రోజుల లోపు రాజకీయ పార్టీలు... వారి స్టార్ క్యాంపైనర్ల వివరాల్ని ఎన్నికల సంఘానికి అందించాలి. అలా చేస్తే వీరికయ్యే ఖర్చును అభ్యర్థికయ్యే వ్యయంగా పరిగణించరు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వారి జాబితా పంపటంలో తెదేపా జాప్యం చేసింది. గడువు ముగిసిన వారం తరువాత జాబితాని ఎన్నికల సంఘానికి పంపింది. దీంతో వీరి పేర్లను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోలేదు. తెదేపా తరపున పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, కొందరు మంత్రులు ప్రచారం చేశారు. ఎన్నికల అధికార వర్గాల సమాచారం మేరకు వీరికైన ఖర్చునూ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి వ్యయంగానే పరిగణించనున్నారు. ఇదంతా నిర్దిష్ట పరిమితికి లోబడి ఉంటే ఫర్వాలేదు గాని అలా లేకుంటే ఇబ్బందికరమే.

జగన్‌కు ప్రతిపక్షనేత హోదా కూడా మిగలదు

మంత్రి ఆదినారాయణరెడ్డి

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డికి ప్రతిపక్షనేత హోదా కూడా మిగలదని, 2019 ఎన్నికల తర్వాత ఆ పార్టీ జెండా పీకేయడం ఖాయమని రాష్ట్ర గిడ్డంగులు, మార్కెటింగ్ శాఖ మంత్రి సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప జిల్లా ప్రొద్దుటూరులో మంత్రి విలేకరులతో మాట్లాడారు. నంద్యాలలో తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిది మహాభారతంలోని దుర్యోధనుడి పాత్ర అని అన్నారు. ఎన్నికల తరువాత నంద్యాలలో చోటుచేసుకున్న ఘటనలను ప్రభుత్వంతో ముడిపెట్టి ప్రతిపక్ష పార్టీ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ లింగారెడ్డి, తెదేపా నేతలు శ్రీనివాసులురెడ్డి, వరదరాజులురెడ్డి పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో మట్టి గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలంలో వైభవంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు

శ్రీశైలం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం 9 గంటలకు దేవస్థానం ఈవో, ఆలయ అర్చకులు, వేదపండితులు యాగశాల ప్రవేశం చేసి మహాగణపతిపూజ, ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ ప్రాంగణంలో మట్టి గణపతిని నెలకొల్పి వ్రతకల్ప పూర్వకంగా విశేషపూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం గణపతిహోమం, రుద్రహోమంలను వేదపండితులు నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో చేపట్టిన పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

బ్యాంకు సేవలన్నీ చరవాణికి బదిలీ!

- ఆ రోజెంతో దూరంలేదు
- ఆర్థిక మంత్రి జైట్లీ విశ్లేషణ

ఈనాడు - బెంగళూరు

నల్లధనాన్ని అడ్డుకునేందుకు, పన్ను ఎగవేతను నివారించేందుకు కేంద్ర పథకాల అమలులో బ్యాంకులు చురుకైన పాత్ర పోషించాలని కేంద్ర ఆర్థిక, రక్షణమంత్రి అరుణ్‌జైట్లీ పిలుపునిచ్చారు. బెంగళూరులో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన విజయాబ్యాంకు చేపట్టిన 'నూరు గ్రామాల డిజిటలీకరణ' పథకంతో పాటు ఆ బ్యాంకుకు చెందిన వందేసి కొత్త శాఖలు, ఏటీఎంలను ప్రారంభించారు. అనంతరం బ్యాంకు సిబ్బంది, ఖాతాదార్లను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలోని బ్యాంకులన్నింటినీ పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు ప్రారంభించగా రైతులు స్థాపించిన విజయా బ్యాంకు 87ఏళ్లుగా పోటీ బ్యాంకుల కంటే మెరుగ్గా పనిచేయడం ప్రశంసార్హమన్నారు.

- ప్రస్తుత బ్యాంకింగ్ వ్యవస్థ ఎంతో కాలం ఇలాగే కొనసాగదని జైట్లీ విశ్లేషించారు. లావాదేవీలన్నీ చరవాణికి బదిలీ కావటం తథ్యమన్నారు. విపరీతమైన నగదు చలామణీ పన్ను ఎగవేతకు- నల్ల ధనాన్ని పోగుచేసేందుకు ఊతమిస్తుందని విమర్శించారు. ఫలితంగా జాతీయ భద్రత చర్యలకు, సంక్షేమ పథకాల అమలుకు నిధుల కొరత ఏర్పడి దేశ పురోగతికి అవరోధంగా మారుతుందన్నారు.
- అభివృద్ధి చెందిన అనేక దేశాలు ఏనాడో నగదు చలామణికి వీడ్కోలు పలికాయని జైట్లీ గుర్తుచేశారు. నగదు రహిత ఆర్థిక వ్యవస్థకు స్వీడన్ ఆనవాలుగా పేర్కొన్నారు. అదే బాటలో మన దేశాన్నీ వేగంగా మార్పుచేయాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ దిశగా అడుగేసేందుకు తమ ప్రభుత్వం జనధన్ ప్రారంభించగా మూడేళ్ల వ్యవధిలో ముప్పయి కోట్ల మంది కొత్తగా బ్యాంకు ఖాతాదార్లుగా మారి సొమ్మునూ మదుపు చేశారన్నారు. సంక్షేమ పథకాల నగదు, ఇతర సాయాలన్నీ బ్యాంకు ఖాతాల్లోనే జమయ్యాయన్నారు. నగదు రహిత వ్యవస్థను గ్రామీణులు అమలు చేయలేరనేది భ్రమ మాత్రమేనని జైట్లీ పేర్కొన్నారు. విజయా బ్యాంకు ఛైర్మన్ నారాయణన్, ఎండీ కిశోర్ సాన్సి, కార్యనిర్వాహక సంచాలకులు వై.నాగేశ్వరరావు, బి.ఎస్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



విజయాబ్యాంకు కొత్త శాఖలను లాంఛనంగా ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ

బీఈఎల్‌లో పరీక్ష కేంద్రాలను ప్రారంభించిన జైట్లీ

భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ(బీఈఎల్)కు చెందిన బెంగళూరు ఆవరణలో నిర్మించిన 'అకాడమీ ఫర్ ఎక్సలెన్సీ, ఈఎంసీ, నియర్ ఫీల్డ్ యాంటెన్నా' పరీక్ష కేంద్రాల్ని రక్షణమంత్రి అరుణ్‌జైట్లీ శనివారం ప్రారంభించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ ఆవరణలో ఆరెకరాల విస్తీర్ణంలో రూ.47కోట్ల వ్యయంతో ఈ అకాడమీ నిర్మించారు. ఇక్కడ వివిధ పరికరాలు, విడిభాగాల సరఫరా సంస్థలు, సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తారు. సంస్థ ఉద్యోగులకూ అకాడమీ శిక్షణ ఇవ్వనుంది. దీన్ని జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలకు అనుబంధం చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లోనూ అకాడమీ భాగస్వామి కానుంది. అకాడమీకి ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్సీ, ఐఈఈఈ నిపుణులు సహకరిస్తారు. దేశంలో తొలిసారి ఇక్కడే ఈఎంసీ పరీక్ష కేంద్రాన్ని నిర్మించారు. ఆకాశ్ క్షిపణి, రణరంగంలో మారణాయుధాలను గుర్తించే రాడార్లు తదితరాల సామర్థ్యాన్ని పరీక్షించవచ్చు.



బెంగళూరులో ప్రతిష్ఠించేందుకు రూపొందించిన విగ్రహాలు

బెంగళూరు పార్కులో ఎన్టీఆర్ విగ్రహం

34 మంది ప్రముఖులవి తయారుచేసిన తెనాలి శిల్పులు

తెనాలి, న్యూస్‌టుడే: కర్ణాటక రాజధాని బెంగళూరు రాజరాజేశ్వరి నగర్ జె.పి పార్కులో ప్రతిష్ఠించనున్న విగ్రహాల తయారీకి కళల కాణాచి తెనాలి వేదికైంది. విగ్రహాల తయారీలో తెనాలికున్న పేరు ప్రఖ్యాతులు తెలుసుకున్న ఆ రాష్ట్ర ఎమ్మెల్యే మునిరత్నం పట్టణానికి చెందిన శిల్పి కాటూరి రవిచంద్రను సంప్రదించారు. దేశానికి చెందిన 34 మంది ప్రముఖుల విగ్రహాలను తయారు చేయించేందుకు ప్రణాళిక చేశారు. ఈమేరకు కాటూరి రవిచంద్ర తన తండ్రి వెంకటేశ్వరరావుతో కలిసి రూపొందించారు. మూడు నెలల కాలంలో ఫైబర్ విగ్రహాలను తీర్చిదిద్దారు. ఇందులో ఛత్రపతి శివాజీ, టిప్పు సుల్తాన్, ఝాన్సీరాణి, బాబూరాజేంద్ర ప్రసాద్, నెహ్రూ, వల్లభాయ్ పటేల్, అంబేడ్కర్, రవీంద్రనాథ్ ఠాగూర్, భగత్‌సింగ్, మడకరి నాయక, సంగోలి రాయన్న, జయచామరాజ వడయార్, ఇందిరాగాంధీ, పింగళి వెంకయ్య, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఎన్టీ రామారావు, ఎం.జి.రామచంద్రన్, రాజకుమార్, ప్రేమ్ నజీర్, కె.సి.రెడ్డి, వినాయక కృష్ణ గోకక్, హనుమంతయ్య, చంద్రశేఖర్ కుమార్, మస్తి వెంకటేష్ అయ్యంగార్ తదితరుల విగ్రహాలు ఉన్నాయి. శనివారం వీటిని బెంగళూరుకు తరలించారు.

తారస్థాయికి తమిళ రాజకీయం!

- సీఎంను మార్చకుంటే రాష్ట్రపతి వద్దకెళ్తాం
- టీటీవీ మద్దతుదారు ఎమ్మెల్యేల స్పష్టీకరణ
- తిరుగుబాటు ఎమ్మెల్యేలకు నోటీసులు పంపిన స్పీకర్

చెన్నై: తమిళనాట ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, టీటీవీ దినకరన్‌ల మధ్య రాజకీయ పోరు తారస్థాయికి చేరుకుంది. ఇరువురు వ్యూహప్రతివ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు 19 మంది ఎమ్మెల్యేలు గవర్నర్‌కు లేఖలు అందించగా... మరో ముగ్గురు శాసనసభ్యులు తాజాగా టీటీవీకి మద్దతు తెలిపారు. మరోవైపు మైనారిటీలో ఉన్న ప్రభుత్వానికి బలపరీక్ష పెట్టాలని విపక్షాలన్నీ డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం దిల్లీకి వెళ్లి కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన రాష్ట్ర ఇన్‌ఛార్జి గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. అనంతరం శనివారం సాయంత్రం చెన్నైకి చేరుకున్నారు. ఈ క్రమంలో గవర్నర్ నుంచి సరైన నిర్ణయం వెలువడుతుందని దినకరన్ నమ్మకంగా ఉన్నారు. సర్కారుపై తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేలు కూడా అదే ఆశతో ఉన్నారు. ఇది జరగకపోతే త్వరలోనే దిల్లీకి వెళ్లి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే తంగ తమిళ్‌సెల్వన్ శనివారం స్పష్టం చేశారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపునకు పాల్పడ్డారంటూ స్పీకర్ నోటీసులు పంపించారు. రాష్ట్రంలో 17 సంవత్సరాల తర్వాత ఈ తరహా ఘటన జరిగింది. 2000లో డీఎంకే ఎమ్మెల్యే ఎం.ముత్తురామలింగం అన్నాడీఎంకేలో చేరారని అనర్హుడిగా ప్రకటించారు. ఇప్పుడు మరోసారి అనర్హత అంశం తెరపైకి వచ్చింది. ఇదే సమయంలో.. తాము స్పీకర్ నోటీసులకు స్పందించబోమని, అవి చట్టవిరుద్ధమని తిరుగుబాటు ఎమ్మెల్యేలు చెబుతున్నారు. అన్నాడీఎంకే సీనియర్ నేత మధుసూదన్‌తో శనివారం ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం సమావేశమయ్యారు. తాజా పరిణామాల నేపథ్యంలో మధుసూదన్ అసంతృప్తిగా ఉన్నారని ప్రచారం సాగడంతో ఈ భేటీ జరిగినట్లు తెలిసింది. ఆదివారం ఉదయం 10 గంటలకు డీఎంకే సీనియర్ నేత, ఎమ్మెల్యే దురైమురుగన్ నేతృత్వంలో ఎంపీ కనిమొళి, ఇతర నాయకులు రాజ్‌భవన్‌లో గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావుతో సమావేశం కానున్నారు. ముఖ్యమంత్రి పళనిస్వామి బలపరీక్షపై వారు చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కూడా గవర్నర్‌తో సమావేశం కానున్నట్లు తెలిసింది.

ప్రోగ్రాం సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ప్రసార భారతి ఛైర్మన్‌కు సంఘం ప్రతినిధుల వినతి

ఈనాడు, హైదరాబాద్: ఆకాశవాణి, దూరదర్శన్‌లలో పనిచేస్తున్న ప్రోగ్రాం సిబ్బంది సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రోగ్రాం సిబ్బంది సంఘం ప్రతినిధులు కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఆకాశవాణి కేంద్రం సందర్శించిన ప్రసార భారతి ఛైర్మన్ డా.ఎ.సూర్యప్రకాశ్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఎం.నరేందర్, సి.రాంబాబు, వి.గోపీచంద్, ఎన్.విజయరాఘవరెడ్డి, ఎ.సంపత్‌నాయుడు మాట్లాడుతూ..2016 జనవరిలో బెంగళూరులో దక్షిణ మండల సమావేశం సందర్భంగా ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ప్రోగ్రాం డివిజన్‌లో 20 ఏళ్లుగా ఎటువంటి పదోన్నతులు నోచుకోని వారికి న్యాయం చేయడంతో పాటు ఇతర సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు.



నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందచేస్తున్న తితిదే ఈవో

సమస్త మానవాళికి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించా

నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా

తిరుమల, న్యూస్‌టుడే: ప్రపంచ మానవాళికి శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు అందించాలని ప్రార్థించినట్లు నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా ఉద్ఘాటించారు. తిరుమల శ్రీవారిని ప్రధాని దంపతులు శనివారం దర్శించుకున్నారు. నేపాల్, భారత్‌ల మధ్య సాంస్కృతికంగా, భౌగోళికంగా విడదీయరాని సంబంధం ఉందన్నారు. శ్రీవారిని దర్శించుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు ప్రధానికి తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు స్వాగతం పలికారు.



పట్టువస్త్రాలు సమర్పించడానికి వస్తున్న మంత్రి పైడికొండల మాణిక్యాలరావు దంపతులు

ఘనంగా కాణిపాక బ్రహ్మోత్సవాలు

కాణిపాకం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో శుక్రవారం వైభవంగా చవితి వేడుకలు నిర్వహించారు. భక్తులకు వేకువజామున 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పించారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు దంపతులు ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఉత్సవాలకు అంకుర్పారణ చేశారు. మూషిక పటాన్ని ధ్వజస్తంభం పైకి ఎగురవేశారు. రాత్రి హంసవాహనంపై స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.


25 వేల ఓట్ల మెజార్టీతో నంద్యాలలో గెలుస్తాం: మంత్రి కాలవ

తిరుపతి, న్యూస్‌టుడే: నంద్యాల ఉప ఎన్నికల్లో వైకాపా అధినేత జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు తెదేపాకు అనుకూలించాయని, 25 వేల ఓట్ల మెజార్టీతో పార్టీ అభ్యర్థి విజయం ఖాయమని మంత్రి కాల్వ శ్రీనివాసులు ధీమా వ్యక్తం చేశారు. శనివారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నంద్యాల ఉప ఎన్నిక తెదేపా ప్రభుత్వానికి రెఫరెండమేనన్నారు. తెదేపా ప్రభుత్వ మూడేళ్ల పాలనకు కృతజ్ఞతగా ఎన్నికల్లో తెదేపాకు ప్రజలు ఓట్లు వేశారని తెలిపారు. రానున్న రెండేళ్లలో 10 లక్షల గృహాలు నిర్మిస్తామని, జర్నలిస్టులకు ట్రిబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. ఇప్పటివరకు 1.5 లక్షల ఇళ్లు నిర్మించామని వీటిలో వచ్చేనెలలో గృహ ప్రవేశాలు చేయించనున్నట్లు తెలిపారు. 20 రోజుల్లో 5 లక్షల ఇళ్లకు భూమి పూజ చేయనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీకాకుళం జిల్లాలో ప్రేమికుల ఆత్మహత్య

పొందూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పొందూరు రైల్వే నిలయం సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున రైలుకింద పడి ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్నారు. పొందూరుకు చెందిన ఆచంటి మహాలక్ష్మి(18), రాజాం మండలం కొండంపేట గ్రామానికి చెందిన యజ్జిపురపు విజయ్‌కుమార్ అలియాస్ మనోజ్(18)లు రాజాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ క్రమంలో వారిమధ్య ప్రేమ చిగురించింది. అనంతరం ప్రేమ విషయం ఇరు కుటుంబాలకు తెలిసింది. దీంతో వారు పిల్లలను మందలించారు. ఇది పెళ్లి వయస్సు కాదని బుద్ధిగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఉద్బోధించారు. ఆ తర్వాత ఇరువురికి వివాహం చేసేందుకు నిర్ణయం తీసుకుంటామని నచ్చజెప్పారు. ఆ మాటలు ప్రేమికులకు మింగుడుపడలేదు. దీంతో శుక్రవారం తెల్లవారు జామున 3.15 గంటల సమయంలో చరవాణిలో తాము ఇష్టపూర్వకంగా ఎవరి ప్రమేయం లేకుండా ఆత్మహత్య చేసుకుంటున్నామని, దీనిలో తల్లిదండ్రుల పాత్ర ఏమాత్రం లేదని మహాలక్ష్మి, మనోజ్‌లు ఇరు కుటుంబాలకు సమాచారం పంపించారు. అనంతరం విశాఖ నుంచి పలాస వైపునకు వెళ్లే మార్గంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.





మహాలక్ష్మి ★ విజయ్‌కుమార్

నేడు స్వర్ణభారతి ట్రస్ట్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి

విజయవాడ: విజయవాడ సమీపంలోని ఆత్కూరులో స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించనున్నారు. ఈ శిబిరంలో స్టార్, మణిపాల్ ఆసుపత్రి సౌజన్యంతో నరాలు, కీళ్లు, గుండె జబ్బులు, సాధారణ వ్యాధులతో పాటు స్త్రీలలో పెరుగుతున్న రొమ్ముక్యాన్సర్‌కు ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ మేనేజింగ్ సభ్యురాలు దీపా వెంకట్ తెలిపారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు డా.గూడపాటి రమేష్, నరాల వ్యాధి నిపుణులు డా.వి రవికాంత్, కీళ్లు, మోకాళ్ల వ్యాధి నిపుణులు డా.కె.శ్రీరామ్, ప్రముఖ రేడియాలజిస్టు డా.వి.రామకృష్ణ, నొప్పుల నివారణ నిపుణులు కాట్రగడ్డ అజయ్ సేవలందిస్తారన్నారు.

ఈనాడు

అమ్మ పాల అమృతం

ఆలుమగలు అమ్మానాన్నలుగా మారడం సృష్టిలో పరమాద్భుత పరిణామం. బిడ్డకు తల్లి కావడం స్త్రీ జన్మకు ఉత్సవం అది. ఆ ఇంటికే గొప్ప పండుగ! పెళ్లయి ఏడాది తిరక్కుండానే 'విశేషం ఏం లేదా?' అని అడుగుతారు అమ్మలక్కలు. 'ఇంకా కడుపున నలుసు పడలేదా?' అని ఆ ప్రశ్నకు అర్థం. కంట్లోపడితే మంటకు కారణమయ్యే 'నలుసు'- కడుపులో పడితే పంటగా తోస్తుంది. 'ప్రతి శిశువు ఆగమనం ఒక అద్భుతమే... దేవుడికి ఇంకా మనుషులపై ఆశ పోలేదనడానికి అదే గుర్తు' అన్నారు విశ్వకవి రవీంద్రులు. రాముడు భూమిపై పడగానే 'కెవ్వన స్నిగ్ధ మంథరము(కొండంత పేగుబంధం) కేక వినంబడె'నట. కౌసల్య తేరుకుని నెమ్మదిగా కళ్లు తెరచి తన మహాభాగ్యాన్ని కళ్లారా పరికించింది. 'ఆమె కన్నులున్ నవ్వెనొ, జాలి పొందెనో సనాతనమౌ మధుకాంతి చిమ్మెనో' అంటారు విశ్వనాథ. బిడ్డలకూ అంతే! 'సర్వ జగతికీ సార్వభౌమత్వం సైతం అమ్మఒడితో సమానం కానే కాదు' అన్నాడు లత 'మోహనవంశి'లో కృష్ణుడు. అవతార పురుషులకు సైతం అమ్మ ఒడి అన్నా, అమ్మ పాలన్నా విశేష అభిమానం. గోవు పొదుగునుంచి పాలు తాగుతూ దూడ అడపాదడపా పొదుగును కుమ్ముతుంది. రాముడట 'నిక్కి నిక్కి చుబుకు చుబుక్కున చుంచు మూతిని పెట్టి ఆబ తీరగ పయస్ స్వాదు నిర్ఝర నిర్ఝర ధారలు(చనుబాల ధారలు)' గ్రోలేవాడట. ఆ సమయంలో రాముడి 'పసి గళములోని లేత నరముల చిరు కదలికలు' చూస్తూ తల్లీ తండ్రీ మురిసిపోయేవారట. బలరామకృష్ణులదీ అదే తంతు అని పోతన వర్ణించాడు. 'ఎలమి తల్లుల చన్నుబాలెల్ల త్రావి, పరమ యోగోద్భవామృత పానలీల సోలి, యోగుల విధమున సొంపు గందురు' అంది భాగవతం. ఇచ్చిన తల్లికి, తాగిన బిడ్డకు పరమానంద సంధాన సేతువు అమ్మపాలు!

'రైతుల ఒంటిమీది చెమట ప్రవాహాలకు విలువ కట్టగల షరాబు లేడు' అన్నాడు శ్రీశ్రీ. 'కర్షక వీరుల కాయం నిండా కాలువ గట్టే ఘర్మ జలానికి- ఘర్మజలానికి ధర్మజలానికి ఘర్మజలానికి ఖరీదు లేదోయ్' అని మహాకవి చెప్పినదానిలో ధర్మజలమనేది అమ్మ పాలకూ వర్తించే గొప్ప పదం. అమ్మ పాలకు విలువ కట్టడం అసాధ్యం. అమూల్యమైనవి మాత్రమే కావు, అవి అతి పవిత్రమైనవి. 'చీమనునైన లోకము సృజించిన బ్రహ్మనునైన ఒక్కటే ప్రేమమయ ఆప్తతత్వ సమవీక్షణ సేయును తల్లిపాలు' అన్నారు కవులు. స్తనాలనుంచి వస్తాయి కనుక అమ్మపాలను 'స్తన్యాలు' అంటారు. తనను చంపబోయిన పులితో గోమాత 'తిరిగి వత్తును బిడ్డకు స్తన్యమిచ్చి' అని బతిమాలుతుంది. రక్తంలో రాజసం ఉంటుంది. అది పాలుగా మారేసరికి ప్రేమరసం అవుతుంది. 'రక్త ఝురులెల్ల విడనాడి రాజసమ్ము, తల్లి ప్రేమను పాలసంద్రమ్ములాయె' అని కవులు తీర్మానించారు. బిడ్డ పుట్టేసరికి అమ్మపాల రూపంలో ఆహారం సిద్ధంగా ఉండటం ఈ సృష్టిలో పరమాద్భుతం. 'వనజాక్షి సొగసైన వక్షోజములు, అమ్మ పాలిండ్లుగా మారి ప్రాణమొసగె...' క్రమం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. 'వెన్నా జున్నూ మీగడ ఎన్నిటినో తలలుదన్ను ఏవో రుచులన్, మన్నికగా చనుబాలను అన్నన్నా! దైవమొసగె అమృతము వోలెన్' అంటూ కవులు అబ్బురపడుతుంటారు. అంతటి అమృత మాధుర్యంతోనే కృష్ణుణ్ని కడతేర్చాలని పూతన ప్రయత్నించింది. 'నా చనుబాలొక గ్రుక్కెడు ఓ చిన్న కుమార! త్రావుము' అని బలవంతపెట్టింది. ఆమె 'బాలెంత చందంబునన్ పాలిండ్లన్ విషమూని వచ్చుట' ఆ బాలగోపాలుడు ముందే పసిగట్టాడు. పాలతోపాటు పూతన ప్రాణాలనూ పీల్చేశాడని భాగవతం వర్ణించింది. అమ్మదనానికి కళంకం తెచ్చిన పూతన 'పయోముఖ విషకుంభం... పాలకుండలా తోచే విషపాత్ర'గా చరిత్రలో మిగిలిపోయింది.

కష్టాలనే విషాన్ని కడుపులోనే జీర్ణించుకుని స్తనాల్లోంచి అమృత జీవధారలను స్రవిస్తుంది అమ్మ. వాటితోనే బిడ్డ ప్రాణం నిలుస్తుంది. బతికి బట్టకడుతుంది. 'అను' అంటే ఎడతెగని- అని అర్థం. బిడ్డకు తల్లికి మధ్య బలపడే అనుబంధానికి తల్లిపాలే మూలకారణం. ఆ అనుబంధమే అమ్మానాన్నల మధ్య బంధాన్ని సైతం బలోపేతం చేస్తుందన్నారు వేటూరి ప్రభాకర శాస్త్రి. దాన్ని 'సుతాకారపు ముడి'గా వర్ణించారు. 'అరయన్ ఆలుమగల్ల హృదయంబులనంబడు రెండు రజ్జువుల్(తాళ్లు)... యిక వేర్పడకుండగ ఏర్పడున్ సుతాకారపు ముళ్లు' అన్నారాయన 'మూన్నాళ్ల ముచ్చట' ఖండకావ్యంలో! బిడ్డ పుట్టినప్పుడు బాలెంత స్తనాల్లోంచి పసుపురంగు చిక్కని ద్రవం స్రవిస్తుంది. వైద్య పరిభాషలో దాన్ని 'కొలస్ట్రమ్' అంటారు. తెలుగులో 'ముర్రుపాలు'. పౌష్టిక విలువల రీత్యా, రోగనిరోధక శక్తి రీత్యా ముర్రుపాలు ఎంత శ్రేష్ఠమైనవంటే- పిల్లలకు 18 ఏళ్లు వచ్చేవరకు వాటి ప్రభావం చురుగ్గా ఉంటుందట! అంతటి బలమైన చనుబాలు సరిపోక, భారతదేశంలో ఏటా లక్షమంది శిశువులు చనిపోతున్నట్లు ఐక్యరాజ్య సమితి లెక్క కట్టింది. మనదేశంలో ఈ లోపానికి రెండు కారణాలు. 'ప్రేమను రంగరించి శిశుప్రాణము నిల్పగ చాలినంతగా' అమ్మల దగ్గర పాలు లేకపోవడం ఒక కారణం. ఇష్టం లేకపోవడం మరోకారణం. 'పాలు గుడుపబోవ పాలిండ్ల సొగసులు తరిగిపోవునంచు తలచువారు' సైతం లోకంలో ఉన్నారు. ఈ కారణాల మూలాన 'తొలి వ్యాక్సిన్' ద్వారా దక్కాల్సిన రక్షణ కవచం, సమగ్ర పోషక ఆహారం శిశువులకు లభించడం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. 'ఈ లోకమనే గుడి చేరగ తొలివాకిలి'గా నిలిచే అమ్మలకు సంపూర్ణ స్తన్య సంపదను, వాటిని బిడ్డకు పట్టాలన్న అమృతత్వ భావాన్ని దైవం ప్రసాదించాలని ఆశిద్దాం!

ప్రమాదాలతోనా రైల్వే చెట్టపట్టాలు?



ఉత్తర్ ప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన రెండు వరస రైలు ప్రమాదాలు ప్రయాణికుల భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయడానికి సురేశ్ ప్రభు సిద్ధపడ్డారు. సామాన్యుడి ప్రయాణ నేస్తంగా పేరొందిన భారత రైల్వే కొన్ని దశాబ్దాలపాటు తిష్ఠవేసిన నిర్లక్ష్యం కారణంగా సమస్యల వలయంలో చిక్కుకుపోయింది. ప్రయాణికుడి భద్రత గాలిలో దీపమైంది. గడచిన మూడేళ్లలో రైల్వేల అభివృద్ధికి సురేశ్ ప్రభు ఎంతో కృషి చేశారు. అయినా పరిస్థితుల్లో పెద్దగా మార్పు రాకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. 1950 నుంచి 2016 వరకు 64 ఏళ్లలో ప్రయాణికుల రవాణా 1,344 శాతం, సరకు రవాణా 1,642 శాతం మేర పెరిగాయి. రైలు మార్గాల అభివృద్ధి మాత్రం 23 శాతానికే పరిమితమైంది. 15 ఏళ్లలో ప్యాసింజర్ రైళ్లు 56 శాతం, సరకు రవాణా రైళ్లు 59 శాతం పెరిగాయి. రైలు మార్గాల అభివృద్ధి 12 శాతం దగ్గరే ఆగిపోయింది. విపరీతమైన రద్దీ కారణంగా ట్రాక్ నిర్వహణ, మరమ్మతులకు సమయం సరిపోవడం లేదు. దిల్లీ-కాన్పూర్ మార్గంలో మరమ్మతుల కోసం రాత్రివేళ 13 నిమిషాలు, పగలు 19 నిమిషాలు మాత్రమే సమయం లభిస్తోంది. ఇంతటి ఒత్తిడిలో రైల్వే సిబ్బంది మరమ్మతుల కోసం హడావుడి పడటం ప్రమాదాలకు కారణమవుతోంది.

రాజకీయ మాయాజాలం

ట్రాకుల సామర్థ్యానికి మించి జరుగుతున్న రవాణా సైతం ప్రమాదాలకు దారి తీస్తోంది. రైల్వేశాఖ మొత్తం మార్గాలను 1,219 విభాగాలుగా విభజించింది. వీటిలో 40 శాతం విభాగాలపై సామర్థ్యానికి మించి రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన లైన్ల ఆధునికీకరణ జరగలేదు. రైల్వే బడ్జెట్లలో కొత్త రైళ్లు, రైల్వే లైన్లు అంటూ ఇన్నేళ్లుగా జరిగింది కేవలం ఆర్భాటపు ప్రకటనల ప్రహసనం. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా సాగిన రాజకీయ నాటకం. ప్రయాణికుల భద్రత గురించి ఏనాడూ ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. రైల్వే ట్రాకులను ఆధునికీకరించాలన్న అనేక నిపుణుల కమిటీల సూచనలు, సలహాలు, సిఫార్సులను గాలికి వదిలేశారు. రైల్వేల అభివృద్ధికి, నవీకరణకు భారీగా పెట్టుబడులు కావాలన్న విన్నపాలూ అరణ్య రోదనలే అయ్యాయి. ఇలాంటి నిష్క్రియాపరత్వమే ప్రమాదాలకు కారణమవుతోందని రైల్వేల స్థాయీసంఘం మొత్తుకొన్నా పట్టించుకున్న నాథుడే లేడు. కీలకమైన భద్రత పనుల కోసం 2009-10లో రూ.906 కోట్లు, 2010-11లో రూ.911 కోట్లు మాత్రమే కేటాయించారు. రైల్వేల భద్రత కోసం లక్ష కోట్ల రూపాయలు అవసరమంటూ 2012లో అనిల్ కకోద్కర్ కమిటీ చేసిన సూచననూ ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి. సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలోనూ భారతీయ రైల్వే వెనకబడింది. ఊబర్, ఓలా కార్ల సేవాసంస్థలు సైతం జీపీఎస్ వాడుతున్నాయి. ఈ విషయంలో రైల్వేలు ఎంతో వెనకబడ్డాయి. మొత్తం 10,773 రైలు ఇంజిన్లు ఉంటే, వాటిలో 10 శాతంలోనైనా జీపీఎస్ లేదు.

వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపమూ రైల్వేలపాలిట శాపమవుతోంది. రైల్వే వ్యవస్థలో ఇంజినీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, ట్రాఫిక్, సిగ్నల్ అండ్ టెలికాం, అకౌంట్స్, సిబ్బంది, స్టోర్స్, రైల్వే పోలీస్, మెడికల్, కమర్షియల్... ఇలా మొత్తం పదకొండు విభాగాలున్నాయి. వీటిలో భద్రతపరంగా ఇంజినీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, ట్రాఫిక్, సిగ్నల్ అండ్ టెలికాం వంటి సాంకేతిక విభాగాల మధ్య సమన్వయం చాలా అవసరం. ఇవేవీ భద్రతను బాధ్యతగా తీసుకోవడం లేదు. ఉదాహరణకు ఇంజినీరింగ్ విభాగం ట్రాక్ మరమ్మతులు చేపట్టడానికి ట్రాఫిక్ నుంచి అనుమతి కావాలి. సమయానికి రైళ్లు గమ్యం చేరాలన్న ఉద్దేశంతో ట్రాఫిక్ విభాగం అధికారులు మరమ్మతుల కోసం ట్రాక్‌పై రైళ్ల రాకపోకలను ఆపడానికి అంత సులభంగా అనుమతి ఇవ్వడం లేదు. అందువల్లే, రైల్వేలకు ఒక భద్రతా విభాగం అవసరమని కకోద్కర్ కమిటీ సూచించింది. భద్రతకు సంబంధించిన పనుల్లో లక్షల సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో ఏ ఒక్కరు చిన్న తప్పిదం చేసినా అనేకమంది ప్రాణాలకు ముప్పు తప్పదు. గడచిన అయిదేళ్లలో జరిగిన ప్రతి 10 ప్రమాదాల్లో ఆరింటికి రైల్వే సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని 'నీతి ఆయోగ్' అధ్యయనం స్పష్టీకరించింది. 2016-17లో జరిగిన 104 ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణమని రైల్వే శాఖ గణాంకాలు వివరిస్తున్నాయి. 22 మంది మరణానికి కారణమైన కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికీ మానవ తప్పిదమే కారణమన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

దిద్దుబాట్లు తక్షణావసరం



నిరుడు నవంబరులో ప్రధాని మోదీ జపాన్‌లో పర్యటించారు. టోక్యో నుంచి కొబెకు జపాన్ ప్రధాని అబెతో కలిసి రైలులో వెళ్లారు. ఆ సందర్భంగా టోక్యో స్టేషన్‌లో ఉభయులు ముచ్చటించుకుంటున్న దృశ్యం. (పాతచిత్రం)

పరిశోధనలతో పరిష్కారం

రైల్వేలో భద్రతకు సంబంధించి ఇటీవల కాలంలో నైరుతి (దక్షిణ పశ్చిమ) రైల్వే జోన్‌లో ఐఐటీ, బిట్స్ పిలానీల సహకారంతో నడుస్తున్న కొన్ని ప్రాజెక్టులు మంచి ఫలితాలు ఇస్తున్నాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న జోన్లలో రెండింటిని ఎంపిక చేసుకుని, వాటిని సాంకేతిక హంగులతో ఆదర్శ జోన్లుగా తీర్చిదిద్దాలి. ఆ ఫలితాలను మిగతా జోన్లలో అమలు పరచాలి. నైరుతి రైల్వే జోన్‌లోని మైసూర్ డివిజన్‌లో గత ఏడాదిన్నర కాలంలో ఒక్క ప్రమాదం కూడా జరగలేదు. అక్కడి అధికారులు తీసుకున్న చర్యలను అధ్యయనం చేయాలి. రెండో ప్రపంచ యుద్ధంలో అణుబాంబుల తాకిడికి దెబ్బతిన్న జపాన్ స్వల్పకాలంలోనే ప్రబల ఆర్థిక శక్తిగా అవతరించడానికి- సాంకేతిక పరిజ్ఞాన వినియోగం కన్నా సిబ్బంది వృత్తినిబద్ధతే ప్రధాన కారణం. రైల్వే వ్యవస్థల నిర్వహణలో జపాన్ అనుసరిస్తున్న విధానాలను భారత్ ఆదర్శంగా తీసుకోవాలి

నిత్యం 30 లక్షల కిలోమీటర్ల ప్రయాణంలో రెండున్నర కోట్ల ప్రయాణికులను భారతీయ రైల్వే గమ్యస్థానాలకు చేరుస్తోంది. రైల్వేలు సగటున రోజుకు 30 లక్షల టన్నుల సరకును రవాణా చేస్తున్నాయి. ఇంతటి కీలకమైన భారతీయ రైల్వేను నడపడంలో గత ప్రభుత్వాలు ఏనాడూ దూరదృష్టి ప్రదర్శించలేదన్నది నిష్ఠుర సత్యం. వాస్తవానికి ప్రస్తుత ఎన్‌డీయే హయాములో సురేశ్ ప్రభు రైల్వేమంత్రిగా పగ్గాలు చేపట్టాక ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. 2001-2004 మధ్యలో నితీశ్ కుమార్ మంత్రిగా ఉన్నప్పుడు ఏడాదికి సగటున 363 చొప్పున మొత్తం 1,090 ప్రమాదాలు జరిగాయి. 2004-2009 మధ్య లాలు ప్రసాద్ హయాములో ప్రమాదాల సంఖ్య పెద్దగా తగ్గుముఖం పట్టలేదు. సురేశ్ ప్రభు బాధ్యతలు స్వీకరించిన తరవాత 2014-15లో 135, 20015-16లో 107, 2016-17లో 104 ప్రమాదాలు జరగ్గా, యూపీఏ పాలన తొలి మూడేళ్లలో 759 మంది, మలి దఫా పాలన మొదటి మూడేళ్లలో 938 మంది ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. మోదీ ప్రభుత్వ కాలంలో ఇప్పటివరకు 652 మంది ప్రాణాలు కోల్పోయారు. రైల్వే ప్రమాదాలు రెండు రకాలు. రైలు పట్టాలు తప్పడం, క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు. దేశంలో మొత్తం 27,181 రైల్వేక్రాసింగ్‌లు ఉన్నాయి. వీటిలో 7,701 మానవ రహిత రైల్వే క్రాసింగ్‌లు. మొత్తం ప్రమాదాల్లో 64 శాతం ఈ మానవరహిత రైల్వే క్రాసింగ్‌ల వద్దే చోటుచేసుకొంటున్నాయి. 2020 నాటికి వీటిని పూర్తిగా తొలగించాలన్న లక్ష్యంతో యుద్ధప్రాతిపదికన వంతెనలను నిర్మిస్తున్నారు. ఇలా గత మూడేళ్లలో 4,258 మానవరహిత రైల్వే క్రాసింగ్‌లను తొలగించారు. దీనివల్ల 17 శాతం మేర ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి.

వ్యవస్థల ఆధునికీకరణ నేటి అవసరం

రైళ్లలో భద్రత పెంచడానికి అనిల్ కకోద్కర్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు 'రాష్ట్రీయ రైల్వే సంరక్ష కోశ్' పేరిట ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ప్రత్యేక నిధి ఏర్పాటు చేసింది. ట్రాక్‌ల ఆధునికీకరణకు కేటాయింపులను మోదీ ప్రభుత్వం రెట్టింపు చేసింది. యూపీఏ-2లో సగటున ఏడాదికి రూ.5,548 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ఎన్‌డీయే సర్కారు ఏడాదికి రూ.9,961 కోట్లు ఖర్చు చేస్తోంది. గతంలో ఏడాదికి 1,028 కిలోమీటర్లు ఆధునికీకరిస్తే, ప్రస్తుతం ఏడాదికి 2,950 కిలోమీటర్ల రైలు మార్గాన్ని నవీకరిస్తున్నారు. పట్టాలపై లోపాలను పసిగట్టడానికి అల్ట్రాసోనిక్, ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వాడకాన్ని వేగవంతం చేశారు. ప్రమాదాలను నివారించగలిగే నూతన ఎల్‌హెచ్‌బీ బోగీల ఉత్పత్తి, వాడకాలను పెంచారు. ఎల్‌హెచ్‌బీ బోగీలు పట్టాలు తప్పే అవకాశం తక్కువ. పట్టాలు తప్పినా ఒక బోగీపై మరో బోగీ ఎక్కే అవకాశం కనిష్ఠంగా ఉంటుంది. దీనివల్ల ప్రాణనష్టం తగ్గుతుంది.

రైల్వే ప్రయాణికుల భద్రత విషయంలో పాత ప్రభుత్వాల దశాబ్దాల అలసత్వం వల్ల జరుగుతున్న నష్టం స్వల్ప వ్యవధిలో పూడ్చలేనిది. నాటి అసంబద్ధ విధానాల వల్ల రైల్వే వ్యవస్థలు నేటికీ సమస్యల చట్రంలో నలిగిపోతున్నాయి. గతంతో పోలిస్తే రైల్వేలో వనరులు పెరిగాయి. ఇక ట్రాక్‌ల ఆధునికీకరణ, ఎల్‌హెచ్‌బీ బోగీల పెంపుదల, పట్టాలపై లోపాలు గుర్తించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి చర్యలు వేగవంతం కావాలి. అందుకు భారీ పెట్టుబడులు అవసరం. దానికోసం సాధ్యమయ్యే అన్ని మార్గాలను అన్వేషించాలి. సాంకేతిక విభాగాల మధ్య సమన్వయాన్ని, పని సంస్కృతిని పెంచాలి. సమన్వయ లోప నివారణకు పదకొండు విభాగాలను సాంకేతిక, సాంకేతికేతర విభాగాలుగా విభజించాలి. ప్రత్యేక భద్రత విభాగం ఏర్పాటుపై సత్వర నిర్ణయం తీసుకోవాలి. రైలు ప్రమాదాల నివారణ, వ్యవస్థల అభివృద్ధిపై సాంకేతిక విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలి. అప్పుడే దేశంలో రైల్వే ప్రమాదాలు కనిష్ఠ స్థాయికి దిగివస్తాయి!

- ఏనుగుల రాకేశ్‌రెడ్డి

(రచయిత- డైరెక్టర్, సెంటర్ ఫర్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్)

రసరమ్య జీవన్నాటకం!

'బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు ప్రీతి గూర్చునొ వాడె ధన్యుడు' అని గురజాడ పలికిన మాటలు ఆయనకే వర్తిస్తాయి. అవి ఆయన పట్ల సార్థకమవుతాయి. కవి, తత్వవేత్త- ఎప్పుడూ కాలం కంటే ముందే ఉంటారన్నది నిర్వివాద అంశం. ద్రష్ట అయినవాడే సాహిత్య స్రష్ట కాగలడు. అతడి మాటలే మంత్రాలవుతాయి. తాత్వికుడైన రచయిత మాత్రమే అధునాతన సమాజానికి బాటలు వేసే మేటి నిర్మాతగా నిలుస్తాడు.

నాటకం ఓ అత్యుత్తమ సమాహార కళ. మానవ జీవిత విమర్శ, జీవిత తత్వ స్వరూప నిరూపణలే నాటక ప్రక్రియ లక్ష్యాలని విమర్శకులు చెబుతారు. మానవుల మనో ప్రవృత్తులు- మంచి, చెడు... సమస్తమూ నాటకంలో ప్రతిబింబించాలి. కళ అనేది వాస్తవికపు భ్రాంతి. వాస్తవం కళ కాదు. కానీ, మానవ జీవితాల్లోని వాస్తవికతను కళాత్మకంగా ప్రదర్శించిన అపురూప నాటకమే 'కన్యాశుల్కం'. కాల ప్రవాహానికి, ప్రభావానికి తట్టుకొని- ఆలోచనాపరుల భావావరణంలో శాశ్వతంగా నిలిచిన కళాఖండం. ఇది సార్వకాలిక సృజన. ఈ నాటకానికి ఒక మహత్తరమైన నైతిక ప్రయోజనం ఉంది. జీవితపు అంచుల్ని దాటి దర్శించాల్సిన లోతులూ ఇందులో ఎన్నో ఉన్నాయి. ఇందులోని పాత్రలు ఐతిహాసిక పాత్రల్లా సజీవంగా సమాజంలో నిలిచిపోయాయి. సమాజంలో కరడు గట్టిన దురాచారాలు, కీడు తెచ్చిపెట్టే కుహనా సంస్కారాలను ఈ నాటకం ద్వారా గురజాడ రచ్చకీడ్చారు.

'గురజాడ ప్రతిభలో నాటకీయ స్వభావం బలంగా ఉండేది. ఆంగ్లంలో కవిత్వం రాయడానికి ఆయన చేసిన మొదటి ప్రముఖ ప్రయత్నం- 'సారంగధర'. దాని ఇతివృత్తం, సన్నివేశ కల్పన- రెండూ నాటకీయంగా ఉన్నాయి. ఆయన కవితల్లోనూ ఛందోబద్ధమైన నాటకీయ దృశ్యాలు; ఆయన కథలన్నింటికీ నాటకీయమైన ప్రారంభాలు, ముగింపులు ఉన్నాయి' అని గురజాడ రచనాశిల్పంలోని నాటకీయ కోణాన్ని నార్ల వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. గురజాడ డైరీల్లో, నోటు పుస్తకాల్లోనూ ఆయన చదివిన నాటకాలు, నాటక విమర్శలు, నాటకకర్త జీవిత చరిత్రలే కాకుండా ప్రపంచ నాటకరంగం గురించిన వివరాలు, విశేషాలు ఎన్నో కనిపిస్తున్నాయి. నాటకం, ఆ రంగం పట్ల ఇంత ఇష్టం, వ్యామోహం ఉన్నాయి కాబట్టే- గురజాడ నాటక కర్తగా ఆవిర్భవించడం ఆశ్చర్యమేమీ కాదు. నాటకకర్తగా మొదటి ప్రయత్నంలోనే ఆయన సాధించిన ఆధునికత నిజంగా అద్భుతమే! ఆధునిక తెలుగు నాటక రచయితల్లో గురజాడ ప్రథములు కారు. కానీ, ఇతరుల ఆధునికత ఎక్కువగా కాలానికే వర్తిస్తే- ఆయన అధ్యయనం విస్తృతం, వైవిధ్యపూరితం కావడం వల్ల; సమకాలీన ప్రపంచ భావనల్లోని సరికొత్త ధోరణుల అవగాహన వల్ల ఆలోచనలో ఆయన ఆధునికులయ్యారు. బహుళ ప్రయోజనాలు గల వ్యావహారిక భాషా సాహిత్యానికి తొలి నమూనాగా 'కన్యాశుల్కం' నాటకం రాశారు.

కన్యాశుల్కం నాటకాన్ని 1892 ఆగస్టులో జగన్నాథ విలాసినీ సభవారు విజయనగరంలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనతో తెలుగు సమాజంలో, నాటక రంగంలో నూతన కవాటాలు తెరచుకున్నాయి. తోకచుక్కను గురజాడ సంఘ సంస్కరణ ప్రయాణ పతాకగా తలచారు. అలాగే తెలుగు నాటకాన్ని సంఘ సంస్కరణ ప్రమాణ పతాకగా చేతపట్టి సంఘాన్ని, నాటకాన్ని ముందుకు నడిపించారు. కన్యాశుల్కం, వితంతువుల దయనీయ స్థితిగతులు ఆయన హృదయాన్ని కలచివేశాయి. సృజన శక్తి, విమర్శనాత్మక దృష్టి కలిగిన ఆయన- తన పదునైన కలాన్ని ఆయుధంగా ప్రయోగించి సంఘ దురాచారాల్ని ఖండించేందుకు నిర్ణయించారు. నాటక రచన కేవలం వినోదం కోసం కాదని; అది ప్రజల్ని ఆలోచింపజేయాలని, జీవిత సమస్యల్ని పరిష్కరించుకునేంత అవగాహన కలిగించాలని గురజాడ భావించారు. ఆ లక్ష్యాలతో ఆయన రచించిన నాటకం తెలుగు సాహిత్య చరిత్రలో అపూర్వ పరిణామాలకు నాంది పలికింది.

1892లో నాటకం మొదటగా ప్రదర్శితమైనా, అది 1897 వరకు ప్రచురణ కాలేదు. నాటక ప్రదర్శనపై అప్పటి 'తెలుగు హార్ప్' పత్రిక విపుల సమీక్ష రాసింది. నాటకం ప్రచురితమయ్యాక, తెలుగు గ్రంథ రచనలోనే అది సాహసోపేతమైన కొత్త మలుపు అని 'పీపుల్స్ ఫ్రెండ్' వర్ణించింది. ఇంకా- ద వీక్లీ రివ్యూ, దినమణి, చింతామణి పత్రికలు ప్రశంసించాయి. నాటకాన్ని తిరగరాయకపోయినా, సంస్కరించాల్సిన అవసరం రచయితకు కనిపించింది. సంవత్సరాల తరబడి కృషిచేసి, 1909నాటికి దాన్ని పఠనయోగ్యమైన సారస్వత నాటకంగా తీర్చిదిద్దారు. కన్యాశుల్కం నాటకాన్ని పూర్తిగా ప్రదర్శించడానికి వీలుపడదని కొందరు విమర్శకులు భావించారు. ఆ మాటల్లో వాస్తవం ఉన్నా, ఆ నాటకంలో ప్రదర్శన యోగ్యం కాని సన్నివేశం ఒక్కటీ లేదు. నాటకాన్ని పరిమిత కాలంలో ప్రయోగించడానికి తగిన విధంగా రూపుదిద్ది, ప్రదర్శించి విజయవంతమైన సందర్భాలు అనేకం ఉన్నాయి.

1892లో తొలి ప్రదర్శన



నూట పాతికేళ్ల 'కన్యాశుల్కం'

ఇందులోని ప్రతి సంభాషణా దైనందినంగా తెలుగువారి జీవితంలో ఎక్కడో ఒకచోట ఇమిడిపోతుందన్న అబ్బూరి, శ్రీశ్రీ అభిప్రాయాలు అక్షర సత్యాలు. ప్రదర్శన యోగ్యత, పఠన యోగ్యత అనే రెండు లక్ష్యాల్నీ గురజాడ సాధించగలిగారు.

సామాజిక వాస్తవికతను దర్పణంలో మాదిరిగా యథాతథంగా ప్రతిబింబించిన కళాఖండం- కన్యాశుల్కం. స్త్రీల సమస్యలెన్నో గురజాడ దృష్టిలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వారికి స్వేచ్ఛ, సమానత్వం, స్వయం నిర్ణయాధికారం కావాలన్న ఆశయాలు ఆ నాటకంలో ప్రతిఫలించాయి. నాటకంలో ఆయన- అబద్ధాలకోరుల్ని, వ్యసనపరుల్ని, కోర్టు పక్షుల్ని- అదేవిధంగా అప్పటి పోలీసు, న్యాయ వ్యవస్థల్లోని లోపాల్ని చిత్రించిన తీరు అపూర్వం. సమాజంలోని మౌఢ్యాన్ని ఉదార మానవతావాదంతో అంతరింపజేయాలన్న సందేశాన్ని గురజాడ తన నాటకంలో ధ్వనిగర్భితంగా అందించారు.

గురజాడకు ఈ నాటకంలో అనేక అంశాలతో పాటు అఖండ కీర్తిని తెచ్చిపెట్టింది ప్రధానంగా- హాస్యరస పోషణం! అవహేళనాత్మకం, చమత్కారయుతమైన హాస్యాన్ని ఆయన మనోజ్ఞంగా చిత్రించి పాఠకుల్ని, ప్రేక్షకుల్ని అలరించారు. సన్నివేశగతమైన హాస్యాన్ని రమ్యంగా సృజించారు. సన్నివేశ కల్పన, సంభాషణ చాతుర్యం కలిసి కన్యాశుల్కం నాటకాన్ని చిరంజీవిని చేశాయి. ఇందులో హాస్యపాత్ర అంటూ ఏదీ ప్రత్యేకంగా లేకపోయినా- దాదాపు అన్ని పాత్రల్లోనూ హాస్యమే ఒలుకుతుంది, పలుకుతుంది. ఆయన సృష్టించిన పాత్రలన్నీ స్వతంత్ర వ్యక్తిత్వం కలిగినవి. పాత్రల భౌతిక, మానసిక, నైతిక, నైసర్గిక రూపాలన్నీ ఆయా సంభాషణల నుంచి సన్నివేశాల నుంచి సహజంగా ఉన్మీలితమయ్యే అద్భుత ప్రజ్ఞను గురజాడ కనబరచారని ప్రసిద్ధ విమర్శకులు డాక్టర్ యు.ఎ. నరసింహమూర్తి అనేవారు. ఆ నాటకానికి ఆత్మవంటిది మధురవాణి పాత్ర. గిరీశం పాత్ర ముందు తల ఎత్తి నిలవదగిన పాత్ర ఆధునిక భారతీయ హాస్య నాటకాల్లో మరొకటి లేదంటారు విమర్శకులు. నాటకంలోని అన్ని పాత్రలూ వేటికి అవే విలక్షణంగా కనిపిస్తాయి.

భాష విషయంలో ఒక కొత్త ఆదర్శాన్ని నిరూపించి, నూతన వాదానికి ప్రాణంపోశారు గురజాడ. తన ప్రాంత జీవద్భాషలో నాటకం రచించారు. కన్యాశుల్కంలోని ఏ పాత్రా తనది కాని భాషా రూపంలో మాట్లాడదు. నాటకంలో సరికొత్త పదాలు, అన్య భాషా పదాలు, నుడికారాలు ఒకెత్తు. సందర్భానుసారంగా ఒక రచయిత తన భాషాశైలిలో ఎంతటి వైవిధ్యాన్ని చూపగలరో, అదంతా కన్యాశుల్కంలో కనిపిస్తుంది. సంస్కృత శ్లోకాల్ని, ఆంగ్ల సామెతల్ని ధారాళంగా ప్రయోగించారు. ఉర్దూ మాటలెన్నో గుబాళించాయి. వింత వింత ప్రయోగాలు ఆశ్చర్యం గొలుపుతాయి. నిడదవోలు వేంకటరావు భావించినట్లు- కన్యాశుల్కంలోని భాష లోకోత్తర విశిష్టత తెలుసుకోవాలంటే, విపులమైన ఓ వ్యాఖ్యానమే వెలువడాలి. సమకాలీన సమాజానికి ఆధునిక సంస్కారాన్ని ఒంటపట్టించి ముందుకు నడిపించడానికి గురజాడ సాగించిన ప్రయత్నం ఈ నాటకంలో ప్రస్ఫుటమవుతుంది. ఆహ్లాద రూపక నిర్మాణంలోని అంతస్సారాన్ని కరతలామలకం చేసుకొని, గురజాడ నిర్మించిన 'కన్యాశుల్కం' ఓ అజరామర దృశ్యకావ్యం!

- డాక్టర్ దామెర వేంకట సూర్యారావు

అంతా మన మంచికే!


ఎగురుతున్న సీతాకోకచిలుకను చూసినప్పుడు- అది ఎంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంది. దాని వెనక ఒక గొంగళి పురుగు దశ ఉందని ఊహకైనా అందదు. దాన్ని చూసినవారికీ అది స్ఫురించదు. ఒక పరిణామ క్రమంలో అది అలా సంభవిస్తుంది. అంతే. ప్రకృతిలో ఇలాంటివెన్నో!

పుట్టుక అనేది మనిషి మంచికే. బతకడమూ అతడి మంచికే. సూఫీ తాత్వికుడు జలాలుద్దీన్ రూమీ భావించినట్లు- మనిషి ఎక్కడా నష్టపోలేదు. రాయి నుంచి చెట్టు, దాని నుంచి జంతువు, అలాగే జంతు దశ నుంచి పరిణామ క్రమంలోకి మానవుడు మారాడు.

సంభవిస్తున్నదంతా మార్పు కోసమే! ఇక్కడితో మనిషి ఆగిపోడు. మానవత్వం పూర్తిగా వికసిస్తే అతడు మహనీయుడవుతాడు. ప్రకృతిలో మనిషి ఓ భాగం. శరీరంలో మార్పులతో పాటు, అతడి మనసులోని ఆలోచనలూ మారాలి. అభిప్రాయాలు మారాలి. అనుభూతి విధానం మారాలి. భావంలో కలిగే ఆ మార్పునే ముక్తిగా భావించవచ్చు. కాయ తదుపరి దశలో పండుగా మారుతుంది. ఆ పండు వేరే ఎక్కడి నుంచో వచ్చేది కాదు. కాయ ఉన్న చోటనే, పండు రూపొందుతుంది.

సీతాన్వేషణలో భాగంగా లంకకు పయనమైన ఆంజనేయస్వామి మది నిండా శ్రీరాముడే తోడుగా ఉన్నాడు. ఆయనతో పాటు ఒక భావాన్ని తనలో నింపుకొన్నాడు. 'ఏం జరిగినా అది మంచికే' అనుకున్నాడు. అటువంటి భావాన్ని అభ్యసించకుంటే, ఎవరైనా ఇబ్బందులు పడాల్సిందే!

శ్రీకృష్ణుడు సదా తోడుగా ఉన్నా, పాండవులకు సమస్యలు తప్పలేదు. తొలి నుంచి వారు భారం అంతా దైవం మీద వేశారు. నిత్యం ఆయననే ప్రార్థించారు. ఆయనమీద ఆధారపడి ఉంటూనే, తమ పనుల్లో తాము మునిగిపోయారు. అరణ్యవాసంలో, అజ్ఞాత వాసంలోనూ అదే జరిగింది. జరుగుతున్నదంతా ఏదో ఒక రూపంలో తమకు సహాయం అవుతుందని పాండవులు ఎంతో బలంగా విశ్వసించారు. చివరికి వారి సహనమే గెలిచింది.



అంతర్యామి

అంతా వారి మంచికే జరిగింది. విజయం వారినే వరించింది.

చీకట్లో మిణుగురులు వెలుగుతూ ఉంటాయి. అంతమాత్రాన, మొత్తం వెలుగునంతా అవే ఇస్తాయని కాదు. వాటి ప్రయోజనం ఎంత వరకో, అంత వరకు ఉంటాయవి. సృష్టిలో చీమ, బొద్దింక, బల్లి, ఎలుక, పిల్లి, కుక్క... ఇలా ఎన్నో ప్రాణులు వాటి బతుకు అవి బతుకుతున్నాయి. ఇతర జీవులకూ ఎంతో కొంత సాయపడుతున్నాయి. ఈ లెక్కన చూస్తే, మానవ జీవితం అంతా అతడి మంచికే. తోటి మనుషులే కాదు, ప్రకృతిలోని ఇతర జీవులూ అతడికి సంబంధించి తమవంతు పాత్రను నిర్వర్తిస్తున్నాయి.

బీజాక్షరాలతో కూడుకున్న మంత్రాల్ని ఉచ్చారణ చేసినప్పుడు, ఫలం కోసమే మనిషి ఓపిక పట్టాలి. అంతా మంచికే అనుకుంటూ జీవితం కొనసాగిస్తే, అతడికి సత్వర సంతోషం కలిగే అవకాశమంటూ ఉంటుంది. శాస్త్రజ్ఞుల సూత్రాల్లా, జీవన సూత్రాలూ గొప్పవే. జీవితంలో ఎదగడానికి అవి మెట్లలా ఉపయోగపడతాయి. ఆ సూత్రాల్ని ఆచరించగలిగితే, వాటిలోని మంచి బోధపడుతుంది.

ఓ మానవుడు- శిశు దశ నుంచి పెరిగాడు. జీవితకాలంలో పలు అనుభవాలు ఎదుర్కొన్నాడు. ఒకసారి అతడు గురువు వద్దకు వెళ్లి 'మీరు భగవంతుణ్ని చూశారా' అని ప్రశ్నిస్తాడు. 'నిన్ను చూస్తున్నట్లే ఆయననూ చూశాను' అని ఆ గురువు బదులిస్తాడు. ఆ మాటలు విని అతడు పరమానందభరితుడవుతాడు. మొగ్గ వంటి అతడి జ్ఞానం వికసించి పుష్పంగా మారుతుంది. అనంతరం అతడు షికాగో నగరంలో మాట్లాడతాడు. ఆ వాగ్ధాటికి అమెరికా సమస్తం ఆశ్చర్యపోతుంది. ఆయన దేశభక్తిని వేనోళ్ల కొనియాడుతుంది. ఆయనే స్వామి వివేకానందుడు. ఆయన ద్వారా లోకానికి ఎంతో మంచి జరిగింది. ఆ స్వామి పుట్టుకే భారతదేశానికి శుభప్రదమైంది.

అందరి మంచినీ కోరుకోవడంలోనే విశ్వ ప్రయోజనం దాగి ఉంటుంది. ఆ ప్రయోజనం నెరవేరేలా చేయడానికి మంచి భావం ఒక్కటే దోహదపడుతుంది!

- ఆనందసాయి స్వామి

వైకాపాకు ఓటేస్తే బెట్టింగ్‌లో అమ్మేస్తారు

- కాకినాడను మరో పులివెందుల చేయాలనుకుంటున్నారు
- అర్హత లేనివారికి ఓటేయొద్దు
- కాకినాడకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొస్తాం: సీఎం చంద్రబాబు

ఈనాడు - కాకినాడ


శనివారం కాకినాడ రోడ్డుషోలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అనర్హులకు ఓటేస్తే ఎలాంటి ఉపయోగం ఉండబోదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం కోసం శనివారం ఇక్కడికి వచ్చిన ఆయన రోడ్డుషో నిర్వహించారు. సాయంత్రం నాలుగింటి నుంచి రాత్రి వరకు జరిగిన ఆయా సమావేశాల్లో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతవి ఉన్మాద చర్యలని విమర్శించారు. ఎవరంటే వాళ్లు వస్తే ఈ ప్రాంతానికి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. వైకాపాకు ఓటేస్తే కాకినాడను బెట్టింగ్‌లో అమ్మేస్తారని ఆరోపించారు. క్రికెట్ బెట్టింగ్‌లో ఉండే విపక్ష నాయకులకు ఓటు అడిగే హక్కు లేదని, వారు ఆ డబ్బుతోనే కాకినాడ ఎన్నికల్లో దిగారని విమర్శించారు. బెట్టింగ్‌ల ద్వారా పిల్లల జీవితాలను నాశనం చేస్తారన్నారు. ప్రతి పక్షానికి ఓటేస్తే మురిగిపోతుందన్నారు. ముఖ్యమంత్రినే రోడ్డుపై కాల్చేయాలి.. ఉరితీయాలి.. చెప్పుతో కొట్టాలి అనే వ్యక్తికి సామాన్యులు లెక్కా? అని ప్రశ్నించారు. అభివృద్ధికి అడ్డుపడుతున్న వారిని ఓటు ద్వారా చిత్తుగా ఓడించాలని, అరాచకాలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఏటీఎంలలో దొంగనోట్లు పెట్టి డబ్బు కాజేసే ముఠా అంటూ కాకినాడ గత పాలకుల అకృత్యాలపై ధ్వజమెత్తారు. ఆక్రమిత భూములను పేదలకు పంచుతామని వివరించారు. సాంకేతిక విధానాల ద్వారా గుర్తించి ఎవరు తప్పుచేస్తే వారిపైనే నేరుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఎన్నికల్లో తెదేపా గెలుపు నల్లేరుపై నడకేనన్నారు. కాకినాడ కాజాను ప్రపంచానికి పరిచయం చేయాలని తెదేపా చూస్తుంటే.. వైకాపా నేతలు రాష్ట్రాన్ని పులివెందులగా మార్చాలని చూస్తున్నారన్నారు. పులివెందులను కాకినాడలా మారుస్తాం తప్ప అరాచకవాదుల ఆగడాలను సహించేది లేదని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో రౌడీల ఆగడాలను సహించబోమని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కాకినాడను అభివృద్ధి చేయలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో దెయ్యాలు వచ్చి ఫించన్లు తీసుకుపోయేవన్నారు. వైకాపానో, మరో పార్టీనో చేయగలిగింది.. చేసేదీ ఏమీ లేదని వివరించారు. కాకినాడలోని 48 డివిజన్లలోనూ గెలిపిస్తే నగర ప్రగతిని జెట్ వేగంతో చేస్తామని భరోసానిచ్చారు. ఒక్కొక్క ఓటరు బాహుబలి కావాలని ఆకాంక్షించారు. కాకినాడను సుందర నగరంగా మార్చేందుకు రూ. 2వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఏపీకి మూడు ఆకర్షణీయ నగరాలు ఇస్తామంటే అందులో ఒకటి కాకినాడ కావాలని పట్టుబట్టామని గుర్తు చేశారు. ఉజ్వల భవిష్యత్తున్న రేవు నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి గుర్తింపు తీసుకొస్తామని తెలిపారు. పారిశ్రామిక నగరంగానూ అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, ఇందుకోసం ఇప్పటికే పలు పారిశ్రామిక ఒప్పందాలు కుదిరాయని అన్నారు. తెదేపా-భాజపా కాకినాడ ఎన్నికల్లో గెలిస్తే అనుకున్న అభివృద్ధి సాధ్యమన్నారు. దేశ చరిత్రలోనే బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత తమ పార్టీదేనని అన్నారు. త్వరలో ఆర్యవైశ్యులకు కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తామన్నారు. గొలుసు దుకాణాల పని పడుతున్నామని, ఇసుక అక్రమార్కులను ఇప్పటికే హెచ్చరించామని, వారు దారికి రాకపోతే కొరడా ఝళిపిస్తామని హెచ్చరించారు.

త్వరలోనే మంజునాథ కమిషన్ నివేదిక

కాపుల రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ త్వరలోనే మంజునాథ కమిషన్ నివేదిక వస్తుందని తెలిపారు. దాన్ని పార్లమెంటుకు పంపి కాపులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తామన్నారు. వైకాపా నేతలు కాపుల గురించి తమ ఎన్నికల ప్రణాళికలో పెట్టలేదన్నారు. ఇటీవలి వారి ప్లీనరీలోనూ చర్చించలేదని తెలిపారు. కాపుల చిరకాల కోరిక తీర్చే బాధ్యత తనదేనని హామీనిచ్చారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు చేయలేదని, ఇప్పుడు మాట్లాడుతున్న నేతలు అప్పుడేమయ్యారని ప్రశ్నించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ.. గతంలో ఎన్‌డీఏ హయాంలోనే తుని-రాజమహేంద్రవరం జాతీయ రహదారి నిర్మించామని గుర్తుచేశారు. ప్రస్తుతం కత్తిపూడి-పామర్రు 216 జాతీయ రహదారిని నాలుగులైన్లకు విస్తరిస్తున్నామని వివరించారు. సమావేశాల్లో మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, పితాని సత్యనారాయణ, పి.నారాయణ, ఎంపీ తోట నరసింహం, ఎమ్మెల్యేలు కొండబాబు, పిల్లి అనంతలక్ష్మి, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జ్యోతుల నెహ్రూ, జిల్లా పార్టీ అధ్యక్షుడు నామన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కత్తులతో అల్లరిమూకల బీభత్సం

- ఒకరి హత్య, మరొకరికి గాయాలు
- విశాఖ మహానగరంలో దారుణం


హత్యకు గురైన కె.రాజు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ మహానగరం మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో శుక్రవారం రాత్రి అల్లరిమూకలు కత్తులతో చేసిన వీరంగంలో ఓ అమాయకుడు ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. మర్రిపాలెం జంక్షన్‌లో ఉంటున్న వినయ్ (24) శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో మద్యం తాగి కత్తులు పట్టుకొని ఎవరైనా తన వద్దకు వస్తే చంపేస్తానంటూ అలజడి సృష్టించాడు. దీంతో అక్కడే ఉన్న నగేష్ (29)తో పాటు స్థానిక ప్రజలు వినయ్‌ను గట్టిగా పట్టుకొని అతని వద్ద ఉన్న కత్తులను లాక్కొన్నారు. తన కత్తుల్నే లాక్కొంటారా అంటూ పలువురిపై దాడి చేసి పారిపోతుండగా స్థానిక ప్రజలు వెంబడించారు. అతడు 104 ఏరియా వరకు పరుగెత్తి అక్కడ ఉన్న రక్షణ శాఖకు చెందిన స్థలం గోడను దూకేశాడు. వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి నగేష్ సమాచారం ఇచ్చి పట్టుకోవాలని సూచించి వెళ్లిపోయాడు. ఇది జరిగిన అర గంటలో 7 ద్విచక్ర వాహనాలపై జ్ఞానాపురం ప్రాంతానికి చెందిన 14 మందితో కూడిన అల్లరిమూక కత్తులతో మర్రిపాలెం జంక్షన్‌కు చేరుకున్నారు. వినయ్ నుంచి కత్తులు లాక్కున్న నగేష్ అక్కడే ఉండటంతో ఒక్కసారిగా కత్తులతో దాడి చేశారు. వీపు వెనుక కత్తులతో పొడిచారు. వెంటనే తేరుకున్న అతడు అక్కడి నుంచి పారిపోయాడు. అతడిని వెంబడిస్తుండగా అదే సమయంలో కిరాణా దుకాణం వద్ద మహారాణి వీధికి చెందిన కొశెట్టి రాజు (28) అడ్డుకోవడానికి ప్రయత్నించాడు. అల్లరిమూకలోని నలుగురు వ్యక్తులు అతడిని కత్తులతో విచక్షణ రహితంగా పొడిచి చంపేశారు. స్థానికుల సమాచారంతో వెస్ట్ ఏసీపీ లంకా అర్జున్ సంఘటన స్థలానికి చేరుకొన్నారు. హంతకులు పరారీ అయిన దారిని జాగిలాల సాయంతో గుర్తించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వయసు రెండేళ్లు.. బరువు 20 కిలోలు

- ఊబకాయంతో బాధపడుతున్న చిన్నారి నిత్య


చిన్నారి నిత్య

కొత్తగూడ, న్యూస్‌టుడే: రెండేళ్ల వయసుకే 20 కిలోల బరువుతో ఓ చిన్నారి బాధపడుతోంది. ఆమెకు వైద్యం అందించేందుకు తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడుకు చెందిన దేవరబోయిన వీరన్న, స్రవంతిలకు ఇద్దరు సంతానం. వీరి రెండో కుమార్తె నిత్యకు ప్రస్తుతం రెండేళ్లు నిండి మూడో ఏడు ప్రారంభమైంది. పుట్టినప్పుడు రెండున్నర కిలోల బరువున్న నిత్య ప్రస్తుతం ఇరవై కిలోల బరువుతో కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైంది. ఆరు నెలల వయస్సు నుంచి నిత్య క్రమంగా బరువు పెరుగుతూ వస్తోంది. తల్లిదండ్రులు కూలీలు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే. ఆరు నెలల క్రితం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించారు. వైద్యులు పలు రకాల పరీక్షలు చేసి వారం పాటు పరిశీలించారు. ఎలాంటి మార్పు రాకపోవడంతో ఇంటికి పంపారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో మెరుగైన వైద్యసేవల కోసం నిత్యను ఆసుపత్రులకు తీసుకెళ్లలేక పోతున్నామని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

'ఈనాడు' ఖమ్మం యూనిట్ మేనేజర్ మృతి


ఎం.శ్రీనివాసరెడ్డి

ఈనాడు, ఖమ్మం: 'ఈనాడు' ఖమ్మం యూనిట్ మేనేజర్ మోర్తాల శ్రీనివాస రెడ్డి(43) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రానికి చెందిన నర్సిరెడ్డి, వెంకటరావమ్మ దంపతుల కుమారుడైన శ్రీనివాసరెడ్డి 1995లో 'ఈనాడు' సంస్థలో చేరారు. కొద్దిరోజులు హైదరాబాద్‌లో పని చేసిన తర్వాత సూర్యాపేటలో ఎలక్ట్రానిక్స్ విభాగంలో పని చేశారు. వరంగల్ ఏటీయూగా విధులు నిర్వహించారు. 2013లో పదోన్నతిపై శ్రీకాకుళం మేనేజర్‌గా వెళ్లారు. అక్కడ 'ఈనాడు' ఆధ్వర్యంలో చేపట్టిన ఇంకుడుగుంతల నిర్మాణంలో ఏపీలోని మిగతా జిల్లాల కంటే మిన్నగా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. హుద్‌హుద్ తుపాను నిర్వాసితుల కోసం సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో పాలు పంచుకొన్నారు. శ్రీనివాసరెడ్డికి భార్య రమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు శ్రీహిత 9వ తరగతి, నైనారెడ్డి 4వ తరగతి చదువుతున్నారు. శ్రీనివాసరెడ్డి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

పిడుగుపాటుకు ముగ్గురి మృతి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లాలో శనివారం పిడుగుపాటుకు గురై ముగ్గురు మృతి చెందారు. లక్కవరపుకోట మండలం ఖాసాపేట గ్రామానికి చెందిన బాడితబోని ఎర్నాయుడు(38) గ్రామంలోని వెంకట్రాయుడు చెరువు కింద పొలం పనులకు వెళ్లి పిడుగు పడడంతో మృతిచెందాడు. ఇదే మండలం రంగాపురం పంచాయతీ శివారు కూర్మవరం గ్రామానికి చెందిన కెల్ల దాలమ్మ(67) పొలం పనుల్లో ఉన్న కొడుకులిద్దరికీ భోజనం తీసుకువెళ్లి తిరిగివస్తుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందింది. జామి మండలం కలగాడ గ్రామానికి చెందిన బాదిరెడ్డి సన్యాశినాయుడు(51) గ్రామంలో రేగుడుబంద పొలంలో పశువులు కాస్తుండగా సాయంత్రం 4 గంటలల ప్రాంతంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

సీమలో ఫ్యాక్షనిజానికి అడ్డుకట్ట వేయాలి: సీపీఐ రామకృష్ణ

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: రాయలసీమలో ఫ్యాక్షనిజం మళ్లీ మొగ్గతొడుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వ్యాఖ్యానించారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఇటీవల జరిగిన సంఘటనలే అందుకు నిదర్శనమన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఫ్యాక్షనిస్టులు కాల్పులు జరుపుతూ స్వేచ్ఛగా మారణాయుధాలతో తిరుగుతున్నారని ఆరోపించారు. అనంతరపురం జిల్లాలో శుక్రవారం సీపీఐ కార్యకర్తపై దాడి చేశారని తెలిపారు. ఈ సంఘటనలో కార్యకర్త మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించారు. ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు డబ్బులు పంపిణీ చేశాయని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ ఓటుకు రూ.వెయ్యి, అధికార పార్టీ రూ.2 వేలు పంపిణీ చేశారని విమర్శించారు. కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో సైతం ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒక్కో అభ్యర్థి రూ.50 లక్షలు ఖర్చు చేసేందుకు కూడా వెనుకాడడం లేదని పేర్కొన్నారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. దొంగ బాబాలకు భాజపా ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆరోపించారు.

రామేశ్వరయ్యను హత్య చేయడం దారుణం: సీపీఐ

విజయవాడ, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా యల్లనూరు మండల సీపీఐ కార్యదర్శి, రైతు సంఘం నాయకుడు రామేశ్వరయ్యను హత్య చేయడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పెత్తందార్లు.. ఆయనపైన, ఆయన భార్య సులోచనపైన పథకం ప్రకారం దాడి చేశారన్నారు. రామేశ్వరయ్య ఉన్నత విద్యావంతులని, కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో, రైతు సంఘ కార్యకలాపాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి ఎంతో చురుకుగా పని చేసేవారని గుర్తు చేశారు. హత్య చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ తరపున డిమాండ్ చేశారు. పెత్తందార్ల ఆగడాల నుంచి యల్లనూరు మండలం దుగ్గుపల్లి గ్రామస్థులకు రక్షణ కల్పించాలని కోరారు.

అందరి దృష్టి ఆ రెండు వర్గాలపైనే

- కీలకంగా మారిన కాపు, మత్స్యకార ఓట్లు
- వారు అధికంగా ఉన్న డివిజన్లపై ప్రత్యేక దృష్టి
- ఉనికి కోసం కాంగ్రెస్ పోరాటం

ఈనాడు - కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో అందరి దృష్టి అత్యధిక ఓట్లు ఉన్న మత్స్యకార, కాపు సామాజిక వర్గాలపైనే ఉంది. వారి మద్దతును కూడగట్టేందుకు ప్రధాన పార్టీల నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. 2,28,996 మంది ఓటర్లు ఉన్న కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో బీసీ సామాజిక వర్గం ఓట్లు 1,19,359. ఇందులో 60 నుంచి 70వేల ఓట్లు ఒక్క మత్స్యకార వర్గానివే. జగన్నాథపురం, దాని పరిసరాల్లో మత్స్యకార సామాజిక వర్గానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ వర్గం ఓట్లను రాబట్టుకునేందుకు తెదేపా, వైకాపాలు పోటీ పడుతున్నాయి. గత ఫలితాలను పరిశీలిస్తే.. 1987 నుంచి ఈ ప్రాంతం తెదేపాకు కంచుకోట. ప్రస్తుతం కూడా తమ ప్రాబల్యాన్ని చాటేందుకు అధికార పార్టీ అదే సామాజిక వర్గానికి చెందిన మంత్రి, ప్రజాప్రతినిధులను రంగంలోకి దింపింది. వైకాపా తరపున సీనియర్ నేతలు కార్యరంగంలోకి దిగి పావులు కదుపుతున్నారు. 2005 నగరపాలక సంస్థ ఎన్నికలలో 15డివిజన్లు తెదేపాకు వస్తే అందులో తొమ్మిది డివిజన్లు జగన్నాథపురంవైపే ఉన్నాయి.

కాపు ఓట్లపై ఒకటే లెక్కలు: మత్స్యకారుల తరువాత అత్యధికంగా సుమారు 45వేల వరకు ఓట్లున్న సామాజిక వర్గం కాపులు. వారి ప్రాధాన్యం అధికంగా ఉన్న డివిజన్లు 4, 5, 6, 28, 29, 36, 39, 43, 45, 47లలో పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీలు శక్తియుక్తులన్నీ పెడుతున్నాయి. తెదేపా తరపున మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు రంగంలోకి దిగారు. ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు వారు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో డివిజన్‌పై ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షిస్తున్నారు. ఇదే ఓటు బ్యాంకు తమకు మద్దతుగా నిలుస్తుందనే నమ్మకంతో వైకాపా నేతలు సైతం ఇక్కడే ఎక్కువ దృష్టి సారించారు. ప్రచారాన్ని ముమ్మురం చేశారు.

ఉనికి కోల్పోయిన కాంగ్రెస్: గతంలో అత్యంత ప్రాబల్యం చూపిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం పూర్తిగా తన ఉనికిని కోల్పోయిందనే చెప్పాలి. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ ఓటు బ్యాంకు చెల్లాచెదురైంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో 48 డివిజన్లకు అభ్యర్థులను కూడా నిలబెట్టలేని పరిస్థితికి చేరింది. కేవలం 17 డివిజన్లలోనే పార్టీ అభ్యర్థులను నిలబెట్టింది.

శాసనసభ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో తెదేపా ఆధిక్యం: 2014 శాసనసభ ఎన్నికల్లో కాకినాడలోని అన్ని బూత్‌ల్లో తెదేపా ఆధిక్యం చాటింది. గతంలో నగరపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లోనూ తెదేపాకు ఆధిక్యం వచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఓటర్లు తమ వైపే ఉన్నారని తెదేపా భావిస్తోంది. అప్పట్లో ఉన్న కాంగ్రెస్ ఓటు బ్యాంకు కూడా తమకు అనుకూలమవుతుందనే ధీమాను వైకాపా వ్యక్తం చేస్తోంది. ఇక భాజపా పరిస్థితి గతంలో ఆశాజనకంగా లేదు. 2000లో జరిగిన కాకినాడ పురపాలక ఎన్నికల్లో 36, 38 వార్డుల్లో మాత్రమే విజయం సాధించింది. 2005లో నగరపాలక ఎన్నికల్లో ఒక్క స్థానాన్ని గెలుచుకోలేకపోయింది. ప్రస్తుతం తెలుగుదేశంతో పొత్తులో భాగంగా తొమ్మిది స్థానాల్లో పోటీ చేస్తున్న భాజపా తన బలాన్ని పెంచుకునేందుకు కృషి చేస్తోంది. ఈ స్థానాల్లో బరిలో ఉన్న రెబల్ అభ్యర్థులను తెదేపా అధిష్ఠానం హెచ్చరించి పోటీ నుంచి విరమించుకోవాలని ఆదేశించింది.

మంటగలిసిన మానవత్వం!

- రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలైన యువకుడు
- గంటపాటు ట్రాక్‌పై కొనఊపిరితో ఉన్నా పట్టించుకోని రైల్వే అధికారులు
- మృతదేహంతో ఆందోళనకు దిగిన ప్రయాణికులు


రైల్వేట్రాక్‌పై కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న యువకుడు

తుని పట్టణం, న్యూస్‌టుడే: మానవత్వం మంటగలిసింది. రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన యువకుడిని రక్షించేందుకు అధికారులు కనీసం స్పందించలేదు. ఆసుపత్రికి తరలించడంలో తీవ్ర జాప్యం జరగడంతో గంటపాటు కొనఊపిరితో కొట్టుమిట్టాడుతూ తుదిశ్వాస విడిశాడు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ప్రయాణికులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. విశాఖ జిల్లా భీమునిపట్నం ప్రాంతానికి చెందిన బోగా రాము(24) వంటమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం నుంచి కాకినాడ ప్యాసింజర్‌లో బయల్దేరి కాకినాడలోని మిత్రుడిని కలిసేందుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో తూర్పుగోదావరి జిల్లా తుని స్టేషన్‌లో శుక్రవారం రాత్రి దిగి తిరిగి ఎక్కే క్రమంలో రైలు కదిలిపోవడంతో ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం ట్రాక్‌పై పడిపోయాడు. తీవ్ర గాయాలపాలవ్వడంతో తోటి ప్రయాణికులు అతడ్ని కాపాడే ప్రయత్నం చేశారు. రైల్వే అధికారులను సాయం కోరినా.. మరోరైలు వస్తోంది.. అతడ్ని పక్కకు తీసేయండంటూ పట్టనట్లు వ్యవహరించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గంట సమయమైనా అంబులెన్స్ రాకపోవడం, కనీసం ప్రాథమిక చికిత్స అందించకపోవడంతో రాము మృతి చెందాడు. రైల్వే అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. మృతదేహాన్ని స్టేషన్‌లోని సిగ్నలింగ్ గది బయట ఉంచి ఆందోళన చేశారు. చివరికి అధికారులొచ్చి క్షమాపణ కోరగా ఆందోళన విరమించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిర్వహించి బంధువులకు అప్పగించామని జీఆర్పీ ఎస్సై రోహిణీపతి తెలిపారు. తాము నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని, 108కు సమాచారం ఇచ్చామని స్టేషన్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం: రాఘవులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ధ్వజమెత్తారు. విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'సేవ్ పబ్లిక్ సెక్టార్-సేవ్ వైజాగ్' పేరుతో శనివారం బహిరంగ సభ నిర్వహించారు. రూ.వేల కోట్ల రాయితీలు ఇస్తూ ప్రైవేటువారిని ప్రోత్సహిస్తోన్న ప్రభుత్వం.. నష్టాల పాలైన ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలకు కనీస సాయం చేయకపోవడం దారుణమని రాఘవులు అన్నారు. విదేశీ ఆర్డర్లు పొందుతున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. విశాఖపట్నం అనేక ప్రభుత్వ రంగ పరిశ్రమలకు నెలవని, నగరాభివృద్ధిలో కీలకంగా ఉన్న ఆయా సంస్థలను నిర్వీర్యం చేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. దేశంలో ఎలాంటి విమానాశ్రయానికైనా 100 నుంచి 200 ఎకరాలు సరిపోతాయని, కాని భోగాపురం ఎయిర్‌పోర్టుకు 5వేల ఎకరాలు కేటాయించడం వెనుక రాజకీయ నాయకుల లీలలు ఉన్నాయన్నారు. అంతకుముందు సీపీఎం నాయకులు, కార్యకర్తలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

కృష్ణా, గోదావరి బేసిన్లలో తగ్గిన ప్రవాహం

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి బేసిన్లలో రిజర్వాయర్లకు ప్రవాహం బాగా తగ్గిపోయింది. ఆలమట్టిలోకి శనివారం 6 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. తుంగభద్ర జలాశయానికి 12000 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. మిగిలిన అన్ని జలాశయాల్లోకి స్వల్పస్థాయిలో ఉంది. మరోవైపు గోదావరి బేసిన్‌లో ప్రవాహం కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఇటీవల శ్రీరాంసాగర్‌కు వరద పెద్దఎత్తున రాగా.. ప్రస్తుతం 2 వేల క్యూసెక్కులే వస్తోంది.

ప్రాణాల మీదకు తెచ్చిన పరిహారం

- భర్తపై కిరోసిన్ పోసి నిప్పంటించిన మహిళ


కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాముడు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: పోలవరం పరిహారం సొమ్ము ఓ వ్యక్తి ప్రాణాలపైకి తెచ్చింది. పరిహారం సొమ్ము విషయంలో ఏర్పడిన వివాదంతో ఓ మహిళ తన భర్తపై కిరోసిన్ పోసి నిప్పంటించింది. పోలీసుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలం దబ్బతోగు గ్రామానికి చెందిన కలమల రాముడుకు రెండు నెలల క్రితం పోలవరం ప్రాజెక్టు ముంపు పరిహారం కింద సుమారు రూ. 14 లక్షలు వచ్చాయి. వాటిని రాములు వడ్డీకి ఇచ్చాడు. అయితే ఆ విషయం భార్య లక్ష్మికి సరిగా చెప్పలేదు. సొమ్ము ఏం చేశావు, ఎవరికి ఇచ్చావని లక్ష్మి రాములుతో గొడవపడుతోంది. శనివారం రాత్రి దీనిపై ఇద్దరూ తీవ్రస్థాయిలో ఘర్షణ పడ్డారు. దీంతో లక్ష్మి ఇంట్లోని కిరోసిన్ తెచ్చి రాముడిపై పోసి నిప్పంటించింది. 60 శాతం కాలిన గాయాలతో ఉన్న రాములును అశ్వారావుపేట సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

రూ.16 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం

చెన్నై: మలేషియాకు తరలించేందుకు సిద్ధం చేసిన రూ.16కోట్ల విలువైన 40 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మలేషియాకు ఎర్రచందనం తరలుతోందనే సమాచారం మేరకు 24, 25వ తేదీల్లో వారు వరుస దాడులు నిర్వహించారు. దుస్తులు, నేల మ్యాట్లు తదితరాలతో నింపిన ట్రక్కుల్లో ఎర్రచందనాన్ని తీసుకొచ్చినట్లు తేలింది. వాటిని చాకచక్యంగా చెన్నై నౌకాశ్రయానికి తరలించి నాలుగు కంటైనర్లలో ఎక్కిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు.

భూగర్భ జలాలు తోడేయండి!

- 3 జిల్లాల్లో నిర్ణీత స్థాయి కన్నా పైనే నీరు
- చౌడుబారుతున్న భూములు
- బోర్ల సంఖ్య పెంచేలా చట్టంలో వెసులుబాటుకు ఏర్పాట్లు

ఈనాడు - అమరావతి

భూగర్భజలాలు అడుగంటిపోయి తాగునీటికీ తల్లడిల్లుతున్న ప్రాంతాలను తరచుగా చూస్తుంటాం. కానీ కొన్ని ప్రాంతాల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. భూగర్భ జలాలు నిర్ణీత స్థాయి కన్నా పైకి వచ్చి పంటలు పండకుండా చేస్తున్నాయి. రెండు జిల్లాల్లోనూ దాదాపు సగం నేలల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. జలవనరులశాఖ అధికారులతో ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ అంశం చర్చకు రావడంతో ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిపై సమాలోచనలు చేస్తున్నారు. సాధారణంగా భూగర్భజలాలు భూమిలో 3 నుంచి 8 మీటర్ల మధ్య ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ శ్రీకాకుళం జిల్లాలో 44 శాతం నేలలో, విజయనగరం జిల్లాలో 45శాతం నేలలో భూగర్భజలాలు 3 మీటర్లకు పైనే లభిస్తున్నాయి. విశాఖ జిల్లాలో 25శాతం మేర ఈ ఇబ్బంది ఉంది. సాధారణంగా చాలా చోట్ల డెల్టా ప్రాంతల్లోనూ వర్షాకాలంలో ఈ పరిస్థితి కనిపిస్తుంది.

ఏం జరుగుతోంది?

భూగర్భజలాలు మరీ పైకి ఉండటంవల్ల సాగుకు ఇబ్బందులు ఎదురవుతాయి. పంటలు సరిగా పండవు. దిగుబడులు రావు. మొక్క పెరగడానికి ఆక్సిజన్ అవసరం. నీరు ఈ స్థాయిలో ఉన్న చోట మొక్క వేర్లకు ఆక్సిజన్ సరిగా అందదు. పైగా నేలపైన ఉన్న ఉప్పు లోపలికి చేరకపోవడం వల్ల భూమి చౌడుబారి పోతున్నాయని చెబుతున్నారు.

నీరు మరింత తోడటమే!

★ ఇలాంటి ప్రాంతాల్లో భూగర్భజలాన్ని మరింత వినియోగించాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టుకు నీరు అందించే ప్రాంతాల్లోనే ఎక్కువగా ఈ పరిస్థితి కనిపిస్తోంది. జలాశయాలు, ప్రాజెక్టులు ఉన్న ఎగువ ప్రాంతంలో ఉపరితల నీటి వాడకం తగ్గించి.. అక్కడ భూగర్భజలాలే వినియోగించాలి. తొలుత ప్రాజెక్టుల నుంచి కాలువల చివరి ఆయకట్టుకు నీరందించి.. ఎగువ ప్రాంతంలో పుష్కలంగా ఉండే భూగర్భజలాలు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆపరిస్థితిలేదు.

★ ఉత్తరాంధ్ర జిల్లాల్లోని తూర్పుకనుమల్లో క్వాడిలైట్ నేలలు ఎక్కువగా ఉన్నాయి. ఆ రాయి భూగర్భంలోంచి నీటిని మరీ దిగువకు ఇంకిపోనివ్వదు. రాతి పొరల్లోనే నీళ్లు విస్తరించి ఉంటాయి. ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు.

చట్టంలో మార్పులకు ఏర్పాట్లు...

భూగర్భజలశాఖ అధికారులు ఆ మూడు జిల్లాల ఉప సంచాలకులు, ఇతర నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయబోతున్నారు. వారు చర్చించి తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించనున్నారు. ప్రస్తుతం ఇక్కడ బోర్లకు మధ్య దూరం 150 మీటర్లు, 250 మీటర్లు ఉండేలా చట్టం నిబంధనలు విధించింది. ఈ దూరాన్ని తగ్గించేందుకు సిఫార్సు చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇక్కడ బోర్ల సంఖ్య పెంచనున్నారు. కమిటీ సంబంధిత సిఫార్సులతో జీవో 277లో కొన్ని మార్పులు చేసేలా సూచనలు చేయనుంది. దీనిపై గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటారు.

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

CA

ఆచారాల్లో ఘనం.. అరుంధతీ దర్శనం!

మన ఆచారాలన్నీ దేవతా సంబంధంగానూ, మహర్షి ప్రమేయంగానూ, సమాజ పరంగానూ, ఆరోగ్య ప్రచురంగానూ ఉంటాయి. అందువల్లనే మంత్రాలు పరమాత్మ పరంగా అన్వయమవుతూ ఉంటాయి. అత్యంత ఉత్తమ సంస్కారంగా చెప్పుకొనే వైవాహిక ఘట్టంలోని ఆచారాలు కూడా ఇలాంటివే. వేడుకగా జరిపేవి కొన్ని మినహాయించి తక్కినవన్నీ ఎంతో ఉదాత్తమైన అంతరార్థాన్ని కూడుకున్నవే. ఇలాంటి వాటిలో అరుంధతీ నక్షత్ర దర్శనం అత్యంత ప్రధానమైంది.

అరుంధత్యనసూయాచ సావిత్రీ జానకీసతీ
తేజస్వినీచ పాంచాలీ వందనీయా నిరంతరం

అరుంధతి, అనసూయ, సావిత్రి, సీత, ద్రౌపది - ఈ అయిదుగురు సదా వందనీయులు. అరుంధతికి ఇంతటి మహత్తు ఎలా వచ్చిందో ఆమె జన్మవృత్తాంతాన్ని భాగవతం, శివపురాణాల్లో వివరంగా చూస్తే అర్థమవుతుంది. అరుం అంటే అగ్ని, తేజము, బంగారు వన్నె అని అర్థాలు. ధతీ అంటే ధరించినది. అగ్ని నుంచి పుట్టింది కనుక ఆమె అరుంధతి అయింది. పరమేశ్వర వరప్రసాదంగా ఉద్భవించిన అరుంధతిని యాగకర్త అయిన మేధాతిథి పెంచి పెద్దచేసి వశిష్ఠునికి ఇచ్చి వివాహం జరిపిస్తాడు. వారిది ఆదర్శమైన, అన్యోన్యమైన దాంపత్యం.



తన పాతివ్రత్య మహిమ వల్ల అరుంధతి కాలగమనాన్ని సైతం ఆదేశించగల శక్తిమంతురాలయింది. త్రిలోకపూజనీయురాలయింది. అందువల్లనే వధూవరులు దంపతులుగా మారాక పురోహితులు అరుంధతిని చూపుతారు. దీనివల్ల నూతన దంపతుల సంసారజీవనం నల్లేరుమీద బండిలాగ సాఫీగా సాగుతుందని విశ్వాసం.

ఆకాశంలో నాలుగు నక్షత్రాలు మంచంకోళ్లలాగ ఉండి, వాటిలో నాలుగో నక్షత్రానికి పక్కగా తోకలా కింది భాగాన మరో మూడు నక్షత్రాలు కనిపిస్తాయి. ఈ ఏడు నక్షత్రాలను కలిపి సప్తరుషులుగా ఖగోళశాస్త్రజ్ఞులు నిర్ణయించి చెప్పారు. తోకలా ఉన్న మూడు నక్షత్రాల్లో మధ్యది వశిష్ఠుడు. దానిని ఆనుకొని ఇంకొంచెం దిగువగా కనిపించీ కనిపించకుండా ఉండే నక్షత్రమే అరుంధతి. వధూవరులను తూర్పు వైపుకాని, ఉత్తరం వైపుకానీ తీసుకెళ్లి పురోహితుడు ఈ నక్షత్రాన్నే చూపుతారు. అరుంధతీ వశిష్ఠులు రుషి వంశాలకే తలమానికం వంటివారు. ఈ పవిత్రమైన నక్షత్రదర్శనం వలన నూతన దంపతులు అన్యోన్యంగా, ఆదర్శంగా జీవితం గడపాలనేదే ఆకాంక్ష!

ఆయా క్లిష్ట సమయాల్లో అరుంధతి భర్తకు అండగా నిలిచి దుఃఖాన్ని పోగొట్టింది. ఒకానొక సమయంలో విశ్వామిత్రుని శాపం కారణంగా నూరుమంది సంతానం మరణించడంతో వశిష్ఠుడు తీవ్ర నిరాశా నిస్పృహలతో దుఃఖిస్తున్నపుడు భర్తకు ఎంతో ధైర్యం చెప్పి సాధారణ స్థితికి తీసుకొచ్చిన ఇల్లాలు అరుంధతి. ఈ వధువు కూడా భర్తకు ఏదైనా కష్ట సమయం సంభవిస్తే ధైర్యాన్ని ఇచ్చి ఆతని పురోగతికి తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వాలనే తలంపుతో ఈ ఘట్టం నెరపుతారు.

వివాహం పగటివేళలో జరిగినప్పటికి ఆకాశంవైపు చూపి అరుంధతీ దర్శనం చేయిస్తారు. మాఘాది పంచ మాసాలలో ఈ నక్షత్రం సాయం వేళలో కానవస్తుంది. శిశిర, వసంత, గ్రీష్మ రుతువులందు సాయంకాల సమయాన, మిగిలిన కాలాల్లో అర్ధరాత్రి దాటిన తరువాత, తెల్లవారు జామున కనిపిస్తుంది. రాత్రివేళ చంద్రుడిని, నక్షత్రాలను చూడటం వలన కంటి దోషాలు పోవడమే కాదు, కంటికి శక్తి కలుగుతుంది. ముఖ్యంగా అరుంధతీ నక్షత్రం వలన వచ్చే కిరణాల సంయోగం వల్ల కంటి శక్తి మరింతగా పెరుగుతుంది. ఇలా మన ఆచారాలు ఆరోగ్యదాయకమైనవి కూడా!


- మాధురి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి

హాస్యం — హడల్!

'పెళ్లి చూపులకు వెళ్లినట్టు న్నావ్! అమ్మాయి నచ్చిందా?'
'అమ్మాయేమో నచ్చిందికానీ ఆవిడకు వచ్చిన బహుమతుల్ని చూసి హడలి పోయాను'
'ఎందుకు?'
'అవన్నీ ఆమెకు పాఠశాల, కళాశాలల్లో డిబేట్‌లో వచ్చినవేనట'

వధువు కావలెను



Reddy, Business, B.Tech, MBA ★ 30, 5'10", 100Cr ★ 29, 5'8" 225Cr ★ 26, 5'6" 120Cr ★ 27, 5'8" 200Cr, 30 5'10", 300Cr ★ Cont: K.C.Reddy - Hyd Ph; 9849321309, 9347807015 (A).

Reddy, B.Tech, MS, H1, USA ★ Now - Hyd ★ 33, 5'10" 70Cr, 100K ★ USA 30, 5'11", 30Cr ★ 29, 5'7", 70Cr ★ 27, 5'8" 30cr. Cont: K.C.Reddy Mar.Bureau hyd Ph: 9849321309 (A).

Reddy MBBS, PG (India) ★ Sur 28, 5'11" 50Cr ★ MD, 30, 5'7", 50Cr ★ USA, 27, 6', 50Cr ★ 35, 5'6" 50Cr ★ 26, 5'9" 10Cr ★ Cont: K.C.Reddy Mar.Bureau- hyd Ph 9849321309 (A).

Hindu, Mala, 30, 5'9", Data Scientist in USA, Seeks Well Educated Traditional Bride. Call: 8978530671 (A)

RJY, బ్రాహ్మిన్, శాండిల్యస, 36 సం॥, 5'.5", M.Com, L.L.B., M.B.A., ఆదాయం 20 Lakhs, (నో బ్రోకర్స్). ✆ 98485 40316. (G)

వైశ్య/ 28/ 5'8"/ MBBs/ MD/ జనరల్ మెడిసిన్ చేస్తున్న మంచి ప్రాపర్టీగల వరునికి, తగిన వధువు కావలెను. 8125210356 (A)

రెడ్డి/ 29/ 5'11"/ MBBS/ MS/ జనరల్ సర్జన్ చేసిన, 50 Cr ప్రాపర్టీగల వరునికి వధువు కావలెను/ 9494038601 (A)

కాపు/ 28/ 5'10"/ MBBS/ MS/ జనరల్ సర్జన్ చేస్తున్న/ హాండ్‌సమ్, మంచి ప్రాపర్టీగల వరునికి తగిన వధువు కావలెను/ 9494038701 (A)

పద్మశాలి/ B.Tech, MBA/ C.Govt A.E (BHEL)/ 70,000/-pm/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 7288048678. (A)

ముదిరాజ్/ B.Tech (Bits)/ Govt Asst. మేనేజర్ (ఆంధ్రా బ్యాంక్)/ 55000/-pm/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9052296834. (A)

కాపు/ M.Tech/ C.Govt J.T.O (BSNL)/ 70,000/-pm/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886512010. (A)

యాదవ/ M.Tech, IIT/ C.Govt కస్టమ్స్ ఆఫీసర్/ 70,000/-pm/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

మాదిగ/ ఏకైక కుమారుడు/ B.Tech, MBA/ C.Govt కస్టమ్స్ & ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్/ 80,000/-pm/ 5'9" ఎత్తు/ 28సం॥ల వరుడికి వధువు కావలెను. ✆ 9642459724 (A)

మాల/ M.Tech/ C.Govt డిప్యూటి మేనేజర్ (FCI)/ 11 Lakhs P.A/ 5'9" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9703794175 (A)

గమనిక

పెళ్లిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునేముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గౌడ/ M.Tech/ C.Govt ఇంజనీర్ (రైల్వే) 45000/-pm/ 5'9" ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885050879 (A)

మున్నూరుకాపు/ B.Tech C.Govt Jr.Asst. (కమర్షియల్ టాక్స్ Dept)/ 45000/-pm/ 5'10" ఎత్తు/ 28సం॥ల వరునికి వధువు కావలెను ✆ 9703978131. (A)

బ్రాహ్మణ/ రెండోపెళ్లి/ 40/ 5'8"/ B.Tech/ Govt బ్యాంక్ ఎంప్లాయి 50,000/-pm/ వరునికి తగిన వధువు కావలెను ✆ 9030056547/ 9676812525. (A)

Kapu Handsome 27 6' BE, IIT MS Cisco $ 120K 10Cr. ★ 26 5'10" BE MBA IIM Amazon 22L. ★ 28 5'9" MBBS, MD 25Cr. ✆ 9989766111. (A)

బ్రాహ్మణ/ మధ్వ/ 26/ 5'10"/ B.Tech/ 7L ★ మధ్వ/ 29/ 5'8"/ B.Tech/ CTS/ 6L ★ మధ్వ/ 29/ 5'10"/ B.Tech/ SWE/ 6L ★ మధ్వ/ 28/5'11"/ B.Tech MS (US)/ $ 90K/ ★ 9494096081 (A)

బ్రాహ్మణ/ 28/ B.Tech MBA/ 16L ★ 30/ 5'9" B.Tech MS (US) $ 1Lakh ★ 26/ B.Tech/ B'Lore 9L ★ 31/ BE/ Govt/ ★ 29/ MD ★ 9492923492 (A)

Kapu 1981 Engineer (USA) 5.11. Very fair and handsome from Doctors family seeks beautiful girl. Cont: 90307 90242 (J)

Kamma/ B.Tech, MBA, IIM/ 6'/ 27/ 12 LPA/ 15 Cr ★ B.Tech, VIT/ 6'/ 26/ 15 LPA/ 10 Cr ★ B.Tech, IIT, MBA, IIM/ 6'/ 29/ 24 LPA/ 25 Cr. తుమ్మల సుజాత. ✆ 81217 95786. (B)

కాపు-రెండోపెళ్లి ★ 36/ 5'9"/ M.టెక్/ 2L.PM ★ 38/6'/B.టెక్ (IIT), MBA (IIM) USA ★ 39/ 5'6"/ MCA/ IBM/ 2L. PM. ★ డాక్టర్ బోమ్మదేవర నాగకుమారి. ✆ 09246278118 (A)

కమ్మ-రెండోపెళ్లి ★ 38/ 6'/ MBBS/ MD/ USA సిటిజెన్ ★ 34/ 5'9"/ MBBS, MS (ఆర్థో)/ 10 కోట్లు ★ 32/ 6'/ M.టెక్/ విప్రో/ 2L.Pm/ 5 కోట్లు ★ డా॥ బోమ్మదేవర నాగకుమారి. ✆ 9246278118 (A)

SC మాల/ 30/ 6'/ MBBS, MS (GS) ★ 29/ 5'9"/ B.టెక్/ MS/ H1 వీసా ★ 30/ 5'10"/ B.టెక్/ SBI ఆఫీసర్ ★ డాక్టర్ బోమ్మదేవర నాగకుమారి. ✆ 09246278118 (A)

విశ్వబ్రాహ్మణ: 29/ 5'9"/B.టెక్, MS/ H1 వీసా ★ 30/ 5'8"/ MBBS, MD (P) ★ 27/ 5'10"/ B.టెక్/ ట్రాన్స్‌కో ఇంజనీర్ ★ డాక్టర్ బోమ్మదేవర నాగకుమారి. ✆ 09246278118 (A)

Yadava 5.10"/ 30/ M.Tech/ TCS/ 9440831748. ★ 5.10"/ 29/ B.Tech/ IIT/ 17 L. Bhemavaram/ 9440759945 ★ 5.7"/ 27/ M.Tech/ IIT/ 15 Lks/ Tirupathi/ 9441735157 (A)

Kamma/ B.Tech, BITS, MS/ 5'11"/ 27/ 140K/ 10 Cr ★ B.Tech, IIT, 5'9"/ 26/ 250 K/ 250 Cr ★ B.Tech, IIT/ MS/ 5'11"/ 120 K/ 5 Cr. తుమ్మల సుజాత. ✆ 98482 17771, 0866-2433788. (B)

Kamma/ M.Tech/ 5'9"/ 29/ AEE Govt./ 25 Cr ★ Group-I 5'8"/ 28 ★ B.Tech/ 26/ AE/Govt ★ MBA/ 6'/ 26 Business/ 50 Cr. తుమ్మల సుజాత. ✆ 81217 95786, 0866-2438222. (B)

Kamma/ MS Genl./ 5'10"/ 26/ 15 Cr ★ MD, Genl/ 6'/ 26/ 10 Cr ★ MS Ortho/ 5'10"/27/ 20 Cr ★ MD Pead/ 6'/ 27/ 12 Cr. తుమ్మల సుజాత. ✆ 98482 17771, 0866-2433788. (B)

రెడ్డి కుల, కట్న ప్రసక్తి లేదు. 28/5'10" Fr MBA/MCA, 25 Crores వెల్‌సెటిల్డ్ 80 వేలు PM ఏకైక అందమైన వరునికి వధువు కావలెను. ✆ 8897824853, 8897824853 (A)

ముదిరాజ్, 30, USA లో జాబ్‌చేస్తున్న అమ్మాయి కావలెను. లేదా, USA వెళ్లే అమ్మాయిలు వెంటనే సంప్రదించండి, మరియు అన్ని కులాలవారికి సంబంధములు చూడబడును. 9393939962 (A)

రెడ్డి, 2వ, పెళ్ళి, 39, 5'5", సొంత బిజినెస్, 30k/ 37, గౌర్న్‌మెంట్‌జాబ్, 35k, వరులకు, వధువులు కావలెను. అన్ని కులముల వారికి చూడబడును. ఫీజు లేదు. 9948190622 (A)

కాపు 27 5'10" B.Tech SWE MNC 15 Lakhs PA వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. ✆ 9866158793 (A)

ముదిరాజ్/ కట్నప్రసక్తిలేదు/ 33/ 5'7"/ Fr. B.Tech/ Sr. SWE/ Hyd/ 1లక్ష. PM/ చాలా వెల్‌సెటిల్డ్ వరునికి/ తగిన అందమైన వధువు కావలెను. ✆ 9705844329 (అర్జెంట్) (A)

పద్మశాలి/ డైవర్సీ/ కుల, కట్న ప్రసక్తిలేని/ 40/ 5'7"/ Fr./ PG./ C.Govt Job / Hyd/ Rly/ 60,000/- PM/ వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. అర్జెంట్ ✆ 9160253545 (A)

SC మాల 29 5'10" B.Tech EEE C.Govt గ్రూప్ ఆఫీసర్ 85 వేలు PM వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువు కావలెను. ✆ 9908200117 (A)

కమ్మ 12 కోట్ల ప్రాపర్టీ 27 5'11" ఫెయిర్ B.Tech MBA SWE వెల్ ప్రోగ్రామ్ 35 లక్షలు PA, వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. ✆ 9666567123 (A)

రజక: BSc/ Govt Jr. Asst/ ఇరిగేషన్ Dept./ 28000/- P.M 5'11" ఎత్తు 28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

కుమ్మరి: BA/ C.Govt టెక్నీషియన్/ రైల్వేస్/ 40,000/- PM, 5'10" ఎత్తు 27సం॥ల వరునికి వధువు కావలెను. ✆ 9618008271. (A)

30 years 5.5" తెలుగు/ ముదిరాజ్ M.S (Opthamology) white colour. contact: 9480560833.

నియోగి/విడాకులు పొందిన/ యాక్సిడెంట్‌లో ఎడమ చేతిని కోల్పోయిన/ బాగా తెల్లటి ఛాయగల/ 44 సం॥ల వయస్సు గల/ సంపన్న కుటుంబానికి చెందిన హైదరాబాద్ నందలి అడ్వకేట్ వరునికి వధువు కావలెను. శాఖా పట్టింపు లేదు. సంప్ర: 9848051007 (A)

Kamma 28, 5'10" B.Tech, IT, 15L PA ★ 30, 5'10" M.Tech IT, 15L PA ★ 30, 5'8", MD, 10L PA Doctor ✆ 9949233422, Blue Trend Matrimonial - Hyd (A).

కమ్మ 31Y/s 5'10" MCA జీతం 93,000/- PM Sr. SWE, Hyd. సొంత ఇల్లు వెల్ సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. Ph: 8121232121, 9948098180. (A)

బ్రాహ్మణ, 34, డైవర్సీ, సాఫ్ట్‌వేర్, 1.6 ల. P/A. వరునికి సాంప్రదాయ వధువు కావలెను. ✆ 040-24415622, 9949836027 (A)

కమ్మ Converted (క్రిస్టియన్)/ 29 Yrs./ 5'10"/ Scientist in USA, H1, వెల్‌సెటిల్డ్ అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Preferrably in USA. ★ Direct ✆ 7659845098. (A)

కమ్మ 32, 5.7" బిజినెస్, మంచి ఆస్తిగల వరునికి; పిల్లలులేని డైవర్సీ లేదా విడో తగిన వధువు కావలెను. (నో బ్రోకర్స్) 8179237770, 7396056278. (E)

★ ★ ★

BC/ 58 రిటైర్డ్ వరునికి 45-55 మధ్య వయస్సు గల కుల ప్రాధాన్యత లేని వధువు నేరుగా సంప్రదించగలరు. ✆ 99082 04021. (C)

★ ★ ★

కమ్మ 32 సం॥ హైట్ 5.10 MBA HR 5.2 Y. ఆస్తి 2.5 Cr.s కమ్మ వధువు కావలెను. నో బ్రోకర్స్. 70930 35135, 80194 57608 (J)

రెడ్డి 32Y/ 5.7 ఎత్తు, సొంత ప్రాపర్టీ 30 లక్షలు. జీతం నెలకు 30 వేలు గల వరునికి అందమైన వధువు కావలెను. కట్నం వద్దు. 99857 99136 (నో బ్రోకర్స్) (J)

వయస్సు 38/ 5'.7" డైవర్స్ (బి.టెక్) బిజినెస్ - లండన్ నెలకు 7 లక్షలు (వెలమ), కులప్రసక్తి లేదు. 93963 65506 (J)


వెలమ/37సం॥/6'ఎత్తు/T.V.S. కంపెనీ మేనేజరుకి తగిన వధువు కావలెను. (నోబ్రోకర్స్). ✆ 94418 22717 (I)

కమ్మ/డైవర్సీ 34/5'9", MCA/SWE, 25 L.P.A, వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. సంప్రదించండి: 9618226996 (A)

కాపు 5'11" 41 సం॥, B.Sc., CMC ట్రైన్ స్థితిపరుడైన డైవర్సీ వరునికి తొలి సంబంధపు కాపు వధువు గాని బాదరబందీలేని డైవర్సీ వధువు గాని కావలెను. ✆ 94906 58169. (B)

బలిజ (కాపు) B.Tech/ 5.9/ 44y/ బిల్డర్ 5 కోట్లు/ 50,000 రెంట్స్/ పిల్లలు లేని, పిల్లలు పుట్టే అందమైన 35 సం॥లోపు I లేక II వధువు కావలెను. డైరెక్ట్. ✆ 86390 91428 (J)

వరుడు కావలెను



Reddy, B.Tech (Rich) 30, 5'6" 200Cr ★ 29, 5' 1/2", 100Cr ★ 27, 5'6", 100Cr ★ MBBS, 28, 5'5" 50Cr 27, 5'7" 100Cr ★ 25, 5'5" 120Cr, Cont: K.C.Reddy - Hyd Ph: 9849321309 (A).

Reddy B.Tech, MS, USA ★ 25, 5'7" 30Cr ★ 26, 5'6" 10Cr ★ 24, 5'5" 10Cr ★ 27, 5'5" 25Cr ★ 28, 5'5", 20Cr ★ Cont: K.C.Reddy Mar-Bureau hyd, Ph: 9849321309, 9347807015 (A).

Reddy, USA Citizens ★ MBBS, 25, 5'5" 100Cr ★ 25, 5'7" 50Cr ★ 29, 5'6" ★ 28, 5'5" 10Cr ★ 30, 5'2" 10Cr ★ BS, 27, 5'5" 10Cr ★ Cont: K.C.Reddy (A).

Parents Intercast Marriage. Father Padmasali, Mother Catholic, Age: 31, Ht: 5'4", Wheatish Complexion, Sal: 3.5Lac per Annum. 9652467370 (A)

కమ్మ/ 25/ 5'4"/ MBBS/ MS/ గైనిక్ చేస్తున్న అందమైన మంచి ప్రాపర్టీగల వధువుకి, తగిన వరుడు కావలెను. 9581635726 (A)

SC హిందు/ 26/ 5'3"/ MBBS/ MD/ రేడియాలజి చేస్తున్న ప్రాపర్టీగల మంచి సాంప్రదాయమైన, వధువుకి తగిన వరుడు కావలెను. 8142540968 (A)

గౌడ/ 27/ 5'4"/ MBBS/ MS/ గైనిక్ వధువుకి తగిన వరుడు కావలెను. 8125210344 (A)

విశ్వబ్రాహ్మిణ్ (తూర్పుశాఖ) 30 సం॥, 5'2", డైవర్సీ, సెంట్రల్ గౌట్ ఉద్యోగి, 30 PM, అందమైన వధువుకి (Fair) Hyd లో పనిచేస్తున్న Govt/ సాఫ్ట్‌వేర్ వరుడు (ఆంధ్ర) కావలెను. డైరెక్ట్ సంప్ర: ✆ 9866245001 (A)

పద్మశాలి / B.Tech, IIT/ C.Govt ఎలక్ట్రానిక్ ఇంజనీర్ (రైల్వే) / 40,000/- PM/ 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886957298 (A)

గౌడ / B.Tech/ Govt బ్యాంక్ క్యాషియర్ (ఆంధ్రా బ్యాంక్) / 22000/- PM/ 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885299854 (A)

ముదిరాజ్ / B.Tech/ C.Govt ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆఫీసర్ / 60,000/- PM/ 5'5" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9642459724 (A)

క్రిస్టియన్ మాదిగ / B.Tech/ C.Govt J.T.O (B.S.N.L)/ 35000/-PM/ 5'5" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014/ 9985606180 (A)

యాదవ / M.Tech (IIT)/ C.Govt ఇంజనీర్ (BHEL)/ 65000/-PM/ 5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885055185 (A)

SC మాల / B.Tech/ Govt. Asst మేనేజర్ (విజయా బ్యాంక్) / 55000/- PM/ 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

విశ్వబ్రాహ్మణ / B.Tech/ C.Govt క్వాలిటి ఇన్స్‌పెక్టర్ (FCI)/ 35000/- PM/ 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886512010 (A)

గౌడ / ఏకైక కుమార్తె /B.Tech/ C.Govt బ్యాంక్ P.O (IOB)/ 35000/- PM/ 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9052296834 (A)

బ్రాహ్మణ/ రెండో పెళ్లి / 35/ 5'3"/ డిగ్రీ / Pvt. జాబ్/ పిల్లలు లేని వధువుకు తగిన జాబ్/ బిజినెస్ వరుడు కావలెను. ✆ 8309527614/ 9030056547 (A)

Kapu Beautiful 24 5'5" MS H1 $ 85 ★ 23 5'6" BE MBA HCL 45K 10Cr ★ 24 5'5" CA MNC 6L ★ 22 5'4" Infosys. Rich ✆ 9989766111 (A)

బ్రాహ్మణ / 22/ 5'2"/ 10th ★ 25/ 5'4"/ ఇంటర్ ★ 27/5'4"/ ఇంటర్ వారంకే విడాకులు, కట్నం ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. పూజారి O.K. ✆ 9848819651/ 9848816536 (A)

వైశ్య / 20/5'3"/ 10th ★ 23/5'4"/ ఇంటర్ ★ 25/ 5'4"/ B.Com, వధువులకు తగిన వరులు కావలెను. బిజినెస్ అయినా O.K. ✆ 7702254878/ 9848816536 (A)

బ్రాహ్మణ/23/ 5'4"/ BSc/ ★ 26/ B.Tech/ Infosys/ 5L ★ 24/ 5'3"/ MBA ★ 25/ B.Tech MS (US) $ 65 K ★ 26/ 5'4"/ MBBS ★ 9494309202 (A)

బ్రాహ్మణ/ మధ్వ/ 21/ 5'3"/ MCA/ ★ మధ్వ/ 22/ 5'2"/ B.Tech/ IBM/ 3L ★ మధ్వ/ 25/ 5'7"/ B.Tech/ CTS/ 4L/ ★ మధ్వ/ 26/ 5'2"/ M.Tech ★ మధ్వ/ 27/ 5'4"/ BE. 9030036501 ★ (A)

బ్రాహ్మణ/ వైదిక/ 23/ 5'6"/ B.Tech/ TCS/ 5L ★ నియోగి/ 27/ MSc/ Wkg ★ మధ్వ/ 25/ BSc/ BEd/ ★ శ్రీ వైష్ణవ/ 26/ 5'2"/ B.Tech/ Bank ★ 8555024711 (A)

కుల పట్టింపులేదు, కమ్మ గవర్నమెంట్ గెజిటెడ్ హెడ్ మాస్టర్/ 52సం॥ ఎత్తు:5.3, సొంత ఇల్లు, విడో, పిల్లలులేరు. 85,000 PM, 22ఎకరాల పొలం గల వధువుకి వరుడు కావలెను. ✆ 70138 86194.(L)

SC హిందు మాల B.Tech/ IIM Cognizent 18 Lakhs PA/ 5.6 ఎత్తు/ 25Y అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9440325586. (N)

SC మాదిగ/ 25/ 5'4"/ BDS/ SBI ఆఫీసర్ ★ 25/ 5'5"/ B.టెక్, MS/ H1 వీసా ★ 27/ 5'4"/ MBBS, MD (P) సంప్ర॥ డాక్టర్ బోమ్మదేవర నాగకుమారి. ✆ 09246278118 (A)

కాపు/ 25/ 5'6"/ B.టెక్/ RBI ఆఫీసర్ ★ 24/ 5'6"/ B.టెక్, MS/ H1 వీసా ★ 27/ 5'5"/ MBBS, MS (గై) ★ డాక్టర్ బోమ్మదేవర నాగకుమారి. ✆ 09246278118 (A)

SC మాదిగ హిందూ/ 30/ 5.3"/ B.Tech/ Com సైన్స్/ SWE/ Hyd/ 50,000/- PM. వెల్‌సెటిల్డ్/ V.V. Fair/ వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8712865419. (A)

చౌదరి, డైవర్సీ, ఫర్టిలైజర్స్, 15 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. Ph: 9391355366 (A)

మాదిగ: MCA/ 33 Y/ 5'4"/ Fair/ 60 వేల జీతంతో సాఫ్ట్‌వేర్‌గా జాబ్‌చేస్తున్న వధువు (2వ మ్యారేజ్, పిల్లలులేరు) కు SWE గాని, MBBS గాని, Govt. Jobs వారు గాని. Ph: 90009 80214, 88855 66712. (B)

Kamma/ MD, Peada/ 5'5"/ 26/ 10 Cr ★ MS Gynec/ 5'8"/ 25/ 15 Cr ★ MS, Genl/ 5'4"/ 25/ 5 Cr ★ MDS/ 5'5"/ 27/ 10 Cr ★ Resi/5'7"/ 27/ 25 Cr. తుమ్మల సుజాత. ✆ 81217 95786. (B)

Kamma/ CA/ 5'5"/ 24/ 5 LPA/ 3 Cr ★ B.Tech/ 5'6"/ 26/ AEE, Govt/ 5 Cr ★ B.Tech/ 5'7"/ 24/ Infosis/ 5 Cr ★ B.Tech IIT/ 5'4"/ 22/ 9 LPA/ 10 Cr. తుమ్మల సుజాత. ✆ 81217 95786. (B)

Kamma/ B.Tech, NIT, MS/ 5'5"/ 23/ 20 Cr ★ B.Tech/ BITS, MS/ 5'7"/ 23/ 105 K/ 3 Cr ★ BEMS/ 5'5"/ 23/ 50 Cr ★ BEMS/ 5'5"/ 24/ 90 K/ 4 Cr. తుమ్మల సుజాత. ✆ 98482 17771. (B)

కాపు, డైవర్సీ, 38, 5'5" PVT జాబ్, 35K, రెంట్స్ 40K, వెల్‌సెటిల్డ్, ఒంటరి వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్థి, పట్టింపులేదు. 9948190622/ 7288030633 (A)

రెడ్డివిడో / 38/5'5", Govt జాబ్, 35K, సొంత ఇల్లు, రెంట్స్ 25K, గల ఒంటరి వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్థి, పట్టింపులేదు. 9666376030/ 9966871719 (A)

వెలమ, విడో, 35, 5'5", సొంత బిజినెస్, 80K PM, ఓన్‌హౌస్, రెంట్ 30K, గల ఒంటరి వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్థి. పట్టింపు లేదు. 9014354354/ 9951619273 (A)

రెడ్డి కులపట్టింపులేదు 25/5'5" ఫెయిర్ MBA, Engg, 25 కోట్లు, తండ్రిలేని ఏకైక అందమైన వధువుకు వరుడు కావలెను. ఆర్థిక సహాయం చేయబడును. ✆ 9640204207 (A)

కమ్మ 25 5'4" V.Fr B.Tech SWE INFOTECH 35000 PM సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9014933627 (A)

కాపునాయుడు/ MBA/ SBI బ్యాంక్ మేనేజర్/ 26 సం॥/ 5'5" ఎత్తు/ 60,000/- P.M. అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8340841945 (A)

కులపట్టింపులేదు 32/ 5'4"/ Bటెక్ MS USA ★ 38/ 5'5"/ MBBS, MD/ USA ★ 37/ 5'2"/ MBBS, MD, MPH/ USA వధువులకు USA లో సెటిల్ అయిన వరులు కావలెను. ✆ 9490479371 (A)

కాపు/ CNB/ 24/ 5'2"/ MSC/ 20Cr/ గల వధువుకు అందమైన వరుడు కావలెను. Ph: 9989974827 (A)

మాదిగ హిందూ 25/ 5'6"/ B.Tech, MBA అందమైన అమ్మాయికి వెల్‌సెటిల్డ్ సాంప్రదాయ కుటుంబం నుండి మంచి ఉద్యోగం చేస్తున్న అబ్బాయి కావలెను. సం॥ " శుభమస్తు " Hyd. ✆ 8790690309 (A)

క్రిస్టియన్/ 32/ 5'4"/ V.Fr./ PG/ C.Govt Job/ Hyd/ 50,000/- PM/ చాలా అందమైన/ వెల్‌సెటిల్డ్/ వధువుకు తగిన వరుడు కావలెను. అర్జెంట్: ✆ 8374883874 (A)

వైశ్య 23 5'6" ఫెయిర్ B.Tech SWE, TCS 35,000/- PM అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు అందమైన వరుడు కావలెను. ✆ 9948005247 (A)

గౌడ: MSc/ హార్టికల్చర్/ Govt గెజిటెడ్ ఆఫీసర్/ హార్టికల్చర్ Dept/ 45,000/- P.M, 5'5" ఎత్తు, 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

కమ్మ: B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్/ 45,000/- P.M, 5'6" ఎత్తు 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007652 (A)

బెస్త, గంగపుత్ర: BSc/ Agri/ Govt. ఆఫీసర్/ అగ్రికల్చర్ Dept/ 36,000/- P.M, 5'5" ఎత్తు, 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

వడ్డెర: CA/ చార్టర్డ్ అకౌంటెంట్/ 45,000/- PM, 5'5" ఎత్తు, 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

కమ్మ/ విడో/ 23/ 5'3" B.Pharmacy 12 కోట్ల ఆస్తి, ప్రమాదంలో భర్తను కోల్పోయిన ఏకైక వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. ఓన్లీ వాట్సప్: 90304 58459. (B)

రెడ్డి లేట్‌మ్యారేజ్ కుల, ధనప్రసక్తి లేదు/ 35/ 5'5"/ ఫెయిర్/ డిగ్రీ, 40 కొట్ల స్థిరాస్తి కమర్షియల్ కాంప్లెక్స్/ రెంట్స్ 5L.PM ఒంటరి వధువుకు వరుడు కావలెను (వాట్సప్) 9121896329 (A)

రాజులు/ కులప్రసక్తి లేదు/ 25/ 5'5"/ B.Com 28Cr ఆస్తి యాక్సిడెంట్‌లో తండ్రిని కోల్పోయిన చాల అందమైన వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను ఇల్లరికం OK. (వాట్సప్) 7097258384 (A)

కాపు/ 38/ డైవర్సీ/ B.Com 5'3" గ్రానైట్‌బిజినెస్ 3Lks.PM 10 కోట్ల ప్రాపర్టీగల వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. 9121881498 (A)

కమ్మ 30Yrs/ విడో/ మున్సిపల్ కమీషనర్ వాలెంటరి రిటైర్డ్/ 5'4"/ పెన్షన్ 80,000 PM సొంత ఇల్లు/ 15Cr ప్రాపర్టీగల వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను 9908044571 (A)

రెడ్డి/ 24/ 5'5"/ ఫెయిర్ ఇంటర్/ 26Cr ఆస్తి Hydలో సెటిల్డ్ ఏకైక అందమైన వధువుకు కుల, ఉద్యోగ ప్రసక్తి లేని వరుడు కావలెను మంచి సపోర్ట్ ఇవ్వబడును (వాట్సప్) 9618265637 (A)

చౌదరి విడో/ 32 కోట్ల ప్రాపర్టి 2సం॥రాల పాప 36Yrs 5'4"/ ఫెయిర్/ MBBS డాక్టర్ ఒంటరి వధువుకు కుల ప్రసక్తిలేని మధ్యతరగతి 1వ, 2వ వరుడు కావలెను (వాట్సప్) 7337269487 (A)

Kamma, 26, 5'5" Fair, MBBS, 4L PA ★ 26, 5'7" Fair, 5L, PA, M.Tech ★ 27, 5'5" MS/ USA ✆ 9000487865, Blue Trend Matrimonial - Hyd (A).

మాల 24, 5'.5" V.Fair B.Tech, MBA, Hyd 12L PA 3 Cr. ప్రోపర్టీ ఉన్న వధువుకు మంచి వరుడు కావలెను. ✆ 8885825522/ 8885725522. (C)

SC మాల, హిందూ 32Y/5'4" MBBS/ MD Physiology. Asst ప్రొఫెసర్ Sal: 70K P/M గల అందమైన వధువుకి డాక్టర్ వరుడు కావలెను. డైరెక్ట్ ✆ 8185043702 (A)

కాపు CNB, 23 5'.5" V.Fair B.Tech MNC Hyd 9L PA, 2 Cr. ప్రోపర్టీ ఉన్న వధువుకు వరుడు కావలెను. ✆ 8885925522, 8886191249. (C)

రాజులు 24 Y/ 5'.5"/ ఫెయిర్/ B.Tech/ Hydలో సెటిల్‌గల తండ్రిలేని ఏకైక వధువుకు సాంప్రదాయం గల మధ్యతరగతి వరుడు కావలెను. ఫోన్: 8886021792. (C)

★ ★ ★

బ్రాహ్మణ కాశీపస పునర్వసు unmarried 1968 (49) v.fair Govt Employee Vja గల వధువునకు వెల్‌సెటిల్డ్ తగిన వరుడు కావలెను. ✆ 94925 36250, 94583 08406 (I)

★ ★ ★

హిందూ మాల, Gnt, Near Tenali, DB: 19/6/93, B.Tech, SWA Infosys (Hyd) జాబ్ గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లేక డాక్టర్ జాబ్ చేస్తున్న వరుడు కావలెను. 90004 09980 డైరెక్ట్ (I).

Hindu, Mala/ 27/ 5'5"/ Software Engineer Girl/ Seeks well settled boy, Govt Job Preferred. Phone: 8978530671 (A)

కమ్మ/ 25/ 5'4"/ B.Tech Hydలో జాబ్. సాంప్రదాయ కుటుంబానికి చెందిన అందమైన వధువుకు తగిన వరుడు వెంటనే కావలెను. ✆ 94934 51861. (B)

వివాహ వేదిక



పీస్ క్రిస్టియన్ మ్యారేజ్‌బ్యూరో. అన్ని కులాల నుండి కన్వర్ట్ అయిన క్రిస్టియన్స్‌కు OC (కమ్మ, కాపు, రెడ్డీస్) BC, SC, ST, 1 & 2 సంబంధాలు కలవు. ✆ 9246880866 (A)

కేవలం మాలమాదిగ, ST, క్రిస్టియన్ మా ప్రత్యేకత. 1వ, 2వ, లేటు, డైవర్సీ, విడోస్, Govt., సాఫ్ట్‌వేర్ జాబ్స్ దేశవిదేశ సంబంధాలకై AP, తెలంగాణల్లో (3 బ్రాంచీలు) ✆ 7095940444 (A)

P.Supriyareddy, Rich Reddy Boys & Girls. India & Abroad Matches, All Emp/Govt/Pvt/ SWE/Doc's/ Business/ Divorcess from all Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762, Email: palletisupriyareddy@gmail.com (A)

బ్రాహ్మణ వధువు వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ. Hyd ✆ 9248600342, 8019207503. brahmininformationmatri@gmail.com. (A)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

ఓన్లీ Govt ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్నిమతాల, కులాల, 1వ, 2వ, లేట్, వీడో/ డైవర్స్‌లకై వివాహాలు & Govt ఎంప్లాయిస్ సంబంధాల కొరకు వెరిఫాస్ట్ సెటిల్‌కై ✆ 9000185415. (A)

కమ్మ వారికి దేశ/ విదేశ 1వ, 2వ వివాహాలకై డా॥, ENG, S/W, Govt/ P.జాబ్స్, బిజినెస్ & కమ్మ, కన్వర్టడ్ వారికి సంప్ర॥ శ్రీవారి కళ్యాణ వేదిక ✆ 9966655116/ 115 (A)

జంధ్యాల–jandhyala.com, మ్యాగజైన్, Well Exp-Staff మొ॥ అన్ని రిసోర్సెస్‌తో దశాబ్దాలుగా Quality Services. 9494945172/ 3. (A)

గవర్నమెంట్ ఎంప్లాయిస్/ ఫస్ట్, సెకండ్, విడో, డైవర్స్/ లేట్/ రిటైర్డ్/ పెన్షనర్స్. 50సం॥ దాటిన వారికి కూడ సంబంధాలు కలవు. సంప్ర:70138 86194.(L)

విశ్వబ్రాహ్మణులలో పెళ్ళి కావలసిన యువతీ, యువకుల వివరాలకోసం మా ఆఫీసులో గాని, ఫోన్‌లో గాని సంప్రదించండి. విశ్వబ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం, బ్రహ్మముడి, గుంటూరు. ✆ 0863- 2261898, 94911 25725(I)

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.comలో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాలు ఫోన్ నెంబర్లు ఫ్రీగా చూసుకోండి. ✆ 98497 44707 (I)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com, Hyd. 9440831748, Gnt. ✆ 9440759945, VSP. 9441735157. (A)

Whats App Your Photo & Biodata to 9347262769. We will Send the Suitable Matches. www.pellisandadi.com, ESTD. 1999 (A)

20సం॥ల అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహవేదిక. శ్రీసత్యసాయి వివాహవేదిక. ✆ 9849414098/ 040-66317515. satyasaivivahavedica.com (A)

CNB 2వ సంబంధాలు మాత్రమే 2 వ సంబంధాలు కుదర్చడంలో 5 సం॥ల అనుభవం ప్రతి ఆదివారం 2Pm-5Pm, పరిచయ వేదిక 500 మంది లిస్ట్ ఇవ్వబడును/కుదుర్చబడును. Hyd. 8712456779 (A)

శ్రీ సత్యసాయి తలంబ్రాలు. అన్ని కులముల వారికి అన్ని వయస్సుల వారికి 1వ, 2వ పెళ్ళి సంబంధాలు చూడబడును. సం॥ వేళలు ఉ॥ 10.30 to 9.00 pm. ✆ 94905 70029 (J)

క్షత్రియ, సూర్యవంశం, చంద్రవంశం, బట్రాజులు, MBBS, MD, BTech, MS, Govt, హైరేంజ్ జాబ్స్, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీస్, 1st 2nd అబ్బాయిలు, అమ్మాయిలు, సంప్ర: M. ధనలక్ష్మీ/ 8374514056 (A)

కేవలం రెడ్డీస్/ మున్నూరు కాపు/ కాపు కమ్మకాపు, నాయుడ్స్ ప్రత్యేకత. 1వ, 2వ, లేటు, డైవర్సీ, విడోస్, Govt. & సాఫ్ట్‌వేర్ జాబ్స్, దేశ, విదేశ సంబంధాలకై. 3 బ్రాంచిలు ✆ 9849283323. (A)

SPL, Doct(3000 ప్రోఫైల్స్) MBBS, MD, MS, DM, BDS, MDS, & All Pharmకు 1వ, 2వ/ లేటు దేశ, విదేశ సంబంధాలు అన్ని కులాలకు కుదుర్చబడును. Ph: 9866411588 (A)

15 సం॥ల అనుభవంతో అన్ని కులాల వారికి Govt, బిజినెస్, సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, దేశ, విదేశీ సరియైన జోడి కుదుర్చబడును. రెడ్డీస్‌కు ప్రత్యేకత Hyd. ✆ 9440937900 (A)

సుజిత మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 1 నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీలకు ఫ్రీ. పు॥ సర్వీస్ చార్జ్ ✆ 7893688248 (A)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్ కాస్ట్స్) MBBS/ MS/ MD/ MCH/ DM/ BDS/ MDS & బిజినెస్ మ్యాన్స్‌కి 1వ/2వ/విడో, దేశ, విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9966808059 (A)

కాపు fairlinksmatrimony.comలో ఉచితంగా login అవ్వండి. వేలాది వధూవరుల నుండి మీకు తగిన సంబంధం ఎంపికచేసి మా ద్వారా సంబంధం కుదుర్చుకోండి. హైదరాబాద్ 93955 66115, వైజాగ్ 93911 66116, విజయవాడ 93955 66114 (D)

క్షత్రియ/ రాజు fairlinksmatrimony.comలో ఉచితంగా login అవ్వండి. వేలాది సంబంధాల నుండి సత్వరం వివాహం కుదుర్చుకోండి. తిరుపతి 92999 92601, వైజాగ్ 81061 68806, హైదరాబాద్ 97045 21575 (D)

★ ★ ★

వాసవి-విజయవాడ వారిచే 10వ ఆర్యవైశ్య వధూవరుల పునర్వివాహ పరిచయ వేదిక 24-9-17 తేదీ మ. గం. 2.00 లకు విజయవాడలో జరుగును. వివరాలకు: ✆ 99895 00130, 81064 54284. (B)

అను మ్యారేజ్ బ్యూరో /సెకండ్ మ్యారేజ్స్ మా ప్రత్యేకత. అన్ని కులాలవారికి సంబంధాలు కుదర్చబడును. ✆ 94405 77966 (I)

అదును దాటాక ప్యాకేజీ?

- పత్తి సాగు నుంచి మళ్లితే ప్రోత్సాహకాలు
- ముఖ్యమంత్రి ప్రకటించిన 75 రోజులకు ఉత్తర్వులు
- రూ.53.50 కోట్లు కేటాయింపు
- మరో నెలలో మొదలవనున్న పత్తి తీతలు

ఈనాడు – అమరావతి

రైతుల్ని పత్తి నుంచి ప్రత్యామ్నాయ పంటలకు మళ్లించే ప్రయత్నంలో ప్రభుత్వం దాదాపుగా విఫలమైంది. ఖరీఫ్‌కు ముందే దీనిపై ప్రకటన చేయాలనే విషయాన్ని విస్మరించి విత్తనం వేయడం పూర్తయ్యాక ప్రోత్సాహకాలు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అదును దాటిపోయాక రూ.53.50కోట్ల ప్యాకేజి ప్రకటించింది. వాస్తవానికి ఇప్పటికే గుంటూరు, కృష్ణా జిల్లాల్లో పత్తిచేలు పూత, పిందె దశకు చేరాయి. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వానలేక చేను కొంత ఎండుముఖం కూడా పట్టింది. అంతా అయిపోయాక ఇప్పుడిచ్చే ప్యాకేజితో పత్తి రైతులకు ఒరిగేదేమీ ఉండదు.



75 రోజుల తర్వాత ఉత్తర్వులు

పత్తికి గులాబీ రంగు పురుగు ఆశిస్తే పొలం మొత్తం తుడిచిపెట్టేస్తుంది. కాయ లోపలకు చేరే పురుగును నిర్మూలించడం కష్టమే. అందుకే పత్తిసాగు తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడేళ్లుగా ప్రచారం చేస్తున్నాయి. గతేడాది పత్తికి మంచి ధర లభించిన నేపథ్యంలో ఈ ఏడాది రైతులంతా దీనివైపు మొగ్గకుండా చేయాలని ప్రభుత్వం ఆలోచించింది. పత్తికి ప్రత్యామ్నాయంగా అపరాలు, నూనెగింజలు, తృణధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం ప్రకటించింది. జూన్ 9న అనంతపురంలో జరిగిన ఏరువాక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై ప్రకటన చేశారు. అప్పటికే కొంత ఆలస్యం జరిగింది. తొలకరి వర్షాలు కురవడంతో పత్తిసాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. విత్తనాలు కొనుగోలు చేశారు. అక్కడక్కడా నాటడం కూడా మొదలైంది. ప్రభుత్వం ప్రకటన చేయడమే ఆలస్యం అనుకుంటే ఉత్తర్వులకు మరింత జాప్యం చేశారు. జూన్ 12న కమిషనరేట్ నుంచి లేఖ వెళితే ఆగస్టు 24న పత్తికి ప్రత్యామ్నాయంగా సాగుచేసే పంటలకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ జీవో వెలువడింది.

సాగుకు మించిన సమయం

అధికారులు ప్యాకేజి లెక్కలు తేల్చేసరికి రైతులు పత్తి వేయడం కూడా పూర్తయింది. ఇప్పుడు పత్తి వేసే అదును కూడా కాదు. మరో నెల రోజుల్లో పత్తి తీతలు మొదలు కాబోతున్నాయి. వాస్తవ సర్కారీ లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రంలో 83% పత్తి సాగైనట్లు స్పష్టమవుతోంది. 6.41 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికిగాను ఆగస్టు 23 నాటికి 5.32లక్షల హెక్టార్లలో పత్తి సాగైంది. పత్తి వేసే పొలాల్లో ఇప్పటికే ఇతర పంటలు సాగుచేసిన వారికి ప్యాకేజీ వర్తింప జేసినా.. విత్తనాలు వేసి, మూడు నాలుగు సార్లు కలుపులు కూడా తీశారు. దీంతో పంట అమ్మకంపై వచ్చే బోనస్‌పై మాత్రమే ప్రయోజనం కలగనుంది.

ప్యాకేజిలో ఏం ఇస్తారంటే:

- 75శాతం రాయితీపై విత్తనాలు
- కలుపు మందులపై హెక్టారుకు రూ.500 రాయితీ
- పంట ఎదుగుదల మందులపై హెక్టారుకు రూ.500
- అపరాలు, నూనెగింజలు, తృణధాన్యాలు తదితర ప్రత్యామ్నాయ పంటల ఉత్పత్తుల కొనుగోలుపై క్వింటాలుకు రూ.200 బోనస్
- విత్తనాలు, ప్రోత్సాహకం మొత్తాల్ని ఈ-పోస్, నగదు బదిలీ విధానంలో అందిస్తారు.

నష్టం మొదలైంది

ప్రభుత్వం, వ్యవసాయశాఖ అంచనా వేసినట్లే పత్తికి గులాబీ రంగు పురుగు తాకిడి కూడా మొదలైంది. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఇప్పటికే ఈ పురుగును గుర్తించారు. నివారణకు చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు కూడా సూచిస్తున్నారు. ఇవన్నీ అధికారులకు తెలియనివేం కావు. అయినా ముఖ్యమంత్రి చెప్పారు. ఉత్తర్వులిచ్చేద్దాం అనే ఆలోచనే తప్ప.. వాస్తవంగా రైతులకు కలిగే ఉపయోగమెంత? అన్న కోణంలో ఆలోచించడం లేదు.

గిరిజన గ్రామాలకు రహదారి యోగం!

ఈనాడు అమరావతి: తమ ఆవాసాల నుంచి సమీప పట్టణం లేక మండల కేంద్రానికి చేరుకునేందుకు రహదారి సౌకర్యంలేక.. కనీసం అంబులెన్స్ వెళ్లే మార్గం లేక.. అత్యవసర సమయాల్లో వైద్య సేవలు పొందలేక, ప్రభుత్వ సేవలకు నోచుకోక.. ఇబ్బందులు పడుతున్న గిరిజనుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. రాష్ట్రంలోని 3 వేల గిరిజన గ్రామాలకు వచ్చే మూడేళ్లలో రహదారి సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. మొత్తం రూ.3 వేల కోట్లతో 7 వేల కిలోమీటర్ల మేర రహదారులు నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) నిధులను ఇందుకు వెచ్చించాలని నిర్ణయించారు. మొదటి ఏడాది రూ.500 కోట్లతో 2 వేల కిలో మీటర్ల మేర రహదారుల పనులకు ప్రస్తుతం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

చాపరాయి ఘటనతో: తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలోని చాపరాయిలో ఇటీవల వైద్య సేవలు అందక పలువురు గిరిజనులు మృతి చెందారు. ఈ ఘటనతో గిరిజన గ్రామాలకు కీలక అవసరమైన రహదారుల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉపాధి నిధులతో: 2010-13మధ్య మూడేళ్లపాటు రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో రహదారుల పనులకు ఉపాధిహామీ నిధులు వినియోగించారు. అనంతరం వివిధ కారణాలతో ఈ నిధులను గిరిజనేతర ప్రాంతాలకే పరిమితంచేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి పనులకు రాష్ట్ర బడ్జెట్‌లో ఏటా రూ.130కోట్లు కేటాయిస్తున్నారు. ఈ నిధులు ఏమూలకూ సరిపోనందున రహదారుల నిర్మాణానికి ఉపాధి హామీ నిధుల అనుసంధానం కోసం గిరిజన సంక్షేమశాఖ చేసిన ప్రతిపాదనలపై గ్రామీణాభివృద్ధిశాఖ సానుకూలంగా స్పందించింది. ఈ రహదారులకు 90 శాతం ఉపాధి నిధులు, 10శాతం గిరిజన సంక్షేమశాఖ నిధులు వినియోగించాలని నిర్ణయించారు. రహదారుల నిర్మాణానికి గుర్తించిన 3వేల గిరిజన గ్రామాల్లో 85 శాతం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోనే ఉన్నాయి.

వసుంధర

ఆ బటన్లు నొక్కితే.. ఒత్తిడి మాయం!



జపాన్ శాస్త్రవేత్తలు మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి ఒక చిన్న పరికరాన్ని కనిపెట్టారు.. దానిపేరు 'ఎటర్నల్ పాపెట్'. కీచైన్ సైజులో ఉండే దీని మీద పది చిన్న చిన్న బటన్లు ఉంటాయి. వాటిని నొక్కినప్పుడల్లా గాలి బుడగను పగలగొట్టిన అనుభూతి కలుగుతుంది. పైగా దీంట్లో ఉన్న స్పీకర్ నుంచి అలాంటి శబ్దాలే వస్తాయి. దానివల్ల ఒత్తిడి పోయి ప్రశాంతత కలుగుతుందట. ఇది బబుల్ ర్యాప్ తరహాలో ఉంటుంది. ఉద్యోగం చేసే మహిళలు ఏ మాత్రం ఒత్తిడిగా అనిపించినా ఒక రెండు నిమిషాలు దీన్ని ప్రయత్నిస్తే మెదడు ప్రశాంతంగా మారుతుందని చెబుతున్నారా శాస్త్రవేత్తలు.

నాకేం భయం!




భర్త: ఇదిగో నాలోని జంతువుని నిద్ర లేపుతున్నావ్ నువ్వు!

భార్య: లేవనీయండి మరేం ఫర్వాలేదు.. పిల్లికి నేను భయపడను.


మూత్రశాలలు ఎక్కడున్నా చెబుతుంది!

మనకు తెలియని ప్రదేశాలకు వెళ్తున్నపుడు ఎక్కడైనా దగ్గర్లో టాయిలెట్లు ఉన్నాయా అని కనుక్కోవడం చాలా కష్టం. ముఖ్యంగా ఒంటరిగా వెళ్తే ఎవరిని అడగాలన్నా కాస్త ఇబ్బంది పడాల్సి వస్తుంది. అయితే ఈ సారి 'టాయిలెట్ ఫైండర్' యాప్‌ను ప్రయత్నించి చూడండి. ఇందులో మనమున్న ప్రదేశానికి దగ్గర్లో ఉన్న పబ్లిక్ టాయిలెట్ల వివరాలు అందుబాటులో ఉంటాయి. ఒకవేళ లేకపోతే రెస్టారెంట్లు, షాపింగ్‌మాళ్లు, ఆసుపత్రులు, పెట్రోల్ బంకులు..ఇలా ఎలాంటి ప్రదేశాల్లో అవి అందుబాటులో ఉన్నాయో వాటి వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు.



దెయ్యాలంటే భయమే!

తాప్సీ.. ఇంజినీర్... సోలో ట్రావెలర్... వ్యాపారవేత్త... ఇలా చాలా ప్రత్యేకతలే ఉన్నాయామెకు. 'ఝుమ్మందినాదం'తో తెలుగుతెరపై తళుక్కుమని... అమితాబ్ సరసన పింక్ సినిమాతో తనేంటో చాటుకుంది. తాజాగా 'ఆనందో బ్రహ్మ' తో మరోసారి మన ముందుకు వచ్చిన తాప్సీ.. తన అభిరుచులూ.. ఆసక్తుల్ని మనతో పంచుకుంటోంది..



ఒకేసారి చూడలేదు...

ఆనందోబ్రహ్మ హారర్ కామెడీ చిత్రం అయినా.. నాకు మాత్రం దెయ్యాలంటే భయమే. ఉన్నాయనీ నమ్ముతాను. చాలా రోజుల తరవాత తెలుగులో చేసిన సినిమా ఇది. నిజానికి దీనిలో భయపడటం కంటే హాస్యమే ఎక్కువగా ఉంటుంది. ఈ సినిమాను ఏం చూసి ఎంచుకున్నారు.. .అని చాలామంది అడిగారు. వైవిధ్యమైన కథ అని చెప్పా. నా నిర్ణయం పొరపాటు కాలేదు. ఇప్పుడు అదే నాకు గుర్తింపు తెచ్చింది. దీనికి ముందు గంగలో నటించా. అది పూర్తిగా హారర్. అందుకే అది విడుదలయ్యాక చూడనని లారెన్స్‌గారికి ముందే చెప్పా. కానీ ఆయన ఒప్పుకోలేదు. 'నువ్వు నటించిన సినిమాని చూడనంటే ఎలా?' అన్నారు. అందుకే పూర్తి సినిమా ఒకేసారి కాకుండా చిన్న చిన్న సన్నివేశాలుగా విభజించుకుని చూశాను. చిన్నప్పుడు మా ఇంటికి దగ్గర్లోని ఓ చెట్టు కింద, పాత బంగళాలో దెయ్యాలున్నాయంటే పొరపాటున కూడా అటువైపుకి వెళ్లేదాన్ని కాదు. ముంబయిలో ఉన్నప్పుడు కొందరు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో దెయ్యాలున్నాయనేవారు. దాంతో ఎప్పుడయినా అక్కడ దిగాలంటే ఆలోచించేదాన్ని. .కానీ నాకెప్పుడూ కనిపించలేదు మరి.

సాంకేతికత ఇష్టమే...

మారుతున్న కాలంతో పాటు మనమూ మారాల్సి ఉంటుంది. అందుకే సాంకేతికత విషయంలో ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుంటా. నాకు నచ్చే గాడ్జెట్ అంటే కెమెరానే. తరచూ దాన్ని మారుస్తుంటా. ప్రస్తుతం నా దగ్గర గోప్రో హీరో కెమెరా ఉంది. నేనెక్కడికి వెళ్లినా అది నా వెంట ఉండాల్సిందే. తరచూ ప్రయాణాలు చేస్తుంటా. కొన్నిసార్లు ఒంటరిగానూ వెళ్తుంటా. అలాంటప్పుడు మాత్రం కెమెరా కాకుండా.. ఫోనుతో సెల్ఫీదిగేందుకు ప్రాధాన్యం ఇస్తా. కెమెరాలానే ఫోన్లు, ల్యాప్‌టాప్‌లో కొత్త సాఫ్ట్‌వేర్లను అప్‌డేట్ చేసుకోవడంలోనూ ముందుంటాను. ఎక్కువగా ప్రయాణాలూ, ఆహారానికి సంబంధించిన యాప్‌లను వాడుతుంటా. ఆ రెండూ నాకిష్టమైన విషయాలు కాబట్టి వాటికే ప్రాధాన్యం ఇస్తా. ఇక నా ట్విట్టర్, ఫేస్‌బుక్ ఖాతాలను ఏజెన్సీలకు ఇవ్వకుండా నేను సొంతంగా చూసుకుంటా. అది తెలియడానికి వీలుగా తరచూ ఏదో ఒక ఫోటో కానీ, ట్వీట్ కానీ చేస్తుంటా. అభిమానులకు కూడా స్వయంగా నాతో మాట్లాడుతున్నాననే భావన ఉంటుంది కదా.

అక్కడి నుంచి దూకేశా...

బాల్యం ఎప్పటికీ మధురమే. పైగా నేను చిన్నప్పటినుంచీ చురుకే. ఎప్పుడూ బయటికెళ్లి ఆడుకోవడానికే ఆసక్తి చూపించేదాన్ని. ఎప్పుడూ బయటికెళ్లి ఆడుకోవడమే నాపని. ఉదయం ఏడింటికి బయటికి వెళ్తే రాత్రి పదైనా ఆడుకుంటూనే ఉండేదాన్ని. మధ్యలో తినడానికి లేదంటే పడుకోవడానికి మాత్రమే ఇంటికొచ్చేదాన్ని. ఒకసారి మా అమ్మావాళ్లు నన్ను ఒక్కదాన్నే ఇంట్లో ఉంచి తాళం వేసి ఏదో పనిమీద బయటకు వెళ్లారు. కిటికీలోంచి కిందకు చూస్తే మా స్నేహితులంతా ఆడుకుంటున్నారు. మా పేరెంట్స్ వచ్చేదాకా ఆగలేక మొదటి అంతస్తు నుంచి కిందకు దూకేశాను. దెబ్బలేమీ తగల్లేదనుకోండి. కానీ విషయం తెలిసి.. అమ్మ నన్ను కొట్టినంత పనిచేసింది.

వ్యాయామం కోసం స్క్వాష్...

నాకు జిమ్‌కు వెళ్లడమంటే చాలా చిరాకు. అక్కడ అదేపనిగా ట్రెడ్‌మిల్‌పై వ్యాయామం చేయడం అంటే విసుగు. పైగా చేయడం అన్నా బోరే. అయితే అందరూ వెళ్లమన్నారని నేను కూడా మూడు నెలలు జిమ్‌కు వెళ్లడానికి ప్రయత్నించాను. కానీ నావల్ల కాలేదు. చిన్నప్పుడు ఆటలాడటం వల్ల చాలా సన్నగా ఉండేదాన్నన్నే విషయం గుర్తొచ్చింది. అందుకే ఇప్పుడు కూడా ఆ ఆటల్నే వ్యాయామంగా ఎంచుకున్నా. దాదాపు రెండున్నర సంవత్సరాల నుంచి స్క్వాష్ ఆడుతున్నాను. అది నాకు చాలా నచ్చింది. అది కాస్త కష్టమైన ఆట కూడా. దాంతో పదిరోజుల్లోనే మార్పు వచ్చింది. ఇప్పుడు సన్నగా ఉండేందుకు ఏం చేస్తానో తెలుసా.. రోజూ గంటసేపు స్క్వాష్ ఆడతా. మరీ తప్పనిసరి అనుకుంటే.. చిన్న చిన్న వ్యాయామాలకోసం జిమ్‌కి వెళ్తా. అయితే అందరూ స్క్వాషే ఆడాలని లేదు. నచ్చిందీ.. వాళ్లకు సరిపోయే క్రీడను ఎంచుకోవచ్చు.

అందంగా కనిపించేందుకు...

ఆనందంగా ఉంటాను. ఎంత ఖరీదైన క్రీంలు వాడినా, ఫేషియల్స్ చేయించుకున్నా ఆనందంగా లేకపోతే అందంగా కనిపించలేరని నా నమ్మకం. అలాగే అందంగా ఉన్నామని మనసులో మనం అనుకుంటే అలాగే కనిపిస్తామనేది నా అభిప్రాయం. అయితే నటిగా మేకప్ తప్పనిసరిగా వేసుకుంటా. సినిమా చూడటానికి జనం డబ్బులు ఖర్చుపెడతారు కాబట్టి పాత్రకు తగినట్లుగా దుస్తులూ, అలంకరణ, హెయిర్‌స్టయిల్‌కి ప్రాధాన్యం ఇస్తా. ఈ విషయంలో నా కజిన్ దీప్తి నాకు సహాయం చేస్తుంది.

రోడ్డుపక్కన ఆహారం..

నేను భోజన ప్రియురాలిని. ఏ ప్రాంతానికి వెళ్లినా.. ముందు కొత్త రుచుల్ని చూస్తాను. చిన్నప్పటి నుంచీ దిల్లీలో పెరగడం వల్లేనేమో నాకు మొదటి నుంచీ అక్కడి రోడ్డుపక్కన ఉండే ఆహారం అంటే భలే ఇష్టం. గోల్‌గప్పా, చోలేబతూరే, టిక్కీ.. ఇలాంటివి ఇంకా చాలా ఉన్నాయి. ఇంట్లో అమ్మచేతి రుచులకు మాత్రం ఎప్పుడూ ఫిదానే. సహజంగా మసాలా ఎక్కువగా ఉండే ఆహారమే ఎక్కువగా తింటా. ఈ మధ్య ఎక్కడో చదివా. ప్రపంచంలోనే అత్యధిక జీవితం కాలం జపనీయులదేనని. వాళ్లేం తింటారో తెలుసుకునే ప్రయత్నం చేశా. ఇప్పుడు వాటికి ప్రాధాన్యం ఇస్తున్నా. ముఖ్యంగా సూషిని ఎక్కువగా తీసుకుంటున్నా. **– స్వాతి కొరపాటి**

మీన్ పొల్లిచట్టు

కావల్సినవి: శుభ్రం చేసిన చేప ముక్కలు - నాలుగు, పసుపు, మిరియాలపొడి - పావు చెంచా చొప్పున, ఉల్లిపాయ ముక్కలు - అరకప్పు, అల్లం తరుగు - రెండున్నర పెద్ద చెంచాలు, వెల్లుల్లి తరుగు - రెండు చెంచాలు, పచ్చిమిర్చి - రెండు, కారం - రెండు చెంచాలు, ధనియాలపొడి - ఒకటిన్నర చెంచా, టొమాటో - ఒకటి, కొబ్బరిపాలు - పావుకప్పు, ఉప్పు - తగినంత, కొబ్బరినూనె - అరకప్పు, అరటిఆకు - ఒకటి పెద్దది, కరివేపాకు రెబ్బలు - రెండు.



తయారీ: చేప ముక్కలపై పసుపూ, మిరియాలపొడీ, తగినంత ఉప్పు వేసి బాగా కలిపి పెట్టుకోవాలి. తరవాత బాణలిలో పావుకప్పు నూనె వేసి ఈ ముక్కల్ని వేయించి తీసుకోవాలి. అదే బాణలిలో మిగిలిన నూనె వేసి ఉల్లిపాయ ముక్కలు వేయించుకోవాలి. అవి ఎర్రగా మారాక అల్లం, వెల్లులి, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించుకోవాలి. రెండు మూడు నిమిషాల తరవాత కారం, ధనియాలపొడీ, కాసిని వేడినీళ్లూ... టొమాటో ముక్కలూ, కరివేపాకు వేసి వేయించుకోవాలి. అవి బాగా వేగాక కొబ్బరిపాలు పోసి.. కూరలా అయ్యాక దింపేయాలి. ఇప్పుడు అరటాకుని నాలుగు ముక్కల్లా కోయాలి. ఒకదానిపై ముందుగా కొద్దిగా మసాలా పరిచి.. చేప ముక్కను ఉంచి మరికొంచెం మసాలా వేయాలి. ఆ అరిటాకును పొట్లంలా మడిచి.. దారం చుట్టేయాలి. ఇలాగే మిగిలిన ముక్కలూ చేసుకోవాలి. వీటిని పెనంపై ఉంచి.. మిగిలిన నూనె వేస్తూ కాల్చుకుని తీసుకోవాలి.

వాళ్లలా కనిపించాలంటే.. ఏం చేయాలి?

డియర్ వసుంధర



ధన్యా గుత్తా డిజైనర్

? నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. ఈ మధ్యే ఉద్యోగంలో చేరాను. నాకు కేవలం సంప్రదాయ దుస్తులు వేసుకోవడం అంటేనే ఇష్టం. ఆఫీసులో అందరికన్నా నేనే భిన్నంగా ఉన్నట్టుగా అనిపిస్తోంది. సంప్రదాయంగానే ఉండి, చూడటానికి కాస్త ట్రెండీగా కనిపించాలంటే ఏం మార్పులు చేసుకోవాలి? -సహస్ర, హైదరాబాద్

✔ నిజమే చాలామంది అమ్మాయిలు మీలాంటి సమస్యతో ఇబ్బంది పడుతుంటారు. దానికి కారణం మనం పెరిగిన వాతావరణం కావొచ్చు. అయితే సంప్రదాయాన్ని కాదనుకోకుండా ఆధునికంగానూ కనిపించాలనుకునే మీ ఆలోచన బాగుంది. జీన్స్‌ల వంటివి ఎంచుకునేప్పుడు వాటిమీదకు మరీ పొట్టిగా ఉండే టాప్‌లు కాకుండా మోకాళ్ల వరకూ ఉండేవీ.... నడుము కింది భాగాన్ని కప్పి ఉంచే తరహావి ఎంచుకోవచ్చు. అలానే కుర్తీలూ జీన్స్‌ల మీదకు బాగుంటాయి. ఇప్పుడు నేలవరకూ ఉండే ఫ్లోర్‌లెంగ్త్, పిక్కలవరకూ ఉండే టాప్‌లనూ జీన్స్‌ల మీదకు ఎంచుకుంటున్నారు. కాబట్టి మీరూ ప్రయత్నించొచ్చు. చేతుల్లేని టాప్‌లు(స్లీవ్‌లెస్) ప్రయత్నిస్తున్నప్పుడు పైన జాకెట్ లేదంటే కేప్ జతచేసుకుంటే అద్భుతంగా కనిపిస్తారు. పలాజోల ఎంపిక కూడా కాస్త ప్రత్యేకంగా కనిపించేలా చేస్తుంది. దీన్ని మోకాలివరకూ లేదా పిక్కలదాకా ఉండే టాప్‌లకు జతగా వేసుకుంటే ఆధునికంగా కనిపించొచ్చు. అదే చీరకట్టు అయితే చేనేతలో ఇకత్, పోచంపల్లి, గద్వాల్ వంటివి ఎంచుకుని వాటి మీదకు ఆధునికంగా బ్లవుజుల్ని డిజైన్ చేయించుకుంటే అటు సంప్రదాయంగానూ, ఇటు ఆధునికంగానూ కూడా ఉండొచ్చు. ప్రయత్నించి చూడండి.

బంగారం-వెండి



26న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	30,150	30,100
ఆర్నమెంట్	-------	-------	27,800	27,800
వెండి (కిలో)	-------	-------	40,200	40,200

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	29,900	29,900	29,670	29,570
ఆర్నమెంట్	27,680	27,680	27,740	27,640
వెండి (కిలో)	40,000	40,100	39,100	39,000

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	30,070	29,990	-------	-------
ఆర్నమెంట్	27,660	27,590	2,774	2,764 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	41.70	41.70 గ్రా

తులసి... ఆరోగ్యప్రదాయిని



తులసిని చాలా మంది పవిత్రంగా పూజిస్తారు. తులసి ఆకుల్లో ఔషధ గుణాలూ ఎక్కువగా ఉంటాయి. అసలు ఆ ఆకుల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటుందో చూద్దామా.

రోజుకో తులసి ఆకు తీసుకోవడం వల్ల రక్తం శుభ్రపడుతుంది. దాంతో చర్మం ప్రకాశమంతంగా మారుతుంది. తులసిలో ఉండే యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మచ్చలను తొలిగించి చర్మాన్ని మెరిపిస్తాయి.

- ఎండిన తులసి ఆకుల పొడితో పళ్లు తోముకుంటే నోటి దుర్వాసన తగ్గడమే కాకుండా చిగుళ్ల సమస్యలూ దూరమవుతాయి.
- జలుబూ, దగ్గుతో బాధపడుతున్నప్పుడు వాటికి సంబంధించిన మాత్రలే వేసుకోవాలని లేదు. అలాంటి సమస్యలు ఉన్నప్పుడు పరగడుపున కొన్ని పచ్చి తులసి ఆకులను బుగ్గన పెట్టుకుని రసం మింగడం వల్ల పరిష్కారం దొరుకుతుంది.
- గొంతు నొప్పా... గ్లాసు నీటిలో గుప్పెడు తులసి ఆకులను వేసి బాగా మరిగించాలి. ఆ నీటిని చల్లార్చి వడ కట్టుకుని ఓ సీసాలో భద్రపరచుకోండి. ఈ నీటితో పుక్కిలించాలి. అలాగే గంటకోసారి ఈ నీటిని తాగితే గొంతుకు ఉపశమనం లభిస్తుంది.
- రెండు పెద్ద చెంచాల బెల్లం తరుగూ, కొన్ని తులసి ఆకులూ కలిపి మిక్సీలో మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమానికి కప్పున్నర నీరు కలిపి బాగా మరిగించాలి. తరవాత వడకట్టి నిమ్మరసం పిండి గోరువెచ్చగా తాగాలి. ఇది హెర్బల్‌టీలా పనిచేస్తుంది.

అలసట తీరి... హాయిగా!

ఆఫీస్‌లో గంటలు గంటలు కూర్చుని పనిచేశాక శరీరం అంతా పట్టేసినట్టుగా ఉంటుంది. ఇంటికెళ్లిన తర్వాత మరే పని చేయబుద్ధి కాదు. ముఖ్యంగా చాలామందిలో నడుం కింది భాగం పట్టేసినట్టుగా ఉంటుంది. అలా కాకుండా కేవలం ఓ పదిహేను నిమిషాల పాటూ ఈ వ్యాయామాలు చేస్తే చాలు.. ఉపశమనం లభిస్తుంది. ఇంటికెళ్లిన తర్వాత కూడా చురుగ్గా ఉండగలుగుతాం..



వెల్లకిలా పడుకుని గాలిని లోపలికి పీల్చుకుంటూ రెండు కాళ్లను మడిచి అరిపాదాలను రెండింటినీ కుర్చీ అంచులకు ఆనించాలి. ఇప్పుడు కాళ్లను నెమ్మదిగా పైకి లేపుతూ పొట్ట దగ్గరగా తీసుకురావాలి. రెండు చేతులతో మోకాళ్ల చుట్టూ బంధించి ఉంచాలి. చిత్రంలో చూపినవిధంగా అరనిమిషం ఉండాలి. ఇలా చేయడం వల్ల నడుము కిందిభాగానికి రక్తప్రసరణ పెరిగి.. ఒత్తిడి తగ్గుతుంది.



ఈ వ్యాయామాల కోసం ఓ కుర్చీని దగ్గర పెట్టుకోవాలి. వెల్లకిలా పడుకుని ఎడమ కాలిని కుర్చీకి ఆన్చి కుడి కాలిని ఫొటోలో చూపిన విధంగా ఎడమ మోకాలిపై ఉంచాలి. రెండు చేతులతో ఎడమకాలి తొడను పట్టుకోవాలి. ఇదేవిధంగా కుడికాలితోనూ చేయాలి. నడుం కింది భాగాలకు రక్త ప్రసరణ బాగా జరిగి పట్టేసిన కండరాలు విశ్రాంతి పొందుతాయి.

వెల్లకిలా పడుకుని కాళ్లను నిటారుగా చాపాలి. ఇప్పుడు ఎడమ కాలిని నెమ్మదిగా పైకి లేపుతూ కుడికాలి తొడపై నుంచి తీసుకురావాలి. అరనిమిషం పాటూ ఉన్న తర్వాత మళ్లీ కుడికాలితో ఇలా ప్రయత్నించాలి. ఇలా కాళ్లు మార్చి మార్చి.. నాలుగైదుసార్లు చేయాలి. శరీరం తేలికపడి అన్ని పనులు చురుగ్గా చేయగలుగుతాం.





డాక్టర్ మణిపవిత్ర
యోగా నిపుణురాలు
✆ 7702491110

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.26	67.56	ఆస్ట్రేలియా డాలరు	46.22	53.48	కువైట్ దీనార్	175.43	218.45
పౌండ్ స్టెర్లింగ్	75.07	87.08	సింగపూర్ డాలరు	42.96	50.90	ఒమన్ రియాల్	154.47	176.77
యూరో	69.47	80.58	థాయ్ బాత్/100	175.24	209.58	సౌదీ రియాల్	15.49	18.36
జపనీస్ యెన్/100	53.27	61.79	బ్రెహెయిన్ దీనార్	157.87	180.82	యూఏఈ దిర్హమ్	15.86	18.54

ఈనాడు బిజినెస్ వారాంతం



కోడిగుడ్లు

26వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా (ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
27న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

డాక్టర్ రెడ్డీస్‌పై రోసెన్ లా కేసు

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్‌పై అమెరికాకు చెందిన అంతర్జాతీయ న్యాయ సంస్థ 'రోసెన్ లా' క్లాస్ యాక్షన్ కేసును దాఖలు చేసింది. మదుపర్ల హక్కులను కాపాడేందుకు రోసెన్ పని చేస్తోంది. డాక్టర్ రెడ్డీస్ సెక్యూరిటీలు న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన విషయం తెలిసిందే. 2015, జూన్ 17 నుంచి 2017, ఆగస్టు 10 మధ్య డాక్టర్ రెడ్డీస్ షేర్లను కొనుగోలు చేసిన మదుపర్ల తరపున క్లాస్ యాక్షన్ కేసును దాఖలు చేసినట్లు రోసెన్ లా క్లాస్ వెల్లడించింది. కంపెనీ సరైన సమాచారం ఇవ్వని కారణంగా డాక్టర్ రెడ్డీస్ షేర్లను కొనుగోలు చేసి నష్టపోయిన మదుపర్లకు ఫెడరల్ సెక్యూరిటీస్ చట్టాల ప్రకారం నష్టపరిహారం ఇప్పించేందుకు ఈ కేసును దాఖలు చేసినట్లు తెలిపింది. ఒకే అంశంపై ఎక్కువ మంది తరపున ఒకరు లేదా కొంత మంది దాఖలు చేసే కేసును క్లాస్ యాక్షన్ కేసు అంటారు. డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన విశాఖ సమీపంలోని దువ్వాడలో ఫార్ములేషన్ల యూనిట్, శ్రీకాకుళం, మిర్యాలగూడల్లోని ఏపీఐ యూనిట్లకు 2015, నవంబరులో యూఎస్ఎఫ్‌డీఏ హెచ్చరిక లేఖలను జారీ చేసింది. హైదరాబాద్ బాచుపల్లిలోని ఫార్ములేషన్ల యూనిట్‌కు జర్మనీ ఔషధ నియంత్రణ సంస్థ మంచి తయారీ విధానాల (జీఎంపీ) ధ్రువీకరణ పత్రాన్ని పునరుద్ధరించలేదని ఆగస్టు 10, 2017న కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఈ యూనిట్‌పై జర్మనీ నియంత్రణ సంస్థ గతంలో నాన్ కాంప్లియన్స్ నోటీసు జారీ చేసిందని, ఇటీవల తనిఖీలు నిర్వహించిన అనంతరం ధ్రువీకరణను పునరుద్ధరించలేదని డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. ఈ నేపథ్యంలో కంపెనీ మదుపర్లకు సరైన సమాచారం అందించలేదని క్లాస్ యాక్షన్ కేసులు దాఖలు చేయడానికి ఉన్న అంశాలను పరిశీలిస్తున్నామని ఇటీవల పలు న్యాయ సంస్థలు వెల్లడించాయి.

ఔత్సాహిక మహిళలకు ఫ్లో 'స్వయం' సేవలు

ఈనాడు, హైదరాబాద్: మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి, అంకుర కంపెనీల ఏర్పాటులో వారికి అన్ని విధాలా సహకరించడానికి ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో), హైదరాబాద్ చాప్టర్ 'స్వయం' పేరుతో ఒక వేదికను కల్పించనుంది. చిన్న ఆలోచన ఉన్నా దాన్ని కార్యరూపంలోకి మార్చడానికి ఆర్థిక, న్యాయ, మార్కెటింగ్ పరమైన సలహాలు, సూచనలు, మార్గదర్శనాన్ని మహిళలు ఈ వేదిక ద్వారా పొందవచ్చని ఫ్లో హైదరాబాద్ చాప్టర్ ఛైర్‌పర్సన్ కామిని సరాఫ్ తెలిపారు. 'స్వయం' కార్యక్రమాన్ని ఫ్లో దేశ వ్యాప్తంగా రెండేళ్ల నుంచి అమలు చేస్తోంది. అయితే.. ఇప్పటి వరకూ దీని ద్వారా ఫ్లో సభ్యులకు మాత్రమే సేవలు అందిస్తోంది. కేవలం ఫ్లో ప్రధాన కార్యాలయంలోనే దరఖాస్తులను ప్రాసెస్ చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్ చాప్టర్‌లోనే ప్రత్యేకంగా నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసి చిన్న ఆలోచన నుంచి మహిళలు ఒక అంకుర కంపెనీని ఏర్పాటు చేసుకునే వరకూ సలహాలు ఇవ్వనున్నామని సరాఫ్ వివరించారు. సభ్యులు కాని వారు కూడా ఈ సేవలను వినియోగించుకోవచ్చని చెప్పారు. 'స్వయం'పై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు.

రూ.5000 కోట్ల ఎఫ్‌డీఐ ప్రతిపాదనలకు పచ్చ జెండా

దిల్లీ: అమెజాన్ రిటైల్ ఇండియా సహా 9 విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రతిపాదనలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వీటి విలువ దాదాపు రూ.5000 కోట్లు. పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగానికి (డీఐపీపీ) చెందిన విదేశీ పెట్టుబడుల పోర్టల్ ప్రకారం.. బీసీపీ అడ్వైజర్స్, ఏవియో రియల్ ఎస్టేట్ హోల్డింగ్‌ల ప్రతిపాదనలతో పాటు నాలుగు తిరస్కరణకు గురయ్యాయి. భారత్‌లో 100 శాతం ఎఫ్‌డీఐతో అనుబంధ సంస్థను ఏర్పాటు చేయడానికి రూ.3,500 కోట్ల విలువైన పెట్టుబడుల ప్రతిపాదనకు ఆమోదం లభించింది. వీటితో రిటైల్ ఉత్పత్తుల తయారీ వ్యాపారంపై అమెజాన్ దృష్టి పెట్టనుంది. ఇక ఆహార రిటైల్ వ్యాపారంలో రూ.105 కోట్లు పెట్టేందుకు సూపర్‌మార్ట్ గ్రోసెరీ ప్రతిపాదించింది. వచ్చే 18 నెలల్లో రూ.800- 1000 కోట్ల నిధులు సమీకరిస్తామని వెల్లడించింది.

డీఎల్ఎఫ్ సైబర్ సిటీలో ప్రమోటర్ల వాటా విక్రయం!

విలువ రూ.11,900 కోట్లు

దిల్లీ: డీఎల్ఎఫ్ సైబర్ సిటీ డెవలపర్స్ (డీసీసీడీఎల్)లో మొత్తం 40% వాటాను సింగపూర్ ప్రభుత్వ సంస్థ జీఐసీకి డీఎల్ఎఫ్ ప్రమోటర్లు విక్రయించనున్నారు. దీని విలువ రూ.11,900 కోట్లు. డీసీసీడీఎల్‌లో ప్రమోటర్లు అయిన కేపీ సింగ్, కుటుంబానికి ఉన్న 33.34% వాటాను రూ.8,900 కోట్లకు అమ్మనున్నారు. మిగిలిన వాటాను డీసీసీడీఎల్ రూ.3,000 కోట్లకు తిరిగి కొనుగోలు చేయనుంది. ఈ లావాదేవీలో పన్నులు పోనూ.. డీఎల్ఎఫ్ ప్రమోటర్లకు రూ.10,000 కోట్లకు పైగా దక్కే అవకాశం ఉంది. డీఎల్ఎఫ్ రుణ భారం దాదాపు రూ.26,000 కోట్లకు చేరడంతో.. ఈ మొత్తాన్ని ఇందులో పెట్టుబడిగా పెట్టనున్నట్లు అంచనా. జీఐసీతో ఒప్పందం, షేర్ల కొనుగోలుకు తమ బోర్డు ఆమోదం తెలిపిందని డీఎల్ఎఫ్ వెల్లడించింది.

అప్పుడు 26 ఇప్పుడు 62



- ఇన్ఫీలో అలా అడుగు పెట్టా
- మూర్తితో బంధం బలోపేతం చేస్తా
- వాటాదార్లంతా అదే కోరుకుంటున్నారు
- అక్టోబరు కల్లా కంపెనీ వ్యూహాలపై నివేదిక
- దేశ, విదేశాల్లో కొత్త సీఈఓ అన్వేషణ
- ఇన్ఫోసిస్ కొత్త ఛైర్మన్ నందన్ నీలేకని

దిల్లీ

సాధారణంగా అరవై ఏళ్లలో ఎవరైనా పదవీ విరమణ చేసి విశ్రాంతి తీసుకుంటారు. అయితే అది నీలేకని విషయంలో కాదు. 62 ఏళ్ల వయసులో ఇపుడు ఇన్ఫోసిస్‌ను తిరిగి నిలబెట్టడానికి ఛైర్మన్‌గా పగ్గాలు స్వీకరించారు. మూడు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన కంపెనీకి తిరిగి రావడం చూస్తే జీవితంలో మళ్లీ వెనక్కి వెళ్లి చూసుకున్నట్లు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ '26 ఏళ్ల వయసులో నేను ఇన్ఫోసిస్‌లో చేరా.. ఇపుడు 62 ఏళ్ల వయసులో తిరిగి చేరా. కాలచక్రం గిర్రున తిరిగినట్లుంది' అని ట్వీట్ చేశారు. మరో పక్క, ఛైర్మన్‌గా పగ్గాలు స్వీకరించాక మదుపర్లతో జరిగిన తొలి కాన్ఫరెన్స్ కాల్‌లో వివిధ అంశాలపై నీలేకని ఏమన్నారంటే..

ఇన్ఫీని మరమ్మతు చేస్తా: మదుపర్ల, ఉద్యోగుల ఆందోళనలను తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటాను. ముఖ్యంగా దీర్ఘకాలంలో కంపెనీలో కార్పొరేట్ పాలనను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. మూర్తితో అనుబంధాలనూ బలోపేతం చేసుకోవాలి. కంపెనీ బోర్డుకు, ఆయనకు మధ్య విభేదాలు నిజంగా దురదృష్టకరం. అందరు వాటాదార్లను ఒకేతాటిపైకి తీసుకురావడమే నా తొలి ప్రాధాన్యం. వారు బోర్డు సభ్యులు కావొచ్చు.. మదుపర్లూ కావొచ్చు. సీఈఓ నియామక ప్రక్రియను తక్షణం చేపట్టడానికి రెండో ప్రాధాన్యతనిస్తాను. బోర్డులో కార్పొరేట్ పాలన, కంపెనీ వ్యూహాలపై అక్టోబరు కల్లా నివేదికనివ్వాలని డైరెక్టర్ల కమిటీని కోరుతున్నా. భవిష్యత్ వ్యూహాలను పూర్తిగా మార్చివేయనున్నాం. అదే సమయంలో ఇన్ఫోసిస్‌లో కార్పొరేట్ పాలనపై స్పందన ఇవ్వాల్సిందిగా.. చిన్న నుంచి పెద్ద స్థాయి మదుపర్లందరినీ కోరతాను.

మూర్తితో బంధం ముఖ్యం: మూర్తితో బంధం ముఖ్యమని 100 శాతం మంది వాటాదార్లు కోరుకుంటున్నారు. ఇతర వ్యవస్థాపకులతోనూ ఆరోగ్యకరమైన అనుబంధాన్ని కొనసాగించాల్సి ఉంది. సీఈఓ కోసం అంతర్గత, అంతర్జాతీయ స్థాయిలో అన్వేషణ ఉంటుంది. ఇక ఇన్ఫోసిస్‌కు తిరిగి రావడం కూడా ఒక లాంటి దేశసేవేనని నేను భావిస్తా. మూర్తి ఓ గొప్ప దార్శనికుడు. ఆయన కంపెనీలో కార్పొరేట్ పాలన విషయంలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పారు. కంపెనీ వివరాలను బయటకు వెల్లడించడం ద్వారా పారదర్శకతను తీసుకొచ్చారు. ఆ పాత ప్రాభవం తిరిగి వచ్చేలా కృషి చేస్తా. ఏకాభిప్రాయాన్ని తీసుకురావడంలో నాకున్న నైపుణ్యాలను ప్రదర్శిస్తా.

నీలేకనికి స్వాగతం

ఇన్ఫీకి నీలేకని తిరిగి రావడాన్ని స్వాగతిస్తూ ఐటీ మంత్రి రవి శంకర్ ప్రసాద్, టెక్ మహీంద్రా ఎండీ, సీఈఓ సీపీ గుర్నానీ, మహీంద్రా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, పర్సిస్టెంట్ సిస్టమ్స్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మృత్యుంజయ్ సింగ్‌లు ట్వీట్ చేశారు.

ఆయనొచ్చాక నేనుండడం సరికాదు: సిక్కా

నందన్ వచ్చిన నేపథ్యంలో నేనుండడం సరికాదు. తక్షణం నేను వైదొలగుతున్నానని శుక్రవారం విశాల్ సిక్కా ఓ ఆంగ్ల ఛానెల్‌తో అన్నారు. 'కంపెనీ వ్యూహాత్మక చర్యల్లో ఎలాంటి మార్పు ఉండదనే నేను అనుకుంటున్నా. యు.బి. ప్రవీణ్ రావు.. ఆ వ్యూహంలో చురుగ్గా పాల్గొంటున్నారు కూడా' అని ఆయన అన్నారు. వివాదం విషయంలో మూర్తితో మాట్లాడతారా అన్న ప్రశ్నకు సమాధానంగా 'మూర్తికి వ్యతిరేకంగా నేను ఎటువంటి వ్యాఖ్యలూ చేయలేదు. ఎవరు నాపై ఆరోపణలు చేశారో నాకు తెలియద'ని పేర్కొనడం గమనార్హం.

హెచ్‌పీకి వెళ్లడం లేదు: 'హ్యూలెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజెస్(హెచ్‌పీఈ)కి సీటీఓగా వెళుతున్నానన్న వార్తల్లో నిజం లేదు. నేను ప్రస్తుతం కుటుంబంతో ఎక్కువ సమయం గడపడానికి కేటాయిస్తాను' అని సిక్కా అన్నారు.

సీఈఓ రేసులో వీరు

ఇన్ఫోసిస్ సీఈఓ రేసులో ప్రస్తుత తాత్కాలిక సీఈఓ యు.బి. ప్రవీణ్ రావు, సీఎఫ్ఓ రంగనాథ్, ప్రెసిడెంట్, డిప్యూటీ సీఓఓ రవి కుమార్ ఎస్, బీఎఫ్ఎస్ఐ విభాగ అధిపతి మోహిత్ జోషిలున్నారని వార్తలు వస్తున్నాయి. ఇంకా వి. బాలకృష్ణన్(ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ), మోహన్‌దాస్ పాయ్(మాజీ సీఎఫ్ఓ) అశోక్ వేమూరి(మాజీ బోర్డు సభ్యుడు), బి.జి. శ్రీనివాస్(మాజీ ప్రెసిడెంట్)లు కూడా సీఈఓ రేసులో ఉన్నారని అధికార వర్గాల సమాచారం. కిరణ్ మజుందార్ షాలాంటి అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలోని నామినేషన్స్ కమిటీ ఇన్ఫీ సీఈఓ ఎవరనేది తేల్చనుంది. అదే సమయంలో నియామక సంస్థ ఎగాన్ జెండర్‌ను సైతం నియమించుకుంది. ఈ కంపెనీ ఇన్ఫోసిస్‌లోని నామినేషన్స్ కమిటీతో కలిసి పనిచేస్తుంది.

రూ.8.5 లక్షల కోట్లు

2017-18లో పెరిగిన మదుపర్ల సంపద మొత్తమిది

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో ఇప్పటి వరకు మదుపర్ల సంపద రూ.8.5 లక్షల కోట్లు పెరిగింది. సానుకూల సెంటిమెంట్ ఇందుకు దోహదపడింది. సెన్సెక్స్ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా 1,975.66 పాయింట్లు (6.66 శాతం) దూసుకెళ్లి 31,596.06 పాయింట్లకు చేరింది. ఆగస్టు 2న సూచీ జీవన కాల గరిష్ఠమైన 32,686.48 పాయింట్లను తాకింది. దీంతో బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.8,48,738 కోట్లు అధికమై రూ.1,30,03,263 కోట్లకు పెరిగింది. స్టాక్ మార్కెట్లో పలు కొత్త కంపెనీల అరంగేట్రం విజయవంతం కావడం సైతం మదుపర్ల సంపద పెరగడానికి దోహదపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విదేశీ మదుపర్లు దాదాపు రూ.8,696.70 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఇక దేశంలో అత్యంత విలువైన కంపెనీగా ఆర్ఐఎల్ (మార్కెట్ విలువ రూ.5.09 లక్షల కోట్లు) నిలిచింది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్ (రూ.4.77 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.4.54 లక్షల కోట్లు), ఐటీసీ (రూ.3.42 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ (రూ.2.79 లక్షల కోట్లు)లు నిలిచాయి.

దక్షిణ కొరియా పసిడి దిగుమతులపై ఆంక్షలు

దిల్లీ: దక్షిణ కొరియా నుంచి దిగుమతి అయ్యే పసిడి, వెండి ఉత్పత్తులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఇకపై దక్షిణ కొరియా నుంచి పసిడి, వెండి దిగుమతి చేసుకోవాలంటే విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ (డీజీఎఫ్‌టీ) నుంచి లైసెన్సును తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. దక్షిణ కొరియా నుంచి వచ్చే ఈ దిగుమతుల వృద్ధి గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఆంక్షలు విధించింది. 2010 జనవరి నుంచి దక్షిణ కొరియాతో భారత్‌కు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఉంది. ఇందులో భాగంగా పసిడిపై సాధారణ కస్టమ్స్ సుంకం నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ ఏడాది జులై 1 నుంచి ఆగస్టు 3 మధ్య దక్షిణ కొరియా నుంచి వచ్చే పసిడి దిగుమతులు 338.6 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.2200 కోట్లు)కు దూసుకెళ్లాయి. 2016-17లో ఈ దిగుమతులు కేవలం 70.46 మి.డా (దాదాపు రూ.460 కోట్లు) మాత్రమే.

తాత..తండ్రి..మనవడు

- అవినీతి కేసుల్లో శామ్‌సంగ్ కుటుంబీకులు
- తాజా దోషి లీ జే యాంగ్‌కు అయిదేళ్ల జైలు

ఎంతటి గొప్ప చరిత్ర కలిగిన కంపెనీ అయినా కొన్ని ఒడుదొడుకులు తప్పవు. దశాబ్దాల చరిత్ర, విశ్వ ప్రఖ్యాతి, అంతులేని సంపద కలిగిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్ కుటుంబం సైతం ఇందుకు మినహాయింపు కాదు. గతంలో తాత, తండ్రి జైలు శిక్ష దరిదాపులకు వెళ్లగా.. మనవడు మాత్రం ఆ గండం గట్టెక్కలేకపోయాడు. తాజాగా అవినీతి ముడుపుల కేసులో శామ్‌సంగ్ వారసుడు లీ జే యాంగ్ అయిదేళ్లపాటు కటాకటాలు లెక్కించబోతున్నాడు. వివరాల్లోకి వెళితే..

సియోల్: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న శామ్‌సంగ్ గ్రూప్ అధిపతి లీ జే యాంగ్‌ను స్థానిక కోర్టు దోషిగా నిర్ధారించింది. అభియోగాలు రుజువు కావడంతో అయిదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే శామ్‌సంగ్‌ను ఈ స్థాయికి తీసుకొచ్చే క్రమంలో ఆయన తాత, తండ్రులు సైతం పలు కేసులు ఎదుర్కొన్నారు. 1996లో లీ తండ్రి కున్ హీ సైతం ఒక లంచం కేసులో దోషిగా తేలారు. పన్ను ఎగవేత, ఇతర నేరాలపై తొమ్మిదేళ్ల కిందట అభియోగాలు ఎదుర్కొన్నప్పటికీ.. కోర్టు వాటిని కొట్టివేసింది. దీంతో ఆయన ఎప్పుడూ జైలు శిక్ష అనుభవించలేదు. ఇదే విధంగా.. 1966లో తన ఎరువుల తయారీ కంపెనీ ద్వారా స్మగ్లింగ్ చేస్తున్న కేసులో లీ తాత పట్టుబడ్డారు. అయితే ఆ సంస్థను దేశానికి దానం చేయడం ద్వారా శిక్షల నుంచి తప్పించుకున్నారు. అయితే మూడో సారి మాత్రం.. లీ కుటుంబం జైలు శిక్షను తప్పించుకోలేకపోయింది. 2014లో తండ్రి లీ కున్ హీకు గుండెపోటు రావడంతో శామ్‌సంగ్ గ్రూప్ పగ్గాలు చేపట్టిన లీ జే యాంగ్ కంపెనీ వృద్ధి కోసం శాయశక్తులా కృషి చేశారు. అయితే ఈ క్రమంలోనే తన తండ్రిని దోషిగా తేల్చిన కోర్టు గదిలోనే లీ జే యాంగ్ సైతం నేరస్థునిగా నిలబడ్డారు. శామ్‌సంగ్‌ను అంతర్జాతీయ శక్తి మలచడంలో లీ తండ్రి కీలకపాత్ర పోషించారు. అయితే మేనేజ్‌మెంట్‌లో తండ్రి వారసత్వాన్ని లీ దొరకబుచ్చుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.

ఇదీ నేపథ్యం: దక్షిణ కొరియా మాజీ అధ్యక్షురాలు పార్క్ గున్ హై, ఆయన స్నేహితుడికి చెందిన సంస్థలకు 38 మిలియన్ డాలర్లు మళ్లించినట్లు శామ్‌సంగ్ ఉపాధ్యక్షుడు లీ జే యాంగ్‌పై ఆరోపణలు ఉన్నాయి. ప్రతిగా శామ్‌సంగ్ గ్రూప్‌లో పట్టు పెంచుకునేందుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించింది. ప్రజల ఆందోళనల నేపథ్యంలో పార్క్ గున్ హై అనూహ్యంగా అభిశంసనకు గురైన తర్వాత చోటుచేసుకున్న వరుస పరిణామాలు.. గత ఫిబ్రవరిలో లీ అరెస్ట్‌కు దారితీసింది. శామ్‌సంగ్ నిధుల దుర్వినియోగం, విదేశీ ఆస్తులను దాచి పెట్టడం, నేరపూర్వక చర్యల ద్వారా లాభాలు ఆర్జించడం వంటి ఆరోపణలపై ఆయన కేసు నమోదైంది. వీటిపై విచారణ చేపట్టిన ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం లీను దోషిగా తేల్చి, అయిదేళ్ల శిక్ష విధించింది. లీ, శామ్‌సంగ్ ప్రతినిధుల వల్ల దక్షిణ కొరియా సమాజం, ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడిందని ఈ సందర్భంగా న్యాయస్థానం పేర్కొంది. రాజకీయ వ్యవస్థ, వ్యాపారవేత్తల మధ్య జరిగిన లావాదేవీ అనైతికమని తెలిపింది. శామ్‌సంగ్ గ్రూప్ నైతికతపై ప్రజల నమ్మకం పోయే అవకాశం ఉందని వెల్లడించింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ కార్యాలయం మాత్రం ఈ తీర్పును స్వాగతించింది.

కంపెనీపై ప్రభావమేంటి?: కోర్టు తీర్పు ద్వారా శామ్‌సంగ్ వ్యాపార కార్యకలాపాలపై తక్షణ ప్రభావం పడకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గెలాక్సీ నోట్ 7 స్మార్ట్‌ఫోన్, లీ అరెస్ట్ కావడం వంటి భారీ సంక్షోభాల నుంచి కంపెనీ విజయవంతంగానే కోలుకుందని అంటున్నారు. అయితే దీర్ఘకాలంలో వృద్ధి ఆధారిత ప్రాంతాల్లో పెట్టుబడులు, ఇతర కంపెనీల కొనుగోళ్లు వంటి కీలక నిర్ణయాలు నిలిచిపోవచ్చని భావిస్తున్నారు. శామ్‌సంగ్ ఒక రాచరిక వ్యవస్థ అని, దీని రాజు తప్పనిసరిగా ఉండాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఒకవేళ లీ జే యాంగ్ తండ్రి లీ కున్ హీ మరణించిన పక్షంలో వారసత్వ తగాదాలు తలెత్తొచ్చని, తద్వారా దీర్ఘకాలంలో శామ్‌సంగ్ గ్రూప్ ఏకఛత్రాధిపత్యం కొనసాగకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. లీ గైర్హాజరు వల్ల శామ్‌సంగ్ ఆధిపత్యం తగ్గితే.. దక్షిణ కొరియా ఆర్థిక వ్యవస్థపై సైతం ప్రతికూల ప్రభావం పడొచ్చని వ్యాపార వర్గాలు అంటున్నాయి.



సియోల్‌లో కోర్టు తీర్పు అనంతరం బయటకు వస్తున్న శామ్‌సంగ్ గ్రూప్ వారసుడు లీ జే యాంగ్

మీ సందేహం ➤ మా సమాధానం ?



సీఏ సతీష్ సరాఫ్

❒ **సరుకు రవాణా ఛార్జీలపై చెల్లించిన రివర్స్ ఛార్జీకి మేం ఎస్‌జీఎస్‌టీ చెల్లించాం. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందే వీలుందా?**

– ప్రసూన వంశీకృష్ణ

రవాణా ఛార్జీలపై చెల్లించిన రివర్స్ ఛార్జీకి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వర్తిస్తుంది.

❒ **జీఎస్‌టీఆర్3బీ ఫారంలో ఈకింది వివరాలు ఎలా పొందుపరచాలి?**

1) ఆర్‌సీఎం, డైరెక్టర్ రెంట్ సర్వీస్
2) ఫ్రైట్ అవుట్‌వర్డ్ పెయిడ్ టు ట్రాన్స్‌పోర్టర్
3) ఫ్రైట్ ఇన్‌వర్డ్ పెయిడ్ టు ట్రాన్స్‌పోర్టర్

– ఎర్రన్న

జీఎస్‌టీఆర్-3బీ ఫారంలో 3.1(డి)లో పై వ్యయాల వివరాలను పొందుపరచాలి.

❒ **మాది గ్రానైట్ పరిశ్రమ. వ్యాట్ ఇన్‌పుట్ క్రెడిట్ కింద రూ.7 లక్షల వరకు ఉంది. ఈ మొత్తం జీఎస్‌టీ కింద సర్దుబాటు అవుతుందా?**

– పొట్నూరు గుప్తా

జీఎస్‌టీలో వ్యాట్ క్రెడిట్‌కు మీరు అర్హులే. అయితే వ్యాట్ క్రెడిట్‌ను ఎస్‌జీఎస్‌టీ కింద సర్దుబాటు చేసేందుకు ఆగస్టు 30 లోగా జీఎస్‌టీ ట్రాన్-1 ఫారంను సమర్పించాలి.

❒ **జీఎస్‌టీలో రివర్స్ ఛార్జీపై మీరు రాసిన వ్యాసం పూర్తిగా చదివాం. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌తో పాటు మిగతా వివరాలు కూడా తెలియజేయగలరు.** – తేజస్విని, అనంతపురం

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ అంశంపై జూన్ 25వ తేదీన వ్యాసం ప్రచురితమైంది. ఆ రోజు పత్రికను చూడండి.

❒ **ముత్తూట్ ఫిన్‌కార్ప్ నుంచి నెలకు రూ.46,000 అద్దె అందుకుంటున్నా. నా అద్దె, వేతన ఆదాయం రూ.20 లక్షల్లోపే ఉందని స్వయం ప్రకటనను అందజేశాను కూడా. అయితే రివర్స్ ఛార్జ్ వ్యవస్థ(ఆర్‌సీఎమ్) ద్వారా నా వాణిజ్య అద్దెపై జీఎస్‌టీ వర్తిస్తుందని అంటున్నారు. జీఎస్‌టీని మినహాయించుకుని.. మిగతా అద్దెను ఇస్తున్నారు. ఇది నిజమేనా? నేను జీఎస్‌టీ కింద నమోదు కావాలా?**

– ఎం. బ్రహ్మయ్య, గుంటూరు

సీజీఎస్‌టీ చట్టంలోని సెక్షన్ 9(4) కింద భవంతి యజమాని జీఎస్‌టీ కింద నమోదు కాని పక్షంలో.. నమోదిత కిరాయిదారు రివర్స్ ఛార్జీపై పన్ను చెల్లించాలి. ఎందుకంటే జీఎస్‌టీ కింద వాణిజ్య అద్దెలపై పన్ను ఉంటుంది. మీ లీజు ఒప్పందం ప్రకారం.. మీకిచ్చే అద్దె పన్నులతో కలిపి ఉంటే.. కిరాయిదారు జీఎస్‌టీని మినహాయించుకుని మీకు మిగతాది ఇస్తారు. లేదంటే మీరు ముందుగా కుదుర్చుకున్న ఒప్పందంలో పన్నులు కూడా కిరాయిదారే చెల్లించాలని ఉండి ఉంటే మాత్రం.. మీకు అద్దెను పూర్తిగా చెల్లించాలి. మీ టర్నోవరు రూ.20 లక్షల్లోపు ఉంది కాబట్టి మీరు నమోదు కానక్కర్లేదు.

❒ **డైరెక్టర్లకు సిట్టింగ్ ఫీజు చెల్లిస్తున్నాం. అద్దె ఆదాయం ఏటా రూ.8 లక్షలు; కార్యకలాపాల ఆదాయం ఏటా రూ.4 లక్షలు వస్తోంది. ఏసీఈఎస్ నుంచి జీఎస్‌టీకి ఇప్పటికే మారాం. మా టర్నోవరు రూ.20 లక్షల్లోపే ఉంది కాబట్టి జీఎస్‌టీ నమోదును సరెండర్ చేయవచ్చా? డైరెక్టర్ల సిట్టింగ్ ఫీజుపై రివర్స్ ఛార్జ్ మెకానిజమ్(ఆర్‌సీఎమ్) పద్ధతిలో జీఎస్‌టీ చెల్లించాలా?**

– ఆనంద్

డైరెక్టర్లకు చెల్లించే సిట్టింగ్ ఫీజుపై రివర్స్ ఛార్జ్ కింద కంపెనీలు పన్ను కట్టాలి. కాబట్టి మీరు మీ జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌ను కొనసాగించండి.

❒ **ఒక కాంపోజిషన్ డీలరు 1% పన్ను విభాగంలో ట్రేడింగ్; 2% విభాగంలో తయారీని ఒకే రిజిస్ట్రేషన్ కింద చేయవచ్చా?**

– ప్రసాద్

జీఎస్‌టీ చట్టం ప్రకారం.. ఒక రిజిస్ట్రేషన్‌పై ఎలాంటి పరిమితులు లేవు. అయితే కాంపోజిషన్ కింద మాత్రం రెండు విభాగాల్లో రెండు వ్యాపారాలు చేయకూడదు.

❒ **హైదరాబాద్‌లో ఫ్లాట్ కొనాలని భావిస్తున్నాం. ధర రూ.50 లక్షలు. అయితే ఫ్లాట్ సిద్ధంగానే ఉన్నప్పటికీ బిల్డర్‌కు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ రాలేదు. బిల్డర్ ఇపుడు జీఎస్‌టీ కింద రూ.6 లక్షలు కట్టాలని చెబుతున్నారు. రూ.50 లక్షల ప్రాపర్టీపై ఎంత జీఎస్‌టీ ఉంటుంది. దీనిని బిల్డర్ భరించాలా? లేక కొనుగోలుదారా? బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలనుకుంటున్నాం. రుణంపై జీఎస్‌టీ ప్రభావం ఎలా ఉంటుంది.**

– హారిక

ఫ్లాట్‌పై జీఎస్‌టీ 12 శాతం(భూమి విలువ కలుపుకుని) ఉంటుంది. మీ విషయంలో బిల్డర్ ఇంకా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తీసుకోలేదు కాబట్టి జీఎస్‌టీ రూ.6 లక్షలు అవుతుంది. దీనిని కొనుగోలుదారు బిల్డర్‌కు చెల్లిస్తే.. బిల్డర్ దానిని ప్రభుత్వానికి కడతాడు.

❒ **నేను గ్రానైట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాను. వ్యాట్‌లో ఫారం-హెచ్ కింద మేం మరో కంపెనీకి ఉత్పత్తులను విక్రయిస్తున్నాం. ఆ కంపెనీ వాటిని చైనాకు ఎగుమతి చేస్తోంది. మా కంపెనీ చైనాకు ఎగుమతులు చేయడం లేదు. మాకు వర్తించే జీఎస్‌టీ రేటు ఎంత?**

–డి.సంపత్ కుమార్, కరీంనగర్

జీఎస్‌టీలో ఎగుమతిదారు పన్నురేటే మీకు వర్తిస్తుంది. జీఎస్‌టీలో ఫారం-హెచ్ విధానం లేదు.

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలను మాకు పంపండి. మా మెయిల్ అడ్రస్:

businessdesk@eenadu.net; eenadubusinessdesk@gmail.com



ఆక్టోపస్, ఎన్ఎస్జీ విభాగాల అమ్ముల పొదిలో అత్యాధునిక ఆయుధాలు

ముష్కరులపై పోరులో మానవ రహిత యుద్ధ పరికరాలు

ఉగ్రపోరుకు సాంకేతిక దన్ను

యుద్ధంలో శత్రువును కట్టడి చేయాలంటే వ్యూహం ముఖ్యం. మన జాడ తెలియకుండానే శత్రువు కదలికలు, ఆనుపానులు పసిగట్టగలిగితేనే వ్యూహం అమలుచేయడం సులభమవుతుంది. దాడికి అవసరమైన వ్యూహాత్మక ఆయుధాలు మన దగ్గర ఉంటే... శత్రువును మట్టుబెట్టగలగడమే కాదు...మన వైపు తక్కువ ప్రాణనష్టంతో విజయం సాధించొచ్చు. ఇప్పుడు ఉగ్రవాదులపై పోరులో సాంకేతిక ఆయుధాలు భద్రతాబలగాల చేతిలో కీలక అస్త్రాలుగా మారుతున్నాయి. భద్రతాబలగాలు, సామాన్య ప్రజానీకం ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా కేవలం ఉగ్రవాదులనే లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించడంలో ఈ తరహా ఆయుధాలు ఉపయోగపడతాయి. ఒకప్పుడు అమెరికా వంటి అభివృద్ధి చెందిన విదేశాలకే పరిమితమైన ఇలాంటి అత్యాధునిక ఆయుధాలు ఇప్పుడు ఎన్ఎస్జీ, ఏపీ, తెలంగాణ ఆక్టోపస్ విభాగాలు సమకూర్చుకున్నాయి. వాటి వద్దనున్న వివిధ రకాల ఆయుధాలు, వాటి ప్రత్యేకతలు, పనితీరు ఇలా..



బ్లాక్ హార్నెట్ నానో యూఏవీ

ఈ బుల్లి మానవరహిత విమానం

బరువు: 16 గ్రాములు

గరిష్ఠ వేగం: గంటకు 11 కిలోమీటర్లు

దీనిలోని కెమెరాలు: 3

ప్రత్యేకతలు:

- నిమిషాల వ్యవధిలో ఆకాశంలోకి పంపొచ్చు. విపత్కర వాతావరణ పరిస్థితులలోనూ ఎగురుతాయి.
- శత్రుస్థావరాల్లోకి, ఉగ్రమూకలు మాటేసిన ప్రదేశంలోకి పంపించవచ్చు.
- దీనిలోని కెమెరాలు శత్రువుల కదలికలు, స్థావర స్థితిగతులను పసిగట్టి వాటికి సంబంధించిన చిత్రాలు, దృశ్యాలను దాన్ని రిమోట్‌తో నడిపించే భద్రత బలగాల కమాండోలకు చేరవేస్తుంది.

ఎప్పుడు ఉపయోగిస్తారంటే..

ఏదైనా బహుళ అంతస్తుల భవనంలో ఉగ్రవాదులు చొరబడి, అందులో ఉన్న వారిని బందీలుగా చేసుకున్నప్పుడు లోపల ఎంత మంది ఉగ్రవాదులున్నారు? ఎక్కడెక్కడ ఉన్నారు? వారి చేతిలోని ఆయుధాలు? ఎంత మంది బందీలుగా ఉన్నారు? అనే అంశాలను ఈ బుల్లి విమానం పంపించే చిత్రాలు, దృశ్యాల ద్వారా తెలుసుకుని వాటి ఆధారంగా ఆపరేషన్ వ్యూహాలు రూపొందించుకుంటారు.



కార్నర్ షూట్ మోడల్ గన్

తయారీ దేశం: ఇజ్రాయెల్

ఉండే పరికరాలు: ఓ కెమెరా మానిటర్, కెమెరాలు, టాక్టికల్ లైట్

లక్ష్యం తీరు: 50 మీటర్ల రేంజిలో పనిచేస్తుంది

ప్రత్యేకత: ఏదో ఒక మూలన దాక్కొని విచక్షణరహితంగా కాల్పులు జరిపే ముష్కరలను మట్టుబెట్టడానికి ఈ ఆయుధాల్ని వినియోగిస్తారు. ఈ ఆయుధాన్ని వినియోగించే కమాండో తనకు ఎదురుగా ఉన్న వారినే కాకుండా పక్క వైపుల ఉన్న శత్రువుల కదలికలను ఆ కెమెరా మానిటర్ ద్వారా పరిశీలించి. . శత్రువును లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరుపుతారు. లక్ష్యాన్ని గుర్తించేందుకు దీనిలో టాక్టికల్ లైట్ ఉంటుంది.

కమాండో జెట్‌ప్యాక్



ప్రత్యేకతలు: దుండగులు ఏ అంతస్తులో ఉన్నారో, ఏ దిశలో ఉన్నారో తెలుసుకోవచ్చు.

- ఈ ప్యాక్‌ను వెనుక వైపున తగిలించుకుని నిర్దేశిత మీటలు నొక్కితే చాలు సెకన్ల వ్యవధిలో భారీ భవంతులపైకి ఎగరవచ్చు.

ఉపయోగపడుతుందిలా..

బహుళ అంతస్తుల భవనాల్లో ఏదో ఒక గదిలో దాక్కొని కాల్పులు జరిపే ముష్కరులను ఎదుర్కొనే క్రమంలో ఇది అత్యంత కీలకం. ఎత్తయిన భవనాల పైకి చేరడంలోనూ...ఆ భవనాలపై వాలుగా నడవడం, వాల్‌డ్రాప్, స్పైడర్ టెక్నిక్, స్పీడ్ డ్రాపింగ్, బంగీ జంప్ వంటి వాటికోసం కమాండోలు ఉపయోగిస్తారు. భవనం లోపల ఉన్న ఉగ్రవాదులను గుర్తించి దాడి చేయడం, బందీలను సురక్షితంగా కాపాడటం కోసం.



ఫైబర్ ఆప్టికల్ స్కోప్

అన్ని వైపులా మూసేసి ఉన్న ఉన్న గదులు లేదా అతి పెద్ద కంటైనర్లు తదితర వాటిలో దాక్కొని ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతుంటే ఆ లోపల ఉన్నవారిని గుర్తించేందుకు ఈ పరికరాన్ని వినియోగిస్తారు. సన్నటి ఫైబర్ ఆప్టికల్ వైరు ఓ వైపు భాగాన్ని కెమెరాతో అనుసంధానిస్తారు. మరో వైపును ఉగ్రవాదులు మాటువేసిన గదుల్లోకి పంపిస్తారు. ఈ వైర్లు చాలా సన్నగా ఉంటాయి కనుక అన్ని వైపులా మూసేసి ఉన్న ఆ గదుల్లోకి సులువుగా పంపించొచ్చు. అవి చిత్రీకరించే దృశ్యాలు, చిత్రాలను ఆధారంగా చేసుకుని వ్యూహాలు సిద్ధం చేస్తారు.

- ఈనాడు, అమరావతి

▶▶ డోగో టాక్టికల్ రోబో

తయారీ దేశం: ఇజ్రాయెల్ గరిష్ఠ వేగం: గంటకు 3 కిలోమీటర్లు

దీని ప్రత్యేకతలు:

- క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేయడం.
- వాలు ప్రాంతాల్లోనూ సులువుగా ప్రయాణించడం
- లక్ష్యాన్ని నిర్దేశిస్తే అత్యంత కచ్చితంగా, వేగంగా ఈ రోబోలో అమర్చిన పిస్తోలు ద్వారా కాల్పులు జరిపి ఉగ్రమూకలను మట్టుబెడుతుంది.
- 360 డిగ్రీల కోణంలో చీకట్లోనూ స్పష్టంగా దృశ్యాలను చిత్రీకరించగలిగే 8 కెమెరాలు.
- సంభాషణలు సాగించేందుకు అవసరమైన ఆడియో, వీడియో పరికరాలు.
- కాల్పులు జరిపినా చెక్కుచెదరని పరిస్థితి.

ఏ సమయంలో ఉపయోగిస్తారంటే..

ఏదైనా బహుళ అంతస్తుల భవనంలోకి ముష్కరులు చొరబడి అక్కడున్న వారిని బందీలుగా చేసుకుంటే.. లోపల ఏం జరుగుతుందో, ఉగ్రవాదుల కదలికలు ఎలా ఉన్నాయో గుర్తించడం, అవసరమైతే వారికి లొంగిపోమని హెచ్చరికలు జారీ చేయడం, అనువు చూసుకుని మట్టుబెట్టడం కోసం వినియోగిస్తారు. ఈ రోబోను నడిపించే వ్యక్తి చేతిలో ఉండే స్క్రీన్‌పైన భవనం లోపల జరిగే ప్రతీ దృశ్యమూ కనిపిస్తుంది. వాటి ఆధారంగా వ్యూహాలు రూపొందించుకుంటారు.



▶▶ రోబోటిక్ బాంబు డిస్పోజల్స్

తయారీ దేశం: అమెరికా

పనిచేసే విధానం:

- వైర్‌లెస్ కమ్యూనికేషన్ ద్వారా..
- బాంబులను గుర్తించి నిర్వీర్యం చేయడం.
- అన్నివాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేయడం.



ఉపయోగించేది..

ఈ రోబోల వల్ల ప్రాణనష్టం గణనీయంగా తగ్గేందుకు అవకాశం ఉంటుంది. వీటిలో బాంబులను అమర్చి శత్రుస్థావరాలపై దాడి చేయొచ్చు. ఉగ్రవాదులను మట్టుబెట్టొచ్చు. అమెరికాలోని డల్లాస్‌లో మికా జాన్సన్ అనే దుండగుడిని మట్టుబెట్టేందుకు తొలిసారిగా ఈ రోబోను ఆ దేశ భద్రత బలగాలు ఉపయోగించాయి.



బహుళ అంతస్తుల భవనాల్లో దాగి ఉన్న ఉగ్రమూకలను గుర్తించేందుకు చొచ్చుకెళ్తున్న కమాండోలు (నమూనా చిత్రం)

జాగిలాలు..

ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్ వద్ద ఉన్న జాగిలాల్లో రాంబో, టైగర్, చీతా అనేవి ప్రత్యేకం. బహిరంగ ప్రదేశాల్లో విచక్షణారహితంగా కాల్పులు జరిపే ఉగ్రవాదులను నియంత్రించి వారిపైన దాడులు చేయడంలో ఈ జాగిలాలది ప్రత్యేక పాత్ర. అక్కడ ఎంత మంది ఉన్నా, ముష్కరులు ఎవరో గమనించి వారిపైకి ఒక్క ఉదుటన దూకి వారిని నియంత్రిస్తాయి. అత్యంత ప్రముఖులను ఉగ్రవాదుల చెరనుంచి విడిపించే క్రమంలోనూ ఇవి ఉగ్రవాదులనే లక్ష్యంగా చేసుకుని దాడి చేయగలవు.



ఒక్క ఉదుటన ముష్కరులపై దూకే జాగిలం

నిధుల లేమి..

ప్రగతి ప్రశ్నార్థకం!

- సమస్యల వలయంలో నగరాభివృద్ధి సంస్థలు
- మౌలిక సదుపాయాలు కల్పించలేని దుస్థితి
- సొంతగా స్థిరాస్తి వ్యాపారానికి భూముల కొరత
- పెద్దనోట్ల రద్దుతో లేఅవుట్లపై 60 శాతానికి పైగా తగ్గిన ఆదాయం



విశాఖ శివారు నగరపాలెం నుంచి మధురవాడ, కాపులుప్పాడ మీదుగా వందడుగుల మాస్టర్‌ప్లాన్ రహదారి నిర్మాణానికి 2014 ఫిబ్రవరి 15న శంకుస్థాపన చేసినా.. నేటికీ పనులు ప్రారంభించకపోవడంతో మరింత అధ్వానంగా తయారైన తీరు

ఈనాడు, అమరావతి

నిధుల లేమితో నగరాభివృద్ధి సంస్థల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. ఒకటీ అరా తప్పితే దాదాపు అన్ని చోట్లా ఈ సంస్థలు అభివృద్ధి మాటే మరిచాయి. గత పదేళ్ల నుంచి నగరాభివృద్ధి సంస్థల్లో ఇదే పరిస్థితి. విభజనతో ఆర్థికలోటుతో ఉన్న ప్రభుత్వమూ సాయం అందించలేకపోతోంది. స్థిరాస్తి వ్యాపార నిమిత్తం ప్రభుత్వ భూములైనా కేటాయించాలన్న నగరాభివృద్ధి సంస్థల ప్రతిపాదనలపైనా సర్కారు ఆచితూచి వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే నాలుగు నగరాభివృద్ధి సంస్థలు ఉన్నాయి. ఏడాది వ్యవధిలో ప్రభుత్వం మరో నాలుగింటిని ఏర్పాటు చేసింది. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆవాసం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్న ప్రభుత్వ ఉద్దేశం మంచిదైనా వనరుల కొరత ప్రతిబంధకమవుతోంది.

▶▶ లక్ష్యమేంటి... ఏం చేస్తున్నారు?

- బృహత్తర ప్రణాళిక(మాస్టర్ ప్లాను) రూపొందించి కొత్త లేఅవుట్లకు అనుమతులిచ్చి, రహదారులు, కాలువలు వంటివి అభివృద్ధి చేయాలి. ఉద్యానవనాలు, సామాజిక భవనాలు నిర్మించేందుకు ప్రాధాన్యమివ్వాలి. అవసరమైన చోట భూగర్భ మురుగునీటి వ్యవస్థ(యూజీడీ) తీసుకొచ్చి ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలి.
- విశాఖపట్నం, తిరుపతి నగరాభివృద్ధి సంస్థల్లో కొత్తగా చేర్చిన ప్రాంతాలతో కలిపి మాస్టర్‌ప్లాను రూపకల్పన నేటికీ పూర్తికాలేదు. పాత వాటితో నెట్టుకొచ్చే పరిస్థితి. పుట్టపర్తి మాస్టర్‌ప్లాను కోసం ప్రతిపాదలనలైతే సిద్ధమైనా తదుపరి చర్యల్లేవు. కొత్తగా కలిసిన మూడు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.68 కోట్లకు పైగా ప్రతిపాదనలున్నా నిధుల కొరతతో పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. విశాఖలో తప్పితే గత మూడేళ్లలో చెప్పుకోదగ్గ ఉద్యానవనాలను అభివృద్ధి చేసిన దాఖలాల్లేవు. పుట్టపర్తిలో యూజీడీ విస్తరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలైతే వెళ్లాయి. పెద్దనోట్ల రద్దుతో కొత్త లేఅవుట్ల కోసం వ్యాపారసంస్థలు ముందుకు రానందున నగరాభివృద్ధి సంస్థల ఆదాయం గత రెండేళ్లలో 60శాతానికి పైగా తగ్గింది.
- పేద, మధ్య తరగతి కుటుంబాల కోసం నగరాభివృద్ధి సంస్థలు సొంతగా లేఅవుట్లు వేసి స్థలాలు విక్రయించాలి. ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి అందుబాటు ధరల్లో ప్రజలకు అమ్మకానికి పెట్టాలి.
- గత ప్రభుత్వ హయాంలో భారీగా లేఅవుట్లు వేసి స్థలాలు విక్రయించిన విశాఖ నగరాభివృద్ధి సంస్థ(వుడా)కు ఆదాయ పన్ను రూపంలో రూ. 420 కోట్లకు పైగా పడిన భారంతో ఇప్పుడు ఆచితూచి వ్యవహరించే పరిస్థితి. పెద్దనోట్ల రద్దు తరువాత ఒకటి, రెండు లేఅవుట్లలో ఖాళీ స్థలాల విక్రయానికి భయపడే స్థితి. తిరుపతి, విజయవాడ, పుట్టపర్తిలలో గత ఏడేళ్ల వ్యవధిలో కొత్త లేఅవుట్లు వేసిన దాఖలాల్లేవు. ప్రభుత్వ భూములు కేటాయిస్తే లేఅవుట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నామని పుట్టపర్తి నగరాభివృద్ధి సంస్థ ఇటీవల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇందుకోసం 3వేల ఎకరాల భూమి కేటాయించాలని కోరింది.
- సంస్థ నిర్వహణ, అభివృద్ధి పనులకు నిధుల సమీకరణ నిమిత్తం పలు కార్యక్రమాలు చేపట్టాలి. వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, వినోద థియేటర్లు నిర్మించి లీజులకు ఇవ్వాలి. ఇలాంటి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు విస్తరించేలా ఆలోచనలు చేయాలి.
- పది నుంచి పదిహేనేళ్ల క్రితం నాటి నిర్మాణాలపై వస్తున్న ఆదాయంపైనే ఇప్పటికీ నగరాభివృద్ధి సంస్థలు ఆధారపడుతున్నాయి. విశాఖలో మినహా మిగతా మూడు చోట్లా నిధుల కొరతతో ఎలాంటి కొత్త ప్రాజెక్టులు చేపట్టని పరిస్థితి. పుట్టపర్తిలో వాణిజ్య సముదాయాలు, యూజీడీ కనెక్షన్లపై వచ్చే ఆదాయంతో నగరాభివృద్ధి సంస్థ మనుగడ సాగిస్తోంది. వివిధ పద్దుల కింద వార్షిక ఆదాయం రూ.150 కోట్లుంటే, అదే స్థాయిలో విశాఖ నగరాభివృద్ధి సంస్థలో ఖర్చుల కారణంగా కొద్ది కాలంగా కొత్త పనులపై వెనుకంజ వేస్తున్నారు.

▶▶ నగరాభివృద్ధి సంస్థలు.. ప్రస్తుత పరిస్థితి

- విశాఖ నగరాభివృద్ధి సంస్థ(వుడా) పరిధిలో ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు కలిసి ఉన్నాయి. 5,573చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఈ సంస్థ పదేళ్ల క్రితం దేదీప్యమానంగా వెలుగొందినా వైఎస్ ప్రభుత్వ హయాంలో బడ్జెటరీ సపోర్టు పేరుతో భూములమ్మి డబ్బు సర్దుబాటు చేయడం వివాదాస్పదమైంది. అప్పటి నుంచి కార్యకలాపాలు తగ్గించుకుంటూ వచ్చారు. ఇప్పటికీ వుడా పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని అనేక ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోని పరిస్థితి.
- రాష్ట్ర విభజనతో విజయవాడ నగరాభివృద్ధి సంస్థ పరిస్థితి మెరుగైంది. కొత్త ప్రాంతాలను కలుపుతూ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ)గా ఉన్నత స్థాయి కల్పించారు. రాజధాని నిర్మాణంతోపాటు అనేక కీలక బాధ్యతలు ప్రస్తుతం ఈ సంస్థ నిర్వహిస్తోంది. ఉన్న నగరాభివృద్ధి సంస్థలో సీఆర్‌డీఏ పనితీరు మెరుగ్గా ఉంది. రాబోయే రోజుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.
- తిరుపతి నగరాభివృద్ధి సంస్థ(తుడా)లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించలేకపోతున్నారు. రూ.85 కోట్లకుపైగా ప్రతిపాదనలైతే ఉన్నా పూర్తిగా అమలుచేయలేని పరిస్థితి. 1211.51 చ.కి.మీ. పరిధిలోని తుడాలో మాస్టర్ ప్లాను రహదారుల అభివృద్ధికి ప్రస్తుతం సర్వే నిర్వహిస్తున్నారు. కొత్తగా చేరిన ప్రాంతాలతో కలిపి బృహత్తర ప్రణాళిక రూపకల్పనకు కొద్దికాలంగా కసరత్తు జరుగుతోంది. పెద్దనోట్ల రద్దు ప్రభావంతో కొత్త లేవుట్లపై వచ్చే ఆదాయం 50శాతానికిపైగా తగ్గింది.
- పుట్టపర్తి నగరాభివృద్ధి సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. కొత్తగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేని పరిస్థితి. సొంతంగా భూముల్లేక స్థిరాస్తి వ్యాపార ప్రతిపాదనలు ఆచరణకు నోచుకోవడం లేదు. కొత్తగా చేరిన అనేక ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టి సారించని పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.
- అనంతపురం, కర్నూలు, నెల్లూరు, కాకినాడ కేంద్రంగా మరో నాలుగు నగరాభివృద్ధి సంస్థలను ప్రభుత్వం ఏర్పాటుచేసినా ఇక్కడ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. పాలకవర్గ నియామకం పైనా ఇంకా దృష్టిపెట్టని పరిస్థితి. ప్రభుత్వం ప్రాథమికంగా కొంత సాయం అందిస్తే తప్ప ఇక్కడ అభివృద్ధి పనులు నిర్వహించలేమని అధికార వర్గాలు చెబుతున్నాయి.



పుట్టపర్తిలోని సమాధి రోడ్డులో భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్వహణ సరిగా లేనందున రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు

మొయిన్ ఖురేషీ అరెస్టు

- **అక్రమ నగదు చెలామణీ కేసులో మాంసం ఎగుమతిదారుకు సంకెళ్లు**

దిల్లీ: అక్రమ నగదు చెలామణీ కేసులో మాంసం ఎగుమతిదారు మొయిన్ అఖ్తర్ ఖురేషీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టుచేశారు. ఆయన్ను శుక్రవారం రాత్రి ప్రశ్నించేందుకు కార్యాలయానికి పిలిపించామని, దర్యాప్తు అనంతరం అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. విచారణకు ఆయన సరిగా సహకరించలేదని పేర్కొన్నారు. అక్రమ నగదు చెలామణీ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఖురేషీపై రెండు ప్రాథమిక విచారణ నివేదిక(ఎఫ్ఐఆర్)లు ఇప్పటికే నమోదయ్యాయి. వీటిపై ఆయన్ను పలుమార్లు అధికారులు విచారించారు. ఇటీవల నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఆయనతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మాజీ డైరెక్టర్ ఏపీ సింగ్ పేరు కూడా ఉంది. ఖురేషీని శనివారం అధికారులు దిల్లీ న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. దర్యాప్తు కోసం 14 రోజుల రిమాండ్ విధించాలని కోరారు. దీంతో ఆయన్ను ఈ నెల 31 వరకు నిర్బంధంలోకి తీసుకోవాలని ప్రత్యేక న్యాయమూర్తి అరుణ్ భరద్వాజ్ ఆదేశాలు జారీచేశారు.

శ్రీజన్ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు

దిల్లీ: బిహార్‌లోని భాగల్పూర్‌లో చోటుచేసుకున్న 'శ్రీజన్' కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ వినతి మేరకు దాదాపు రూ.950 కోట్లకుపైగా ప్రభుత్వ నిధులను స్వచ్ఛంద సంస్థకు తరలించి అక్రమాలకు పాల్పడిన వైనంపై దర్యాప్తు చేయనుంది. దీనిపై ఇప్పటికే బిహార్ పోలీసుల పరిధిలోని ఆర్థిక నేరాల విభాగం (ఎకనామిక్ అఫెన్సెస్ యూనిట్- ఈఓయూ) పది కేసులు నమోదు చేసింది. నిబంధనల ప్రకారం ఈ కేసులను సీబీఐ..తన వద్ద మళ్లీ నమోదు చేసుకుంది. ఇందుకు సంబంధించి శనివారం బిహార్ ప్రభుత్వం నుంచి పత్రాలు అందాయి. శ్రీజన్ మహిళా వికాస్ సమితి అనే స్వచ్ఛంద సంస్థకు అక్రమంగా ప్రభుత్వ నిధులను తరలించడంపై ఆ సంస్థ వ్యవస్థాపకురాలు దివంగత మనోరమా దేవితో పాటు, ఆ సంస్థకు చెందిన ఉద్యోగులు, బ్యాంకు అధికారులపై కేసులు దాఖలయ్యాయి. మనోరమాదేవి గత ఫిబ్రవరిలో మరణించడంతో ఆమె కోడలు ప్రియా కుమార్, కుమారుడు ఆమిత్ కుమార్‌లు ఈ సంస్థను నిర్వహిస్తున్నారు. వారిద్దరితో పాటు, 'శ్రీజన్' కార్యదర్శి పరారీలో ఉండడంతో వారిపై బిహార్ పోలీసులు లుక్‌అవుట్ నోటీసు జారీ చేశారు.

బకింగ్‌హామ్ ప్యాలస్ వద్ద పోలీసులపై దాడి

లండన్: లండన్ బకింగ్‌హామ్ ప్యాలస్ బయట ఓ వ్యక్తి పోలీసు అధికారులపై దాడికి పాల్పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన 26 ఏళ్ల వ్యక్తిని యూకే ఉగ్రవాద చట్టం కింద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి ఉద్దేశపూర్వకంగా పోలీసు వ్యానుకు ముందు నిషేధిత ప్రాంతంలో కారును ఆపగా, అందులో పదునైన కత్తి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అరెస్టుకు ఉపక్రమించగా అతను దాడికి పాల్పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సందర్భంగా అతను పదేపదే నినాదాలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై ఉగ్రవాద కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

అఫ్గానిస్థాన్ మసీదులో ఆత్మాహుతి దాడి

28 మంది మృతి..50 మందికి గాయాలు

కాబూల్: అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 28 మంది మృతిచెందారు. మరో 50 మంది వరకూ గాయపడ్డారు. శుక్రవారం నగరంలోని షియాల మసీదులోకి నలుగురు సాయుధులు చొరబడ్డారు. వారిని భద్రతాబలగాలు అడ్డుకునే సమయంలో తొలుత ఇద్దరు ఆత్మాహుతి సభ్యులు తమను తాము పేల్చేసుకున్నారు. మిగిలిన ఇద్దరిని భద్రతా బలగాలు కాల్చిచంపినట్లు అఫ్గానిస్థాన్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. దాడి తమ పనేనని ఐసిస్ ఉగ్రవాదులు ప్రకటించుకున్నారు.

బెల్జియంలో సైనికులపై కత్తితో దాడికి దిగిన దుండగుడు

- **కాల్పుల్లో హతం**

బ్రసెల్స్: బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో సైనికులపై ఓ అనుమానిత ఉగ్రవాది కత్తితో దాడికి దిగాడు. ప్రతిస్పందనగా సైనికులు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నగర కేంద్రంలోని గ్రాండ్ ప్లేస్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. నిందితుడు 'అల్లాహు అక్బర్' అని రెండు సార్లు నినాదాలు చేసి.. వెనుకవైపు నుంచి ఇద్దరు సైనికులపై దాడికి పాల్పడ్డాడని అధికారులు తెలిపారు. వారిలో ఓ సైనికుడికి స్వల్పగాయాలయ్యాయని పేర్కొన్నారు. మరో సైనికుడు దుండగుడిపై కాల్పులు జరిపాడని తెలిపారు. దుండగుడి వద్ద నుంచి కత్తి, బొమ్మ తుపాకీ, రెండు ఖురాన్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇటు బ్రూగెస్‌లోని అతడి నివాసంలోనూ పోలీసులు సోదాలు జరిపారు. నిందితుడు సొమాలియా నేపథ్యమున్న వాడని.. 2004లో బెల్జియంకు వచ్చి 11 ఏళ్ల అనంతరం ఇక్కడి పౌరసత్వం పొందాడని అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరిలో భౌతికదాడికి సంబంధించి అతడిపై ఓ కేసు నమోదైందని.. అయితే ఉగ్రవాద సంబంధ నేరచరిత్ర ఏమీ కనిపించలేదని తెలిపారు. అనుమానిత ఉగ్రవాద హత్యాయత్నంగా కేసు విచారణ సాగిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఈ ఏడాది విడుదలైన చిన్న చిత్రాల్లో... పెద్ద విజయం సాధించింది 'అమీ తుమీ'. సున్నితమైన హాస్యం, గుర్తుండిపోయే పాత్రలు, వాటి మధ్య 'చిలిపి' సంఘటనలు... ఇవన్నీ 'అమీ తుమీ'ని వినోదాల్లో ముంచి విజయ తీరం చేర్చాయి. అవసరాల శ్రీనివాస్, అడవి శేష్, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకుడు. ఈటీవీలో ఈరోజు మధ్యాహ్నం 2 గం. 15 నిమిషాలకు 'అమీతుమీ' ప్రసారం అవుతుంది. ఈ సందర్భంగా 'అమీతుమీ' ముచ్చట్లను ఈనాడు సినిమాతో పంచుకొన్నారు ఇంద్రగంటి.

అమీ తుమీ... వినోదాల హామీ

ఇప్పటి వరకూ మీ ఖాతాలో హిట్లు, సూపర్ హిట్లూ ఉన్నాయి. అవార్డు సినిమాలూ ఉన్నాయి. వీటి మధ్య 'అమీ తుమీ' విజయం ప్రత్యేకంగా అనిపించిందా?

'అష్టాచమ్మా' తరవాత నేను వినోదాత్మక చిత్రం చేయలేదు. 'అష్టాచమ్మా'లో కామెడీ ఉంటుంది. కానీ అది రొమాంటిక్ కామెడీ. పూర్తిస్థాయి వినోద భరిత చిత్రం మాత్రం 'అమీ తుమీ'నే. ఈ చిత్రానికి వచ్చిన గుర్తింపు, సాధించిన విజయం ఎప్పటికీ మర్చిపోలేను. కామెడీ చేయడం చాలా కష్టం. బూతులు, ద్వందార్థాలూ లేకుండా సున్నితమైన వినోదం పంచుతూ, కథకు లోబడి నడుస్తూ నవ్వించడం ఇంకా కష్టం. ఆ కష్టాలు పడి... ఇష్టంగా తీసిన సినిమా కాబట్టి 'అమీ తుమీ' ఎప్పటికీ ప్రత్యేకమే.

'అమీ తుమీ' విజయంలో ఎవరి భాగస్వామ్యం ఎంత?

నాలోని రచయిత, తెరపై నటీనటులు... ఇద్దరికీ సమ ప్రాధాన్యం ఉంది. రచయితగా నేను రాసిన దాన్ని నటులు మరో మెట్టు పైకి తీసుకెళ్లారు. 'వీళ్లు కాకుండా మరొకరు అయితే బాగుంటుందేమో' అన్న ధ్యాస ప్రేక్షకుడికి రాకుండా చేశారు. శ్రీచిలిపి లాంటి పాత్రలు చాలా కాలం గుర్తుండిపోతాయి. మణిశర్మ గారితో ఇది నా రెండో చిత్రం. సినిమాలో రెండు పాటలే ఉన్నాయి. అయితే నేపథ్య సంగీతం ఈ చిత్రానికి బాగా కలిసొచ్చింది.

'అమీ తుమీ'.. ఇలాంటి అచ్చమైన తెలుగు టైటిళ్లు పెట్టడానికి స్ఫూర్తి ఎవరు?

దినపత్రికలే. 'ఈనాడు'లో చాలాసార్లు 'అమీ తుమీ' అనే పదం చదివా. నా కథకు, అందులోని పాత్రల స్వభావానికీ ఇదే సరిపోతుంది అనిపించింది.

'అమీ తుమీ'లో ప్రధాన పాత్రలతో తెలంగాణ యాసలో మాట్లాడించారు. అది ఎంత వరకూ కలిసొచ్చింది?

ఏ మాండలికమైనా స్వచ్ఛంగా మాట్లాడితే అందంగా, అద్భుతంగా ఉంటుంది. తెలుగు తెరపై తెలంగాణ మాండలికాన్ని కేవలం ప్రతినాయకులకు, హాస్య నటులకే పరిమితం చేశారు. కథానాయకులు కొంతమంది మాట్లాడినా, ఓ నాయిక చేత తెలంగాణలో మాట్లాడించడం ఇదే తొలిసారి. నా పాత్రలు తెలంగాణలో మాట్లాడుతుంటే నాకూ, ప్రేక్షకులకూ కొత్తగా అనిపించింది.

స్వచ్ఛమైన హాస్యం ఇప్పటి సినిమాల్లో కనిపిస్తోందా?

ఒక విధంగా చెప్పాలంటే రాను రాను తగ్గిపోతోంది. పంచ్‌లు మాట్లాడితేనే హాస్యం అనుకొంటున్నారు. పంచ్‌లు ఎవరైనా రాయగలరు. పాత్రల నుంచి హాస్యం పుట్టించడం ముఖ్యం. అలాంటి కథలే మిగిలిపోతాయి. సినిమాల్లోనే కాదు, రచనల్లోనూ హాస్యం స్థాయి తగ్గింది. ముళ్లపూడి వెంకటరమణ, శ్రీరమణ, మల్లాది, ఎర్రంశెట్టి సాయి... ఇలా చాలామంది రచయితలు అద్భుతమైన హాస్యం పండించారు. బాపుగారి సినిమాల్లో హాస్యం చాలా సున్నితంగా ఉంటుంది. జంధ్యాల సృష్టించిన పాత్రలు మళ్లీ మళ్లీ గుర్తుతెచ్చుకొని నవ్వుకొంటాం. సింగీతం, కమల్ హాసన్ గారి చిత్రాల్లోనూ హాస్యానికి పెద్ద పీట వేస్తారు. నా వరకూ స్ఫూర్తి ముళ్లపూడి వారే. మామూలు మాటల్లోనే ఓ అక్షరం మార్చి వినోదం పండిస్తారు. 'అతనికి డబ్బు చేసింది' లాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. అలాంటి హాస్యం పుట్టించడం చాలా కష్టం. 'అమీ తుమీ'లో 'నిన్ను నిన్నుగానే ప్రేమిస్తాను కానీ నన్‌గా కాదు' అనే సంభాషణ ఉంది. అది చూసి ఒకాయన 'ముళ్లపూడి వారిని గుర్తు చేశారు' అన్నారు. ఆ మాట ఓ అవార్డులా భావిస్తా.

హాస్య రస చిత్రాలకు జీవిత కాలం ఎక్కువ అంటుంటారు కదా?

అవును. అది నిజమే. సీరియస్ చిత్రాల్ని ఓసారి చూస్తాం. మళ్లీ మళ్లీ చూడాలంటే కష్టం. అదే హాస్య చిత్రాలు మాత్రం అలా కాదు. ఎప్పుడూ చూస్తూనే ఉంటాం. కామెడీ చిత్రాల్ని చిన్న చూపుతో చూస్తుంటారు. 'మన కోపమే మన కామెడీలో కనిపిస్తుంది' అని ఓ పెద్దాయన చెప్పారు. అది నిజం. అయితే వినోదాత్మకంగానే మంచి విషయాలు చాలా చెప్పే అవకాశం ఉంటుంది. 'అష్టాచమ్మా', 'అమీ తుమీ'లో సీరియస్ విషయాలెన్నో నర్మగర్భంగా చర్చించాం. కాకపోతే.. సున్నితమైన రీతిలో. సీరియస్ చిత్రాలకు వచ్చినన్ని అవార్డులు కామెడీలకు రావు.

మళ్లీ హాస్యరస ప్రధాన చిత్రం ఎప్పుడు తీస్తారు?

ఇప్పట్లో దాని జోలికి వెళ్లను. ఎందుకంటే నాకు నేను సంపూర్ణంగా అనుభవించినప్పుడే అలాంటి కథని రాసుకొంటా. అయితే నా సినిమాల్లో హాస్యం ఉంటుంది. దాన్ని వదలను.

ఈనాడు సినిమా


'జగదేకవీరుడు...' గుర్తుకొచ్చింది!



యన్. నరసింహారావు, ఆకాష్ కుమార్, చిరంజీవి, జయప్రద, సురేష్ కపాడియా, మిస్తి చక్రవర్తి

"నా సినీ ప్రయాణంలో 'మేఘసందేశం', 'సింహాసనం' లాంటి చిత్రాలతో పాటు ప్రేక్షకులకి గుర్తుండిపోయే పాత్రలెన్నో చేశా. ఇటీవల నటించే అవకాశాలు వచ్చినా, మంచి పాత్రతోనే మళ్లీ తెరపై కనిపించాలని నిర్ణయించుకొన్నా. 'శరభ' నటిగా నాకు సంతృప్తినిచ్చిన మరో మంచి చిత్రం" అన్నారు జయప్రద. ఆమె కీలకపాత్రలో నటించిన చిత్రం 'శరభ'. ఆకాష్ కుమార్, మిస్తి చక్రవర్తి జంటగా నటించారు. యన్. నరసింహారావు దర్శకుడు. సురేష్ కపాడియా, అశ్వనికుమార్ సహదేవ్ నిర్మాతలు. శనివారం హైదరాబాద్‌లో ప్రముఖ నటుడు చిరంజీవి 'శరభ' మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "జయప్రద కొన్నిరోజుల కిందట మా ఇంటికి వచ్చి సినిమా పోస్టర్‌ను విడుదల చేయాలని కోరారు. ఆ సందర్భంలోనే 'శరభ' క్లిప్పింగ్స్‌ను కొన్నింటిని చూశా. చాలా బాగా నచ్చాయి. ముఖ్యంగా జయప్రద నటన ఆకట్టుకుంది. ఆమె యువతిగా, నడివయస్కురాలిగా రెండు రకాల పాత్రల్లో కనిపిస్తుంది. సోషియో ఫాంటసీ తరహాలో దైవశక్తి, దుష్టశక్తి, మానవశక్తిల మధ్య నడుస్తుందీ చిత్రం. ఆ క్లిప్పింగ్స్‌ని చూస్తున్నప్పుడు నేను నటించిన 'జగదేకవీరుడు అతిలోకసుందరి' గుర్తుకొచ్చింది. పతాకదృశ్యాల్లో ఆకాష్ నటన బాగుంది. అత్యున్నత సాంకేతికతతో కూడిన చిత్రమిది. రమణ సాల్వ కెమెరా పనితనం బాగుంది. చిత్రం విజయవంతం అవుతుందని ఆశిస్తున్నా" అన్నారు. జయప్రద మాట్లాడుతూ "మా సినిమా పోస్టర్ చిరంజీవి చేతులమీదుగా విడుదలవడం చాలా ఆనందంగా ఉంది. నాకిది ప్రత్యేకమైన రోజు. ట్రెండ్‌కి తగ్గట్టుగానే అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు దర్శకుడు" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "వాణిజ్యాంశాలతో సాగే సోషియో ఫాంటసీ చిత్రమిది. తండ్రి సెంటిమెంట్ ఆకట్టుకుంటుంది" అన్నారు. సురేష్ కపాడియా మాట్లాడుతూ "చిరంజీవిగారు ఈ పోస్టర్‌ను విడుదల చేయడమే మాకు గొప్ప గౌరవం. చిన్నా, పెద్దా, యువత అందర్నీ వినోదపరిచే చక్కటి చిత్రమ"న్నారు. కార్యక్రమంలో నాయకానాయికలైన ఆకాష్ కుమార్, మిస్తి చక్రవర్తి, ఛాయాగ్రాహకుడు రమణ సాల్వ మాట్లాడారు.

రొమేనియాలో మహేష్ పాట



'స్పైడర్'లో మహేష్‌బాబు

మహేష్‌బాబు కథానాయకుడిగా తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న చిత్రం 'స్పైడర్'. రకుల్‌ప్రీత్‌సింగ్ కథానాయిక. ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్.వి.ప్రసాద్ నిర్మాత. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. ఒక పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. మిగిలివున్న ఆ పాటని ఈ నెల 25 నుంచి రొమేనియాలో చిత్రీకరిస్తున్నారు. 31తో పూర్తి కానున్న ఆ పాటతో సినిమా మొత్తం పూర్తవుతుంది. సెప్టెంబర్ 27న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మహేష్ ఇందులో ఇంటెలిజెన్స్ అధికారి పాత్రలో కనిపించబోతున్నారు. ఎస్.జె.సూర్య ప్రతినాయకుడిగా నటించిన ఈ చిత్రానికి సంగీతం: హారిస్ జైరాజ్, ఛాయాగ్రహణం: సంతోష్ శివన్, కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, ఫైట్లు: పీటర్ హెయిన్.

కుశ... ఓ టపోరి



'జై లవకుశ'లో ఎన్టీఆర్

ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'జై లవకుశ'. రాశిఖన్నా, నివేదా థామస్ కథానాయికలు. బాబీ దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్ జై, లవ, కుశ అనే మూడు పాత్రల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. వ్యతిరేక ఛాయలతో కూడిన జై, మంచి వాడైన లవ పాత్రల్ని పరిచయం చేసింది చిత్రబృందం. వినాయక చవితి సందర్భంగా కుశ లుక్ కూడా విడుదలైంది. కుశ గెటప్‌లో ఎన్టీఆర్ కొత్తగా కనిపిస్తున్నారు. టపోరిగా, ఓ కొంటె కుర్రాడిగా కుశ చేసే సందడి ఆకట్టుకుంటుందని చిత్ర బృందం చెబుతోంది. సినిమాలో ప్రియ అనే పాత్రలో నటిస్తున్న రాశిఖన్నా లుక్ కూడా విడుదలైంది. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఛోటా కె. నాయుడు, సంగీతం: దేవిశ్రీప్రసాద్.

అబ్బాయి అల్లరి



నిఖిలా విమల్, అల్లరి నరేష్

"నవ్విస్తూనే ఏడిపించే 'గమ్యం' గాలిశీను పాత్ర చాలామందికి నచ్చింది. అలాంటి కథ కోసం ఎప్పట్నుంచో వెతుకుతూ వచ్చా. మూడేళ్ల కిందట 'ఒరు వడక్కన్ సెల్ఫీ' అనే మలయాళ చిత్రాన్ని చూశాక నా అన్వేషణ ఫలించింది. కామెడీకి థ్రిల్లర్ అంశాల్ని మేళవించి తీశారు. నాకు బాగా నచ్చడంతో మాతృకని తెరకెక్కించిన దర్శకుడితోనే రీమేక్ చేశాం. ఒక మంచి సినిమా చేశానని మనస్ఫూర్తిగా నమ్ముతున్నా" అన్నారు అల్లరి నరేష్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మేడమీద అబ్బాయి'. నిఖిలా విమల్ కథానాయిక. ప్రజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. బొప్పన చంద్రశేఖర్ నిర్మాత. శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ "నా సినిమాలు ఈమధ్య మూసధోరణిలో ఉన్నాయని కొందరంటున్న నేపథ్యంలో కొత్తగా ఏం చేయాలని ఆలోచిస్తూనే ఉన్నా. ఈ చిత్ర నిర్మాత బొప్పన చంద్రశేఖర్ 'గమ్యం' తరహాలో ఓ సీరియస్ కథని చేద్దాం అన్నారు. ఆయనే మలయాళంలో నివిన్‌పాళి చేసిన 'ఒరు వడక్కన్ సెల్ఫీ' గురించి తెలుసుకొని నన్ను చూడమన్నారు. అది చూశాక నేను వెదుకుతున్న కథ ఇదే అనిపించింది. ఈ సినిమాలో హైపర్ ఆది కీలక పాత్ర పోషించాడు. నాకంటే తనకే ఎక్కువ పేరొస్తుంది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "అల్లరి నరేష్ ఇది వరకు నటించిన 'అల్లరి', 'ప్రాణం', 'గమ్యం', 'శంభో శివ శంభో' చిత్రాలు కలిస్తే ఎలా ఉంటుందో ఈ సినిమా అలా ఉంటుంది. సెప్టెంబరు 8న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. "ఇది అల్లరి నరేష్ కెరీర్‌లోనే ఉత్తమచిత్రంగా నిలుస్తుంది" అన్నారు హైపర్ ఆది. ఈ కార్యక్రమంలో గీత రచయిత విజయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఎం.ఎస్.కుమార్‌తో పాటు సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ్‌రామ్



తమన్నా

తమన్నాతో కలిసి...

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్, కూల్ బ్రీజ్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నాయి. జయేంద్ర దర్శకుడు. కిరణ్ ముప్పవరపు, విజయ్‌కుమార్ వట్టికూటి నిర్మాతలు. మహేష్ కోనేరు సమర్పిస్తున్నారు. ఇందులో కల్యాణ్‌రామ్ సరసన తమన్నా నటిస్తోంది. మొదట ఈ చిత్రంలో కథానాయికగా ఐశ్వర్యలక్ష్మిని ఎంపిక చేశారు. అయితే కల్యాణ్‌రామ్ సరసన స్టార్ కథానాయిక అయితేనే బాగుంటుందని భావించిన చిత్రబృందం ఐశ్వర్యలక్ష్మి స్థానాన్ని తమన్నాతో భర్తీ చేశారు. సెప్టెంబరు 1 నుంచే తమన్నా సెట్లోకి అడుగుపెట్టనున్నట్టు చిత్రబృందం స్పష్టం చేసింది. "ఒక రొమాంటిక్ కామెడీ కథతో తెరకెక్కుతున్న చిత్రమిది. కల్యాణ్‌రామ్ తెరపై కనిపించే విధానం కొత్తగా ఉంటుంది. సెప్టెంబరు నెలాఖరులోపు యాభై శాతం టాకీభాగం పూర్తవుతుంది. అమెరికాలో నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతాయి. ఫిబ్రవరిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"ని తెలిపారు చిత్ర సమర్పకుడు మహేష్ కోనేరు. ఈ సినిమాకి ఛాయాగ్రహణం: పి.సి. శ్రీరామ్, సంగీతం: శరత్.

ప్రేమకి 'దర్పణం'



అలెక్సియస్, తనిష్క్‌రెడ్డి, సుభాంగి పంత్

తనిష్క్‌రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'దర్పణం'. వి. రామక్రిష్ణ దర్శకుడు. వి.ప్రవీణ్‌కుమమార్ యాదవ్ నిర్మాత. శనివారం హైదరాబాద్‌లో చిత్రీకరణ మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి పరుచూరి వెంకటేశ్వరరావు క్లాపిచ్చారు. ఎన్.శంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "ఉత్కంఠ నిండిన ప్రేమకథ. ఆద్యంతం ఏం జరుగుతుందనే ఆసక్తిని రేకెత్తించేలా సన్నివేశాలుంటాయి. నటీనటులు కొత్తయినా పాత్రల్లో చక్కగా ఇమిడియపోయార"న్నారు. "తొలి ప్రయత్నంలోనే కొత్తకోణంలో సాగే పాత్ర దక్కింద"న్నారు కథానాయకుడు తనిష్క్‌రెడ్డి. నిర్మాత మాట్లాడుతూ "ఏకధాటిగా జరిపే షెడ్యూల్‌తో పూర్తి చేసి, త్వరలోనే విడుదల చేయాలనుకుంటున్నామ"న్నారు. ఈ చిత్రానికి సిద్ధార్థ్ సదాశివుని సంగీతం అందిస్తున్నారు. ఛాయాగ్రహణం: సతీష్ ముత్యాల

పంచ్ డైలాగ్

మనుషులు నకిలీ నోట్లను తయారు చేస్తారు. నోట్లు నకిలీ మనుషులను తయారు చేస్తాయి! చిత్రం: వేదం

- పంపినవారు: జి.సురేష్‌కుమార్ రాజు, ధనియానిచెర్వు, అనంతపురం

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

సినిమాలు చూడటంలో గిన్నిస్ రికార్డు!



ఇది విన్నారా!

రోజుకు నాలుగు ఆటలు నాన్‌స్టాప్‌గా సినిమాలు చూసే సినీ ప్రియులు చాలా మందే ఉంటారు. అయితే సినిమాలు వీక్షించడంలో సురేష్ జోచిమ్ అనే వ్యక్తి నెలకొల్పిన రికార్డు చూస్తే వామ్మో అనాల్సిందే. ఒక్క నిమిషం కూడా విరామం లేకుండా వరుసగా ప్రదర్శించే సినిమాలను అందరికన్నా ఎక్కువ సేపు ఎవరు చూడగలరంటూ 2015లో ఓ పోటీ నిర్వహించారు. అందులో శ్రీలంకకు చెందిన సురేష్ జోచిమ్ పాల్గొని విజేతగా నిలిచాడు. ఇంతకీ సురేష్ ఎంత సేపు సినిమాలు వీక్షించాడో తెలుసా... నిద్ర కూడా పోకుండా ఏకంగా ఐదు రోజుల పాటు! ఇంకా కచ్చితంగా చెప్పాలంటే 121 గంటల 18 నిమిషాల పాటు చూశాడు. దీంతో గిన్నిస్ రికార్డు అతని సొంతమైంది. ఇప్పటివరకూ ఆయన రికార్డును ఎవరూ బద్దలుకొట్టలేకపోయారు.

నా కోసం కాదు... నా వాళ్ల కోసం



అనుష్క

తెలుగులోనే కాదు, దక్షిణాదిన అత్యధిక పారితోషికం తీసుకొంటున్న కథానాయికల జాబితాలో అనుష్క పేరు కూడా ఉంటుంది. కోటి రూపాయల మార్క్‌ను అతి తక్కువ సమయంలోనే చేరుకోగలిగింది స్వీటీ. అయితే తన ప్రాధాన్యతలలో పారితోషికానిది చివరి స్థానమే అంటోందామె. "అనుష్క అంత తీసుకొంది, ఇంత తీసుకొంది అంటుంటారు. కాకపోతే ఇస్తానన్న డబ్బులు ఎగ్గొట్టిన వాళ్లూ ఉన్నారు. వాటి గురించి అస్సలు మాట్లాడుకోరు. అయినా నా నిర్మాత బాగుండాలి, నా సినిమా బాగుండాలి అనుకొంటా. డబ్బుల కోసం ఎప్పుడూ ఆలోచించలేదు. నేనెంత సంపాదిస్తున్నా, ఎంత దాచుకొంటున్నా అనే విషయాల్ని పెద్దగా పట్టించుకోను. నా అవసరాలకు సరిపడినంత ఉంటే సరిపోతుంది. మా ఇంట్లో వాళ్లు, నా స్నేహితులు 'నాకేదైనా కొని పెడతావా' అని అడిగితే... డబ్బుల కోసం చూసుకోకూడదు. వాళ్ల సంతోషమే నా సంతోషం. వాళ్ల కోరికలు తీర్చడమే నా ఆనందం. ఆ మేరకు సంపాదిస్తే చాలు" అంది అనుష్క.



రాక్‌స్టార్ బాబా



♦ ఆధ్యాత్మికత, ఆధునికతల కలబోత ♦ బహుముఖ పాత్రల్లో గుర్మీత్ రామ్ రహీంసింగ్

అతనో బాబా. ఒంటికి విభూతి పూసుకుని, ఎల్లప్పుడూ కాషాయ దుస్తుల్లో కనిపించే మిగతా బాబాల్లాంటి వాడు మాత్రం కాదు. రాక్‌స్టార్ బాబా. షోకిల్లా రాయుడు. సంప్రదాయ, ఆధునిక జీవన శైలిల కలబోత. సాధువు, సేవాతత్పరుడు, గాయకుడు, క్రీడాకారుడు, నటుడు, సంగీత దర్శకుడు, పాటల రచయిత... ఇలా రకరకాల పాత్రల్ని తనలో ఇముడ్చుకున్న వింత మనిషి. రీలు జీవితం- రియల్ జీవితం మధ్య హద్దులు చెరిపేసిన వ్యక్తి. అతని ఆహార్యం విలక్షణం. జిగేల్‌మనిపించే డ్రెస్సుల్లో వెలిగిపోతుంటాడు. ఖరీదైన రంగురంగుల దుస్తులు, ఆభరణాల్ని ధరించి చూపరుల్ని ఇట్టే ఆకట్టుకుంటాడు.గ్లైడింగ్ చేస్తూ.. గాల్లో నుంచి కిందికి దుముకుతాడు. అత్యంత ఖరీదైన బైక్‌లపై సవారీ చేస్తాడు. ఈ బాబాలాగానే అతను నడిపే వాహనాలూ రకరకాల అలంకరణలతో విచిత్రంగా కనిపిస్తుంటాయి. వింత వింత వేషధారణలతో ఇతను తెరపై కనిపిస్తుంటాడు. డేరా సచ్చా సౌధా(డీఎస్ఎస్) అధిపతి గుర్మీత్ రామ్ రహీంసింగ్ జీవన చిత్రమిది!

లక్షల కొద్దీ అనుచరులు

హరియాణాలోని సిర్సా కేంద్రంగా పనిచేస్తున్న డీఎస్ఎస్ అధిపతి రామ్ రహీంకు పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లలో లక్షల సంఖ్యలో అనుచరులున్నారు. వారందరికీ అతనో దేవుడు. ఓ సూపర్‌స్టార్. అతని మాట వారికి వేద వాక్కు. గుర్మీత్ అడుగుజాడల్లో నడిస్తే జీవితం ధన్యమైనట్లు భావిస్తారు.

ఆధ్యాత్మికంతో పాటు, వ్యాపార కార్యకలాపాల్లోనూ గుర్మీత్ రాటుదేలాడు. 'ఎంఎస్‌జీ' పేరుతో స్వదేశీ, సేంద్రీయ ఉత్పత్తుల్ని రెండేళ్ల నుంచి గుర్మీత్ బృందం విక్రయిస్తోంది. గుర్మీత్ పిల్లలు సిర్సా కేంద్రం నుంచే ఈ వ్యాపారాలు చూస్తుంటారు. కాస్మోటిక్స్, హెయిర్‌ఆయిల్, చాక్లెట్లు, దుస్తులు, బ్యాటరీలు, బిస్కెట్లు, కిరాణా సామగ్రి.. ఇలా వందలకొద్దీ ఉత్పత్తుల్ని విక్రయించడంతో పాటు, పాఠశాలలు, ఆసుపత్రుల నిర్వహణలాంటివి ఎన్నో వీరి వ్యాపార సామ్రాజ్యంలో విస్తరించి ఉన్నాయి. 11 పాఠశాలలు, రెండు కాలేజీల్ని(ఇందులో ఒకటి మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్) నిర్వహిస్తున్నారు. సిర్సా హెడ్‌క్వార్టర్‌లోనే చాక్లెట్ల తయారీ ఫ్యాక్టరీలున్నాయి. డేరా సచ్చా సౌధా సంస్థ అయిన 'ఎంఎస్‌జీ ఆల్ ట్రేడింగ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్' దాదాపు 151 ఉత్పత్తుల్ని మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 'ప్రేమీలు'గా పిలిచే డేరా అనుచరులే వీటిని ఎక్కువగా వాడుతుంటారు. సిర్సాలో ఓ ఆయుర్వేదిక్ కేంద్రం, నేచురోపతి ఇన్‌స్టిట్యూట్, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్వహిస్తున్నట్లు డేరా వెబ్‌సైట్ చెబుతోంది. హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో విద్యాసంస్థలున్నాయి. వీటిలో నామమాత్రపు ఫీజుల్ని వసూలుచేస్తుంటారు.

వ్యవసాయ కుటుంబంలో జన్మించి...

గుర్మీత్ 1967 ఆగస్టు 15వ తేదీన రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లా శ్రీగురుసర్ మోడియా గ్రామంలో మగర్ సింగ్, నజీబ్ కౌర్ దంపతులకు జన్మించాడు. అతని తండ్రి ఓ భూస్వామి. చిన్నతనంలో గుర్మీత్ వ్యవసాయ పనుల్లో తన తండ్రికి సహకరించేవాడు. తన ఏడో ఏట నుంచే ఆధ్యాత్మికత వైపు నెమ్మదిగా మళ్లాడు. దీంతో సిర్సాలోని డేరా సచ్చా సౌధా అధిపతి షా సత్నాం సింగ్ ఇతన్ని తన డేరాకు తీసుకువచ్చి రామ్ రహీంగా పేరు మార్చాడు. 1990 సెప్టెంబరు 23న తన అనుచరుడిగా ప్రకటించారు. అప్పట్నుంచి గుర్మీత్ రామ్ రహీం డేరా అధిపతిగా ఉన్నాడు. కేవలం పదోతరగతి వరకు మాత్రమే చదువుకున్న గుర్మీత్- హర్జీత్ కౌర్ అనే మహిళను పెళ్లిచేసుకున్నాడు. వారికి చరణ్‌ప్రీత్, అమన్‌ప్రీత్ అని ఇద్దరు కూతుళ్లు, జస్మీత్ అనే కొడుకు ఉన్నారు. హనీప్రీత్ ఇన్సాన్ అనే ఓ బాలికనూ గుర్మీత్ దత్తత తీసుకున్నాడు. ఆమె నటి, దర్శకురాలు.

వివాదాల పుట్ట

గుర్మీత్‌పై 2002లో తొలిసారిగా వివాదాలు, అత్యాచారం, హత్య, బలవంతపు ఆపరేషన్లలాంటి నేరారోపణలు మొదలయ్యాయి. 2002లోనే తన అనుచర మహిళల్ని వశపరుచుకుని లైంగిక వాంఛ తీర్చుకున్నారన్న కేసు నమోదయింది. ఆ తర్వాత ఇద్దరు సాధ్వీలతో లైంగిక వాంఛలు తీర్చుకున్నారంటూ వెలుగులోకి వచ్చిన ఓ లేఖ ప్రస్తుతం అతనిపై అభియోగాలు నమోదుకావడానికి కారణమైంది. అప్పటి ప్రధాని వాజ్‌పేయికి ఓ బాధితురాలు ఈ లేఖ రాశారు. డేరా సచ్చా కార్యకలాపాల్ని రిపోర్ట్ చేస్తున్న రాంచందర్ ఛత్రపతి అనే జర్నలిస్టును 2002లో హత్యచేసినట్లు గుర్మీత్‌పై అభియోగం నమోదయింది. ఓ అడ్వర్‌టైజ్‌మెంట్‌లోపదో సిక్కు గురువు గోవింద్‌సింగ్‌లాగా గుర్మీత్ వేషం ధరించినందుకు 2007లో పంజాబ్, హరియాణాలలో అనేక రోజుల పాటు హింస చెలరేగింది. ఆ తర్వాత ఈ కేసును కోర్టులు కొట్టేశాయి. సిక్కులు, డేరాల మధ్య గొడవల్ని ఖలిస్థాన్ అనుకూల వర్గాలు సొమ్ముచేసుకున్నాయనేది ప్రచారం. డేరా అనుచరులు ఆత్మాహుతి దళాలంటూ ఓ కేసు కూడా నమోదయింది.

ఎన్ని వివాదాలున్నప్పటికీ... అనుచరుల్లో గుర్మీత్‌కు విపరీతమైన పలుకుబడి ఉంది. అనుచరులతో కలిసి అతను ఎల్లప్పుడూ ఖరీదైన వాహనాల్లో తిరుగుతుంటాడు. రేంజ్ రోవర్ ఎస్‌యూవీలో గుర్మీత్ వెళుతుంటే.. దాదాపు వంద వాహనాలు(ఇందులో 16 ఫోర్డ్ ఎండీవర్‌లు) వెంట వెళుతుంటాయి. గతంలో సిక్కు తీవ్రవాదుల హిట్‌లిస్ట్‌లో ఉన్నాడు. దేశంలో జెడ్ కేటగిరీ భద్రత పొందుతున్న 36 మంది అత్యంత ప్రముఖుల్లో గుర్మీత్ ఒకరు(కోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పుడు దానిని ఉపసంహరించారు). బిగ్‌బాస్-9లో పాల్గొనడానికి ఒక దశలో అతను సమ్మతి తెలిపాడు. అయితే అనుచరుల్ని కలుసుకోవడానికి ప్రతి రెండు మూడు గంటలకోసారి తనను బయటికి పంపించాలని అతను షరతు విధించాడు.

సిర్సా... అదో అడ్డా

సిర్సాలో ఉన్న డేరా సచ్చా సౌధా ప్రధానకేంద్రం దాదాపు వెయ్యి ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. ఇందులోనే పాఠశాల, క్రీడాగ్రామం, ఆసుపత్రి, సినిమా హాలు తదితరాలున్నాయి. పితాజీ(గుర్మీత్) సందేశాలు వినడానికి వివిధ ప్రాంతాల నుంచి వేలమంది 'ప్రేమీ'లు సిర్సా ప్రధాన కేంద్రానికి వస్తుంటారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులూ వచ్చిపోతుంటారు. ఎన్నికల్లో ఎవరికి మద్దతివ్వాలన్న దానిని తన రాజకీయ విభాగానికి గుర్మీత్ వదిలిపెడుతుంటారు. 2014 ఎన్నికల్లో హరియాణాలో భాజపాకు డేరా రాజకీయ విభాగం మద్దతిచ్చింది. 2007 పంజాబ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బలపరిచింది.

సినిమా నటుడిగా...

గుర్మీత్‌కు ఉన్న ఇతర ఆసక్తులు, వ్యాపకాల్లో సినిమా అత్యంత ముఖ్యమైనది. దాదాపు నాలుగు సినిమాలకు దర్శకత్వం వహించి, నటించాడు. మొదటి సినిమా పేరు 'మెసెంజర్ ఆఫ్ గాడ్'. ఈ సినిమాల్లో ప్రమాదకరమైన స్టంట్‌లు చేయడం ద్వారా అనుచరుల గుండెల్లో సూపర్‌హీరో స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఈ నాలుగు సినిమాలు దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూలుచేశాయని అతని అనుచరులు చెబుతారు. ఐదో సినిమా ఈ ఏడాది విడుదల కావాల్సి ఉంది. దాదాపు అరడజను అల్బంలను గుర్మీత్ విడుదల చేశాడు. అతనే స్వయంగా సంగీతాన్ని సమకూర్చిన, దర్శకత్వం వహించినవి ఇవన్నీ. 'రూ-బా-రూ నైట్స్' పేరుతో దాదాపు వంద కచేరీలను కూడా అతను నిర్వహించాడు. ఆధునిక రూపంలో సందేశాన్ని అందివ్వడం తన వ్యూహమని గుర్మీత్ చెబుతాడు.



సేవా కార్యక్రమాల్లో...

నిస్వార్థ సేవ చేయడంలో తమ అధిపతి లక్షల మందికి స్ఫూర్తిగా నిలిచారని గుర్మీత్ అనుచరులు చెబుతారు. రక్తం, అవయవ దానాలు, పేదలకు విద్యాబోధనలాంటి కార్యకలాపాల్ని గుర్మీత్ అనుచరులు చేస్తుంటారు. రాయితీ ధరలకు ఆహారం, ఉచిత మందులు అందివ్వడం కూడా వీరివైపు చాలా మంది ఆకర్షితులు కావడానికి కారణం. సిర్సా కేంద్రంలో, జిల్లా యూనిట్లలో సభ్యులకు రాయితీ ధరలకు తిండిగింజల్ని అందిస్తారు. ఇది పేదలకు వరం. డేరాలు సంగ్రూరు, బర్నాలా, మానస, బటిండా, ఫజిల్కా, ఫరీద్‌కోట్, ఫిరోజ్‌పూర్ జిల్లాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించారు. ఈ ప్రాంతాల్లో కేన్సర్, మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు ఎక్కువ. ఇలాంటి వారందరికీ డేరా అనుచరులు ఉచిత చికిత్స అందిస్తుంటారు.



ఏమిటీ డేరా సచ్చా సౌధా?

అనుచరుల భాషలో చెప్పాలంటే.. సచ్చా సౌధ అంటే 'సత్యాన్ని పలికే ప్రదేశం' అని అర్థం. మస్తానా బలూచిస్థానీ అనే వ్యక్తి 1948లో దీనిని ప్రారంభించారు. దేశవ్యాప్తంగా దీనికి దాదాపు 50 ఆశ్రమాలున్నాయి. దాదాపు 4 కోట్ల మంది అనుచరులుంటారని చెబుతారు.

డేరా అనుచరులెవ్వరు?

డేరా బాబా అనుచరుల్లో ఎక్కువమంది వెనుకబడిన కులాలు, తెగలకు చెందిన వారు. ముఖ్యంగా దళితులు, అణగారిన వర్గాల వారు. అన్ని కులాలకూ సమానత్వ హోదా ఇవ్వడం వల్లనే ఎక్కువమంది ఇటువైపు మొగ్గుతున్నారు. ప్రతి ఒక్కరి పేరు పక్కన 'ఇన్సాన్' అని చేర్చుకుంటారు. ఇది మానవత్వానికి నిదర్శనమంటారు. రాష్ట్రాన్ని జోన్లు, యూనిట్లుగా విభజించి, ప్రతి యూనిట్‌కు ఒక 'భంగీ దాస్'ను నియమిస్తారు. భంగీ అనేమాట నిమ్నజాతుల వారిని ఉద్దేశించినది. అందుకే అట్టడుగు వర్గాల వారు దీనినో గౌరవంగా భావించి, ఇటువైపు వస్తున్నారు. పంజాబ్, హరియాణాల్లో భూస్వాములైన జాట్‌ల ఆధిపత్యం ఎక్కువ. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ లాంటి వాటిలో జాట్ తదితర అగ్రవర్ణాల సిక్కులున్నారనే వాదన ఉంది. అందుకే డేరా సచ్చా సౌధాలాంటి వాటివైపు దళితులు, ఇతర వెనుకబడిన తరగతుల వారు మొగ్గుచూపుతున్నారు. తమ విశ్వాసాల్ని గుర్మీత్ కించపరుస్తున్నారని ప్రధాన సిక్కు మతనేతలు ఆరోపిస్తుంటారు. మాదకద్రవ్యాలు, మత్తుపానీయాలకు వ్యతిరేకంగా డేరాలు గళం విప్పుతారు కాబట్టి మహిళల్లో వీరికి విపరీతమైన మద్దతు ఉంది.

-ఈనాడు ప్రత్యేక విభాగం

అల్లర్ల నియంత్రణలో కేంద్రం వైఫల్యం: సురవరం

ఈనాడు, హైదరాబాద్: డేరా సచ్చాసౌధా అధిపతి గుర్మీత్‌సింగ్‌ను దోషిగా తేలుస్తూ సీబీఐ కోర్టు తీర్పు వెలువరించిన తర్వాత పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో జరిగిన హింసాత్మక ఘటనలకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యం కన్పిస్తోందని, అల్లర్లు జరుగుతాయని ముందే తెలిసినా నియంత్రించలేకపోయిందని సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి విమర్శించారు. సాధారణ పరిస్థితుల్ని పునరుద్ధరించేందుకు కఠినచర్యలు తీసుకోవాలని, హరియాణా సీఎంను తొలగించాలని కోరారు. పార్టీ తెలంగాణ కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో కలిసి శనివారమిక్కడ సురవరం మాట్లాడారు. ముమ్మారు తలాక్, వ్యక్తిగత గోప్యతపై సుప్రీంకోర్టు తీర్పులను సీపీఐ స్వాగతిస్తోందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అవినీతి విషయంలో ప్రత్యర్థుల పట్ల ఒకలా తమవారిపట్ల మరోలా వ్యవహరిస్తోందన్నారు. "పనామ పత్రాల వ్యవహారంలో విదేశాల్లో డబ్బులు దాచినట్లు వెల్లడైన పాకిస్థాన్ ప్రధాని నవాజ్‌షరీఫ్, ఐస్‌లాండ్ ప్రధాని పదవుల్ని కోల్పోయారు. భారతదేశం నుంచి 500 మంది పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. విదేశాల్లో రూ.వేలకోట్లు దాచుకున్న వీరిని కాపాడేందుకు ప్రయత్నిస్తోంది. భాజపాకు చెందినవారు, ఆ పార్టీకి సన్నిహితులుగా ఉండటమే కారణం' అని సురవరం ఆరోపించారు. నంద్యాల ఉపఎన్నిక ఫ్యాక్షన్‌పోరులా సాగిందన్నారు. కేంద్ర నిర్ణయాలకు వ్యతిరేకంగా నెల పాటు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు.

నల్గొండ జిల్లాలో 'డేరా' భూములు

- చర్చనీయాంశమైన రాంరహీంసింగ్ ఆశ్రమ వ్యవహారం
- వెలిమినేడులో 56 ఎకరాల కొనుగోలు
- 7.24 ఎకరాల అసైన్డ్ భూములూ ఉన్నట్లు ఆరోపణలు

చిట్యాల - న్యూస్‌టుడే

నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో 'డేరా సచ్చా సౌదా' పేరుతో ఉన్న భూముల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. వివాదాస్పద హరియాణా ఆధ్యాత్మిక గురువు గుర్మీత్ రాంరహీం సింగ్‌పై వచ్చిన నేరారోపణలపై అక్కడి కోర్టు వెలువరించిన తీర్పుతో శుక్రవారం ఇక్కడి భూములపై సర్వత్రా చర్చ మొదలయింది. గుర్మీత్ రాంరహీంసింగ్‌కు చెందిన 'డేరా సచ్చా సౌదా' పేరుతో వెలిమినేడులో సుమారు 56 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిని ప్రజలకు సేవ చేసే పేరుతో 2007 నుంచి పలు దఫాలుగా ఇక్కడ కొనుగోలు చేశారు.





వెలిమినేడులోని 'డేరా సచ్ఛా సౌదా' ఆశ్రమ ప్రహరీ ★ లోపల నిర్మించిన తాత్కాలిక గృహం

ఇందులో కొన్ని తాత్కాలిక గదులు నిర్మించారు. ఇవి కాకుండా 7.24 ఎకరాల అసైన్డ్ భూములు కూడా వీరి అధీనంలో ఉన్నాయని, వాటిని కలుపుకొని ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్థులు జనవరిలో మండల రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారిణి అసైన్డ్ లబ్ధిదారులకు, ఆశ్రమ నిర్వాహకులకు ఫారం 1, ఫారం 2 నోటీసులు జారీచేశారు. ఆరోపణలు వచ్చిన భూమిలో చేపట్టిన నిర్మాణాలను నిలిపి అసైన్డ్ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానిక వీఆర్వో, ఆర్ఐలకు ఫిబ్రవరిలో మెమో ఇచ్చారు. ఆశ్రమ నిర్వాహకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ వ్యవహారం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

అసైన్డ్ భూముల వివరాలివీ..

సర్వేనంబరు 98లో 3.30 ఎకరాలు, 102లో 1.34 ఎకరాలు, 132లో రెండెకరాలు.. మొత్తం 7.24 ఎకరాల అసైన్డ్ భూములు ఇందులో ఉన్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే ప్రధాన జాతీయ రహదారి వెంట రహదారి పక్కనే హైదరాబాద్‌కు 63 కి.మీ దూరంలో ఇక్కడ ఆశ్రమం కోసం భూమి కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఆశ్రమం నిర్మిస్తారనే విషయం మినహా చుట్టుపక్కల రైతులకు కూడా దీనిపై ఎలాంటి సమాచారం లేదు. అసైన్డ్ భూమితో కలిపి సుమారు 63 ఎకరాల భూమి ఉంది. హరియాణాకు చెందిన ఆధ్యాత్మిక గురువు వెలిమినేడులో భూములను ఎందుకు కొనుగోలు చేశారనేదీ గోప్యంగా ఉంచారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా హైదరాబాద్ నుంచి ఇక్కడి వ్యవహారాలు చూసే వ్యక్తి ఒకరు వచ్చి జాతీయజెండా ఎగురవేసి వెళ్లడం తప్ప ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగిన దాఖలాల్లేవని స్థానికులు చెబుతున్నారు. హరియాణాలోని గుర్మీత్‌రాంరహీం సింగ్ ఆశ్రమాన్ని పరిచయంచేసే పేరుతో 2010 జనవరిలో వెలిమినేడు, పరిసర ప్రాంత ప్రజాప్రతినిధులు సుమారు వందమందిని ఆశ్రమ నిర్వాహకులు హరియాణాకు సొంత ఖర్చుతో తీసుకెళ్లారు. రాంకీ సంస్థ వెలిమినేడులో రైతులకు తెలియకుండానే వారి భూములను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయాన్ని ఇటీవల 'ఈనాడు-ఈటీవీ' వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. దీనిపై ఇంకా అధికారులు ఎటూ తేల్చకముందే వివాదాస్పద 'డేరా సచ్ఛా సౌదా ' భూముల వ్యవహారం వెలుగులోకి రావడంతో మరోసారి వెలిమినేడు గ్రామం అందరి దృష్టినీ ఆకట్టుకుంటోంది.

తహసీల్దారు సందర్శన

వెలిమినేడు శివారులోని డేరాసచ్ఛాసౌదాకు చెందిన భూమిని శనివారం చిట్యాల తహసీల్దారు సీహెచ్ విశాలాక్షి సందర్శించారు. భూములను, రెవెన్యూ దస్త్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ అసైన్డ్ భూములు ఆశ్రమ ప్రహరీలోపల ఉన్నాయని ఒక వర్గం వారు న్యాయస్థానానికి వెళ్లడంతో.. ఒకసారి భూమి కొనుగోలు చేసినవారి వాదన విని తుది నిర్ణయం ప్రకటించాలని న్యాయస్థానం తమను ఆదేశించిందని పేర్కొన్నారు. రెవెన్యూ దస్త్రాల్లో 7.24 ఎకరాలను ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ పట్టాదారు కాలమ్‌లో 'తహసీల్దారు, చిట్యాల' అని ఈ ఏడాది ఏప్రిల్ 20న సవరించారని పేర్కొన్నారు. ఆశ్రమ ప్రహరీ నిర్మాణానికి పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులూ లేవని వెలిమినేడు పంచాయతీ కార్యదర్శి ఎండీ యూసుఫ్ తెలిపారు.



కర్ఫ్యూ విధించడంతో సిర్సాలోని డేరా సచ్ఛా సౌధాకు సమీపాన కాపలా కాస్తున్న సైనికులు



కర్ఫ్యూ విధించడంతో నిర్మానుష్యమైపోయిన సిర్సా రైల్వేస్టేషన్

ముందే దాడులకు సిద్ధపడ్డారు!

- రుజువుచేస్తున్న ఆడియో టేపులు!

దిల్లీ: డేరా సచ్చా సౌదా సారథిగా ఉన్న గుర్మీత్ రాం రహీం సింగ్‌కు వ్యతిరేకంగా సీబీఐ కోర్టు తీర్పు వస్తుందని ఊహించిన డేరా మద్దతుదారులు విధ్వంసం సృష్టించడానికి ముందే సిద్ధ పడ్డారు. ఆ విషయాన్ని రుజువుచేస్తూ.... డేరా గుర్మీత్ మద్దతుదారులు ఇద్దరి మధ్య జరిగిన సంభాషణల టేపులు వెలుగు చూశాయి. డేరా గుర్మీత్ అరెస్టయిన వెంటనే పంచకుల, సిర్సాల్లో చెలరేగిన హింస 36 మందిని బలితీసుకున్న విషయం గమనార్హం. ' 'బాబా(గుర్మీత్ రాం రహీం)పేరు ప్రస్తావించకుండా జాగ్రత్తగా ఉండాలనీ...తాను చెప్పిన ఈ విషయాలన్నిటినీ తు,చ తప్పకుండా అమలు చేయాలన్న'ది ఓ వ్యక్తి మరోవ్యక్తితో జరిపిన సంభాషణ సారాంశంగా ఉంది. 'ఇంతకీ మనం దాడులు చేయాలా? వద్దా? ' అని ఆ రెండో వ్యక్తి ప్రశ్నించాడు. అందుకు అవతలి వ్యక్తి సానుకూలంగా స్పందించాడు. " నువ్వు దాడి చేసి తీరాల్సిందే. ఒకవేళ ఎవరైనా విలేకరి చూసి అడిగితే మాత్రం...నీ అంతట నువ్వే వచ్చానని చెప్పు!' అంటూ ఓ మెలిక కూడా పెట్టాడు. సంభాషణను కొనసాగించిన రెండో వ్యక్తి మొదటి వ్యక్తిని ఉద్దేశించి మాట్లాడుతూ..." తమ సొంతంగానే అక్కడికి వచ్చినట్లుగా పిల్లలు కూడా చెప్పేలా వారివారి తలిదండ్రులకు గట్టిగా సూచనలివ్వండి" అన్నాడు. గుర్మీత్‌పై సీబీఐ కోర్టు తీర్పు వెలువరించడానికి కనీసం మూడురోజుల ముందు నుంచే పంచకుల...సమీప ప్రాంతాల్లో భారీ ఎత్తున గుమికూడిన జనసందోహంలో మహిళలు, పిల్లలు ఉన్న విషయం ఈ సంభాషణ నేపథ్యంలో గమనార్హం.



పంచకులలో గుర్మీత్ రామ్ రహీం మద్దతుదారులు ధ్వంసం చేసిన వాహనాలు

ఇక, అంత భారీ సంఖ్యలో జనం గుమికూడటం కూడా హఠాత్తుగా జరిగినదేమీ కాదు. వందలాది మందికి ముందే భోజనాల ఏర్పాట్లు జరిగిపోయాయి. అదే విషయాన్ని ధృవీకరించే ఓ సంభాషణ కూడా ఆ టేపుల్లో ఉంది. " అన్నీ వస్తువులను దాచిపెట్టండి. ఎవరికీ చూపకండి. అవసరమైనప్పుడు వినియోగించండి' అన్నది ఆ సంభాషణ సారాంశంగా ఉంది. అంటే..., డేరా గుర్మీత్ అరెస్టు నేపథ్యంలో జరిగిన సంఘటనలన్నీ ముందుగా పక్కా ప్రణాళిక ప్రకారం సిద్ధం చేసుకున్నవేనన్నది గమనార్హం.

2014లో హిస్సార్ సమీపంలోని సత్లోక్ ఆశ్రమం వద్ద జరిగిన రాంపాల్ ఘటన పునరావృతం కాకూడదనే హరియాణా సర్కారు మనసారా కోరుకుంది. ఆ నాటి ఘటనలో రాంపాల్ అనుచరులు పోలీసులను ఆశ్రమంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆ సందర్భంగా హింసాత్మకసంఘటనలు జరిగిన సంగతి గమనార్హం. అందుకే, గుర్మీత్ విషయంలో ఎక్కడా ప్రాణనష్టం అనేది జరగకుండా చూడాలని ప్రభుత్వం గట్టిగా సంకల్పించినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గుర్మీత్‌ను న్యాయస్థానానికి రప్పించేందుకు ఏం చేయాలనే దానిపై ముఖ్యమంత్రి ఖట్టర్... ఆయన మంత్రివర్గ సభ్యులు, సీనియర్ బ్యూరోక్రాట్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఇంటెలిజెన్స్ విభాగాలతో పుంఖానుపుంఖాలుగా చర్చలుజరిపింది. ఎప్పటికప్పుడు కేంద్రానికి సమాచారాన్ని అందించింది.

డేరా అధిపతిని సమర్థించిన భాజపా ఎంపీ

వివాదం రేపిన సాక్షి మహరాజ్ వ్యాఖ్యలు

దిల్లీ: వివాదాస్పదుడైన డేరా సచ్చా సౌధా అధిపతి గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను భాజపా ఎంపీ సాక్షి మహరాజ్ సమర్థించారు. గుర్మీత్‌సింగ్ చాలా సాధారణ వ్యక్తి అనీ, కోట్లాది మంది అనుచరులున్న వ్యక్తిపై ఒక్క వ్యక్తి మాత్రం అత్యాచార ఆరోపణలు చేశారనీ చెప్పారు. సింగ్‌ను అనుసరిస్తున్న కోట్లాదిమంది తప్పు చేసినట్లేనా అని ప్రశ్నించారు. "సింగ్ సాదాసీదా వ్యక్తి కాబట్టే సమన్లు ఇచ్చారు. జామా మసీదు ఇమామ్‌కు సుప్రీంకోర్టు, హైకోర్టు ఎందుకు సమన్లు ఇవ్వవు? అతనేమైనా బంధువా ఏమిటి? " అని ఆయన ప్రశ్నించారు. సాక్షి మహరాజ్ వ్యాఖ్యలపై అనేక పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.

ఖట్టర్‌ను తొలగించాల్సిందే: డేరా ఉదంతం నేపథ్యంలో హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌పై వేటు వేయాలని కాంగ్రెస్, సీపీఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేశాయి. ఖట్టర్‌ను తొలగించి, రాష్ట్రపతి పాలన విధించాలని హరియాణా మాజీ ముఖ్యమంత్రి హుడా, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తదితరులు శనివారం డిమాండ్ చేశారు. పరిస్థితిని అదుపు చేయడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఖట్టర్ సహా అనేకమంది భాజపా నేతలు గుర్మీత్‌సింగ్ ఆశీస్సులు పొందినవారేననీ, అందుకే దాడులపై సానుభూతితో వ్యవహరిస్తున్నారనీ సీపీఎం ఆరోపించింది. ఖట్టర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ శుక్రవారమే డిమాండ్ చేశారు.

బాబోయ్ బాబాలు

● అత్యాచారాలు, హత్య కేసుల్లో ఎందరో నిందితులు ● శిష్యురాళ్లపైనే అఘాయిత్యాలు

భక్తుల దృష్టిలో వారు పరమ పూజ్యులు... దైవాంశ సంభూతులు. నిరాడంబర జీవనం గడుపుతూ అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాల్సిన వారు. కానీ అనుచర గణం పెరిగే కొద్దీ వారి బుద్ధి మారిపోతోంది. తమ ఆహార్యంతో, ప్రవచనాలతో వందలు, వేల సంఖ్యలో అనుచరులను తయారు చేసుకోవటం, ఆశ్రమాలు కట్టుకోవటం, సొమ్ము కూడబెట్టుకోవటం సర్వ సాధారణంగా మారింది. చెప్పేది భక్తి మార్గం... కానీ చేసేది నమ్మక ద్రోహం. భక్తురాళ్లను, అనుచరులను ఇష్టానుసారం వాడుకుంటారు. హత్యలు, అత్యాచారాలు చేసే బాబాలకు కూడా కొదవ ఉండటం లేదు. తమని తాము చట్టానికి అతీతులుగా భావిస్తూ ఇష్టానుసారం వ్యవహరించే బాబాలకు ఏదో ఒకరోజు పాపం పండుతోంది. అటువంటి వారు చట్టానికి చిక్కి జైలు ఊచలు లెక్కించక తప్పటం లేదు. డేరా సచ్చా సౌధా ఛీఫ్ గుర్మీత్ రామ్ రహీం ఉదంతం దీనికి తాజా ఉదాహరణ. ఇటువంటి వివాదాస్పదమైన బాబాలు ఎందరో గతంలో కేసులు, విచారణ ఎదుర్కొన్నారు. జైలు పాలయ్యారు. బాబాల నేరప్రవర్తనకు సంబంధించి ఎప్పటికప్పుడు కొత్త వివాదాలు, కేసులు పుట్టుకొస్తూ ఉండటమే విచిత్రమైన విషయం.

గుర్మీత్ రామ్ రహీం



కేవలం భక్తి, సేవా కార్యక్రమాలకు మాత్రమే పరిమితం అయినట్లయితే గుర్మీత్ రామ్ రహీం కటకటాల పాలవ్వాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. కానీ తన భక్తురాళ్లైన మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఆయన స్థాయిని దిగజార్చాయి. పదిహేనేళ్ల క్రితం నమోదైన కేసులో ఆయన కటకటాల పాలు కావలసి వచ్చింది. ఆయన జీవన శైలి, చర్యలు, నిర్ణయాలు ఎన్నో సందర్భాల్లో వివాదాస్పదంగా మారాయి. గుర్మీత్ రామ్ రహీం 2007లో సిక్కుల మత గురువైన గురు గోవింద్ సింగ్ రూపంలో ప్రకటనల్లో కనిపించటం పెద్ద వివాదానికి తావిచ్చింది. పంజాబ్‌లో దీనిపై పెద్దఎత్తున అల్లర్లు చెలరేగాయి. రెండు హత్యా కేసుల్లోనూ ఆయన విచారణను ఎదుర్కొంటున్నారు. డేరా అనుచరుడైన రంజిత్ సింగ్, జర్నలిస్ట్ రామ్ చందర్ ఛత్రపతి ఒకే ఏడాదిలో హత్యకు గురయ్యారు. ఈ సంఘటనల్లో గుర్మీత్ రామ్ రహీం పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆశారామ్ బాపు




భక్తి యోగ పేరుతో ప్రాచుర్యం లోకి వచ్చిన ఆశారామ్ బాపు ప్రస్తుత పాకిస్థాన్‌లో సింధ్ ప్రాంతంలో జన్మించారు. 1973లో అయిదుగురు అనుచరులతో ఆశ్రమాన్ని స్థాపించారు. దేశవిదేశాల్లో ఆయనకు 425 ఆశ్రమాలు ఉన్నాయి. తన డెబ్భై ఏళ్ల వయస్సులో లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొని జైలు పాలయ్యారు. 2012లో జోథ్‌పూర్‌లోని తన ఆశ్రమంలో 16 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై కేసు నమోదైంది. ఆ తర్వాత ఎంతో మంది ముందుకు వచ్చి ఆశారామ్ బాపు అత్యాచారాలను పూసగుచ్చినట్లు చెప్పారు. తాము నోరుతెరిస్తే చంపేస్తామని బెదిరించే వారని బాధితులు వాపోయారు. ఆశారామ్ బాపుతో పాటు ఆయన కుమారుడు నారాయణ సాయి కూడా మహిళలపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొని జైలు పాలయ్యారు. తండ్రీ కొడుకులిద్దరిపై భూఆక్రమణ కేసులు ఉన్నాయి. అంతేగాక 2008లో సబర్మతీ నదీ తీరంలో శవాలై కనిపించిన ఇద్దరు పిల్లల హత్య కేసుల్లో బాపు, ఆయన కుమారుడిని పోలీసులు విచారించారు.

స్వామి నిత్యానంద



స్వామి నిత్యానంద అసలు పేరు రాజశేఖరన్. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ధ్యానపీఠ ఆశ్రమాలు స్థాపించి వెలుగులోకి వచ్చారు. తనను దైవంగా భావిస్తూ భక్తులను ఆకర్షించారు. బొమ్మలకు ప్రాణప్రతిష్ఠ చేస్తానని అనుచరులకు నమ్మబలికేవారు. తన ఆశ్రమయంలో భారతీయ అమెరికన్ శిష్యురాలిపై అత్యాచారం చేసినట్లు వచ్చిన ఆరోపణలపై ఆయనపై కేసు నమోదైంది. 2010లో ఒక తమిళ సినీ నటితో స్వామి నిత్యానంద అసభ్యంగా ప్రవర్తించిన వీడియో దృశ్యాలు బయటకు రావటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో వివిధ వర్గాల ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది. భూముల ఆక్రమణ, తనను అనుమానించిన వారిని వేధించటం తరహా ఆరోపణలెన్నో ఆయనపై ఉన్నాయి.

సంత్ రాంపాల్



హరియాణా లోని ధనానాలో ఆశ్రమాన్ని స్థాపించి ఎంతో మందిని తన భక్తులుగా మార్చుకున్న సంత్ రాంపాల్ పోలీసులు తన ఆశ్రమంలోకి అడుగుపెట్టకుండా ఆ భక్తులనే రక్షణ కవచంగా వాడుకొని దేశవ్యాప్తంగా విమర్శల పాలయ్యారు. ఆర్యసమాజ్ పవిత్ర గ్రంథమైన 'సత్యార్థ ప్రకాష్' లోని కొన్ని భాగాలను ఆయన వ్యతిరేకించి విమర్శలు చేశారు. దీనిపై పెద్దఎత్తున అల్లర్లు చెలరేగాయి. ఈ గొడవల్లో ఒక యువకుడు చనిపోగా ఎందరో గాయాల పాలయ్యారు. రాంపాల్‌పై పోలీసులు హత్యా కేసు నమోదు చేశారు. ఇదే కాకుండా ఆశ్రమం కోసం భూఆక్రమణకు పాల్పడ్డారనే ఆరోపణలు, విచారణను ఎదుర్కొన్నారు. తనపై నమోదైన కేసుల్లో విచారణ నిమిత్తం హాజరు కాకపోవటంపై ఎన్నోసార్లు న్యాయస్థానాల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది. అనుచరులు అల్లర్లకు పాల్పడతారనే ఆందోళనతో పలు సందర్భాల్లో ఆయనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు లభించింది. ఆయనపై తన అనుచరులైన మహిళా సాధ్వీలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి.

స్వామి వికాసానంద్

మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో స్వామి వికాసానంద్ అలియాస్ వికాస్ జోషి మీద ఎన్నో ఆరోపణలు వచ్చాయి. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఇందులో ముఖ్యమైనవి. యువతులపై అత్యాచారాలకు పాల్పడటమే కాకుండా వారితో నగ్న చిత్రాలు తీసినట్లు ఆరోపణలు ఎదుర్కొని కటకటాల పాలయ్యారు.

చంద్రస్వామి



తాంత్రిక్‌గా పేరు పొందిన చంద్రస్వామి మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు సన్నిహితుడు. దిల్లీ సమీపంలోని కుతుబ్ ఇనిస్టిట్యూషనల్ ప్రాంతంలో ఆశ్రమాన్ని నిర్మించుకున్నారు. చంద్రస్వామి చుట్టూ ఎన్నో వివాదాలు ఉన్నాయి. విదేశీ మారక ద్రవ్య నిబంధనలను ఉల్లంఘించినట్లు వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు విచారించింది. ఇటువంటి 13 కేసుల్లో ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 9 కోట్ల అపరాధ రుసుము విధించింది. లండన్‌కు చెందిన ఒక వ్యాపారిని లక్ష డాలర్లకు మోసం చేసిన కేసులో 1996లో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. రాజీవ్ గాంధీ హత్యోదంతంలో ఆయన పాత్ర ఉందనే ఆరోపణలపై విచారణను ఎదుర్కొన్నారు. బ్రూనై, బహ్రెయిన్ సుల్తాన్‌లు, ఆయుధ వ్యాపారి అద్నాన్ ఖషోగ్గి, ప్రముఖ నటి ఎలిజిబెత్ టేలర్... తదితర ప్రముఖులతో ఆయనకు సంబంధాలు ఉండటం వివాదాస్పదమైంది.

శ్రీముఖ్ ద్వివేది

సంత్ స్వామి భీమానంద్ మహారాజ్ చిత్రకూట్ వేల్‌గా ప్రసిద్ధి చెందిన శ్రీముఖ్ ద్వివేది ని తన అశ్రమం కేంద్రంగా వేశ్యా గృహాన్ని నిర్వహించారనే ఆరోపణల మీద పోలీసులు అరెస్టు చేశారు.

స్వామి జ్ఞానచైతన్య

కేరళలోని శివ శ్రీంగమ్ ఆశ్రమం వ్యవస్థాపకుడైన స్వామి జ్ఞానచైతన్య లైంగిక వేధింపులు, హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. బ్రిటీష్ దేశస్థురాలైన ఆయన భార్య ఆమండా విలియమ్స్ స్వామి అకృత్యాలను వెలుగులోకి తెచ్చారు. వ్యాపారంలో కష్టనష్టాల పాలైన ఆమందా విలియమ్స్ కుటుంబానికి ఎవరో ఇచ్చిన సలహా మేరకు భారతదేశానికి వచ్చి స్వామిజీని ఆశ్రయించారు. అందాను చూసిన వెంటనే తనను పెళ్లి చేసుకోవాలని లేనిపక్షంలో భగవంతుని ఆగ్రహానికి గురి కావలసి వస్తుందని ఆజ్ఞాపించారు. అలా ఆమెను పెళ్లి చేసుకుంది గాక హింసకు గురిచేయటంతో ఎలాగో తప్పించుకొని పోలీసులను ఆశ్రయించింది. ఇదేగాక మూడు హత్యకేసుల్లో ఆయన నిందితుడు. ఈ కేసుల్లో ఆయన జైలు పాలయ్యారు.

స్వామి ప్రేమానంద



తన అశ్రమంలోని శిష్యులపై అత్యాచారానికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై స్వామి ప్రేమానంద జైలు పాలయ్యారు. ఆయన శ్రీలంక వాస్తవ్యుడు. 1984లో భారతదేశానికి వచ్చి స్థిరపడ్డారు. తిరుచురాపల్లి సమీపంలో ఆశ్రమాన్ని నెలకొల్పారు. 1994లో ఒక మహిళ ఆశ్రమం నుంచి తప్పించుకొని బయటకు వచ్చి తనపై స్వామి అత్యాచారం చేసినట్లు తత్ఫలితంగా తాను గర్భవతిని అయ్యానని ఆరోపించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టగా రవి అనే మరొక ఆశ్రమ వాసి హత్యకు గురైన ఉదంతం వెలుగుచూసింది. చివరికి హత్య, అత్యాచారం, లైంగిక వేధింపులు కేసుల్లో స్వామి ప్రేమానంద జైలు పాలయ్యారు.

'రాజకీయ' బాబాలు!

మందీ మార్బలం సంపద సమకూరగానే బాబాలు దైవాంశ సంభూతులైపోతున్నారు. వారికి రాజకీయ బలగం తోడవుతోంది. రాజకీయ నాయకులకు ఎన్నికల్లో ఓట్లు, ఖర్చుకు డబ్బు కావాలి. లక్షలాది మంది అనుచరులు, అవసరం అయితే సొమ్ము సమకూర్చగల బాబాల కంటే ముఖ్యమైన వారు ఎవరుంటారు. అందుకే పరస్పర ప్రయోజనాల కోసం కలిసి ముందుకు సాగుతున్న ఉదంతాలెన్నో కనిపిస్తాయి. డేరా ఛీఫ్ గుర్మీత్ రామ్ రహీం ఉదంతాన్నే తీసుకుంటే హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో ఆయనో బలమైన శక్తి. ఎన్నికల్లో ఫలానా వారికి మద్దతు ఇవ్వాలని ఒక పిలుపు ఇస్తే చాలు, అప్పటి వరకూ ఉనికి లేని అభ్యర్థులు కూడా ఒక్కసారిగా గెలుపు ముంగిట నిలుస్తారు. సిక్కులు, ముస్లింలు, క్రిస్టియన్లలోని దళితుల్లో ఎంతో పలుకుబడి ఉన్న గుర్మీత్ సింగ్ రామ్ రహీం ప్రత్యక్ష రాజకీయాల్లో లేనప్పటికీ డేరా సచ్చా సౌధాలో భాగంగా 2007లో రాజకీయ వ్యవహారాల విభాగాన్ని ప్రారంభించారు. 2014 ఎన్నికల్లో ఈ విభాగం క్రియాశీలకమైన పాత్ర పోషించింది. హరియాణా రాష్ట్ర బీజేపీ విభాగం ఇన్‌ఛార్జి కైలాష్ విజయ్ వర్గీయ ఎమ్మెల్యే అభ్యర్థులను గుర్మీత్ సింగ్ ఆశిస్సుల కోసం తీసుకువెళ్లిన ఉదంతం సంచలనం రేకెత్తించింది. ఆయన అనుచరుల్లో ఎందరో రాజకీయ నాయకులు, మంత్రులు ఉన్నారు. ఇటువంటి ఉదంతాలు ఇంకెన్నో ఉన్నాయి. *– ఈనాడు ప్రత్యేక విభాగం*

ఖట్టర్‌ను తొలగించం

● హరియాణాలో సీఎం మార్పుపై భాజపా

● హైకోర్టు చీవాట్ల నేపథ్యంలో తమ పార్టీ ప్రభుత్వానికి మద్దతు

దిల్లీ: హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఆ పదవి నుంచి తప్పించే ఉద్దేశంలేదని భారతీయ జనతా పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ఖట్టర్‌ను శిక్షించాలని అనుకోవటంలేదని, రాష్ట్రంలో అల్లర్లను అదుపుచేయటానికి ప్రభుత్వం తన వంతు తీవ్రంగానే కృషిచేసిందని సమర్థించింది. అత్యాచారం కేసులో డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను న్యాయస్థానం దోషిగా ప్రకటించిన అనంతరం రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లను అదుపుచేయటంలో వైఫల్యంపై హైకోర్టు తీవ్రవ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఖట్టర్‌కు భాజపా, కేంద్రప్రభుత్వం మద్దతుగా నిలిచాయి. గత మూడేళ్లలో పార్టీ అధిష్ఠానం ఖట్టర్‌కు అండగా నిలవటం ఇది మూడోసారి. హరియాణాలో మొట్టమొదటిసారిగా 2014లో భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షాల సూచనల మేరకు ఖట్టర్‌కు ముఖ్యమంత్రి పదవి లభించింది. ఆయన శాసనసభకు ఎన్నికవ్వటం కూడా ఇదే తొలిసారి.

ఖట్టర్ ప్రభుత్వానికి మూడు చిక్కులు: గత మూడేళ్లలో ఖట్టర్ ప్రభుత్వాన్ని మూడు ఘటనలు ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టాయి. 2014లో బాబా రాంపాల్‌ను అరెస్టు చేయటానికి పోలీసులు వెళ్లినప్పుడు హిసార్‌లో జరిగిన ఘర్షణల్లో అయిదుగురు మహిళలు, ఒక చిన్నారి మృతి చెందారు. గత ఏడాది జాట్‌ల రిజర్వేషన్ ఉద్యమ సమయంలో జరిగిన హింసాత్మక ఆందోళనల్లో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ రెండు ఘటనల్లోనూ ఖట్టర్ ప్రభుత్వ వైఫల్యంపై విమర్శలు వచ్చాయి. తాజా ఘటనలో 36 మంది చనిపోవటంపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఖట్టర్ రాజీనామా డిమాండ్లు వస్తున్నాయి.

సీబీఐ జడ్జి ప్రయాణానికి ఏర్పాట్లు చేయండి: హైకోర్టు

● గుర్మీత్‌కు రోహతక్ జైలులో ఖరారవనున్న శిక్ష

చండీగఢ్: అత్యాచారం కేసులో దోషిగా తేలిన గుర్మీత్ రాంరహీంసింగ్‌ను ఉంచిన రోహతక్ జిల్లా జైలుకు వెళ్లేందుకు సీబీఐ ప్రత్యేక జడ్జి విమానయానానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలంటూ పంజాబ్, హరియాణా హైకోర్టు...హరియాణా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సోమవారం గుర్మీత్‌కు శిక్ష ఖరారుపై విచారణ నిర్వహించేందుకు సీబీఐ జడ్జి రోహతక్ జైలుకు వెళ్లనున్నారు. జడ్జి, ఇద్దరు సిబ్బందిని విమానం ద్వారా సురక్షితంగా వెళ్లేందుకు తగిన భద్రత ఏర్పాట్లు చేయాలని హైకోర్టు పేర్కొంది. 15 ఏళ్ల క్రితం ఇద్దరు భక్తులపై అత్యాచారానికి పాల్పడ్డారనే ఆరోపణలున్న కేసులో గుర్మీత్‌ను శుక్రవారం దోషిగా ప్రకటించిన సీబీఐ ప్రత్యేక జడ్జి జగ్దీప్‌సింగ్.. శిక్షను 28న వెలువరించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం రోహతక్ జిల్లా జైలులో కోర్టు గది కోసం తగిన వసతి సౌకర్యాల్ని ఏర్పాటు చేయాలనీ, న్యాయవాదులు, ఇతర పక్షాలు కోర్టు గదికి తేలికగా చేరేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది.







పంచకులలో పాత్రికేయుల వాహనాన్ని ధ్వంసం చేసి, పాత్రికేయుడి(బ్లూ టీషర్టు వ్యక్తి)పై దాడి చేస్తున్న డేరా సచ్చా సౌధా అధ్యక్షుడు గుర్మీత్ రామ్ రహీం మద్దతుదారులు ★ డేరా సచ్చా సౌధా అధ్యక్షుడు గుర్మీత్ రామ్ రహీం మద్దతుదారుల కోపాగ్నికి పంచకులలో ఆహుతవుతున్న వాహనాలు ★ దిల్లీలోని ఆనంద్‌విహార్ స్టేషన్‌లో నిప్పు పెట్టడంతో కాలిపోయిన రైలు కోచ్‌లోని లోపలి భాగాన్ని పరిశీలిస్తున్న పాత్రికేయుడు

కేసు మూసేయమని ఒత్తిడి

● గుర్మీత్ కోసం ప్రముఖ రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు వరుసకట్టారు

● సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వెల్లడి

దిల్లీ

డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్‌పై కేసును మూసేయాలని చాలామంది ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఒత్తిడి చేసినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మాజీ జాయింట్ డైరెక్టర్ ములింజా నారాయణన్ తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన బృందానికి నారాయణనే నేతృత్వం వహించారు. గుర్మీత్‌ను పంచ్‌కులాలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దోషిగా నిర్ధారించిన నేపథ్యంలో.. ఆయన స్పందించారు. 'చాలా మంది నన్ను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. ఇలాంటి కేసుల్లో ఒక్కోసారి మేం ఓడిపోవచ్చు కూడా. కానీ చట్టం నుంచి మాత్రం ఎవరూ తప్పించుకోలేరని కోర్టు తీర్పు నిరూపించింది'అని నారాయణన్ వ్యాఖ్యానించారు. 2002 సెప్టెంబరులో పంజాబ్, హరియాణా హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. ఆనాడు దిల్లీలో డీఐజీగా నారాయణన్ పనిచేస్తున్నారు. '2002, డిసెంబరు 12న కేసు నమోదు చేశాం. ఆ రోజు ఓ ఉన్నత సీబీఐ అధికారి నా గదిలోకి వచ్చారు. కేసును వెంటనే మూసేయాలని, ఎలాంటి చర్యలూ తీసుకోకూడదని చెప్పారు. దీంతో ఈ కేసులో చాలా "విషయం" ఉందని భావించాను. లోతుగా దర్యాప్తు చేపడదామని నిర్ణయించుకున్నాను'అని నారాయణన్ తెలిపారు.

మరింత మంది వచ్చారు

'కొన్నిరోజుల తర్వాత.. విచారణ కొనసాగుతున్నప్పుడు ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు సీబీఐ ప్రధాన కార్యాలయానికి వరుసకట్టారు. ఒత్తిడిని మరింత పెంచారు. ఎలాగోలా దర్యాప్తును పూర్తిచేయగలిగాం. ఈ విషయంలో న్యాయవ్యవస్థకు ధన్యవాదాలు చెప్పాలి'అని ఆయన వివరించారు. 2009లో ఆయన పదవీ విరమణ చేశారు. సీబీఐలో సబ్‌ఇన్‌స్పెక్టర్ పదవి నుంచి జాయింట్ డైరెక్టర్‌గా ఎదిగిన తొలి అధికారి ఈయనే. 'ఓ బాధితురాలిని వెతికిపట్టుకోవడం చాలా కష్టమైంది. ఆ బాలిక 1999లో వేధింపులకు గురైంది. అనంతరం గుర్మీత్ ఆశ్రమాన్ని వదిలి వెళ్లిపోయి.. పెళ్లి చేసుకుంది. ఎట్టకేలకు ఆమెను వెతికి పట్టుకున్నాక.. వాంగ్మూలం తీసుకునేందుకు ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను ఒప్పించడం మరో తలనొప్పిగా మారింది. ఆ బాలికకు తండ్రిగా మారి ధైర్యం చెప్పాను. దీంతో వాంగ్మూలం ఇవ్వడంతోపాటు ఆమె కోర్టుకు వచ్చి సాక్ష్యం కూడా చెప్పింది. కేసును ఎవరూ బలహీన పరచకుండా జాగ్రత్త వహించాను. సాక్ష్యాలన్నీ కోర్టు ముందు సమర్పించాక కాస్త ఊపిరిపీల్చుకున్నాను'అని నారాయణన్ వెల్లడించారు.

గుర్మీత్ భయపడ్డాడు

'నేను ప్రశ్నలు అడుగుతున్నప్పుడు గుర్మీత్ భయపడటం నాకింకా గుర్తుంది. ఏ ప్రశ్నకూ అతడు నేరుగా సమాధానాలు ఇవ్వలేదు. అతడు బాబానని చాలామందిని నమ్మించొచ్చు. కానీ అతడు భయస్థుడని నా అంతరాత్మ ప్రబోధించింది'అని ఆనాటి పరిస్థితులను నారాయణన్ గుర్తుచేసుకున్నారు. జూనియర్ అధికారులు సైతం దర్యాప్తును నిలిపేయాలని సూచించడంతో విస్మయానికి గురయ్యాయని చెప్పారు. 'వృత్తిపట్ల నా అంకితభావం పైఅధికారులకు తెలుసు. దీంతో ఎలాంటి ఒత్తిడికీ తలొగ్గలేదు' అని ఆయన వివరించారు. విధుల్లో ప్రతిభ చూపినందుకుగాను ఆయన్ను 1992, 1999ల్లో రెండు పోలీసు పతకాలు వరించాయి.

15 ఏళ్ల తరువాతయినా న్యాయం జరుగుతుంది!

చండీగఢ్: అత్యాచారం కేసులో డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రాం రహీం సింగ్ దోషి అని సీబీఐ కోర్టు తీర్పునివ్వడం ఓ పాత్రికేయుని కుటుంబంలో ఆశలు మొలకెత్తించింది. తమ తండ్రిని హత్య చేసిన దోషులకు శిక్ష పడుతుందని భావిస్తోంది. రామ్‌చందర్ ఛత్రపతి స్థానికంగా 'పూరా సచ్' అనే హిందీ పత్రికను నడిపేవారు. శిష్యురాళ్లయిన ఇద్దరు సాధ్వీలపై గుర్మీత్ సింగ్ జరిపిన లైంగిక వేధింపులకు సంబంధించి గుర్తుతెలియని మహిళ రాసిన మూడు పేజీల లేఖను ఆయన ప్రచురించారు. 2002 అక్టోబరు 24న ఇంట్లో ఉన్న ఆయనను దగ్గర నుంచి తుపాకీతో కాల్చి చంపారు. అప్పటి నుంచి న్యాయం కోసం ఆయన కుమారుడు అన్షుల్ పోరాడుతునే ఉన్నారు. ఈ కేసు సెప్టెంబరు 16న విచారణకు రానుంది. ప్రస్తుతం తీర్పు ఇచ్చిన న్యాయమూర్తే ఈ కేసునూ విచారిస్తున్నారు. 15 ఏళ్ల తరువాతయినా న్యాయం జరుగుతుందని ఆయన ఆశిస్తున్నారు.

శిష్యురాలిగా మారితే.. శరీరాన్ని రాసిచ్చినట్టేనట

దిల్లీ: అత్యాచారాలు.. అకృత్యాలు.. బెదిరింపులు.. ఇలా దైవం పేరుతో డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్ చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. అతణ్ని గుడ్డిగా నమ్మి తమనే అనుమానించే కుటుంబ సభ్యులు ఓ వైపు. . లైంగిక వేధింపులు మరోవైపు తట్టుకోలేక బాధిత యువతులు పడిన వేదన వర్ణనాతీతం. ఓ బాధితురాలు రాసిన లేఖ వీటిని కళ్లకు కట్టింది. నిజానికి ఈ లేఖే గుర్మీత్‌ను కటకటాల వెనక్కు పంపింది. దీన్ని 15ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీకి ఓ బాధితురాలు రాశారు. దీని ఆధారంగానే దర్యాప్తునకు ఆదేశాలు జారీఅయ్యాయి. దీనిలోని వివరాల ప్రకారం.. గుర్మీత్‌ను గుడ్డిగా నమ్మేసే కుటుంబ సభ్యులు యువతులను ఆయన దగ్గర సేవలో వదిలి వెళ్లిపోయేవారు. 'నేను దేవుణ్ని. నాకు శిష్యురాలిగా మారితే.. మీ సంపద, శరీరం, ఆత్మను నాకిచ్చేసినట్టే. నేను ఎప్పుడో వాటిని స్వీకరించేశాను' అంటూ బాధితురాళ్లపై గుర్మీత్ అత్యాచారానికి తెగబడేవాడు. నీలి చిత్రాలు చూడటం, తుపాకులతో బెదిరించడం లాంటి పనులూ చేసేవాడు. అప్పటికీ లొంగకపోతే చంపేస్తానని కూడా హెచ్చరించేవాడు. ప్రభుత్వాల్లో తనకు పలుకుబడి ఉందని; ప్రముఖ రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు తన పాదాలు మొక్కుతారని; డబ్బుతో అందరినీ కొనేస్తానని బెదిరించేవాడు. దీంతో బాధితురాళ్లు నరకం చూసేవారు. 'ప్రతి 25 నుంచి 30 రోజులకు ఓ సారి నా వంతు వస్తుంది. ఇక్కడ 35 నుంచి 40 ఏళ్ల వయసున్న 40 మందికిపైగా నాలాంటి మహిళలున్నారు. వారిలో బీఏ, ఎంఏ, బీఈడీ చదివినవారూ ఉన్నారు. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. మేం ఏం చెప్పినా కుటుంబ సభ్యులు నమ్మరు'అని లేఖలో బాధితురాలు వాపోయారు. పేరు చెబితే తన ప్రాణాలకే ముప్పని, దయచేసి ప్రభుత్వం దర్యాప్తు చేపట్టాలని ఆమె అభ్యర్థించారు.

మీరు డేరా అనుచరులకు లొంగిపోయారు

● రాజకీయ కారణాలు చూసుకున్నారు

● హరియాణా సర్కారుకు తీవ్రంగా తలంటిన హైకోర్టు

● ప్రధాని దేశం మొత్తానికి ప్రధాని అని వ్యాఖ్య

చండీగఢ్: హరియాణా రాష్ట్ర సర్కారుకు పంజాబ్-హరియాణా హైకోర్టు శనివారం తలంటింది. వివాదాస్పద డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రాంరహీం సింగ్ అనుచరులకు ప్రభుత్వం లొంగిపోయిందనీ, ఈ విషయంలో రాజకీయ కారణాలను చూసుకొందనీ ఆక్షేపించింది. శనివారం హైకోర్టు నిర్వహించిన ప్రత్యేక విచారణలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎస్.శరణ్ నేతృత్వంలోని పూర్తిస్థాయి ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి చీవాట్లు పెట్టింది. హరియాణాలో నెలకొన్న శాంతి భద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ పంచ్‌కుల నివాసి ఒకరు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు విచారించింది. నిషేధాజ్ఞలు ఉన్నా వాటిని ధిక్కరించి 1.5 లక్షల మంది ప్రజలు జిల్లాలోకి వచ్చారని ఈ పిటిషన్లో పేర్కొన్నారు. సంఘ వ్యతిరేక శక్తులే హింసకు పాల్పడ్డాయని ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ చేసిన ప్రకటనను ధర్మాసనం తప్పుపట్టింది. 'సీబీఐ న్యాయస్థానం తీర్పు తర్వాత సంఘ వ్యతిరేక శక్తులు డేరా అనుచరుల్లో కలిసిపోయిన విషయం మీకు (ముఖ్యమంత్రికి) వెంటనే తెలియవచ్చింది. పంచ్‌కులలోకి డేరా అనుచరులు పెద్దఎత్తున వచ్చిన విషయాన్ని పట్టించుకోవడంలో మీరెలా విఫలమయ్యారు?' అని సూటిగా ప్రశ్నించింది. భారీ సంఖ్యలో తరలివచ్చినవారిని ఖాళీ చేయించకపోవడం 'రాజకీయ లొంగుబాటు' అని వ్యాఖ్యానించింది. ఇలాంటివి ముమ్ముందు జరగకుండా ఏం చేయబోతున్నారో తమకు తెలపాలనీ, హింస వల్ల నష్టపోయినవారికి పరిహారం కోసం క్లెయింలను ఆహ్వానించాలనీ ఆదేశించింది. డేరా ప్రధాన కార్యాలయాన్ని ఎలా ఖాళీ చేయించేదీ కూడా తెలపాలంది.

డేరా ఆస్తుల జాబితా సమర్పించండి: డేరా ఆస్తుల్ని బదలాయించడానికి, అమ్మడానికి, గుత్తకు ఇవ్వడానికి వీల్లేకుండా హైకోర్టు నిలువరించింది. హరియాణాలో ఉన్న ఆస్తులన్నింటినీ స్తంభింపజేసింది. వారి స్థిర, చరాస్తుల జాబితాను తమకు సమర్పించాలని ఆదేశించింది. సిర్సా నుంచి పంచ్‌కులకు డేరా అధిపతి ప్రయాణించినప్పుడు వాహన శ్రేణిలో ఉన్న వాహనాల సంఖ్యపై తప్పుడు సమాచారాన్ని ఇచ్చారంటూ ప్రభుత్వాన్ని మందలించింది. అయిదుగురు నేతలు డేరా అనుచరుల్ని రెచ్చగొట్టినట్లు వచ్చిన కథనం నిజమైతే వారిపై కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆస్తుల నష్టానికి డేరా అనుచరులు బాధ్యులని తేలితే డేరా ఆస్తుల్ని జప్తు చేస్తామని శుక్రవారమే న్యాయస్థానం ప్రకటించింది.

కేంద్రం స్పందనపైనా: విచారణ సందర్భంగా కేంద్రం స్పందనపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. శాంతి భద్రతల అంశం రాష్ట్రానికి సంబంధించినదని అదనపు సొలిసిటర్ జనరల్ సత్యపాల్ జైన్ వాదించినప్పుడు ధర్మాసనం మండిపడింది. ఈ ప్రాంతాన్ని వలస ప్రాంతంగానో, సవతి పిల్లల మాదిరిగానో ఎందుకు పరిగణిస్తున్నారని కేంద్రాన్ని నిలదీసింది. ప్రధాని దేశమంతటికీ ప్రధానేనని అంది. తగిన ఏర్పాట్లు చేసినా, అల్లర్లకు పాల్పడినవారు భారీగా ఉండడంతో హింస చెలరేగిందని హరియాణా ప్రభుత్వం తెలిపింది. ఆ వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. అసాంఘిక శక్తుల్ని ముందుగానే ఎందుకు నిలువరించలేదని ప్రశ్నించింది.

జమ్ముకశ్మీర్ లేని భారత్ అసంపూర్ణమే: ఖుర్షీద్

దిల్లీ: దేశం మరో విభజన వేదనను ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేదని కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. జమ్ముకశ్మీర్ లేని దేశం అసంపూర్ణంగానే ఉంటుందని అభిప్రాయపడ్డారు. "కశ్మీర్ ఎందుకు రగులుతోంది? " అనే అంశంపై దిల్లీలో నిర్వహించిన ఒక చర్చా కార్యక్రమంలో ఖుర్షీద్ ఈ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ సమస్యకు నిష్పక్షపాతంగా చర్చించి పరిష్కారాన్ని కనుగొనాల్సి ఉందన్నారు. నిఘా సంస్థ రా మాజీ అధిపతి ఏఎస్ దౌలత్ మాట్లాడుతూ కశ్మీర్ ఉపజాతీయ వాదం సమర్థనీయం కాదన్నారు.

గొడ్డు మాంసం నిషేధ ఉత్తర్వులపై గోప్యత హక్కు ప్రభావం

● **సుప్రీంకోర్టు వ్యాఖ్య**

దిల్లీ: వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించినందున, దాని ప్రభావం గొడ్డు మాంసం నిషేధానికి సంబంధించిన ఉత్తర్వులపై కొంతవరకు ఉంటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీలును విచారిస్తున్న సందర్భంగా శుక్రవారం ఈ వ్యాఖ్య చేసింది. మహారాష్ట్ర పశువుల పరిరక్షణ (సవరణ) చట్టం-1995లోని సెక్షన్ 5(డి), 9(బి)లను గత మే ఆరో తేదీన బొంబాయి హైకోర్టు కొట్టివేసింది. సెక్షన్ 5(డి) ప్రకారం మహారాష్ట్ర బయట వధించిన ఆవులు, ఎద్దులు, గిత్తల మాంసాన్ని కలిగి ఉండడం నేరం. సెక్షన్ 9(బి) ఏమి చెబుతోందంటే.. గొడ్డు మాంసం కలిగి ఉన్నారంటూ ఎవరిపైన అయినా ఫిర్యాదులు వస్తే.. అది సెక్షన్ 5(డి) పరిధిలోది కాదంటూ నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితునిపైనే ఉంది. ఈ రెండు సెక్షన్లూ చెల్లవంటూ బొంబాయి హైకోర్టు కొట్టివేయగా, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇందుకు సంబంధించిన వ్యాజ్యాన్ని జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన ధర్మాసనం విచారిస్తోంది. కొందరు పిటిషన్‌దార్ల తరఫున హాజరయిన సీనియర్ న్యాయవాదులు ఇందిరా జైసింగ్, సి.యు.సింగ్‌లు తమ వాదనలు వినిపిస్తూ వ్యక్తుల భోజన హక్కుకు గోప్యత హక్కు కింద రక్షణ లభించిందని, నిర్ణయం వెలువరించే ముందు దీన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం "ఔను, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దీనిపై ప్రభావం చూపుతుంద"ని పేర్కొన్నారు.

4 నెలల్లో 'నరోదాగామ్' కేసు తేల్చండి

గుజరాత్ అల్లర్లలో నరోదాగామ్ ఘటన కేసు విచారణను నాలుగు నెలల్లో తేల్చాలని సుప్రీంకోర్టు ఆ రాష్ట్రంలోని దిగువ న్యాయస్థానానికి స్పష్టం చేసింది. ఆ ఘటనలో 11 మంది మరణించారు. సదరు ఘటనపై విచారణ కొనసాగుతోందనీ, సాక్ష్యాధారాలు నమోదు చేశారని ధర్మాసనానికి తెలుపగా, రెండు నెలల్లో మిగతా సాక్ష్యాధారాల నమోదు పూర్తి చేయాలని ధర్మాసనం తెలిపింది.

భారతీయ కార్మికులకు భద్రత కల్పిస్తాం: ఖతార్ మంత్రి హామీ

దిల్లీ: ఖతార్ విదేశాంగ మంత్రి షేక్ మహ్మద్‌బిన్ అబ్దుల్ రెహ్మాన్ అల్-థాని రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ, విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్‌తో సమావేశమయ్యారు. ప్రధాని మోదీకి ఖతార్ రాజు వద్ద నుంచి తెచ్చిన లేఖను సమర్పించారు. అనంతరం భారత రక్షణ సలహాదారు అజిత్ డోభాల్‌తో సమావేశమై భద్రతా, రక్షణ సహకార అంశాలు చర్చించారు. ఖతార్‌లో పనిచేస్తున్న భారతీయుల సంక్షేమం గురించి సుష్మాస్వరాజ్ ప్రత్యేకంగా ప్రస్తావించగా వారి భద్రతకు అల్-థాని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఖతార్‌లో 6.3 లక్షల మంది భారతీయులు పనిచేస్తున్నారు.



ముంబయిలో ముఖేష్ అంబానీ నివాసంలో జరిగిన గణేశ్ చతుర్థి వేడుకల్లో కుమార్తె ఆరాధ్యతో కలసి పాల్గొన్న బాలీవుడ్ నటీనటులు అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యారాయ్

సన్నగిల్లుతున్న సదభిప్రాయం!

అమెరికా అధ్యక్షుడిపై తాజా అధ్యయనం

వాషింగ్టన్: రేటింగ్‌ల ఆసక్తి అమితంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం చేదు వార్తనే వినిపించినట్లయింది. ట్రంప్ పట్లా....ఆయన చేపట్టిన పలు కీలక విధానాల పట్ల ప్రపంచవాప్తంగా వ్యతిరేకత వ్యక్తమైనట్లు 'ప్యూ పరిశోధనా సంస్థ' నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ సంస్థ స్వచ్ఛందంగా నిర్వహించిన అధ్యయనం వివరాలను శుక్రవారం ఇక్కడ ప్రకటించారు. చాలా దేశాల్లో అమెరికా రేటింగ్స్ గణనీయంగా పడిపోయినట్లు ఈ అధ్యయనంలో సుస్పష్టమైంది. ఫిబ్రవరి 16-మే 8వ తేదీల మధ్య నిర్వహించిన ఈ అధ్యయనంలో సుమారు 40వేల మందికి పైగా అభిప్రాయాలను పరిశోధకులు తీసుకున్నారు. ఆ వివరాలను చూస్తే...చైనా, రష్యా అధ్యక్షుల కంటే కూడా అమెరికా అధ్యక్షుడు బాగా వెనకబడి ఉన్నట్లు తేలింది. బరాక్ ఒబామాతో పోలిస్తే ట్రంప్‌ను ఇష్టపడే వారి సంఖ్య కూడా బాగా తక్కువగా ఉంది.

కొనసాగుతున్న రాజీనామాల పర్వం...: ట్రంప్ కొలువు నుంచి ఉన్నతస్థాయి అధికారుల రాజీనామాల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా ఆయన కొలువులో 'మెరుపువేగంతో ప్రతిస్పందన' వ్యవహారాల సంచాలకులుగా ఉన్న ఆండీ హెమ్మింగ్ రాజీనామా చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసే మంచిపనుల గురించిన సమాచారం ప్రచారం బాధ్యతను ఆయన నిర్వర్తించేవారు.

శ్వేతసౌధాన్ని వదిలేసిన గోర్కా!: అధ్యక్షుడి సలహాదారుగా పేరుగాంచిన సెబాస్టియన్ గోర్కా ప్రస్తుతం ట్రంప్ కొలువులో లేరు. ఆయన రాజీనామా చేయలేదు....కానీ, ఆయన శ్వేతసౌధంలో మాత్రం పనిచేయడం లేదని ఓ అధికారి వెల్లడించారు.

పాక్ జనాభా 20.7 కోట్లు

19 ఏళ్లలో 57 శాతం పెరుగుదల

ఇస్లామాబాద్: పాకిస్థాన్ జనాభా గత 19 సంవత్సరాల్లో 57 శాతం (7.5 కోట్లు) మేర పెరిగింది. దేశ ఆరో జనగణన (2017) తాత్కాలిక ఫలితాలను పాక్ విడుదల చేసింది. 1998 లెక్కల ప్రకారం 13.2 కోట్లున్న జనాభా తాజాగా 20.7 కోట్లకు చేరింది. ఇందులో పురుషులు 10.6 కోట్లు, మహిళలు 10.1 కోట్లు కాగా ట్రాన్స్‌జెండర్లు 10,418 మంది ఉన్నారు. తాత్కాలిక జనగణన ఫలితాలను పాక్ ప్రధాని నేతృత్వంలోని నలుగురు ముఖ్యమంత్రులతో కూడిన రాజ్యాంగ సంస్థ (సీసీఐ) ఆమోదించినట్లు ఓ వార్తాసంస్థ తెలిపింది. ఇందులో గిల్గిత్ బాల్టిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ల వివరాలను చేర్చలేదని. తుది నివేదికను వాటితో కలిపి ఇచ్చే అవకాశం ఉందని పేర్కొంది.

హరికేన్ హార్వే ధాటికి టెక్సాస్ విలవిల



హూస్టన్: టెక్సాస్‌లోని క్రిస్టస్ స్పోన్ ఆసుపత్రి ఎదుట ఉంచిన విద్యుత్తు జనరేటర్ ఒకవైపునకు ఒరిగిపోతున్న దృశ్యమిది. హరికేన్ హార్వే ధాటికి మధ్యటెక్సాస్ శనివారం విలవిల్లాడింది. టెక్సాస్‌లోని అర్నసస్, ఒకనార్ సముద్రతీరాల మధ్య తీరం దాటడంతో గంటకు 195 కిమీ వేగంతో బలమైన గాలులు వీచాయి. ఫలితంగా 2.5 లక్షల ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీని ప్రభావంతో వచ్చే వారంరోజుల్లో కొన్ని ప్రాంతాల్లో 40 సెంమీ మేరకు వర్షపాతం నమోదు కావచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నివురుగప్పిన నిప్పులా వాత హృద్రోగం


వాషింగ్టన్: నివురుగప్పిన నిప్పులా మరో రుగ్మత ఏటికేడు విస్తరిస్తూ, ప్రపంచాన్ని కుదిపేస్తోంది. వాత జ్వరానికి దారితీసే బ్యాక్టీరియా... గుండె కవాటాలను తొలిచేస్తూ 'వాత హృద్రోగం (రుమటాయిడ్ హార్ట్ డిసీజ్)'కు కారణమవుతోంది. ముఖ్యంగా ఇది పేద, వర్ధమాన దేశాల్లో విజృంభిస్తోందని, అందునా చిన్నారులను ఎక్కువగా పొట్టన పెట్టుకుంటోందని వాషింగ్టన్ విశ్వవిద్యాలయ తాజా అధ్యయనంలో వెల్లడైంది. 2015లో అత్యధికంగా ఇండోనేషియాలో 11.8 లక్షల మంది, కాంగోలో 8,05,000, భారత్‌లో 1,19,000, చైనాలో 72,600, పాకిస్థాన్‌లో 18,900 మంది ఈ వ్యాధి కారణంగా తనువు చాలించినట్లు లెక్కగట్టింది. అయితే... ఈ మరణాల రేటు అధికంగా (లక్షలో పది మంది) ఉండే ప్రాంతాలున్న దేశాల్లో భారత్ కూడా ఉందని పరిశోధకుడు జార్జ్ రోథ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఛిద్రమైన గుండె కవాటాలను మార్చడం ద్వారా పునర్జన్మను ప్రసాదించే వీలున్నా- రోగుల ఆర్థిక పరిస్థితి; ఆయా దేశాల్లో వైద్య వసతులు అందుకు అనుకూలంగా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ వ్యాధిని తొలిదశలోనే గుర్తించి, సరైన చికిత్స అందించేందుకు ప్రభుత్వాలు నడుం బిగిస్తేనే.. వాత హృద్రోగాన్ని అదుపు చేయగలమని సూచించారు.

త్రివర్ణ పతాకం రంగులున్న పెట్టెల్లో బూట్లు!

డేహ్రాడూన్: అల్మోరాలోని ఓ చెప్పుల దుకాణానికి త్రివర్ణ పతాకం రంగుల్లో ఉన్న పెట్టెల్లో బూట్లు సరఫరా కావడం సంచలనం కలిగించింది. పార్శిల్ తెరిచిన వెంటనే ఈ పెట్టెలు ఉండడాన్ని గమనించిన దుకాణం యజమాని వెంటనే విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇది చైనా దేశం పన్నాగమయి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. చైనా వస్తువులు అధికంగా దొరికే దిల్లీలోని కరోల్‌బాగ్ నుంచి ఇవి సరఫరా అయినట్టు ప్రాథమికంగా గుర్తించామని పోలీసులు తెలిపారు.

తాజ్‌మహల్ ఆలయం కాదు.. సమాధే!

కోర్టులో పురావస్తు సంస్థ స్పష్టీకరణ



ఆగ్రా: తాజ్‌మహల్ ఆలయం కాదనీ, సమాధి అని భారత పురావస్తు సర్వే(ఏఎస్ఐ) సంస్థ తొలిసారిగా ఓ న్యాయస్థానంలో వెల్లడించింది. తాజ్‌మహల్ పరిరక్షణకు సంబంధించి 1920లో జారీ అయిన నోటిఫికేషన్ ఆధారంగా ప్రమాణపత్రం సమర్పించినట్లు అధికార వర్గాల సమాచారం. తాజ్‌లో ఆలయం ఉందనేందుకు ఎలాంటి ఆధారం లేదని 2015 నవంబర్‌లో కేంద్ర సాంస్కృతిక శాఖ లోక్‌సభలో వివరణ ఇచ్చింది. తాజ్‌మహల్ అనేది తేజో మహాలయగా పిలిచే శివమందిరమనీ, ఆవరణలోకి హిందూ భక్తులనూ అనుమతించాలంటూ 2015 ఏప్రిల్‌లో ఆరుగురు న్యాయవాదులు వేసిన వ్యాజ్యాన్ని ఆగ్రా జిల్లా కోర్టు అనుమతించింది. దీనిపై ప్రతిస్పందన తెలపాలంటూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర సాంస్కృతిక, హోం శాఖలు, ఏఎస్ఐకి నోటీసులు జారీచేసింది. ఏఎస్ఐ తన స్పందనను కోర్టుకు సమర్పించింది. స్థానిక కోర్టు పరిధిని, దావాదారుల జోక్యం చేసుకునే హక్కును ఏఎస్ఐ సవాలు చేసింది. తమ ప్రతిస్పందనను సమర్పించేందుకు దావా వేసిన వ్యక్తులకు సెప్టెంబర్ 11వరకూ కోర్టు గడువు ఇచ్చింది. చారిత్రకంగా, అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం ఆగ్రాలో యమునా నది ఒడ్డున తాజ్‌మహల్ పేరిట ప్రాచీన కట్టడం ఉందనీ, అది జాతీయ ప్రాధాన్యం ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందనీ, ఏడో వింతగా ప్రపంచవ్యాప్తంగా పేరొందిందని ఏఎస్ఐ తెలిపింది. తాజ్‌మహల్‌లో గుడిగానీ, శివలింగంగానీ లేదని స్పష్టం చేసింది. పిటిషన్‌దారుల వాదనకు ఎలాంటి ఆధారం లేదనీ, ఊహల్లో నుంచి పుట్టిన కల్పనగా పేర్కొంది. పిటిషన్‌దారుల తరఫు న్యాయవాది రాజేష్ కులశ్రేష్ఠ స్పందిస్తూ.. ఏఎస్ఐ దాఖలు చేసిన ప్రతిస్పందన ఆధారరహితమన్నారు. అందులో సమర్పించిన పలు వాస్తవాలు వైరుధ్యంగా ఉన్నాయని వెల్లడించారు.

బిహార్‌కు రూ. 500 కోట్ల సాయం

- రాష్ట్రంలో ప్రధాని మోదీ ఏరియల్ సర్వే
- అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా

పూర్ణియా

జల ప్రళయంతో అల్లాడుతున్న బిహార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ రూ. 500 కోట్ల తక్షణ ఆర్థికసాయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో వరద తాకిడికి గురైన ప్రాంతాల్లో ఆయన శనివారం ఏరియల్ సర్వే చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు వంతున, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50 వేలు చొప్పున ప్రధాని జాతీయ సహాయ నిధి నుంచి పరిహారం ప్రకటించారు. వరదల తీవ్రత కారణంగా రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందాన్ని పంపనున్నట్లు తెలిపారు. రైతులకు త్వరితగతిన సాయం అందేలా.. బీమా సంస్థలు వెంటనే తమ సిబ్బందిని పంపించి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. పూర్ణియా, కతియార్, కిసన్‌గంజ్, ఆరారియా జిల్లాల్లో నిర్వహించిన ఏరియల్ సర్వేలో ప్రధానితో పాటు బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీలు పాల్గొన్నారు. అనంతరం ప్రధాని వారితో వైమానిక దళానికి చెందిన చౌనాపుర్ విమానాశ్రయం వద్ద సమావేశమయ్యారు. రాష్ట్రంలో 19 జిల్లాలు వరద తాకిడికి గురికాగా.. 13 జిల్లాల్లో తీవ్రత అధికంగా ఉన్నట్లు ఈ సందర్భంగా ప్రధానికి వివరించారు. అత్యధికంగా జల వనరుల విభాగానికి రూ. 27 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. నిర్వాసితులను ఆదుకునేందుకు దాదాపు రూ. 2 వేల కోట్లు వెచ్చించినట్లు ప్రధానికి వివరించారు. అనంతరం ప్రధాని మోదీ పలు నిర్ణయాలు ప్రకటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) వెల్లడించింది. అన్నివిధాలుగా ఆదుకుంటామని బిహార్ ప్రభుత్వానికి ప్రధాని హామీ ఇచ్చారు. బిహార్‌లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ చర్యలు తీసుకుంటుందని ప్రధాని తెలిపారు.



బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్‌తో కలసి ఆ రాష్ట్రంలో వరద ఉద్ధృతిపై హెలిక్యాప్టర్‌లో పర్యటిస్తూ పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

440కి చేరిన మృతుల సంఖ్య..

ఉత్తరాదిన బీభత్సం సృష్టిస్తున్న వరదల కారణంగా.. బిహార్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 440కి చేరింది. 19 జిల్లాల పరిధిలోని 1.71 కోట్ల మంది జలప్రళయం తాకిడికి గురయ్యారు. అసోం, పశ్చిమ్ బెంగాల్‌లలో వరదలు కొంత తగ్గుముఖం పట్టాయి. ఇంతవరకు అసోంలో 73 మంది, పశ్చిమ్ బెంగాల్‌లో 90 మంది మృతి చెందారు. మణిపుర్, మిజోరాంలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చాలా ప్రాంతాలకు రహదారి సంబంధాలు తెగిపోయాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. మిజోరామ్ రాజధాని ఐజ్వాల్‌లో 7 భవనాలు కుప్పకూలాయి.

యూపీలో 25 లక్షల మంది పై ప్రభావం..

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ ఏడాది 25 జిల్లాల్లోని 25 లక్షలకు పైగా ప్రజలు వరదల తాకిడికి గురైనట్లు రాష్ట్ర ప్రభుత్వం శనివారం తెలిపింది. వారి కోసం 984 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. మొత్తం 761 వైద్య బృందాలు సేవలందిస్తున్నట్లు యూపీ ఆరోగ్య మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్ తెలిపారు.

'మాదే అసలు జేడీయూ'

ఈసీని ఆశ్రయించిన శరద్‌యాదవ్ వర్గం

దిల్లీ: అసలైన జేడీయూకు తామే ప్రతినిధులమంటూ.. శరద్‌యాదవ్ నేతృత్వంలోని పార్టీలోని అసమ్మతి నేతల వర్గం ఎన్నికల సంఘం (ఈసీ)ను ఆశ్రయించింది. కార్యకర్తలు, జాతీయ మండలి సభ్యుల్లో అత్యధిక మంది తమతోనే ఉన్నారని.. పార్టీకి కేటాయించిన ఎన్నికల గుర్తు, కార్యాలయాలు తమ వర్గానికే చెందాలని ఈసీని అభ్యర్థించింది. ఇటు ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ నేతృత్వంలో ఆదివారం పట్నాలో 'భాజపాను తరిమికొట్టండి.. దేశాన్ని కాపాడండి' పేరుతో ర్యాలీ జరగనుంది. దీనికి పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్‌యాదవ్, కాంగ్రెస్ నేత గులామ్ నబీ ఆజాద్‌లతోపాటు శరద్‌యాదవ్ కూడా హాజరుకానున్నారు. ఇటు ఈ ర్యాలీలో శరద్ పాల్గొనడం పార్టీ వ్యతిరేక చర్య అవుతుందని, ఆయన స్వచ్ఛందంగా పార్టీని వీడినట్లు పరిగణించాల్సి వస్తుందని జేడీయూ సెక్రటరీ జనరల్ కేసీ త్యాగి చేసిన హెచ్చరికలపైనా.. శరద్ వర్గం స్పందించింది. జేడీయూ జాతీయ మండలి గతంలో చేసిన నిర్ణయాలకు అనుగుణంగానే.. శరద్ ర్యాలీలో పాల్గొంటున్నారని పేర్కొంది. భాజపాతో పొత్తు పెట్టుకుని బిహార్ సీఎం నీతీశ్ కుమారే.. పార్టీ తీర్మానాలను ఉల్లంఘించారని ఆరోపించింది. గతేడాది ఏప్రిల్‌లో 'భాజపా, ఆర్ఎస్ఎస్ విముక్త భారత్' కోసం కృషి చేయాలని జేడీయూ నిర్ణయించిందని శరద్‌యాదవ్ వర్గం నేత జావెద్ రజా గుర్తు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/468/17 dt. 24-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం ప్రకారం భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

[illegible]

షెడ్యూల్

గ్రామం: అయ్యపరాజుగూడెం — మండలం: లింగపాలెం

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు తండ్రి / భర్త పేరు	హద్దులు				రిమార్కులు
					ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	
1	105/7	0.100	0.026	[illegible]	104	108	110	106	సాగుభూమి
2	110	1.660	0.031	[illegible]	115	109	111	105	సాగుభూమి
3	111/1A	0.300	0.089	[illegible]	114	112	112	110	సాగుభూమి
4	111/1B	3.450	0.699	[illegible]	114	112	112	110	సాగుభూమి
5	112/1	5.900	0.181	[illegible]	111	[illegible]	[illegible]	110	సాగుభూమి
6	113/5	2.630	0.342	[illegible]	117	[illegible]	[illegible]	114	సాగుభూమి
	మొత్తం		1.438						

సం/- సిహెచ్.భానుప్రసాద్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/473/2017 dt. 24-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం ప్రకారం భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

[illegible]

షెడ్యూల్

గ్రామం: వాసిరాజుగూడెం — మండలం: పెదవేగి

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి / భర్త పేరు)	హద్దులు				రిమార్కులు
					తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	
1	189/1	3.45	0.17	[illegible]	355	192	190	188	సాగుభూమి
2	190	4.22	0.50	[illegible]	310	191	277	189	సాగుభూమి
3	193/1ఎ	0.37	0.07	[illegible]	191	194	275	195	సాగుభూమి
4	193/1బి	0.32	0.06	[illegible]	191	194	275	195	సాగుభూమి
5	193/1సి	1.29	0.12	[illegible]	191	194	275	195	సాగుభూమి
6	193/1డి	0.12	0.07	[illegible]	191	194	275	195	సాగుభూమి
7	193/1ఇ	0.07	0.01	[illegible]	191	194	275	195	సాగుభూమి
8	193/1ఎఫ్	0.47	0.02	[illegible]	191	194	275	195	సాగుభూమి
9	193/1జి	0.24	0.07	[illegible]	191	194	275	195	సాగుభూమి
10	193/3ఎ	3.58	0.33	[illegible]	191	194	275	195	సాగుభూమి
11	193/3బి	1.10	0.07	[illegible]	191	194	275	195	సాగుభూమి
12	193/3డి	0.85	0.19	[illegible]	191	194	275	195	సాగుభూమి
13	273/1ఎ	0.47	0.10	[illegible]	276	274	272	275	సాగుభూమి
14	273/1బి	0.47	0.07	[illegible]	276	274	272	275	సాగుభూమి
15	273/1సి	0.01	0.13	[illegible]	276	274	272	275	సాగుభూమి
16	273/3ఎ	1.28	0.10	[illegible]	276	274	272	275	సాగుభూమి
17	273/3బి	1.28	0.01	[illegible]	276	274	272	275	సాగుభూమి
18	308	13.30	0.56	[illegible]	380	305	322	357	సాగుభూమి
19	310	0.54	0.21	[illegible]	322	190	380	355	సాగుభూమి
20	322/4	0.94	0.20	[illegible]	380	310	303	308	సాగుభూమి
21	322/5	0.59	0.04	[illegible]	380	310	303	308	సాగుభూమి
22	322/6	0.62	0.20	[illegible]	380	310	303	308	సాగుభూమి
23	336	65.00	1.42	[illegible]	430	339	365	338	సాగుభూమి
24	338/2ఎ	20.20	0.01	[illegible]	335	380	382	449	సాగుభూమి
26	442/2	7.91	0.15	[illegible]	449	358	380	443	సాగుభూమి
27	451/1	1.24	0.04	[illegible]	453	448	450	452	సాగుభూమి
28	451/3	1.16	0.15	[illegible]	453	448	450	452	సాగుభూమి
	మొత్తం		5.07						

సం/- సిహెచ్.భానుప్రసాద్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఖరీఫ్ సాగు తగ్గింది!

- గత ఏడాది కంటే 5.77 లక్షల హెక్టార్లు
- 6 శాతం తగ్గిన వర్షపాతం
- చెరకు, పత్తి పంటలు బాగు
- కోస్తాంధ్రలో మెండుగా వర్షాలు

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి, చెరకు మినహా అన్ని పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే మొత్తంగా 5.77 లక్షల హెక్టార్ల మేర తగ్గుదల కనిపిస్తోంది. అయితే పత్తి (సుమారు 17 లక్షల హెక్టార్లు), చెరకు (దాదాపు 4 లక్షల హెక్టార్ల మేర) పంటల సాగు విస్తీర్ణం మాత్రం పెరిగింది. వరి, పప్పు దినుసులు, చిరుధాన్యాలు, నూనెగింజలు, జనుము(జూట్) వంటి పంటల సాగు విస్తీర్ణం గుర్తించదగ్గ స్థాయిలోనే తగ్గింది.

సాధారణం కంటే తక్కువ వర్షాలు.. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇంతవరకూ దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 6 శాతం తక్కువ నమోదైంది. వాయువ్య భారతంలో 3 శాతం, మధ్య భారతంలో 9 శాతం, దక్షిణ ప్రాంతంలో 13 శాతం మేర వర్షాలు తగ్గాయి. కేవలం తూర్పు, ఈశాన్య భారతంలో మాత్రమే సాధారణం కంటే 1 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర జిల్లాల్లో సాధారణం కంటే 14 శాతం అధికంగాను.. రాయలసీమలో సాధారణంగాను వర్షాలు పడ్డాయి. తెలంగాణలో సాధారణం కంటే 12 శాతం తక్కువ కురిశాయి. ఫలితంగా చాలా ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. గత ఏడాది పత్తి, చెరకు ధరలు ఆశాజనకంగా కనిపించడంతో ఈసారి రైతులు వాటివైపు బాగా మొగ్గుచూపారు.

పంటలవారీగా సాగు విస్తీర్ణం (లక్షల హెక్టార్లలో)

పంట	ఈ ఏడాది	గత ఏడాది	తేడా
వరి	358.28	361.24	-2.96
తృణధాన్యాలు	178.85	182.61	-3.76
నూనెగింజలు	164.24	178.66	-14.42
పప్పు దినుసులు	135.96	141.35	-5.39
పత్తి	119.67	102.54	+17.13
చెరకు	49.78	45.64	+4.14
జనుము	7.05	7.56	-0.51
మొత్తం	1,013.83	1,019.60	−5.77

మాదకద్రవ్యాల అంతర్జాతీయ స్మగ్లర్ అరెస్టు

లండన్‌లో పట్టుబడిన పాకిస్థాన్ జాతీయుడు

లండన్: మత్తుమందుల తయారీతో పాటు వాటిని ప్రపంచంలోని వివిధ దేశాలకు అక్రమంగా సరఫరాచేస్తున్న అంతర్జాతీయ స్మగ్లర్ ముహమ్మద్ అసిఫ్ హఫీజ్ అలియాస్ సుల్తాన్ (58) అరెస్టయ్యాడు. బ్రిటన్, అమెరికా దర్యాప్తు బృందాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో లండన్‌లోని రీజెంట్స్ పార్క్ ప్రాంతంలో హఫీజ్ పట్టుబడినట్లు తెలిసింది. అతనిని అమెరికాకు అప్పగించే న్యాయపరమైన ప్రక్రియ జరుగుతోంది. హఫీజ్‌కు చెందిన సంస్థలు ఐరోపా, ఆఫ్రికా, ఆసియా, ఉత్తరఅమెరికా దేశాల్లో విస్తృతమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నాయని బ్రిటన్‌కు చెందిన జాతీయ నేర విచారణ విభాగం(ఎన్‌ఏసీ) అధికారులు తెలిపారు.

మహిళాశక్తికి ప్రతీక ఇందిరాగాంధీ

భూటాన్ రాణి ప్రశంసలు

థింపు(భూటాన్): భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై భూటాన్ రాణి అషి దోర్జీ వాంగ్మో వాంగ్‌చుక్ శనివారం ప్రశంసల వర్షం కురిపించారు. ఇందిరాగాంధీని మహిళాశక్తికి ప్రతీకగా అభివర్ణించారు. ఏదైనా నిర్ణయం తీసుకుంటే...అక్షరాలా దానిని అమలు చేసి తీరుతారన్న విషయాన్ని, మహిళాశక్తి సంకల్పబలాన్నీ ఇందిరాగాంధీ రుజువు చేశారన్నారు. ఇక్కడ జరిగిన 'ఇండియాస్ ఇందిర: ఎ సెంటెన్నియల్ ట్రిబ్యూట్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో భూటాన్ రాణి మాట్లాడారు. ఇందిరాగాంధీకి సంబంధించిన వ్యాసాలు, ఫొటోలు ఇతరత్రా వివరాలతో భారత జాతీయ కాంగ్రెస్ ఈ పుస్తకాన్ని సంకలనం చేసింది. ఈ పుస్తకావిష్కరణ సందర్భంగా మాట్లాడిన భూటాన్ రాణి ఇందిరాగాంధీని అత్యంత శక్తిమంతురాలిగా శ్లాఘించారు. భూటాన్ రాజకుటుంబంతో నెహ్రూ కుటుంబానికి ఉన్న అనుబంధం ఎంతో గొప్పదన్నారు. ఈ పుస్తకంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ రాసిన చాప్టర్ కూడా ఉంది. ఇందిరాగాంధీ గురించి కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ మాట్లాడారు.

అమెరికా నర్సుకు జాక్‌పాట్:

రూ.4846 కోట్ల పై చిలుకు సొంతం

న్యూయార్క్: అమెరికాలోని మసాచ్యుసెట్స్‌లో ఓ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న మావిస్ వాన్‌జిక్ (53) జాక్‌పాట్ కొట్టేశారు. సుమారు రూ.4846 కోట్ల పైచిలుకు జాక్‌పాట్‌ను సొంతం చేసుకుని అమెరికా చరిత్రలోనే ఒకే టిక్కెట్‌పై అత్యంత అధికమొత్తాన్ని గెలుచుకున్న వ్యక్తిగా ప్రత్యేకంగా నిలిచారు. బుధవారం డ్రా తీయగా... ఆమెకు జాక్‌పాట్ వచ్చినట్లు గురువారం ప్రకటన వెలువడింది. వార్త తెలియగానే మావిస్ ఒక్కక్షణం పట్టరాని ఉద్వేగంతో మూగబోయారు. ఇక తాను ఈ ఉద్యోగం చేయబోనంటూ ఆ తర్వాత ప్రకటించేశారు. ఇద్దరు పిల్లల తల్లి అయిన మావిస్ భర్త విలియంను ఇటీవలే కోల్పోయారు.

నార్వే పర్యటనలో రాహుల్‌గాంధీ

దిల్లీ: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ నార్వే పర్యటనకు వెళ్లారు. నార్వే దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆహ్వానం మేరకు ఆ దేశంలో పర్యటిస్తున్నట్లు రాహుల్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ఈ పర్యటన నేపథ్యంలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం పట్నాలో నిర్వహించనున్న ర్యాలీకి రాహుల్ హాజరు కావడం లేదు.

యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలపై వజ్రాల వర్షం

జర్మనీ: మన భూమ్మీద సముద్రాల్లోని నీరు ఆవిరి అయి వర్షం కురిసినట్లే, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలపై వజ్రాల వర్షం కురుస్తుంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. హైడ్రోకార్బన్ సమ్మిళితమైన అక్కడి మహాసముద్రాలపై వాతావరణ పీడనం భూమితో పోలిస్తే లక్షల రెట్లు అధికంగా ఉంటుంది కాబట్టి హైడ్రోజన్, కార్బన్ విడిపోతాయని చెబుతున్నారు. ఫలితంగా కార్బన్ ఆవిరై, సముద్ర పైభాగంలో స్ఫటికీకరణం చెంది వజ్రాలుగా వర్షిస్తుందంటున్నారు. చెప్పడమే కాదు ఫ్యాన్సీ ప్లాస్టిక్, అత్యంత శక్తిమంతమైన లేజర్ల సాయంతో ఇది శాస్త్రీయంగా సంభవమేనని శాస్త్రవేత్తలు తాజాగా నిరూపించారు. పూర్తి వివరాలు 'నేచర్ ఆస్ట్రోఫిజిక్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఆర్థిక వ్యవహారాల గోప్యతపై చట్టం ఉండాలి

- రిజర్వు బ్యాంకు కమిటీ సూచన

ముంబయి: కుటుంబ ఆర్థిక వ్యవహారాల విషయంలో గోప్యత హక్కుగా ఉండాలన్న పద్ధతిలో చట్టపరమైన విధానాన్ని రూపొందించాలని రిజర్వు బ్యాంకు అభిప్రాయపడింది. ప్రస్తుతం వ్యక్తుల అనుమతితో సమాచారాన్ని వెల్లడిస్తున్నామని, కానీ ఇది సురక్షితం కాకపోవడంతో మార్పులు చేయాల్సి ఉందని రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలోని కుటుంబ ఆర్థిక వ్యవహారాల కమిటీ సూచించింది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా, పక్షపాత రహితంగా ఉపయోగిస్తున్నారా లేదా అని చూడడానికి ఓ సాంకేతిక నిపుణుల వ్యవస్థను రూపొందించాల్సి ఉందని సూచించింది. దీనిపై ఏవైనా ఫిర్యాదులు వస్తే పరిష్కరించడానికి, పారదర్శకత, బాధ్యత ఉండేలా చూడడానికి డాటా కమిషనర్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. సమాచార భద్రతను ఉల్లంఘిస్తే డాటా కంట్రోలర్లయిన ఆర్థిక సంస్థలు బాధ్యత వహించేలా చేయాలని తెలిపింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. No. C1/476/2017 dt. 24-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం ప్రకారం భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

[illegible]

షెడ్యూల్

గ్రామం: బాపిరాజుగూడెం — మండలం: పెదవేగి

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి / భర్త పేరు)	హద్దులు				రిమార్కులు
					తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	
1	320/1	24.98	0.37	[illegible]	324	332	332	422	సాగుభూమి
2	320/4	14.36	1.16	[illegible]	324	332	332	422	సాగుభూమి
3	332/1	175.60	0.40	[illegible]	320	[illegible]	330	331	సాగుభూమి
	మొత్తం		1.93						

సం/- సిహెచ్.భానుప్రసాద్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/481/2017 dt. 24-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం ప్రకారం భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

[illegible]

షెడ్యూల్

గ్రామం: నడుపల్లి — మండలం: పెదవేగి

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి / భర్త పేరు)	హద్దులు				రిమార్కులు
					తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	
1	27/2	2.00	0.09	[illegible]	125	26	112	112	సాగుభూమి
2	107/2	1.38	0.04	[illegible]	116	106	[illegible]	108	సాగుభూమి
3	107/3	1.39	0.05	[illegible]	116	106	[illegible]	108	సాగుభూమి
4	107/4	1.39	0.13	[illegible]	116	106	[illegible]	108	సాగుభూమి
5	108/1	1.32	0.11	[illegible]	115	109	107	111	సాగుభూమి
6	111/1	1.59	0.02	[illegible]	113	110	108	106	సాగుభూమి
7	111/2	1.59	0.40	[illegible]	113	110	108	106	సాగుభూమి
8	111/3	1.59	0.50	[illegible]	113	110	108	106	సాగుభూమి
9	115/1	1.31	0.06	[illegible]	114	108	116	113	సాగుభూమి
10	115/3	1.31	0.05	[illegible]	114	108	116	113	సాగుభూమి
11	116/1	1.56	0.15	[illegible]	117	107	[illegible]	115	సాగుభూమి
12	116/2	1.57	0.11	[illegible]	117	107	[illegible]	115	సాగుభూమి
13	116/3	1.57	0.43	[illegible]	117	107	[illegible]	115	సాగుభూమి
14	117/2	1.10	0.34	[illegible]	118	116	[illegible]	114	సాగుభూమి
15	118/1	1.38	0.01	[illegible]	121	117	[illegible]	123	సాగుభూమి
	మొత్తం		2.49						


సం/- సిహెచ్.భానుప్రసాద్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

1 ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఒకేసారి భారత్ రెండు పతకాలు సొంతం చేసుకోవడం ఇదే తొలిసారి.

2 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సైనా పతకం గెలవడం ఇది వరుసగా రెండోసారి. 2015లో రజతం గెలిచింది.

3 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అత్యధికంగా మూడు పతకాలు గెలుచుకున్న భారత షట్లర్‌గా సింధు రికార్డు సాధించనుంది. 2013, 2014లో సింధు కాంస్యం నెగ్గింది. సింధు, సైనా కాకుండా గతంలో ప్రకాశ్ పదుకొనె (కాంస్యం), జ్వాల-అశ్విని పొన్నప్ప జోడీ (కాంస్యం) పతకాలు గెలిచారు.

ఛాంపియన్స్



సింధు

"తొలి గేమ్ నెగ్గాక కూడా మ్యాచ్ ఓడిపోవడం చాలా నిరాశ కలిగించింది. తొలి గేమ్ తర్వాత ఒకహూర సుదీర్ఘ ర్యాలీల్లో పైచేయి సాధించడం ద్వారా గొప్పగా పుంజుకుంది. ఐతే మొత్తంగా నా ప్రదర్శన సంతృప్తినిచ్చింది. గాయం నుంచి కోలుకున్నాక ఈ టోర్నీలో ఆడాను. సెమీస్ వరకు వచ్చాను. అత్యుత్తమ ప్రదర్శన చేసినందుకు సంతోషంగా ఉంది"
– సైనా నెహ్వాల్

40 ఏళ్ల భారత బ్యాడ్మింటన్ చరిత్రలో భారత్ గెలిచిన పతకాలు ఐదంటే ఐదు! ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఒక్క పతకం గెలిచినా దాన్నో అద్భుతంగా భావించేవాళ్లం ఒకప్పుడు! అలాంటిది ఇప్పుడు ఒకేసారి రెండు పతకాలతో తిరిగొస్తోంది భారత్! భారత బ్యాడ్మింటన్‌ను తిరుగులేని స్థాయికి తీసుకెళ్లిన సైనా నెహ్వాల్, పి.వి.సింధులే ఈ అసాధారణ ఘనతలో భాగస్వాములు కావడం విశేషం! గ్లాస్గో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సైనా కాంస్యం గెలవగా.. సింధు సైతం పతకం ఖాయం చేసుకుంది. మొత్తంగా ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్ భారత బ్యాడ్మింటన్ చరిత్రలోనే ఓ సువర్ణాధ్యాయం అనడంలో సందేహం లేదు!

అద్వితీయం

- భారత బ్యాడ్మింటన్‌లో కొత్త చరిత్ర
- ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారి రెండు పతకాలు
- సైనాకు కాంస్యం.. సింధుకూ పతకం ఖాయం
- సెమీస్‌లో నెహ్వాల్‌కు షాకిచ్చిన ఒకహూర

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సైనా రెండో పతకాన్ని ఖాతాలో వేసుకుంది. రెండేళ్ల కిందట రజతం గెలిచిన ఆమె.. ఈసారి కాంస్యం సాధించింది. ఐతే ఆమె కాంస్యానికే పరిమితమైనందుకు చింతించాల్సిందే. ఎందుకంటే సెమీఫైనల్ తొలి గేమ్‌ను 21-12తో అలవోకగా నెగ్గింది. ఆరంభంలో సైనా ఊపు చూస్తే ఆమె ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మరోసారి ఫైనల్లో అడుగుపెట్టినట్లే అన్న అంచనాలకు వచ్చేశారు అభిమానులు! సింధు కూడా సెమీస్‌లో గెలిస్తే ఇద్దరు భారత అమ్మాయిల మధ్య రసవత్తర ఫైనల్ పోరు చూడబోతున్నామని ఊహల్లోకి వెళ్లిపోయారు! కానీ చూస్తుండగానే కథ మారిపోయింది. ప్రత్యర్థి అనూహ్యంగా పుంజుకుంది. ముందు సైనాకు గట్టి పోటీ ఒకహూర.. తర్వాత ఆమెను వెనక్కి నెట్టేసింది. ఆరంభంలో సైనా చెలరేగిందో.. చివర్లో అదే స్థాయిలో ప్రత్యర్థి రెచ్చిపోయి మ్యాచ్‌ను ఎగరేసుకుపోయింది. సైనాను కాంస్యానికి పరిమితం చేసింది.

గ్లాస్గో

ఇంతకుముందు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో వేర్వేరుగా పతకాలు సాధించిన స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పి.వి.సింధు.. ఈసారి ఒకే టోర్నీలో పతకాల మోత మోగించారు. సైనా సెమీఫైనల్లో ఓటమి పాలై కాంస్యం అందుకోగా.. సింధు కూడా సెమీస్ చేరి కనీసం కాంస్యం ఖరారు చేసుకుంది.

సైనా అద్భుతంగా ఆరంభించి..: జపాన్ అమ్మాయి నొజోమి ఒకహూరతో సెమీఫైనల్‌ను గొప్పగా ఆరంభించి, అలవోకగా గెలిచేలా కనిపించిన సైనా అనూహ్యంగా ఓటమి పాలైంది. ప్రపంచ 16వ ర్యాంకర్, 12వ సీడ్ సైనా మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో 12-21, 21-17, 21-10తో 12వ ర్యాంకర్, ఏడో సీడ్ ఒకహూర చేతిలో పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌కు ముందు ఒకహూరతో ఏడు మ్యాచ్‌లు ఆడిన సైనా.. ఆరుసార్లు గెలవడం విశేషం. మ్యాచ్ ఆరంభంలో ఇదే ఆధిపత్యాన్ని కొనసాగించింది భారత స్టార్. తొలి గేమ్‌ను అలవోకగా 21-12తో నెగ్గిందామె. 2-2తో స్కోరు సమమైన దశలో వరుసగా ఆరు పాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన సైనా.. తర్వాత కూడా ప్రత్యర్థికి అందకుండా దూసుకెళ్లింది. 10-6 వద్ద వరుసగా మరో ఐదు పాయింట్లతో ప్రత్యర్థిని మరింత వెనక్కి నెట్టింది. ఒకహూర కొంచెం పుంజుకుని సైనాను అందుకునే ప్రయత్నం చేసినా.. ఆమె పట్టువిడవలేదు. అలవోకగా గేమ్‌ను గెలుచుకుంది. ఐతే రెండో గేమ్‌లో ఒకహూర అనూహ్యంగా పుంజుకుంది. ఆరంభంలోనే 4-0తో ఆధిక్యంలో నిలిచింది. సైనా ఆమెను అందుకోవడానికి చెమటోడ్చాల్సి వచ్చింది. అతి కష్టం మీద 10-10తో స్కోరు సమం చేసింది. ఐతే ప్రత్యర్థి మళ్లీ దూకుడు పెంచింది. 15-12తో ఆధిక్యంలోకి వెళ్లింది. సైనా మళ్లీ పుంజుకుని స్కోరు సమం చేసింది. 15-15, 16-16, 17-17. . ఇలా గేమ్ హోరాహోరీగా సాగింది. ఐతే ఫైనల్ చేరేందుకు నాలుగే పాయింట్లు అవసరమైన స్థితిలో, 17-17 వద్ద సైనా తడబడింది. 17-19తో వెనుకబడ్డపుడు సైనా స్మాష్ సైడ్ లైన్ అవతల పడింది. వెంటనే ఒక క్రాస్ కోర్ట్ రిటర్న్‌తో ఒకహూర గేమ్‌ను సొంతం చేసుకుని మ్యాచ్‌ను మూడో గేమ్‌కు మళ్లించింది. నిర్ణయాత్మక గేమ్ ఆరంభంలో సైనా 3-1 ఆధిక్యంలో నిలిచింది. కానీ అక్కడి నుంచి పట్టు కోల్పోయింది. సుదీర్ఘంగా సాగిన ర్యాలీల్లో పైచేయి సాధించడం ద్వారా సైనా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసింది. ర్యాలీలతో అలసిపోయిన సైనా.. వరుసగా పాయింట్లు కోల్పోయింది. సైనాను 3 పాయింట్ల దగ్గరే ఆపేసిన ఒకహూర వరుసగా ఏకంగా 9 పాయింట్లు కొల్లగొట్టింది. ఆ దశలో సైనా కదలికలు చూస్తేనే మ్యాచ్ ఆమె చేజారిందని అర్థమైపోయింది. విరామ సమయానికి 11-7తో ఆధిక్యంలో నిలిచిన ఒకహూర.. తర్వాత కూడా సైనాకు పెద్దగా అవకాశమివ్వలేదు. 16-7తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత కూడా అదే ఊపును కొనసాగించి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్ గంటా 14 నిమిషాలు సాగింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో సైనా 21-19, 18-21, 21-15తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)పై విజయం సాధించింది. ఆ మ్యాచ్ కూడా సరిగ్గా గంటా 14 నిమిషాలు జరగడం విశేషం.

సింధు ధాటికి సున్ విలవిల: మరో క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ సింధు.. చైనా అగ్ర క్రీడాకారిణి సున్ యును చిత్తు చేసింది. నాలుగో సీడ్ సింధు 21-14, 21-9తో 39 నిమిషాల్లోనే అలవోకగా సున్‌ను ఓడించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లి, కనీసం కాంస్యం ఖాయం చేసుకుంది. తొలి గేమ్‌లో సింధును కొంతమేర ప్రతిఘటించిన సున్.. రెండో గేమ్‌లో ఆమె ముందు నిలవలేకపోయింది. ఏకపక్షంగా సాగిన ఈ గేమ్‌లో సింధుపై సున్ ఒక్కసారి కూడా ఆధిక్యం సాధించలేకపోయింది.

సైనా


ఒకే పార్శ్వంలో ఫెదరర్, నాదల్



న్యూయార్క్: యుఎస్ ఓపెన్ టోర్నీలో స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్, ప్రపంచ నంబర్‌వన్ రఫెల్ నాదల్ ఒకే పార్శ్వంలో ఉన్నారు. వీరిద్దరూ సెమీస్‌లో తలపడే అవకాశం ఉంది. టాప్‌సీడ్‌గా బరిలో దిగిన నాదల్.. తొలి రౌండ్లో లజోవిచ్ (సెర్బియా)తో తలపడనున్నాడు. అతనికి ప్రిక్వార్టర్స్‌లో థామస్ బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్) ఎదురు కావొచ్చు. మూడో సీడ్ ఫెదరర్.. తొలి రౌండ్లో ఫ్రాన్సిస్ టియోఫి (అమెరికా)తో ఆడనున్నాడు. క్వార్టర్స్‌లో అతను జువాన్ మార్టిన్ డెల్‌పోట్రో (అర్జెంటీనా) తలపడే అవకాశాలున్నాయి. బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రేకు రెండో సీడ్ లభించింది. జర్మనీ యువ కెరటం అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు నాలుగో సీడింగ్ దక్కింది. సోమవారం ఈ టోర్నీ ప్రారంభం కానుంది.

శ్రీకాంత్ అసాధారణంగా పోరాడినా..

పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. అతను క్వార్టర్స్‌లో 14-21, 18-21తో టాప్ సీడ్ సాన్ వాన్ హో (కొరియా) చేతిలో ఓడాడు. ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడైన హోతో శ్రీకాంత్ అద్భుతంగా పోరాడాడు. రెండో గేమ్‌లో 5-16తో వెనుకబడిన దశలో అతను పుంజుకుని పోరాడిన తీరు అమోఘం. వరుసగా ఏడు పాయింట్లు సాధించి 12-16తో ప్రత్యర్థికి చేరువైన




శ్రీకాంత్ ఓ దశలో 18-19తో హోకు అత్యంత సమీపంగా వచ్చాడు. ఐతే హో తన అనుభవం, నైపుణ్యాన్నంతా ఉపయోగించి రెండు వరుస పాయింట్లతో మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. సెమీఫైనల్లో హోపై చైనా అగ్ర క్రీడాకారుడు లిన్ డాన్ 21-17, 21-14తో విజయం సాధించి ఫైనల్ చేరాడు. మరో సెమీస్‌లో యాగ్జెల్సన్ (డెన్మార్క్) 21-9, 21-10తో చెన్ లాంగ్ (చైనా)పై నెగ్గాడు.



పట్నాను గెలిపించిన మోను

ముంబయి: మోను గొయత్ (11) విజృంభించడంతో ప్రొ కబడ్డీ లీగ్‌లో పట్నా పైరేట్స్ 35-24తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. మోనుతో పాటు జైదీప్ ఐదు ట్యాకిల్ పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అజయ్ ఠాకూర్ (10) రాణించినా.. తలైవాస్‌ను గెలిపించలేకపోయాడు. ఈ గెలుపుతో 7 మ్యాచ్‌ల్లో 27 పాయింట్లు సాధించిన పట్నా జోన్-బిలో ద్వితీయ స్థానంలో కొనసాగుతోంది. ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ 26-24తో యు ముంబాను ఓడించింది. దీపక్ హుడా (8) పుణెరి విజయంలో ముఖ్య పాత్ర పోషించాడు.



హోప్

హోప్, బ్రాత్వైట్ శతకాలు

వెస్టిండీస్‌కు ఆధిక్యం

లీడ్స్: ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో వెస్టిండీస్ బలమైన స్థితిలో నిలిచింది. చక్కని బ్యాటింగ్‌తో పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తోంది. హోప్ (147 బ్యాటింగ్), క్రెయిగ్ బ్రాత్వైట్ (134) శతకాలు బాదడంతో రెండో రోజు, శనివారం ఆట ముగిసే సమయానికి విండీస్ (ఓవర్‌నైట్ 19/1) తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసింది. హోప్‌తో పాటు బ్లాక్‌వుడ్ (21) క్రీజులో ఉన్నాడు. విండీస్ ఇప్పటికే 71 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగులు చేసింది.

ధోని వల్లే భువి అలా..

సౌరభ్ గంగూలీ

భారత్ రెండో వన్డేలో గొప్పగా పోరాడి గెలిచింది. అలాంటి విజయాలు ప్రత్యర్థి జట్ల నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీస్తాయి. నిజాయితీగా చెప్పాలంటే రెండు జట్ల మధ్య అంతరం చాలా ఉంది. ఏ జట్టు నాణ్యత ఎంత అన్నది ఫలితాలే రుజువు చేశాయి. సిరీస్ మొత్తంలో రెండో వన్డే విజయాన్ని భారత్ ఇచ్చిన నాకౌట్

పంచ్‌గా చెబుతాను. 130/7 అంటే.. మ్యాచ్ పోయిందనే అనిపించింది. కానీ ధోని, భువి అద్భుతంగా ఆడి భారత్‌ను గెలిపించారు. భువికిది కెరీర్లో అత్యుత్తమ బ్యాటింగ్ ప్రదర్శన. అతను గొప్ప పరిణతి చూపించాడు. ధోని.. భువి మీద ఒత్తిడి పడకుండా చూసి అతను స్వేచ్ఛగా ఆడే అవకాశమిచ్చాడు. ధోని మ్యాచ్‌లు ముగించడంలో మొనగాడు. కొన్నిసార్లు ఆశించిన ఫలితం వచ్చి ఉండకపోవచ్చు. ఈసారి మాత్రం మ్యాచ్‌కు చక్కటి ముగింపు ఇచ్చాడు.

తొలి వన్డేలో ఘన విజయం.. రెండో వన్డేలో ప్రత్యర్థి నుంచి అనూహ్య ప్రతిఘటన.. మరి మూడో వన్డే? వరుసగా రెండు మ్యాచ్‌లు నెగ్గి సిరీస్‌పై కన్నేసిన భారత్.. శ్రీలంకతో ఆదివారం మూడో వన్డేకు సిద్ధమైంది. రెండో వన్డే లోలా ఉదాసీనతకు తావీయకుండా.. సిరీస్‌ను మూడో వన్డేలోనే సాధించాలని కోహ్లి సేన కోరుకుంటోంది.

ఇక్కడే కొట్టేయాలి

- సిరీస్‌పై భారత్ కన్ను
- నేడే లంకతో మూడో వన్డే

మధ్యాహ్నం 2.30 నుంచి సోని సిక్స్‌లో

వరుణుడి ముప్పు: రెండో వన్డేకు అంతరాయం కలిగించిన వరుణుడు.. మూడో వన్డేకూ వచ్చే అవకాశాలున్నాయి. వర్ష సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో టాస్ కీలకం కానుంది.

పల్లెకెలె: శ్రీలంకతో వన్డే సిరీస్ గెలిచేందుకు భారత్‌కు మంచి అవకాశం. వరుసగా రెండు వన్డేలు నెగ్గిన టీమ్‌ఇండియా.. హ్యాట్రిక్ విజయంతో సిరీస్ కైవసం చేసుకోవాలనే ఉత్సాహంతో ఉంది. రెండో వన్డేలో బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రయోగాలు చేసి దెబ్బ తిన్న కోహ్లి.. మూడో వన్డేలోనూ అలాంటి ప్రయోగాలు చేస్తాడా అన్నదే చూడాలి. రెండో వన్డేలో బ్యాటింగ్ ఆర్డర్‌లో కోహ్లి కన్నా ముందుగా వచ్చిన రాహుల్, జాదవ్.. స్పిన్నర్ అఖిల ధనంజయ గూగ్లీలను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు. మరోవైపు స్పిన్నర్లు అక్షర్ పటేల్, యజువేంద్ర చాహల్‌లను తుది జట్టులో ఆడించడంపై కోహ్లి ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో..? ఈ పర్యటనలో వరుసగా ఐదుసార్లు టాస్ గెలిచిన కోహ్లి.. మళ్లీ టాస్ గెలిస్తే ఛేదనకు మొగ్గు చూపుతాడా అనేది ఆసక్తికరం. యువ స్పిన్నర్ ధనంజయను ఎదుర్కోవడం కూడా భారత బ్యాట్స్‌మెన్‌కు సవాలే.

పాండ్య అనుమానం!: ఆల్‌రౌండర్ హర్దిక్ పాండ్య ఈ మ్యాచ్‌లో ఆడేది అనుమానంగా మారింది. రెండో వన్డే ముగిశాక ఎడమ మోకాలికి బ్యాండేజీ కట్టుకుని కనిపించిన పాండ్య.. మూడో వన్డేకు ఎంతవరకు ఫిట్‌నెస్ సాధిస్తాడనేది కీలకం. మరి సాహసం చేసి పాండ్యను ఆడిస్తారో లేదా కుల్‌దీప్ యాదవ్, శార్దూల్ ఠాకూర్ ఇద్దరిలో ఒకరికి అవకాశం ఇస్తారా అనేది ఆసక్తికరం. లంక జట్టును కపుగెదర నడిపించనున్నాడు. రెగ్యులర్ కెప్టెన్ చండిమాల్ జట్టులోకి వచ్చినా.. కపుగెదరకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడం విశేషం. గాయపడిన గుణతిలక స్థానంలో తిరిమానె ఆడనున్నాడు. అతను డిక్వెలాతో కలిసి ఓపెనింగ్ చేస్తాడు.



శిథిల 'వసతి'.. ఏమిటీ దుర్గతి

• కాపలా లేని భవనాల్లో బిక్కుబిక్కు • ఎటూ సరిపోని ఉపకార వేతనాలతో విద్యాభ్యాసం

ఈనాడు అమరావతి


విశాఖ జిల్లా పెదగంట్యాడలో శిథిల భవనంలో నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థుల వసతి గృహం

వసతి గృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. తాగునీటి నుంచి తలదాచుకోవడం వరకూ.. అన్నీ సమస్యలే. ఏ సదుపాయం లేక, ఎవరూ పట్టించుకోకపోవడంతో వసతిగృహాలు దయనీయ స్థితికి చేరుకున్నాయి. ఇంటర్మీడియట్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) చేసే విద్యార్థుల కోసం సాంఘిక, వెనుకబడిన తరగతుల, గిరిజన సంక్షేమ శాఖల వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులను సమస్యలు పట్టి పీడిస్తున్నాయి.

ఇంటర్మీడియట్ నుంచి పీజీ చేసే పేద విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన విద్యార్థి యాజమాన్య వసతి గృహాలను ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ స్వాధీన వసతి గృహాలు (డీఏహెచ్)గా పేరు మార్చింది. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1050 చొప్పున ప్రభుత్వం ఇస్తున్న ఉపకార వేతనాలతో ఆయా సంక్షేమశాఖలు వసతి గృహాలను నిర్వహిస్తున్నాయి. వంట దినుసుల సమీకరణ నుంచి ఆహారం తయారు చేసే సిబ్బందికి వేతనాలు, నిర్వహణ వరకు విద్యార్థుల ఉపకార వేతనాల డబ్బే సర్దుబాటు చేస్తుంటారు. ఒక్కో వసతి గృహంలో కనిష్ఠంగా 60, గరిష్ఠం 120 మంది విద్యార్థులు ఉంటున్నారు.

సరిపడా భోజనం కూడా..

ప్రభుత్వం తరఫున ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్నే విద్యార్థులకు అందిస్తున్నా, ఇతర నిత్యావసరాల కొనుగోళ్లు, సిబ్బంది వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం ఒక్కో విద్యార్థిపై నెలకు రూ.2 వేలకుపైగా అవసరమని అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఉపకార వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలైతే వెళ్లినా ఇప్పటికీ నిర్ణయం వెలువడలేదు. విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టే పరిస్థితి వసతి గృహాల్లో లేదు. పరిమిత బడ్జెట్‌తో వార్డెన్లు సర్దుబాటు చేస్తున్నారు.

బకాయిలు చెల్లిస్తేనే..

వసతి గృహాల కోసం వినియోగిస్తున్న అద్దె భవనాలకు చదరపు అడుగు(ఎస్ఎఫ్‌టీ)కు రూ.12 చొప్పున ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. ఇది ఏమూలకు సరిపోని కారణంగా భవన యజమానులు మరమ్మతులు చేయించడం లేదు. 24 శాతం వసతి గృహాల్లో మరుగుదొడ్లు సరిగా లేవు. ప్రయివేట్ భవనాలకు అద్దె పెంచాలన్న ప్రతిపాదనైతే ఉన్నా ఇప్పటికీ ప్రభుత్వ ఆమోదానికి నోచుకోలేదు. ఆరు జిల్లాల్లో అద్దె భవనాలకు నాలుగు నెలల బకాయిలు చెల్లించాలి.

కాపలా.. కనుమరుగు

తొంబై శాతం బాలికల వసతి గృహాలకు రాత్రి కాపలాదారు లేరు. విద్యార్థుల ఉపకార వేతనాలు మూడు పూటలా భోజనం, వంట మనిషి, సహాయకుడి వేతనాలకే సరిపోతున్న కారణంగా ప్రత్యేకంగా రాత్రి కాపలాదారులను నియమించడం లేదు. వంట తయారీ మనుషుల్లో ఒకరు అప్పుడప్పుడు విద్యార్థినులకు రాత్రుల్లో కాపలాగా ఉంటున్నారు. మిగతా సందర్భాల్లో వీరికి దేవుడే దిక్కు అన్నట్లుగా తయారైంది.

- రాత్రి కాపలాదారు కొరత ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుంది అనేదానికి.. విజయనగరంలోని సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహంలో విద్యార్థిని ఒకరు అబార్షన్ చేయించుకొని నెలల నిండని బిడ్డను ఇటీవల రోడ్డున పారేసిన సంఘటనే ప్రత్యేక ఉదాహరణ. వసతి గృహాల నిర్వహణ, పర్యవేక్షణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపని కారణంగానే ఇలాంటివి చేసుకుంటున్నాయి.
- వసతి గృహ భవన అద్దె, విద్యుత్తు ఛార్జీల వరకు ప్రభుత్వమైతే చెల్లిస్తున్నా మిగతా వాటికి విద్యార్థుల ఉపకార వేతనాలతోనే నిర్వహణ అనేది కష్టంగా మారుతోంది.


మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి....



విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉపకార వేతనాలతోనే వీటిని నిర్వహించాలన్న పరిమితుల కారణంగా కనీస సౌకర్యాలకు నోచుకోలేకపోతున్నాం. ఉన్నత విద్య అభ్యసించాలన్న ఆశయం మేరకు తప్పనిసరి పరిస్థితుల్లో వసతి గృహాల్లో ఉంటున్నాం. 99 శాతం మంది విద్యార్థినులు పేద కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే. పరిమిత బడ్జెట్ కారణంగా సరైన ఆహారాన్ని కూడా అందించడం లేదు.

-వి.కుసుమ, ఇంటర్మీడియట్ విద్యార్థిని

భోజన ఖర్చులు పెంచకపోతే కష్టమే...



ఉపకార వేతనాలను భోజన ఖర్చుల కోసం వినియోగిస్తున్నందున పెరిగిన వివిధ నిత్యావసరాల ధరల దృష్ట్యా వీటిని పెంచాలి. రాత్రిపూట నిద్రపోడానికి మంచాలు, పరుపులు కూడా లేవు.

-టి.దినేశ్‌కుమార్, బీఎస్సీ విద్యార్థి

రాత్రి కాపలాదారు లేకపోతే ఎలా?



విద్యార్థినుల వసతి గృహాలకు రాత్రి కాపలాదారు లేకపోతే ఎలాగో ప్రభుత్వం ఆలోచించాలి. అనేక సార్లు అధికారులకు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేదు. నెలవారీ ఉపకార వేతనాలు రూ.2,500కి పెంచడంతోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. వసతి గృహాల నిర్వహణ కోసం ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించాలి. విద్యార్థుల కోసం సన్న బియ్యం సరఫరా చేయాలి.

-ఎల్‌జే నాయుడు, విద్యార్థి సంఘ నాయకుడు

ప్రభుత్వ సంక్షేమశాఖల స్వాధీనంలోని ఇంటర్-పీజీ వసతి గృహాలు	:	932
వీటిలో బాలుర వసతి గృహాలు	:	582
బాలికల వసతి గృహాలు	:	350
మొత్తం విద్యార్థులు	:	12,789
ఒక్కో విద్యార్థికి నెలకు చెల్లిస్తున్న ఉపకార వేతనం	:	రూ.1050
ప్రస్తుత ధరల ప్రకారం పెరిగిన ఖర్చు	:	రూ.2,000

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలలో పూర్తయిన ఏర్పాట్లు
- 19 రౌండ్లలో లెక్కింపు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల ఉపఎన్నిక ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. సోమవారం నిర్వహించనున్న ఈ ప్రక్రియ కోసం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో విస్తృత ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 1,73,335 ఓట్లను లెక్కించనున్నారు. మొత్తం 19 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. ప్రతి రౌండ్‌కు తొమ్మిది వేల ఓట్ల చొప్పున లెక్కించనున్నారు. చివరి రౌండ్ లెక్కింపులో మరికొన్ని ఓట్లు అదనంగా చేరనున్నాయి. ఉదయం ఎనిమిదింటికి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం ఒంటి గంట తరువాత అధికారికంగా ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉంది. మొదట నంద్యాల మండలం ఓట్లను లెక్కించి తరువాత నంద్యాల పట్టణం, గోస్పాడు మండలం ఓట్లను లెక్కించనున్నారు. నంద్యాల మండలం పోలూరు గ్రామం ఓట్ల లెక్కింపుతో ప్రారంభమయ్యే ఈ క్రతువు గోస్పాడు మండలం బీవీ నగర్ గ్రామ ఓట్ల లెక్కింపుతో పూర్తి కానుంది. లెక్కింపు కేంద్రంలోకి పోటీలో ఉన్న అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, పోలింగ్ సిబ్బంది, అధికారులకు తప్ప ఎవరికీ ప్రవేశం లేదు. కౌంటింగ్ కేంద్రం నుంచి వంద మీటర్ల దూరంలో బ్యారికేడ్లు ఏర్పాటుచేసి పాసులు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతించనున్నారు. ఈ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేయనున్నారు. లెక్కింపు కేంద్రం వద్ద, సమీప ప్రాంతంలో సుమారు 200 మంది వివిధ స్థాయి పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.


ర్యాట్‌గమ్ అట్టకు అతుక్కున్న విషనాగు, ఎలుకలు, బొద్దింక

ఎరక్కపోయి వచ్చి.. అతుక్కుపోయింది!

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: పాములు ఎలుకలను వేటాడి తినడం ప్రకృతి సహజం. ఇలాగే ఎలుకల ఉనికిని పసిగట్టి వచ్చిన ఓ పాము.. తానూ బలైపోయింది. చిత్తూరు జిల్లా పెద్దతిప్పసముద్రం మండల కేంద్రంలోని ఓ ఇంటి యజమాని ఎలుకల నివారణ కోసం ర్యాట్‌గమ్ అట్టలు ఉంచాడు. రాత్రిపూట అటూఇటూ తిరుగుతున్న రెండు ఎలుకలు ఆ అట్టకు అతుక్కున్నాయి. ఎలుకలు కిచకిచలాడుతుండగా.. ఆకలిమీదున్న విషనాగు వాటిని పట్టుకునేందుకు వచ్చి ర్యాట్‌గమ్ అట్టపైనున్న జిగురుకు అతుక్కుపోయింది. అనంతరం కుటుంబ సభ్యులు గమనించగా.. రెండు ఎలుకలతో పాటు విషనాగు పట్టుబడింది. ప్రాణాపాయం తప్పిందని వారు ఊపిరి పీల్చుకున్నారు.

అమెరికాలో కర్నూలు యువకుడి ఆత్మహత్య

కర్నూలు, న్యూస్‌టుడే: కర్నూలు ప్రకాశ్‌నగర్‌కు చెందిన యువకుడు కందూరి పృథ్వీనాథ్(26) అమెరికాలో ఆత్మహత్య చేసుకున్నారు. వ్యాపారి గోపాలకృష్ణ, రాజేశ్వరి దంపతుల కుమారుడు పృథ్వీనాథ్ కొన్నాళ్లుగా అమెరికాలోని డెలావేర్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఈనెల 21న అదృశ్యమైనట్లు ఆయన స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. ఆత్మహత్యాయత్నం చేసుకుని ఉంటాడని అనుమానించారు. ఈ క్రమంలో యువకుడి తండ్రి వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయానికి సమాచారం ఇచ్చి తమ బిడ్డ ఆచూకీ తెలపాలని విన్నవించారు. చివరకు పృథ్వీనాథ్ మృతదేహాన్ని గుర్తించారు. తానా ప్రతినిధుల సహకారంతో మృతదేహాన్ని స్నేహితులు భారత్‌కు పంపారు. భౌతికకాయం ఆదివారం హైదరాబాద్‌కు రానున్నట్లు సమాచారం ఇచ్చారు.


పృథ్వీనాథ్ (పాత చిత్రం)

శ్రీకృష్ణదేవరాయల ద్వారపాలకుడి విగ్రహం స్వాధీనం

ఈనాడు, హైదరాబాద్: విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయల వద్ద ద్వారపాలకుడిగా పనిచేసిన అష్టదత్తు విగ్రహాన్ని విక్రయిస్తున్న నిందితుడు నీలకంఠి వెంకటేశ్వరరావును హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి అష్టదత్త విగ్రహం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విజయవాడకు చెందిన వెంకటేశ్వరరావు వ్యాపార పనులపై గతేడాది విజయనగరం వెళ్లాడు. అతడి స్నేహితుడు శ్రీనివాసరావు తన దగ్గర 15వ శతాబ్దికి చెందిన అష్టదత్తు విగ్రహం ఉందని, పురాతన వస్తువులు కొనేవారికి అమ్మితే 40 శాతం కమీషన్ ఇస్తానని చెప్పాడు. దీంతో వెంకటేశ్వరరావు ఆ విగ్రహాన్ని రహస్యంగా విజయవాడకు తీసుకొచ్చాడు. అక్కడ ఎవరూ కొనకపోవడంతో మూడు నెలల క్రితం విగ్రహాన్ని తీసుకుని హైదరాబాద్ వచ్చాడు. నాగోల్‌లో స్నేహితుడి ఇంట్లో ఉండి విగ్రహం అమ్మేందుకు యత్నించాడు. కుల్సుంపురాలో ఇలాంటి విగ్రహాలు కొంటున్నారని తెలుసుకుని శనివారం గోపి హోటల్ వద్దకు వచ్చాడు. సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కుల్సుంపురా పోలీసులకు అప్పగించారు. విగ్రహం విలువ రూ.2 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.



పొట్ల.. పొట్టిగా.. !

కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడిలో భాగవతుల వెంకట చలపతిశాస్త్రి ఇంటి పెరట్లో వేలెడంత పొట్లకాయలే కాస్తున్నాయి. వీటిని కూర వండితే రుచిగా ఉంటోందని కుటుంబీకులు చెప్పారు. జన్యుపరమైన కారణాలతోనే ఇలా పొట్టిగా పెరుగుతాయని ఉద్యానశాఖ అధికారిణి ఎం.సాయిప్రియ అన్నారు.

-న్యూస్‌టుడే, కూచిపూడి

మహేష్‌బాబుకు రాజకీయాలతో సంబంధం లేదు: ఎంపీ గల్లా జయదేవ్

పట్టాభిపురం (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రముఖ సినీనటుడు మహేష్‌బాబుకు రాజకీయాలతో సంబంధం లేదని ఆయన్ని అందులోకి లాగొద్దని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని తన నివాసంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన మామ సినీనటులు కృష్ణ, ఆయన కుమారుడు మహేష్‌బాబు, కుటుంబ సభ్యులందరం చర్చలు జరిపిన తర్వాతే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. గుంటూరు ఎంపీగా పోటీ చేయమని సలహా ఇచ్చింది కృష్ణేనని గుర్తుచేశారు. మహేష్‌బాబు పూర్తి మద్దతు తనకు ఉంటుందన్నారు. కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మద్దతు పలకాలని కోరారు. కాకినాడ ఎన్నికల్లో వారు తెదేపాకు మద్దతు ఇస్తే బాగుంటుందన్నారు. ఇటీవల కృష్ణ, మహేష్‌బాబు ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వలేదని స్పష్టం చేశారు. రూ.200లు నోటు ప్రవేశపెట్టాలని తాను మూడు పర్యాయాలు పార్లమెంటులో ప్రస్తావించానని చెప్పారు. రూ.2000 నోటు రద్దు చేసి, రూ.200 నోటు ప్రవేశపెడితే, నల్లధనాన్ని నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు.

నేడు సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హౌరా నుంచి సికింద్రాబాద్‌కు,విజయవాడ, గుంటూరు మీదుగా ప్రత్యేక రైలు (నెం.07183) నడుపుతున్నట్లు సీనియర్ మండల వాణిజ్య అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ రైలు హౌరాలో ఆదివారం తెల్లవారుజామున 1.30 గంటలకు బయలుదేరి విజయవాడకు అర్ధరాత్రి 12.01 గంటలకు, గుంటూరుకు సోమవారం వేకువజామున 1.55కు, సత్తెనపల్లికు 3.18కి, పిడుగురాళ్లకు 3.48కి, మిర్యాలగూడకు 4.55కి, నల్గొండకు 5.35కి, సికింద్రాబాద్‌కు ఉదయం 9.15 గంటలకు చేరుతుందని ఆయన వివరించారు.

వైద్య సీట్లపై పెద్దనోట్ల దెబ్బ!

- సి కేటగిరిలో 119 సీట్లు మిగులు
- రుసుమును తగ్గించుకుంటున్న యాజమాన్యాలు..!
- పొరుగు రాష్ట్రాల్లో చేరిన విద్యార్థులు
- నేటి మధ్యాహ్నం వరకూ నాలుగో విడత వెబ్‌ఆప్షన్ల నమోదు

ఈనాడు - అమరావతి

వైద్య విద్య సీట్ల భర్తీపై పెద్దనోట్ల రద్దు ప్రభావం భారీగానే కనిపిస్తోంది. 'సి' కేటగిరి సీటును పొందిన వారు ఏడాదికి రూ.30 లక్షల వరకు ఫీజు చెల్లించాల్సి రావడంతో పలువురు విద్యార్థులు ఆ సీట్లకు దూరంగా ఉన్నారు. పెద్ద నోట్ల రద్దు, ఆదాయపన్ను శాఖ చర్యల్ని దృష్టిలో ఉంచుకుని ఈ సీట్లను వదులుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ కేటగిరిలో సీటు పొందాలంటే ఏడాదికి రూ.30 లక్షల వంతున ఐదు సంవత్సరాలకు కలిపి కోటిన్నర రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పలు కాలేజీల్లో సీట్లు మిగిలాయి. మరోవంక.. సీట్లు మిగిలితే ప్రతి ఏడాదీ నష్టపోతామన్న ఉద్దేశంతో పలు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నిర్దేశించిన వార్షిక ఫీజు రూ.30 లక్షల కంటే తక్కువగానే తీసుకునేందుకు సిద్ధమవుతున్నాయి.

నీట్‌లో అర్హత సాధించిన వారితో...ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ద్వారా మాత్రమే ప్రవేశాల కౌన్సెలింగును తప్పనిసరి చేసిన నేపథ్యంలో సి కేటగిరిలో 119 సీట్లు మిగలడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎ కేటగిరి సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుండగా..బి, సి కేటగిరి సీట్ల భర్తీ కౌన్సెలింగ్ ద్వారా పూర్తయింది. బి కేటగిరిలో మైనార్టీ కళాశాలలో పది సీట్లు మాత్రమే మిగిలాయి. సి కేటగిరిలో 389 సీట్లకుగాను 119 మిగిలాయి.

నీట్ ర్యాంకు..వర్సిటీ కౌన్సెలింగ్‌తో..

2015-16 వరకు ఇంటర్‌లో నిర్దేశించిన మార్కుల్ని సాధించిన వారితోనే ఎన్నారై సీట్లు భర్తీ అయ్యేవి. ఈ సీట్లనే 2016-17లో నీట్ ర్యాంకు ద్వారానే ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలే నేరుగా భర్తీ చేసుకున్నాయి. దీంతో లోలోపలే వీటి భర్తీ జరిగిపోయింది. ఒక్కో సీటుకు అప్పట్లోనే పలు కళాశాలల యాజమాన్యాలు కోటి వరకు వసూలు చేశాయి. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలను నీట్ ర్యాంకుతోనే ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం చేపట్టింది. దీంతో అధికారికంగా ఫీజు చెల్లించేందుకు సిద్ధమైన వారు మాత్రమే ముందుకు రావాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఈనేపథ్యంలో ఐదింట్లో మినహా 12 ప్రైవేట్ కళాశాలల్లో సీట్లు మిగిలాయి.

మంతనాలకు దిగిన కళాశాలలు..

సీట్లు నింపుకునేందుకు పలు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సి కేటగిరి సీటు ఫీజును తగ్గిస్తామంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంతనాలు జరుపుతున్నాయి. కళాశాల పేరు ప్రఖ్యాతల్ని అనుసరించి 15 నుంచి 20 లక్షల రూపాయల మధ్య ఫీజును తీసుకుంటామని భరోసా ఇస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం బి కేటగిరి సీటు కింద రూ.12,12,750 వసూలు చేశారు. సి కేటగిరిలో రూ.30లక్షల ఫీజు చెల్లించేకన్నా కర్ణాటక, తమిళనాడు, ఇతర రాష్ట్రాల్లో ఫీజు తక్కువగా ఉండడంవల్ల కూడా పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు అటువైపు మొగ్గారు. దీనివల్ల కూడా రాష్ట్రంలో సి కేటగిరి సీట్లు మిగిలినట్లు భావిస్తున్నారు. దంత వైద్య విద్యలో కన్వీనర్ కోటాలోనూ ఎ కేటగిరి సీట్లు భారీగా మిగిలాయి. బి కేటగిరిలో 126, సి కేటగిరిలో 162 సీట్లు మిగిలాయి.

మొదలైన నాలుగో విడత కౌన్సెలింగ్!

కన్వీనర్ కోటా కింద మిగిలిన సీట్లకు నాలుగో విడత కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థుల నుంచి ఆప్షన్లను స్వీకరించడం శనివారం నుంచి మొదలైంది. రాత్రి వరకు ఆరు వేల మంది విద్యార్థులు ఆప్షన్లు నమోదు చేసుకున్నారని సమాచారం. ఆదివారం మధ్యాహ్నం వరకు వెబ్ ఆప్షన్ల నమోదు కొనసాగనుంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీకాకుంటే మరో విడత కౌన్సెలింగ్ జరపాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు...విద్యార్థులు సందేహాల నివృత్తికి విశ్వవిద్యాలయం ప్రకటించిన సెల్‌ఫోన్లు పనిచేయడంలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే చర్యల్ని తీసుకోవాలని కోరుతున్నారు.

అన్నదాతకు ఉపశమనం

- రాష్ట్రవ్యాప్తంగా అనుకూలిస్తున్న వానలు
- ప్రకాశంలో సాధారణానికి మించి 26శాతం అధికం

ఈనాడు-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు సాగుకు అనుకూలిస్తున్నాయి. ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమ జిల్లాల్లో కురుస్తున్న వానలతో ఇప్పటికే సాగులో ఉన్న మెట్ట పంటలకు మేలు కలగనుంది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో వారం కిందటిదాకా వానల్లేక ఎండుముఖం పట్టిన వేరుసెనగ, పత్తి ఊపిరి పోసుకున్నాయి. పలు జిల్లాల్లో పంటకుంటలకు జలకళ వచ్చింది. ఖరీఫ్‌లో సాగు చేయలేకపోయిన రైతులు ప్రత్యామ్నాయ పంటలతోపాటు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. జలాశయాలు, చెరువుల్లోకి నీరు చేరకపోవడంతో ఈ ఉపశమనం తాత్కాలికమే అవుతోంది.

రాజధాని అమరావతితోపాటు పలుచోట్ల శనివారం మధ్యాహ్నం మబ్బులు కమ్మేశాయి. విశాఖపట్నం జిల్లా కె.కోటపాడు మండలంలో అత్యధికంగా 120 మి.మీ.వర్షపాతం నమోదైంది. కర్నూలు, కడప, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పలుచోట్ల 30 నుంచి 80 మి.మీ. వర్షం కురిసింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 540 మండలాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వానలు కురిశాయి. ఇందులో 136 మండలాల్లో 10 మి.మీ.పైన వర్షం కురిసింది. గుంటూరు 25, ప్రకాశం 31, కర్నూలు 24 మండలాల్లో ప్రభావం ఎక్కువగా ఉంది.

ప్రకాశంలో అధికం: రాష్ట్రంలో అధికవర్షం కురిసిన జిల్లాల్లో ప్రకాశం అగ్రభాగాన నిలిచింది. ఈనెల మొదట్లో ఇక్కడ 15శాతం వర్షపాత లోటు ఉంది. పంటల సాగు కూడా 40శాతంలోపే. రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మెరుగుపడింది. శనివారం నాటికి సాధారణ వర్షపాతానికి మించి 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇది పంటలకు అనుకూలమే అయినా చెరువులు నిండ లేదు. రాయలసీమ వ్యాప్తంగా చెదురుమదురు జల్లులు పడుతున్నాయి. అనంతపురం జిల్లాలో ఇంకా 25 మండలాల్లో వర్షాలు అనుకూలించలేదు. కర్నూలు 25, చిత్తూరు 12, కడప 16 మండలాల్లో వానలు తక్కువగానే ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురిసిన ప్రాంతాల్లో రైతులు ఉలవలు, పెసర, అపరాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. విజయనగరం, విశాఖలో వాన కష్టాలకు ఉపశమనం లభించింది. కొన్నిచోట్ల నాట్లు వేసేందుకు అనువైన వాతావరణం ఏర్పడింది.


హైదరాబాద్ మదీనగూడలోని అపార్టుమెంట్ల చుట్టూ భారీగా వర్షపు నీరు


సికింద్రాబాద్ ప్యాట్నీనగర్‌లో విద్యుత్ తీగలపై కూలిన చెట్టు

హైదరాబాద్‌ను వణికించిన జడివాన

- అత్యధికంగా 12.8 సెం.మీల వర్షపాతం
- నీళ్లలోనే కాలనీలు, అపార్ట్‌మెంట్లు, కొట్టుకుపోయిన వాహనాలు

ఈనాడు, హైదరాబాద్: మహానగరం.. వర్షానికి మరోసారి వణికిపోయింది. నాలుగు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో హైదరాబాద్, సికింద్రాబాద్‌ల్లోని అనేక కాలనీలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరి వందలాది మంది నిరాశ్రయులయ్యారు. శుక్రవారం రాత్రి 8గంటల నుంచి 12గంటల వరకు భారీ వర్షం కురిసింది. కొన్ని కాలనీల్లో 12సెం.మీలు, మరికొన్ని చోట్ల 10సెం.మీల వాన కురవగా.. అత్యధికంగా 12.8సెం.మీల వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం చిరుజల్లులతో సరిపెట్టిన వాన.. సాయంత్రం 6గంటల నుంచి మళ్లీ విజృంభించింది. అనేక అపార్ట్‌మెంట్లు నీళ్లలోనే ఉండిపోయాయి. నానల్‌నగర్, హకీంపేట్, సికింద్రాబాద్, తదితర ప్రాంతాల్లో కాలనీ రహదారులపై నడుములోతు వరద ప్రవహించింది. ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రవాహానికి కొట్టుకుపోయాయి. ముషీరాబాద్, ఎర్రగడ్డ, పాతబస్తీల్లోని నాలా పరివాహక ప్రాంతాల్లో ఇళ్లు మురుగునీటితో నిండిపోయాయి.

ముషీరాబాద్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, నిజాంపేట్, మెహిదీపట్నం, రాజేంద్రనగర్, పాతబస్తీ, బేగంపేట్, ఖైరతాబాద్, ఉప్పల్, ఎల్‌బీనగర్, ఇలా. . సుమారు 395 ప్రాంతాలు జలమయమైనట్లు అధికారులు గుర్తించారు. ఇంజినీరింగ్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో ఏర్పాటు చేసిన అత్యవసర బృందాలు ఆయా ప్రాంతాల్లో సమస్యల్ని పరిష్కరించాయని జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సీజన్‌లో ఇదే భారీ వర్షమని, ఎక్కువ నష్టం వాటిల్లిందని చెప్పారు. జంటనగరాల్లోని చెరువులన్నీ నిండు కుండల్ని తలపిస్తున్నాయి.

అప్పు తీసుకోవడం.. అడిగితే హతమార్చడం..

- వరుస సంఘటనల్లో ఒకడే నిందితుడు!
- తూ.గో.జిల్లా నవాబుపేటలో జనం బిక్కుబిక్కు

ఆలమూరు, న్యూస్‌టుడే: ప్రశాంతతకు నిలయంగా ఉండే తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలం నవాబుపేటలో కొద్దిరోజులుగా పలువురు అదృశ్యమయ్యారు. ఆచూకీ కోసం బంధువులు, పోలీసులు గాలిస్తుండగా నమ్మలేని నిజాలు వెల్లడయ్యాయి. వీరందరినీ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హత్య చేశాడనేది వాటి సారాంశం. గ్రామంలో దొరికిన చోటల్లా అప్పులు చేసి.. బాకీ తీర్చమని అడిగితే వారిని కడతేరుస్తున్నాడు. దీంతో నవాబుపేట వాసులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గ్రామస్థులు ఈ విషయాన్ని బహిరంగంగానే చర్చిస్తుండగా పోలీసులు మాత్రం నోరు మెదపడం లేదు. స్థానికుల కథనం ప్రకారం.. ఈ నెల 11న అదృశ్యమైన చిక్కిరెడ్డి శ్రీనివాసు మృతదేహం కోటిపల్లి వద్ద కాలువలో కనిపించింది. తలపై గాయం ఉండటంతో హత్యగా తెలుసుకున్నారు. ఆయన్ను ఎవరు ఎందుకు హత్య చేసుంటారనే దానిపై గ్రామస్థులలో చర్చ మొదలైంది. ఈ ఏడాది మార్చి 2న ఇదే గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు అదృశ్యమయ్యారు. దీనిపై అప్పట్లో ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకూ వీరి ఆచూకీ లభించలేదు. పిల్లలు దూరంగా ఉంటున్నారనే కారణంతో ఎక్కడికో వెళ్లిపోయి ఉంటారని ముందుగా గ్రామస్థులు అనుకున్నారు. కానీ శ్రీనివాసును హత్య చేసిన యువకుడికే ఈ దంపతులు కూడా అప్పిచ్చారు. వీరిని కూడా డబ్బు ఇస్తానని రాజమహేంద్రవరం తీసుకెళ్లి బొమ్మూరు డంపింగ్ యార్డులో వృద్ధురాలిని, రాజమహేంద్రవరం రైల్వే ట్రాక్‌పై వృద్ధుణ్ని చంపేశాడు. అప్పట్లో బొమ్మూరు, రైల్వే పోలీసులు గుర్తు తెలియని వ్యక్తుల మృతిగా కేసులు నమోదుచేశారు. వారి మరణం తాజాగా ధ్రువీకరణ కావడంతో ఆరు నెలల తర్వాత ఈ వృద్ధ దంపతులకు ఇప్పుడు కుటుంబ సభ్యులు దినకర్మలు చేస్తున్నారు. ఇటీవల ఆయువకుడు తన సొంత బంధువుని కూడా చంపినట్లు గ్రామస్థులు తెలిపారు. అతడికి రూ.50 వేలు అప్పిచ్చిన ఓ మహిళ తనకు డబ్బులు వద్దు ప్రాణ రక్షణ కల్పించమని రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టిస్తోంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00